सत्यमेव जयते

# 2013 మార్చితో ముగిసిన సంవత్సరానికి
# సామాన్య - సామాజిక రంగాలపై
# భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదిక



## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
## 2014 లో 1వ నివేదిక

# 2013 మార్చితో ముగిసిన సంవత్సరానికి
# సామాన్య - సామాజిక రంగాలపై
# భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదిక

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

***2014 లో 1వ నివేదిక***

# విషయ సూచిక



| | పేరా | పేజీ |
|---|---|---|
| ముందుమాట | | v |
| **అధ్యాయం 1 - అవలోకనం** | | |
| ఈ నివేదిక గురించి | 1.1 | 1 |
| సామాన్య, సామాజిక రంగాల సంక్షిప్త స్వరూపం | 1.2 | 1 |
| ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (జీఎస్ఎస్ఏ) కార్యాలయం | 1.3 | 2 |
| ఆడిట్‌కు అధికారాలను కల్పించిన నిబంధనలు | 1.4 | 2 |
| ఆడిట్ ప్రణాళిక, నిర్వహణ | 1.5 | 3 |
| ఆడిట్ పరిశీలనలపై ప్రభుత్వ శాఖల స్పందన | 1.6 | 3 |
| ఆడిట్‌లో కనుగొన్న అంశాల్లో ప్రధానమైనవి | 1.7 | 4 |
| *ఆడిట్ సమీక్షలు* | | |
| *పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ*<br>**అధ్యాయం 2 - సామాజిక భద్రతా పింఛను పథకాల అమలు** | 2 | 15 |
| *గృహ నిర్మాణ శాఖ*<br>**అధ్యాయం 3 - ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అమలు** | 3 | 35 |
| *వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాల శాఖ*<br>**అధ్యాయం 4 - పౌర సరఫరాల శాఖ పనితీరు** | 4 | 55 |
| *నియమాల పాటింపుపై ఆడిట్*<br>**అధ్యాయం 5 - నియమాల పాటింపుపై ఆడిట్ పరిశీలనలు** | | |
| *పాఠశాల విద్యా శాఖ*<br>పాఠశాలల్లో మౌలిక వసతులు | 5.1 | 79 |
| *గృహ నిర్మాణ శాఖ*<br>ఇందిరా ఆవాస్ యోజన (ఐఏవై) అమలు | 5.2 | 85 |
| వరద బాధితులకు ఇళ్ళ నిర్మాణంలో జాప్యం | 5.3 | 92 |
| *పాఠశాల విద్యా శాఖ*<br>పరీక్ష రుసుముల జమాలెక్కలు | 5.4 | 94 |

| | పేరా | పేజీ |
|---|---|---|
| *రెవెన్యూ శాఖ* | | |
| **భూబదలాయింపులో అక్రమాలు** | 5.5 | 96 |
| **ప్రభుత్వ భూమి ఆక్రమణదారుకు బదలాయింపు** | 5.6 | 97 |
| *ఆర్థిక మరియు ఇతర శాఖలు* | | |
| **అద్దెకు తీసుకున్న వాహనాలకు అక్రమ చెల్లింపులు** | 5.7 | 98 |
| *ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ* | | |
| **మానసిక ఆరోగ్య సంస్థ, హైదరాబాదు నందు ఖైదీల వార్డు నిర్మాణంలో జాప్యం** | 5.8 | 99 |
| *హోమ్ (జైళ్ళు) శాఖ* | | |
| **ఫైర్ ఔట్‌పోస్టుల సర్వీసు ప్రొవైడర్లకు అనుచిత లబ్ధి** | 5.9 | 101 |

## అనుబంధాలు



| | | పేరా | పేజీ |
|---|---|---|---|
| 1.1 | శాఖలవారీగా బకాయి ఉన్న తనిఖీ నివేదికలు, పేరాలు | 1.6 | 103 |
| 1.2 | 2014 జనవరి నాటికి అపరిష్కృతంగా ఉన్న వివరణాత్మక నివేదికలు | 1.6 | 104 |
| 2.1 | నమూనా యూనిట్ల జాబితా | 2.3.3.1 | 105 |
| 2.2 | ఆడిట్ నిర్వహించిన లబ్ధిదారుల సర్వేలో సంప్రదించిన పింఛనుదారుల వివరాలు క్యాటగిరీ వారీగా | 2.3.3.1 | 106 |
| 2.3 | పింఛను మంజూరు ప్రక్రియ | 2.5.1 | 107 |
| 2.4 | ఐదు దశల వడపోత ప్రక్రియ | 2.5.1 | 107 |
| 2.5 | ఎంపిక చేసిన 103 యూనిట్లలో రికార్డులు/దరఖాస్తుల ఆడిట్ పరిశీలన ఫలితాలు | 2.5.1 | 108 |
| 2.6 | పింఛను చెల్లింపులకు అనుసరించే వివిధ పద్ధతుల వివరాలు | 2.5.3.1 | 109 |
| 4.1 | నమూనా తనిఖీ వివరాలు | 4.2.3.1 | 110 |
| 4.2 | ప్రతీ సీజనులో చేసే ధాన్యం కొనుగోలు ప్రక్రియ | 4.5.1 | 110 |
| 4.3 | 2008-09 నుండి 2012-13 మధ్య (2013 మే వరకు)<br>ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో జిల్లాలవారీగా ధాన్యం సేకరణ | 4.5.1 | 111 |
| 4.4 | సంవత్సరాల వారీగా రవాణా చేసిన సరుకు, రవాణాపై అదనపు ఖర్చుల వివరాలు | 4.6.6.1 | 111 |
| 4.5 | మొత్తం నిలవ సామర్థ్యంలో సొంత గిడ్డంగుల సామర్థ్యం శాతం | 4.6.7 | 112 |
| 5.1 | నమూనా తనిఖీ చేపట్టిన ఆరు జిల్లాలలో మచ్చుకు పరిశీలించిన పాఠశాలల వివరాలు | 5.1 | 113 |
| 5.2 | భవనాలు లేకుండా పనిచేస్తున్న పాఠశాలల వివరాలు | 5.1.1<br>5.1.2 | 115 |
| 5.3 | నమూనా తనిఖీ చేపట్టిన జిల్లాలలోని పాఠశాలల్లో కనీస వసతుల పరిస్థితి | 5.1.4<br>5.1.5<br>5.1.7<br>5.1.8 | 115 |

| | | పేరా | పేజీ |
|---|---|---|---|
| 5.4 | నమూనా తనిఖీ చేపట్టిన జిల్లాల పాఠశాలల్లో గ్రంథాలయాలు, పుస్తకాల వివరాలు | 5.1.9 | 116 |
| 5.5 | వాహనాలకు నెలవారీ అద్దె చెల్లింపుల వివరాలు | 5.7 | 116 |
| *పొడి అక్షరాల వివరణ* | | | 117 |

# ముందుమాట

1. రాజ్యాంగంలోని 151వ అధికరణం కింద, రాష్ట్ర గవర్నర్‌కు సమర్పించటం కోసం సామాన్య మరియు సామాజిక రంగాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాఖల కార్యకలాపాలపై ఈ ఆడిట్ నివేదికను రూపొందించటం జరిగింది.

2. ఈ నివేదికలో *సామాజిక భద్రతా పింఛను పథకాల అమలు* (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ); *ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అమలు* (గృహ నిర్మాణ శాఖ); *పౌర సరఫరాల శాఖ పనితీరు (వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాల శాఖ)* సమీక్షలు, ఇంకా *పాఠశాలల్లో మౌలిక వసతులు* (పాఠశాల విద్యా శాఖ), *ఇందిరా ఆవాస్ యోజన అమలు* (గృహ నిర్మాణ శాఖ)తో పాటు నియమాల పాటింపుపై మరో ఏడు ఆడిట్ పేరాలు ఉన్నాయి.

3. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, స్థానిక సంస్థలు, ఆర్థిక రంగం, రెవెన్యూ రంగం, ప్రభుత్వ యాజమాన్య సంస్థలపై కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలను వేరు వేరుగా సమర్పించడం జరుగుతుంది.

4. 2012-13 సంవత్సరంలో నిర్వహించిన ఆడిట్‌లో వెల్లడైన అంశాలూ, అంతకుముందు సంవత్సరాల్లోనే ఆడిట్ దృష్టికి వచ్చి, గత నివేదికల్లో పొందుపరచని అంశాలూ ఈ నివేదికలో ఉన్నాయి; అంతేకాకుండా, 2012-13 తరువాతి కాలానికి సంబంధించిన అంశాలను కూడా అవసరమైన చోట్ల చేర్చటం జరిగింది. ప్రభుత్వ/ప్రభుత్వ శాఖల సమాధానాలు అందిన సందర్భాల్లో వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే ఈ నివేదికలోని అంశాలను ఖరారు చేయడమైంది.

5. భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ జారీ చేసిన ఆడిటింగ్ ప్రమాణాలకు అనుగుణంగా ఆడిట్‌ను నిర్వహించడమైంది.

6. ఈ తెలుగు నివేదికలో ఏవైనా సందేహాలుంటే అనువాదానికి మూలాధారమైన ఆంగ్ల నివేదికను అధికారికంగా తీసుకోగలరు.

# అధ్యాయం-1

## అవలోకనం

## 1.1 ఈ నివేదిక గురించి...

ఇది భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదిక. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించి, సామాన్య, సామాజిక రంగాలకు చెందిన ప్రభుత్వ శాఖలు, ఎంపిక చేసిన కార్యక్రమాలపై నిర్వహించిన ఆడిట్ సమీక్షల్లో గమనించిన అంశాలతో పాటుగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాఖలు, కేంద్ర మరియు రాష్ట్ర ప్రణాళికా పథకాలకు సంబంధించిన లావాదేవీల్లో నియమపాలన తనిఖీలోనూ, రాష్ట్ర స్వయంపాలక సంస్థల తనిఖీలోనూ వెల్లడైన అంశాలు ఈ ఆడిట్ నివేదికలో ఉన్నాయి.

ఆడిట్‌లో వెల్లడైన అంశాల్లో ముఖ్యమైన వాటిని రాష్ట్ర శాసనసభ దృష్టికి తీసుకెళ్లడమే ఈ నివేదిక ప్రధాన ఉద్దేశం. ఆడిట్ ప్రామాణిక సూత్రాల ప్రకారం, ఏవైనా ఆడిట్ పరిశీలనలను ఈ నివేదికలో పొందుపర్చాలంటే, అవి సంబంధిత లావాదేవీల స్వభావం, పరిమాణాలకు తగ్గ స్థాయిలో ఉండాలి. కార్యనిర్వాహక అధికారులు దిద్దుబాటు చర్యలు తీసుకునే విధంగానూ, సంస్థలు మెరుగైన ఆర్థిక నిర్వహణకు ఉపయోగపడే విధానాలను రూపొందించుకునే విధంగానూ, తగిన మార్గదర్శకాలను జారీచేసే విధంగానూ ఆడిట్ పరిశీలనలుండాలి. ఆవిధంగా, ఆడిట్ పరిశీలనలు సుపరిపాలనకు దోహదపడతాయి.

భారత రాజ్యాంగంలోని నిబంధనలు, సంబంధిత చట్టాలు, నియమాలు, అధికార్లు జారీ చేసిన ఉత్తర్వులు, నిర్దేశాలను ప్రభుత్వ శాఖలు, సంస్థలు పాటిస్తున్నాయని నిర్ధారించుకోడానికి వాటి లావాదేవీలను నియమపాలన తనిఖీలో పరిశీలించడం జరుగుతుంది. మరోవైపు, పనితీరు సమీక్షలో నియమ పాలన తనిఖీతో పాటు, ఆయా పథకాలు, కార్యక్రమాలు, ప్రభుత్వ శాఖల లక్ష్యాలను పొదుపుగానూ, సమర్థవంతంగానూ, కార్యసాధకంగానూ సాధించారా లేదా అని పరిశీలించడం జరుగుతుంది.

ఈ అధ్యాయంలో, ఆడిట్ ప్రణాళిక, పరిధి గురించి వివరించడం జరిగింది. ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న పథకాల అమలులో సాధించిన ప్రగతి, ఆడిట్ గమనించిన లోపాలు, లావాదేవీల తనిఖీలో వెల్లడైన ప్రధానమైన అంశాలు, ఇంకా గత ఆడిట్ నివేదికలపై ప్రభుత్వ శాఖలు, సంస్థలు తీసుకున్న చర్యల వివరాలను కూడా ఈ అధ్యాయంలో క్లుప్తంగా వివరించడం జరిగింది.

## 1.2 సామాన్య, సామాజిక రంగాల సంక్షిప్త స్వరూపం

రాష్ట్రంలో సామాన్య, సామాజిక రంగాల కిందకు వచ్చే ప్రభుత్వ శాఖలు గత ఐదేళ్ళలో చేసిన ఖర్చుల వివరాలను ఈ దిగువన వివరించడం జరిగింది.

**పట్టిక 1.1**

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | ప్రభుత్వ శాఖ | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | 2012-13 |
|---|---|---|---|---|---|---|
| ఎ | సామాన్య రంగం | | | | | |
| 1 | ఆర్థిక, ప్రణాళిక | 19769.25 | 23079.94 | 28572.35 | 30529.86 | 33817.12 |
| 2 | సాధారణ పరిపాలన | 594.14 | 717.03 | 444.09 | 705.90 | 584.68 |
| 3 | హోమ్ | 2536.26 | 3068.72 | 3916.43 | 4412.53 | 5084.74 |
| 4 | న్యాయ | 326.71 | 415.47 | 612.53 | 603.63 | 684.29 |
| 5 | రెవెన్యూ | 1098.14 | 2132.93 | 1964.19 | 2412.21 | 2058.01 |
| 6 | రాష్ట్ర శాసన సభ | 54.09 | 53.56 | 51.08 | 84.69 | 95.27 |
| | మొత్తం (ఎ) | **24378.59** | **29467.65** | **35560.67** | **38748.82** | **42324.11** |

| క్రమ సంఖ్య | ప్రభుత్వ శాఖ | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | 2012-13 |
|---|---|---|---|---|---|---|
| బి | సామాజిక రంగం | | | | | |
| 1 | వెనుకబడిన తరగతుల సంక్షేమం | 1088.91 | 1181.74 | 1996.34 | 2758.53 | 3774.72 |
| 2 | వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాలు | 2771.67 | 2546.13 | 2415.79 | 2450.69 | 2792.38 |
| 3 | వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం | 3006.66 | 3323.02 | 4140.35 | 4980.25 | 5312.34 |
| 4 | ఉన్నత విద్య | 1334.60 | 1731.51 | 2551.16 | 2669.73 | 3238.25 |
| 5 | గృహ నిర్మాణం | 4083.13 | 1398.34 | 1626.77 | 1743.33 | 1829.15 |
| 6 | కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు | 325.36 | 287.43 | 347.29 | 465.67 | 474.33 |
| 7 | అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం | 195.72 | 197.88 | 324.62 | 370.33 | 350.88 |
| 8 | మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి | 3527.45 | 3139.85 | 4054.53 | 4108.89 | 4268.07 |
| 9 | పంచాయతీరాజ్ $ | 3768.10 | 2758.32 | 3533.15 | 2987.51 | 3393.22 |
| 10 | గ్రామీణాభివృద్ధి $ | 2563.08 | 3159.24 | 3921.78 | 4855.68 | 5175.01 |
| 11 | పాఠశాల విద్య | 5827.19 | 6690.92 | 9906.66 | 12250.18 | 13263.24 |
| 12 | సాంఘిక సంక్షేమం | 1448.93 | 1245.12 | 1776.64 | 1941.74 | 2224.99 |
| 13 | గిరిజన సంక్షేమం | 705.10 | 765.45 | 961.50 | 1143.23 | 1336.44 |
| 14 | స్త్రీ, శిశు, వికలాంగులు, వయోజనులు | 1146.37 | 995.99 | 981.29 | 1513.03 | 2029.56 |
| 15 | యువజనాభ్యుదయం, పర్యాటకం, సాంస్కృతిక వ్యవహారాలు | 139.27 | 101.29 | 188.18 | 214.38 | 258.89 |
| | మొత్తం (బి) | **31931.54** | **29522.23** | **38726.05** | **44453.17** | **49721.47** |
| | పూర్తి మొత్తం (ఎ+బి) | **56310.13** | **58989.88** | **74286.72** | **83201.99** | **92045.58** |

*మూలం: సంబంధిత సంవత్సరాలకు రాష్ట్ర ప్రభుత్వ అప్రోప్రియేషన్ అకౌంట్లు*

*$ ఒకే సచివాలయ శాఖ (పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి) కింద ఉన్నాయి*

## 1.3 ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (జీఎస్ఎస్ఏ) కార్యాలయం




*ఆంధ్రప్రదేశ్ అకౌంటెంట్స్ జనరల్ కార్యాలయాలు*

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని 20 శాఖలు, ఆ శాఖల కింది ప్రభుత్వరంగ సంస్థలు, స్వయంపాలక సంస్థలు, స్థానిక సంస్థల ఆడిట్‌ను భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సీఏజీ) ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (సామాన్య, సామాజిక రంగాల తనిఖీ) కార్యాలయం నిర్వహిస్తుంది.

## 1.4 ఆడిట్‌కు అధికారాలను కల్పించిన నిబంధనలు

భారత రాజ్యాంగంలోని 149, 151వ అధికరణలు, కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు, సర్వీసు నిబంధనల) చట్టం - 1971 (డీపీసీ చట్టం) ఆడిట్ నిర్వహించే అధికారాన్ని సీఏజీకి కల్పించాయి. సామాన్య, సామాజిక రంగాల కిందకు వచ్చే రాష్ట్ర ప్రభుత్వ శాఖల ఖర్చుల తనిఖీని డీపీసీ చట్టంలోని 13వ సెక్షను[1] కింద సీఏజీ నిర్వహిస్తారు. స్వయంపాలక సంస్థలు, స్థానిక సంస్థలకు డీపీసీ చట్టంలోని

[1] (i) రాష్ట్ర సంచిత నిధి నుండి జరిగే అన్ని లావాదేవీలు, (ii) రాష్ట్ర అత్యయిక నిధి, ప్రజాపద్దులకు సంబంధించిన అన్ని లావాదేవీలు, (iii) అన్ని వర్తక, ఉత్పత్తి, లాభ-నష్టాల పద్దులు, ఆస్తి, అప్పుల పట్టీలు, ఇతర ఉప పద్దుల తనిఖీ

19(2)[2], 20(1)[3] సెక్షన్ల కింద ఆడిట్‌ను నిర్వహించడం జరుగుతుంది. ఈ సంస్థలకు సీఏజీ ఏకైక (సోల్) ఆడిటరుగా వ్యవహరిస్తారు. ఇవి కాక, పెద్దమొత్తంలో ప్రభుత్వ నిధులను పొందే ఇతర స్వయంపాలక సంస్థలను కూడా చట్టంలోని 14వ సెక్షను[4] కింద సీఏజీ తనిఖీ చేయాలి. వివిధ ఆడిట్‌లకు అనుసరించాల్సిన నియమాలు, విధానాలు సీఏజీ జారీ చేసిన "ఆడిట్ ప్రామాణిక సూత్రాలు" లోనూ, "ఆడిట్ - అకౌంట్ల నిబంధనలు - 2007" లోనూ నిర్దేశించడం జరిగింది.

## 1.5 ఆడిట్ ప్రణాళిక, నిర్వహణ

ఒక ప్రభుత్వ శాఖ/సంస్థ/స్వయంపాలక సంస్థ /పథకం మొదలైన వాటిలో కార్యకలాపాల తీవ్రత, సంక్లిష్టత ఏ మేరకు ఉందో అంచనా వేయడంతో ఆడిట్ ప్రక్రియ మొదలవుతుంది. అయిన ఖర్చు, ఈ కార్యకలాపాలకు ప్రభుత్వమిచ్చిన ప్రాధాన్యత, ఆర్థికపరమైన అధికారాల స్థాయి, అంతర్గత నియంత్రణలు, భాగస్వాముల ప్రయోజనాలు వంటి అంశాల ఆధారంగా ఈ అంచనా జరుగుతుంది. గత ఆడిట్‌లో కనుగొన్న విషయాలను కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకుంటారు. ఎంత కాలానికి ఒకసారి ఆడిట్ చేయాలి, ఎంతమేరకు ఆడిట్ చేయాలనే విషయాలను ఈ అంచనా ఆధారంగా నిర్ణయిస్తారు. ఈ అంచనా ఆధారంగానే 'వార్షిక ఆడిట్ ప్రణాళిక' రూపొందించి దాని ప్రకారమే ఆడిట్ నిర్వహించటం జరుగుతుంది.

ఒక యూనిట్ ఆడిట్ పూర్తయిన మీదట, ఆడిట్‌లో కనుగొన్న విషయాలను తనిఖీ నివేదిక (ఇన్‌స్పెక్షన్ రిపోర్టు - ఐఆర్) ద్వారా ఆ యూనిట్ అధిపతికి తెలియజేసి, రిపోర్టు అందుకున్న ఒక నెలలోపు అందులోని అంశాలకు సమాధానాలు ఇవ్వాలని కోరడం జరుగుతుంది. సమాధానాలు అందిన సందర్భాల్లో, ఆయా ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించడం లేదా తదుపరి చర్యలను సూచించడం జరుగుతుంది. ఈ ఇన్‌స్పెక్షన్ రిపోర్టులలోని (ఐ.ఆర్.) కీలకమైన అంశాలను ఎంపిక చేసి, ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయి వారి దృష్టికి తీసుకువెళ్ళేందుకు వీలుగా ఆడిట్ నివేదికలలో పొందుపరచడానికి అవసరమైన ప్రక్రియను చేపడతారు. భారత రాజ్యాంగంలోని 151 వ అధికరణాన్ని అనుసరించి రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టడం కోసం ఈ ఆడిట్ నివేదికలను రాష్ట్ర గవర్నరుకు సమర్పించడం జరుగుతుంది.

## 1.6 ఆడిట్ పరిశీలనలపై ప్రభుత్వ శాఖల స్పందన

కార్యాలయ అధిపతులు, వారి పై అధికారులు, ఐఆర్‌లలోని అంశాలపై స్పందించి, తగిన దిద్దుబాటు చర్యలను తీసుకోవాలి. ఐఆర్‌లలో పొందుపరచిన ఆడిట్ పరిశీలనలను ఏజీ కార్యాలయం అధికారులు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లా స్థాయిలో జరిగే సమావేశాల్లో కూడా చర్చిస్తారు.

ఐతే, 2012-13, అంత కన్నా ముందు సంవత్సరాలకు సంబంధించిన 6,632 ఐఆర్‌లు, అందులోని 43,579 పేరాలు ఈ కింద వివరించినట్లు 2013 సెప్టెంబరు 30 నాటికి అపరిష్కృతంగా ఉన్నాయి. వీటిలో 501 ఐఆర్‌లు (6,125 పేరాలు) విషయంలో తొలి సమాధానాలు కూడా రాలేదు. ప్రభుత్వ శాఖలవారీగా వివరాలను ***అనుబంధం-1.1***లో ఇవ్వడం జరిగింది.

---

[2] రాష్ట్ర శాసనసభ చేసిన చట్టం ద్వారా/కింద ఏర్పాటైన కార్పొరేషన్ల (కంపెనీలు కానివి) పద్దులను సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం తనిఖీ చేయడం

[3] రాష్ట్ర గవర్నర్ చేసిన విజ్ఞప్తి మేరకు ఏదైనా సంస్థ పద్దులను తనిఖీ చేయడం. సీఏజీ, ప్రభుత్వం - ఇరు పక్షాలూ అంగీకరించిన షరతులు, నిబంధనల మేరకు ఈ తనిఖీ జరుగుతుంది

[4] రాష్ట్ర సంచిత నిధి నుండి గ్రాంట్లు లేదా లోన్ల ద్వారా పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం పొందిన సంస్థల అన్ని రాబడులూ, ఖర్చులనూ, అలాగే రాష్ట్ర సంచిత నిధి నుండి గ్రాంట్లు లేదా లోన్ల రూపంలో, ఒక ఆర్థిక సంవత్సరంలో కోటి రూపాయలకు తక్కువ కాకుండా పొందిన సంస్థలకు సంబంధించిన అన్ని రాబడులు, ఖర్చులను తనిఖీ చేయడం జరుగుతుంది

పట్టిక 1.2

| సంవత్సరం | 2013 సెప్టెంబరు 30 నాటికి అపరిష్కృతంగా ఉన్న ఐఆర్‌లు, పేరాలు | | తొలి సమాధానాలు కూడా రాని ఐఆర్‌లు, పేరాలు | |
|---|---|---|---|---|
| | ఐఆర్‌లు | పేరాలు | ఐఆర్‌లు | పేరాలు |
| **2009-10, అంతకు ముందు సంవత్సరాలవి** | 5,006 | 28,388 | 206 | 3,187 |
| **2010-11** | 996 | 7,141 | 101 | 661 |
| **2011-12** | 484 | 4,868 | 170 | 1,352 |
| **2012-13** | 146 | 3,182 | 24 | 925 |
| మొత్తం | **6,632** | **43,579** | **501** | **6,125** |

ఆడిట్ జారీచేసిన ఐఆర్‌లు, పేరాలపై చర్యలు చేపట్టకపోవడం వలన, ఈ నివేదికల్లో లేవనెత్తిన తీవ్రమైన ఆర్థిక అవకతవకలు కొనసాగుతూనే ఉండడం, పరిపాలనా ప్రక్రియలో అంతర్గత నియంత్రణలు బలహీనమవడం, ప్రజాసౌకర్యాలను సమర్థవంతంగానూ, కార్యసాధకంగానూ సమకూర్చలేకపోవడం, మోసాలూ, అవినీతి చోటు చేసుకుని ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లడం వంటివాటికి అవకాశం కలుగుతుంది.

ఆర్థిక - ప్రణాళిక శాఖ 1993 నవంబరులో జారీచేసిన ఆదేశాల ప్రకారం, ఆడిట్ నివేదికల్లో పొందుపర్చిన పేరాలు, సమీక్షలపై సంబంధిత ప్రభుత్వ (పరిపాలన) శాఖలు, ఆడిట్ నివేదికలను శాసనసభలో ప్రవేశపెట్టిన నాటినుండి మూడు నెలల్లోపు వివరణాత్మక నివేదికలను సమర్పించాలి. ఇందుకోసం ప్రజాపద్దుల సంఘం నుండి వచ్చే నోటీసు లేదా పిలుపు కోసం వేచి చూడకుండా, అప్పటికే తీసుకున్న చర్యలను లేదా ప్రతిపాదిత చర్యలను సూచిస్తూ వివరణాత్మక నివేదికలను గడువులోపు సమర్పించాలి. ఐతే, 2005- 06 నుండి 2011 -12 సంవత్సరాల ఆడిట్ నివేదికల్లో పేర్కొన్న 21 పేరాలు/సమీక్షలకు వివరణాత్మక నివేదికలను 2014 జనవరి నాటికి 10 ప్రభుత్వ శాఖలు పంపించలేదు. ఈ వివరాలు ***అనుబంధం-1.2***లో ఉన్నాయి.

ఆర్థిక శాఖ జారీ చేసిన సూచనల కరదీపిక, ఇంకా 1993 నవంబరు 3వ తేదీ నాటి యు.ఓ. ప్రకారం, కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో పొందుపర్చాలని ప్రతిపాదించిన ముసాయిదా ఆడిట్ పేరాలపై అన్ని ప్రభుత్వ శాఖలూ ఆ ముసాయిదా పేరాలనందుకున్న ఆరు వారాల్లోపు తమ సమాధానాలను పంపించాలి. ఆవిధంగా, 2013-14లో, నియమాల పాటింపుపై ఆడిట్ పరిశీలనల తాలూకు 13 ముసాయిదా పేరాలు, ఆడిట్ సమీక్షల తాలూకు 3 ముసాయిదా నివేదికలను సంబంధిత ప్రభుత్వ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు/ముఖ్య కార్యదర్శులు/కార్యదర్శులకు పంపి, ఆడిట్‌లో కనుగొన్న అంశాలను వారి దృష్టికి తెచ్చి, ఆరు వారాల్లోపు సమాధానం పంపాలని కోరడం జరిగింది. కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో ఈ పేరాలను పొందుపర్చే అవకాశం ఉంది. ఆ నివేదికను రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టడం జరుగుతుంది కాబట్టి, ఆడిట్ కనుగొన్న అంశాలపై వారి వ్యాఖ్యలు/సమాధానాలను కూడా పొందుపర్చాల్సి ఉన్నందున ఈ పేరాలపై వారు వ్యక్తిగత శ్రద్ధ చూపడంకోసం వాటిని పంపడం జరిగింది. అయినప్పటికీ, మూడు ప్రభుత్వ శాఖలు[5] నియమాల పాటింపుపై ఆడిట్ పరిశీలనల తాలూకు ఐదు ముసాయిదా పేరాలకు ఈ నివేదిక ఖరారు చేసేనాటికి తమ సమాధానాన్ని తెలుపలేదు. ప్రభుత్వ శాఖల నుండి అందిన సమాధానాలను ఈ ఆడిట్ నివేదికలో తగురీతిని పొందుపర్చడం జరిగింది.

## 1.7 ఆడిట్‌లో కనుగొన్న అంశాల్లో ప్రధానమైనవి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని ఎనిమిది శాఖల పద్దులు, లావాదేవీలను 2012-13 సంవత్సరంలో మచ్చుకు తనిఖీ చేసినపుడు కనుగొన్న అంశాలు ఈ నివేదికలో ఉన్నాయి. ప్రజలకు మెరుగైన సేవలందించడానికి తగిన దిద్దుబాటు

[5] హోమ్ (1), రెవెన్యూ (2), పాఠశాల విద్య (2)

చర్యలను తీసుకోవడంలో ప్రభుత్వానికి సహాయకారిగా ఉండటం కోసం కొన్ని నిర్దిష్ట ప్రభుత్వ కార్యక్రమాల అమలును, సామాన్య, సామాజిక రంగాలకు సంబంధించిన విధాన నిర్ణయాల అమలును మదింపు చేయడంపై ఈ ఏడాది ప్రధానంగా ఆడిట్ దృష్టి సారించింది. ఆ ప్రయత్నంలో భాగంగా, పథకాలు/ప్రభుత్వ శాఖలపై ఆడిట్ సమీక్షల తాలూకు మూడు ముసాయిదా నివేదికలు, నియమాల పాటింపుపై ఆడిట్ పరిశీలనల తాలూకు 13 ముసాయిదా పేరాలను ప్రభుత్వానికి పంపడం జరిగింది.

'సామాజిక భద్రతా పింఛనుల అమలు', 'ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అమలు', 'పౌర సరఫరాల శాఖ పనితీరు'లపై ఆడిట్ సమీక్షలు ఈ నివేదికలో ఉన్నాయి. ఈ మూడింటిలోనూ లబ్ధిదారుల ఎంపిక ఒకే ప్రాతిపదికన జరుగుతోంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబాలను ఈ పథకాలకు ఎంపిక చేస్తారు. పౌర సరఫరాల శాఖ జారీ చేసిన రేషన్ కార్డు కుటుంబ ఆర్థిక స్థితిని నిర్ధారించడానికి ఆధారం కాబట్టి, లబ్ధిదారుల ఎంపికకు రేషన్ కార్డును తప్పనిసరి చేసారు. ఆంధ్రప్రదేశ్‌లో తెల్లకార్డు, అన్నపూర్ణ కార్డు, అంత్యోదయ అన్నయోజన కార్డు వంటి వివిధ రకాల రేషన్ కార్డులు కల్గిన వారిని బీపీఎల్ వర్గానికి చెందినవారిగా పరిగణిస్తారు.

రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం 'ఐరిస్ బయోమెట్రిక్ టెక్నాలజీ'ని అనుసరించింది (2005). ఐతే, ఐరిస్ ఆధారిత రేషన్ కార్డులను జారీ చేసిన తర్వాత కూడా బోగస్ కార్డులు కొనసాగుతుండటంతో, అర్హులైన పౌరులకు మాత్రమే రేషన్ సరుకులు, గృహ నిర్మాణం, పింఛన్లు వంటి సామాజిక భద్రతా పథకాల ప్రయోజనాలు అందేలా చూడటానికి రాష్ట్ర స్థాయి సమాచారాన్ని (పౌర సరఫరాలు, పింఛన్లు, గృహ నిర్మాణ డేటాబేస్‌లతో సహా) సమన్వయం చేసి అర్హతలేని/బోగస్ కార్డులను గుర్తించి వాటిని తొలగించాలని 2008 నవంబరులో ప్రభుత్వం నిర్ణయించింది. ఆశించిన విధంగా పౌర సరఫరాల డేటాబేస్ ప్రక్షాళన జరిగిందా, పౌర సరఫరాల డేటాబేస్ ఆధారంగా సామాజిక భద్రతా పింఛన్లు, గృహ నిర్మాణ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడం లోపరహితమైన, సరైన ప్రక్రియేనా అనే అంశాలను ఆడిట్‌లో పరిశీలించడమైంది. డేటాబేస్ విశ్లేషణలో ఆడిట్ కనుగొన్న అంశాలను సంబంధిత ఆడిట్ సమీక్షల్లో[6] చేర్చడమైంది.

**ఈ ఆడిట్ నివేదికలో పొందుపర్చిన ప్రధానమైన అంశాలను క్లుప్తంగా కింద వివరించడం జరిగింది.**

### 1.7.1 సామాజిక భద్రతా పింఛను పథకాల అమలు

***సమాజంలోని బలహీనవర్గాలకు సాంఘిక భద్రత కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమమైన జాతీయ సాంఘిక సహాయ కార్యక్రమంలో సామాజిక భద్రతా పింఛనుల పథకం కూడా ఒక ప్రధాన అంశం. జాతీయ సాంఘిక సహాయ కార్యక్రమాన్ని 2002-03 నుంచి రాష్ట్ర ప్రణాళికకు బదిలీ చేశారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న పింఛను పథకాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం 2006 ఏప్రిల్ నెలలో ఒకే గొడుగు కిందికి తెచ్చింది. పింఛన్ల మంజూరు, చెల్లింపులలో ఏకరూపత సాధించే ఉద్దేశంతో వీటన్నింటినీ ఈ విధంగా పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోకి తీసుకొచ్చింది. నిధులను విడుదల చేసి, పథకాలను పర్యవేక్షించే బాధ్యతను గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ[7] (సెర్ప్)కు అప్పగించారు. ఇది పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ అనుబంధ సంస్థ. ఈ క్రమంలోనే, రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛను పథకాలను పరిపూర్ణత ప్రాతిపదికన ఇందిరమ్మ[8] కార్యక్రమంలో భాగంగా అమలు చేయటం మొదలు పెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ పింఛను పథకాల కింద 2013 మార్చినాటికి రాష్ట్రంలో సుమారు 72.36 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు.***

---

[6] ఈ నివేదికలోని పేరాలు: 2.5.1, 3.5.1, 3.5.2, 3.6.1, 3.6.2, 4.6.1.3, 4.6.1.4

[7] గ్రామీణ పేదరికాన్ని రూపుమాపే దిశగా ఏర్పాటు చేసిన స్వయం పాలక సంస్థ

[8] గ్రామీణ, ఆదర్శ పట్టణ ప్రాంతాలలో సమీకృత నవీన అభివృద్ధి

అర్హులైన లబ్ధిదారులను అందరినీ గుర్తించి, పింఛనులు మంజూరుచేసి, సకాలంలో చెల్లింపులు చేసేందుకు రూపొందించిన వ్యవస్థ లోపరహితంగానే ఉన్నదని నిర్ధారించుకొనేందుకుగాను రాష్ట్రంలోని సామాజిక భద్రతా పింఛనుల అమలుపై ఆడిట్ పరిశీలన చేపట్టటం జరిగింది. ఈ ఆడిట్ పరిశీలనలో గమనించిన ముఖ్యాంశాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

## ఆర్థిక నిర్వహణ, వాస్తవ పురోగతి

- పింఛనుదారుల సంఖ్య **2007-08** సంవత్సరంతో పోలిస్తే **2008-09**లో ఒక్కసారిగా పెరిగిపోయింది (వృద్ధాప్య, వితంతు పింఛన్లు **84** శాతం పెరగటంతో మొత్తంమీద ఇది **23** లక్షలు). ఇందిరమ్మ కార్యక్రమం ప్రవేశపెట్టటంవలన వికలాంగుల పింఛన్లు **2008-09**తో పోలిస్తే **2009-10**లో **342** శాతం పెరిగాయి.

- స్టేట్ నోడల్ అకౌంట్‌ను నిర్వహించటంలోనూ, బ్యాంకులకు నిధులను ఎలక్ట్రానిక్ పద్ధతిలో బదిలీచేసి, మిగులు నిధులను సెర్ప్ అట్టిపెట్టుకునే విషయంలోనూ నియంత్రణ కోసం ప్రభుత్వం తగు యంత్రాంగాన్ని రూపొందించలేదు. అంతేకాక, సెర్ప్ దగ్గర మిగిలిపోయిన మొత్తాలను రికన్సయిల్ చేసుకునేందుకు అవసరమైన విధానమేదీ గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించలేదు.

- తన కార్యకలాపాలకు సంబంధించి సెర్ప్ నగదు పుస్తకం వంటి రికార్డులేవీ రాయటం లేదు. తన లావాదేవీలు అన్నింటికీ బ్యాంకుల నుంచి వచ్చిన నివేదికలనే ప్రామాణికంగా పరిగణిస్తున్నది. అంతేకాకుండా, యూనిట్లు తమ రాబడులను నగదు పుస్తకాలలో రాయకపోవటం, నగదు పుస్తకంలోని అంకెలను బ్యాంకు పద్దులతో రికన్సయిల్ చేయకపోవటం మొదలైన పలు నియంత్రణా లోపాలు నమూనా తనిఖీలో వెలుగుచూశాయి.

**(పేరా 2.4)**

- బహుళ బ్యాంకు ఖాతాలను నిర్వహించటం, పథకాలను అమలుచేసే సంస్థలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలకు వినియోగ ధృవపత్రాలను అందచేయకపోవటం (**₹751** కోట్లు), చెల్లింపుకాక మిగిలిన నిధులను తిప్పి పంపకుండా మండలాభివృద్ధి అధికారులు/మునిసిపల్ కమీషనర్లు (**₹2.18** కోట్లు), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు (**₹14.53** కోట్లు) అట్టిపెట్టుకోవటం, కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర పథకాలమీద ఖర్చు చేయటం వంటివి ఆర్థిక నిర్వహణ లోపాలను బహిర్గతం చేస్తున్నాయి.

**(పేరాలు 2.6.1 నుండి 2.6.3)**

## లబ్ధిదారుల గుర్తింపు, పింఛను మంజూరు

- పలు యూనిట్ కార్యాలయాలలో తగిన రిజిస్టర్లు నిర్వహించకపోవటంతో, ఇంతవరకు అందిన దరఖాస్తుల సంఖ్య, అందులో ఆమోదించినవీ, తిరస్కరించినవీ, అలా తిరస్కరించటానికీ, మంజూరు చేయటంలోని జాప్యానికీ గల కారణాలు మొదలైన వాటి విషయంలో స్పష్టత లేదు.

- దరఖాస్తులను పరిశీలించే మొత్తం ప్రక్రియను ఒక ప్రైవేటు సంస్థకు నామినేషన్ పద్ధతిలో అప్పగించారు. దరఖాస్తుదారుల అర్హతను నిర్ధారించేందుకు ప్రభుత్వ స్థాయిలో తగు యంత్రాంగమేదీ లేదు.

**(పేరా 2.5.1)**

- పింఛనుదారుల డేటాబేస్ (**2012** డిసెంబరు సమాచారం) విశ్లేషించిన మీదట **10.62** లక్షల రేషన్ కార్డు నెంబర్లకు సంబంధించి ఈ డేటాబేస్‌కు పౌర సరఫరాల శాఖ దగ్గర ఉన్న బీపీఎల్ కార్డుల సమాచారంతో సరిపోలటంలేదు. అంతేకాకుండా, **5.54** లక్షల మందికి అసలు రేషన్ కార్డు నెంబర్లే డేటాబేస్‌లో పొందుపరచ లేదు.

**(పేరాలు 2.5.1, 2.5.1.1)**

### పింఛను చెల్లింపులు

చెల్లింపులలో పారదర్శకత తీసుకు వచ్చేందుకూ, సాంప్రదాయ చెల్లింపు విధానంలోని లోపాలను సరిదిద్దేందుకూ, అర్హతగల వారందికీ చెల్లింపులు సకాలంలో చేసి జవాబుదారీతనం సాధించే ప్రయత్నంలో భాగంగా స్మార్ట్ కార్డ్ ఆధారిత చెల్లింపు విధానం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం 2007లో నిశ్చయించుకుంది. పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ నల్గొండ, నిజామాబాద్ జిల్లాలలో పాయింట్ ఆఫ్ ట్రాన్సాక్షన్ పరికరాల ద్వారా చెల్లింపులు చేయటం కోసం తపాలా శాఖతో 2011 జూన్‌లో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది.

- స్మార్ట్ కార్డ్ ఆధారంగాపింఛను చెల్లింపుల విధానం చేపట్టి ఐదు సంవత్సరాలు దాటినా 2013 ఫిబ్రవరి నాటికి మొత్తం పింఛనుదారులలో 66 శాతం మందికే స్మార్ట్ కార్డులు అందడంతో చెల్లింపులలో పారదర్శకత సాధించే లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరలేదు.

  **(పేరాలు 2.5.3.1, 2.5.3.3)**

- చెల్లింపుల బాధ్యతను తపాలా శాఖకు అప్పగించిన నల్గొండ జిల్లాలో వేలిముద్రలు సరిపోలకపోవటం, పింఛనుదారులు తాత్కాలికంగా వలసవెళ్ళటం, మరణించటం వంటి వివరాలను నమోదు చేయకపోవటం, బకాయి మొత్తాలను విడుదల చేయకపోవటం, కస్టమర్ సర్వీస్ ప్రొవైడర్లను అదనంగా నియమించకపోవడం వంటి లోపాలు ఆడిట్ పరిశీలనలో వెలుగుచూశాయి.

  **(పేరా 2.5.3.3)**

- వికలాంగుల పింఛనులను వారి వైకల్యం తీవ్రతను అనుసరించి చెల్లించాలన్న ప్రభుత్వ నిర్ణయం అమలు జరగటంలేదు. వికలాంగుల పింఛను నెలకు ₹500 వంతున మాత్రమే చెల్లిస్తున్నారు. అంగ వైకల్యం హెచ్చు స్థాయిలో ఉన్నవారు దీనివలన ప్రయోజనం కోల్పోతున్నారు.

  **(పేరా 2.5.3.4)**

- పింఛను చెల్లింపులలో జాప్యం, క్యాటగిరీలవారీగా చెల్లింపుల సంగ్రహం (ఆబ్‌స్ట్రాక్ట్) రూపొందించకపోవటం, పింఛనుదారులు శాశ్వతంగా వలసవెళ్లిన విషయం, మరణించిన తేదీ, స్మార్ట్ కార్డులు పనిచేయని కారణంగా సాంప్రదాయ పద్ధతిలో చెల్లింపులు చేసిన వైనం రాయకపోవటం, పరికరాలు వేలిముద్రలను గుర్తించకపోవటం, అసలు పింఛనుదారులకు కాక ఇతరులకు చెల్లింపు చేయటం వంటి పలు లోపాలు ఎక్విటెన్స్‌లను పరిశీలించినప్పుడు వెలుగుచూశాయి.

  **(పేరా 2.5.3.5)**

### అంతర్గత నియంత్రణ, పర్యవేక్షణ

- లబ్ధిదారుల ఎంపిక, దరఖాస్తుల పరిశీలన, పింఛనుల మంజూరు, చెల్లింపు వంటి విషయాలలో అంతర్గత నియంత్రణలు బలహీనంగా ఉండి, అది ఈ వ్యవస్థలో చేతివాటానికి అవకాశమిస్తూ, సమాజంలోని పీడిత వర్గాలకు పింఛను ప్రయోజనం దూరంచేసే స్థితి కల్పిస్తున్నది.

  **(పేరా 2.7)**

- పింఛనుల మంజూరు, చెల్లింపుల మీద పర్యవేక్షణ పటిష్టంగా లేదు. పింఛను పథకాల అమలులో నిర్దేశిత విధానాల అతిక్రమణలను గుర్తించేందుకు సెర్ప్ సంస్థలో తగిన అంతర్గత తనిఖీ విభాగం లేదు.

  **(పేరా 2.8)**

### 1.7.2 ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అమలు

ప్రభుత్వం 2005లో రాష్ట్ర ప్రాయోజిత గృహ నిర్మాణ పథకాలన్నింటినీ కలగలపి 'గ్రామీణ ప్రాంతాలు, ఆదర్శ పురపాలక ప్రాంతాలలో సమీకృత ఆధునిక అభివృద్ధి' (ఇందిరమ్మ) గృహ నిర్మాణ పథకాన్ని సూత్రీకరించింది. (రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థికసాయంలేని రాజీవ్ గృహకల్ప, రాజీవ్ స్వగృహ కార్యక్రమాలను మాత్రం ఇందులో చేర్చలేదు). ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని 2006లో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలన్నింటికీ (బీపీఎల్) పరిపూర్ణంగా మూడు సంవత్సరాలలో దశలవారీగా పక్కా ఇళ్ళు సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంకింద అర్హులైన లబ్ధిదారులందరికీ ఆశించినమేరకు పక్కా ఇళ్ళు సమకూర్చినదీ లేనిదీ తెలుసుకునేందుకు ఈ ఆడిట్ సమీక్ష నిర్వహించటం జరిగింది. ఆడిట్ గమనించిన కొన్ని ముఖ్యమైన అంశాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

#### ఆర్థిక నిర్వహణ

- ప్రభుత్వం 2008-13 మధ్య ఏ సంవత్సరంలోనూ బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో విడుదల చేయలేదు (ఈ ఐదు సంవత్సరాలలో కొరత ₹2,754 కోట్లు). ఈ కొరత 2012-13లో 15 శాతం ఉండగా, 2009-10 సంవత్సరంలో ఏకంగా 36 శాతం ఉన్నది.

  (పేరా 3.3.2)

- ఇళ్ళ నిర్మాణంకోసం లబ్ధిదారులకు గ్రామీణ సంస్థలు, స్వయం సహాయక సమూహాల ద్వారా ₹3,322.35 కోట్లు చెల్లించారు. ఆఫ్‌లైన్ చెల్లింపు విధానానికి 2009 డిసెంబరులోనే స్వస్తి చెప్పినాకానీ, 2013 ఫిబ్రవరి నాటికి వీటిలో ₹3,061.14 కోట్లకు మాత్రమే ఎక్విటెన్సులు వచ్చాయి.

  (పేరా 3.8.1)

#### ప్రణాళిక

- సమాచారాన్ని ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్ విధానంలోకి బదిలీ చేసేందుకు తగిన ప్రణాళిక రూపొందించుకొనక పోవటంవలన ఇప్పుడున్న సమాచారం సమగ్రత, సంపూర్ణత, స్వచ్ఛతలపట్ల భరోసాలేదు. పర్యవసానంగా, ఈ డేటాబేస్‌లోని సమాచారం అసమగ్రం, లోపభూయిష్టమై అధిక చెల్లింపులకు దారితీసింది.

  (పేరా 3.4)

- ప్రభుత్వం నిర్ణయించిన యూనిట్ ధర ఇళ్ళు పూర్తి చేయటానికి సరిపోవటంలేదు. ఈ అదనపు వ్యయానికి అవసరమయ్యే సొమ్ము సమకూర్చుకోవటం నిరుపేదలకు సాధ్యపడటంలేదు. ఫలితంగా, పథకం చేపట్టి ఆరు సంవత్సరాలు గడిచినా, 2012-13 నాటికి మొత్తం 64.32 లక్షల ఇళ్ళకుగాను 12.87 లక్షల ఇళ్ళు (20 శాతం) ఆరంభం కాలేదు.

  (పేరా 3.4.1)

#### పథకం అమలు

- సాంఘిక సంక్షేమ పథకాలన్నింటిలోనూ లబ్ధిదారు గుర్తింపునకు పౌర సరఫరాల శాఖ ఇచ్చిన రేషన్ కార్డు కీలకమైనది. ఐతే, ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం మొదటి దశవరకూ లబ్ధిదారుల గుర్తింపు కోసం ఈ ప్రామాణికాన్ని పాటించలేదు. తర్వాత, 2007-08లో చేపట్టిన రెండవ దశ నుంచి ఇళ్ళ మంజూరుకు తెల్ల రేషన్ కార్డుల నిబంధన పెట్టారు. ఈ పథకం అన్ని దశలలోనూ 2013 మార్చివరకూ పలు అక్రమ మంజూరీలు, అక్రమ చెల్లింపులు ఆడిట్ దృష్టికి వచ్చాయి.

  (పేరా 3.5.1)

- ఇళ్ళను మగవారి పేరున మంజూరు చేయటం, గులాబీ రంగు రేషన్ కార్డు కలిగినవారికి మంజూరు చేయటం (₹12.85 కోట్లు), ఇదివరకే ఆరంభించిన ఇళ్ళకు తదనంతర మంజూరు ఇవ్వటం (₹1,344.56 కోట్లు) వంటి పలు పొరపాట్లు జరిగాయి.

**(పేరాలు 3.6.1 నుండి 3.6.3 వరకు)**

### నిర్మాణ సామగ్రి పంపిణీ, విడుదల

- బలహీన వర్గాల ఇళ్ళ నిర్మాణ వ్యయం తగ్గించే విధంగా నిర్మాణ సామగ్రిని చౌకగా ఉత్పత్తి చేసేందుకు రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 88 నిర్మితి కేంద్రాలలో 2013 మార్చినాటికి 49 మాత్రమే పనిచేస్తున్నాయి. పరిమితికి మించి సిమెంటు బస్తాలను జారీచేయటం, మార్గదర్శకాలలో సూచించిన దశలవారీ విధానం అనుసరించకపోవటం, సిమెంటు విడుదలకు ఉత్తర్వులు ఉన్నాగానీ సిమెంటు ఇవ్వకపోవటం వంటివాటిని ఆడిట్ గమనించింది.

**(పేరాలు 3.7.3, 3.7.2.1, 3.7.2.2, 3.7.2.3)**

### వాస్తవ ప్రగతి

- ఇందిరమ్మ పథకంలో మంజూరైన ఇళ్ళను ఆ సంవత్సరంలోనే పూర్తిచేయాలి. ఒక్కొక్క సంవత్సరం వివిధ దశలలో నిర్మాణ పురోగతి బహుస్వల్పంగా ఉన్నది. మూడవ విడత ఇళ్ళ నిర్మాణంలో ప్రగతి నామమాత్రంగా (ఒక శాతంకన్నా తక్కువగా) ఉన్నది. మంజూరైన ఇళ్ళలో 2013 మార్చినాటికి 33 శాతం ఇళ్ళ నిర్మాణం ఇంకా పూర్తికావలసి ఉండటంతో పథకం ప్రారంభించిన ఆరు సంవత్సరాలకు కూడా అందరికీ గృహ వసతి కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు.

**(పేరా 3.3.3)**

### పర్యవేక్షణ

- సమీకృత సర్వే చేపట్టి 5,22,707 మంది అనర్హులైన లబ్ధిదారులకు ₹485.19 కోట్లను చెల్లించినట్లు గుర్తించారు. మరో 1,02,447 మందికి చెల్లించిన ₹36.86 కోట్ల మొత్తం స్వచ్ఛంద వెల్లడి పథకంవలన బయటపడింది. అయితే, వీరికి ఇచ్చిన అనుమతులను రద్దుచేసి ఆయా మొత్తాలను తిరిగి రాబట్టేందుకు ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థగానీ అటు ప్రభుత్వంగానీ చర్యలు చేపట్టలేదు.

**(పేరా 3.9)**

## 1.7.3 పౌర సరఫరాల శాఖ పనితీరు

పౌర సరఫరాల శాఖ కార్యకలాపాలలో ప్రధానమైనవి కనీస మద్దతు ధరకి ధాన్యాన్ని రాష్ట్ర సంస్థలు, భారత ఆహార సంస్థద్వారా కొనుగోలు చేయటం, కేంద్రీయ నిల్వల కోసం లెవీ బియ్యం సేకరణ, చౌక ధరల దుకాణాలద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ, బహిరంగ మార్కెట్లో ధరల నియంత్రణకోసం అవసరమైన సందర్భాలలో నిత్యావసర వస్తువుల ధరల పర్యవేక్షణ చేస్తూ వివణి వ్యవహారాలలో జోక్యం చేసుకోవటం, ఇంకా ఈ శాఖ కార్యకలాపాలలో తగు ఊతమిచ్చి దీనికి ప్రతినిధిగా వ్యవహరిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వ్యవహారాలను వ్యవస్థీకరించటం.

పౌర సరఫరాల శాఖ పనితీరుపై ఆడిట్ సమీక్ష నిర్వహించి కనీస మద్దతు ధరల అమలు కార్యక్రమాలకూ, ప్రజా పంపిణీ వ్యవస్థకూ సంబంధించి ప్రణాళికా ప్రక్రియ రాష్ట్ర ఆహార ధాన్యాల అవసరాలను తీర్చేవిధంగా పటిష్ఠంగానూ, ప్రభావశీలంగానూ ఉన్నాయా; ప్రజా పంపిణీ పథకాల లబ్ధిదారుల గుర్తింపు యంత్రాంగం లోపరహితంగా ఉన్నదా; లక్షిత లబ్ధిదారులకు ప్రయోజనాలు చేరేలా చర్యలు చేపట్టారా; నిత్యావసర వస్తువుల సేకరణ, రవాణా, నిల్వ, నిర్వహణ, పంపిణీలను పొదుపుగానూ, సమర్ధవంతంగానూ, కార్యసాధకంగానూ నిర్వహించేందుకు తగిన సంస్థాగత

యంత్రాంగం ఉన్నదా అని మదింపు చేసే ప్రయత్నం జరిగింది. ఈ ఆడిట్ సమీక్షలో గమనించిన ముఖ్యమైన అంశాలు ఈకింది విధంగా ఉన్నాయి.

### ఆర్థిక నిర్వహణ

- ఈ శాఖ **2008-13** మధ్య ఐదేళ్ళ కాలంలో చేసిన మొత్తం ఖర్చు **₹12,862** కోట్లు. అందులో బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులపై సబ్సిడీకి **₹11,739** కోట్లు ఖర్చుకాగా మిగిలిన **₹1,123** కోట్లు సిబ్బంది వ్యవహారాలు, ఇతర కార్యకలాపాలపై ఖర్చయింది.

**(పేరా 4.3)**

- సంక్షేమ వసతి గృహాలకు బియ్యం కొనుగోలుకోసం **₹7.94** కోట్లను, ప్రకృతి విపత్తుల ఉపశమనంకోసం **₹61.07** కోట్లు, అలాగే వినియోగదారుల సంక్షేమ నిధికోసం **₹0.53** కోటి పీడీ ఖాతాలో ఉంచగా, వినియోగం కానందున ఆ నిధులకు కాలదోషం పట్టింది

**(పేరా 4.6.5)**

### ప్రణాళిక

- బీపీఎల్ కుటుంబాల సంఖ్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వ లెక్కలకూ **(2.17** కోట్లు**)**, కేంద్ర ప్రభుత్వం గణించిన వాటికీ **(25.05** లక్షలు**)** మధ్య వైరుధ్యమున్నది. కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికీ నెలకు **35** కి.గ్రా.ల బియ్యం కేటాయిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం బీపీఎల్ కార్డు కలిగిన కుటుంబాలకు నెలకు **20** కి.గ్రా.ల వంతున జారీ చేస్తున్నది. ఏపీఎల్ కుటుంబాలకు బియ్యం ఇవ్వటంలేదు.

**(పేరా 4.4)**

### ఆహార ధాన్యాల సేకరణ

- రాష్ట్ర ప్రభుత్వం **2008-13** మధ్యకాలంలో నేరుగా కొనుగోలు చేసిన ధాన్యం **2** నుండి **11** శాతం **(3** నుండి **21** లక్షల మెట్రిక్ టన్నులు**)** మాత్రమే ఉంటున్నది. ఫలితంగా, మిల్లర్లు సేకరించే ధాన్యంకంటే ప్రభుత్వ సేకరణ తక్కువగా ఉండటంతో రైతులు, మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది.

**(పేరా 4.5.1.1)**

- మిల్లర్లు ధాన్యాన్ని నిర్ణీత సమయంలో మిల్లింగ్ చేసేవిధంగా పౌర సరఫరాల సంస్థ శ్రద్ధ పెట్టకపోవటంతో ఇది **2008-13** సంవత్సరాలలో క్యాష్ క్రెడిట్‌పై వడ్డీ రూపేణా **₹171** కోట్ల చెల్లింపుకు దారితీసింది.

**(పేరా 4.5.2.2)**

- లెవీ సుగర్ ప్రైస్ ఈక్వలైజేషన్ ఫండ్ క్లెయిమ్‌లను సమర్పించటంలో జాప్యం ఫలితంగా **₹29.30** కోట్ల నష్టం వాటిల్లింది. పామాయిల్ దిగుమతికోసం ఎమ్‌ఎమ్‌టీసీతో కుదుర్చుకున్న ఒప్పందాల్లోని లోపాల కారణంగా **₹35.90** కోట్లమేర అధిక చెల్లింపులు జరిగాయి.

**(పేరాలు 4.5.3.2, 4.5.3.3)**

### ప్రజా పంపిణీ వ్యవస్థ

- రేషను కార్డులకోసం ప్రజలనుండి వచ్చిన దరఖాస్తుల నమోదు, వాటి పరిశీలన, కార్డుల జారీ, నియమిత కాలవ్యవధుల్లో తాజా స్థితిపై సమీక్ష, బీపీఎల్ కార్డుకు గల అర్హతలను మించి ఉన్నత స్థితిలోకి వెళ్లినవారి కార్డుల తొలగింపు వంటి అంశాలకు సంబంధించి ఎలాంటి యంత్రాంగం లేదు. ఫలితంగా, బోగస్ కార్డులు చలామణిలో ఉండటంవలన వీటికి విడుదల చేసిన ఆహార ధాన్యాలు, ఇతర నిత్యావసర సరుకులపై సబ్సిడీ రూపేణా **₹1,136** కోట్ల నివారించదగ్గ భారం**(2013** మార్చినాటికి**)** రాష్ట్ర ప్రభుత్వంపై పడింది.

- పౌర సరఫరాల శాఖ కంప్యూటరీకరించిన డేటాపై 2012 డిసెంబరులో నిర్వహించిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఆడిట్‌లో ఈ అంశాలు వెల్లడయ్యాయి : (ఎ) బీపీఎల్ కార్డులలో కుటుంబ సభ్యుల ఐరిస్ డేటా లేనివి 13.63 లక్షల కార్డులు ఉన్నాయి; (బి) వెల్లడించిన కుటుంబ ఆదాయం నిర్దేశిత పరిమితికి మించి ఉన్నది; (సి) పరిశీలించిన 191.65 లక్షల కార్డులకుగాను 93,012 బీపీఎల్ కార్డులలో నకిలీ ఫోటోలు ఉన్నాయి (వీటిపై 2008-13 మధ్యకాలంలో ఇచ్చిన సబ్సిడీ విలువ : ₹52.62 కోట్లు).

(పేరాలు 4.6.1.3, 4.6.1.4)

- నిర్దేశిత గిడ్డంగుల వద్ద స్టాకు అందుబాటులో లేకపోవటంతో సుదూరంగా ఉన్న డిపోలనుండి ఆహార ధాన్యాలను మండల స్థాయి స్టాకిస్టు పాయింట్లకు తరలించటంలో ఎక్కువ ఖర్చు కావటంవలన ఇది 2008-12 మధ్యకాలంలో ₹37.79 కోట్లమేర అధిక వ్యయానికి దారితీసింది.

(పేరా 4.6.6.1)

- చౌక ధరల దుకాణాల హేతుబద్ధీకరణ చేపట్టలేదు. మొత్తం 16,653 చౌక ధరల దుకాణాల్లో నిర్దేశిత పరిమితిని మించి బీపీఎల్ రేషన్ కార్డులు ఉన్నాయి. చౌక ధరల దుకాణాల పనితీరులో కూడా పలు లోపాలను ఆడిట్ గమనించింది. నెలలోని మొదటి వారంలోనే సరుకులను పంపిణీ చేయకపోవటం, ప్రతి క్యాటగిరీ కిందా ఇచ్చే సరుకుల వివరాలను ప్రదర్శించకపోవటం, సరుకుల స్టాకు వివరాలను ప్రదర్శించకపోవటం, ఫిర్యాదుల రిజిస్టర్లు లేకపోవటం వంటి పలు లోపాలు ఆడిట్ పరిశీలనలో వెలుగు చూశాయి.

(పేరాలు 4.6.8.2, 4.6.8.3)

పర్యవేక్షణ

- ప్రజా పంపిణీ వ్యవస్థలో పర్యవేక్షణ యంత్రాంగం పటిష్ఠంగా లేదు. ఆహార సలహా సంఘం, ధరల పర్యవేక్షణ సంఘం నిర్ణీత కాలవ్యవధిలో సమావేశమై నిత్యావసర సరుకుల లభ్యతనూ, వాటి ధరలనూ సమీక్షించటంలో విఫలమవుతున్నాయి.

(పేరా 4.7.1)

- అన్ని ఎమ్ఎల్ఎస్ పాయింట్లలో నిర్ణీత కాలవ్యవధిలో నూటికి నూరు శాతం స్టాకు ప్రత్యక్ష తనిఖీ చేపట్టటంలేదు.

(పేరా 4.7.3)

## 1.7.4 నియమాల పాటింపుపై ఆడిట్ పరిశీలనలు

### 1.7.4.1 పాఠశాలలో మౌలిక వసతులు

పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యా హక్కు (ఆర్‌టీఈ) చట్టం, 2009 ప్రకారం పాఠశాలలకు భవనాలు, ఇతర మౌలిక వసతులను, పిల్లలకు ప్రాథమిక సదుపాయాలను కల్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాల్సి ఉంది. ఈ లక్ష్య సాధన కోసం ఆంధ్రప్రదేశ్ పిల్లల ఉచిత, నిర్బంధ విద్యా నియమాలు, 2010ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించింది (2010 ఏప్రిల్).

రాష్ట్రంలోని 96 శాతం పాఠశాలలు తమ సొంత భవనాలలోనే పని చేస్తున్నాయి. కానీ, ఆరు జిల్లాలలో నమూనా తనిఖీ చేపట్టిన 154 పాఠశాలల్లో పలుచోట్ల తగినన్ని తరగతి గదులు, అడ్డంకులులేని విధంగా దోవలు, బాలబాలికలకు వేరువేరుగా మరుగుదొడ్లు, సురక్షితమైన మంచినీరు, మొదలైన మౌలిక వసతులు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన స్థాయిలోగానీ, ఆర్‌టీఈ చట్టం 2009 సూచించిన మేరకుగానీ లేవు.

(పేరా 5.1)

### 1.7.4.2 ఇందిరా ఆవాస్ యోజన అమలు

ఇందిరా ఆవాస్ యోజన (ఐఏవై) పథకాన్ని భారత ప్రభుత్వం **1996**లో ప్రవేశ పెట్టింది. గ్రామీణ ప్రాంతాలలోని షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెట్టి చాకిరీ నుండి విముక్తి పొందినవారు, అల్పసంఖ్యాకవర్గాలు, షెడ్యూలు కులాలు/తెగలకు చెందని ఇతర గ్రామీణ కుటుంబాల వారిలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి ఇళ్ళ నిర్మాణం, ఉన్నతీకరణలో సహాయం చేసే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన రక్షణ సిబ్బంది/పారామిలటరీ బలగాల సిబ్బంది భార్యలు, దగ్గరి బంధువులు గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తుంటే వారి ఆదాయంతో సంబంధం లేకుండానూ, మాజీ సైనిక సిబ్బంది పదవీ విరమణ పొందిన పారామిలటరీ బలగాల సిబ్బందికి కూడా ఈ పథకం వర్తిస్తుంది.

ఐఏవై పథకం అమలు చేసిన వైనాన్ని ఆడిట్‌లో పరిశీలించగా నమూనా తనిఖీ చేపట్టిన ఖమ్మం, కరీంనగర్ జిల్లాలలోని లబ్ధిదారులకు ఈ పథకంపట్ల అవగాహనలేదని తెలిసింది. ఐఏవై పథకాన్ని 'ఇందిరమ్మ' అనే రాష్ట్ర పథకంతో కలగలిపిన కారణంగా, ఐఏవై నిధులతో నిర్మించిన ఇళ్ళలో, ఏ ఒక్క ఇంటిపైనా 'ఐఏవై లోగో'ను ప్రదర్శించలేదు. ఐఏవై పథకానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో నిర్మించిన ఇళ్ళ సంఖ్య, ఆ నిధుల వినియోగానికి సంబంధించిన సమాచారం అసంపూర్ణంగా ఉంది. లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు శాశ్వత నిరీక్షణ జాబితాను మార్గదర్శకాల ప్రకారం రూపొందించలేదు. పౌర సరఫరాల డేటాబేస్‌కూ, గృహ నిర్మాణ శాఖ డేటాబేస్‌కూ మధ్య వ్యత్యాసాలున్నాయి; లబ్ధిదారుల వివరాలలోని వాస్తవికతను తెలుసుకునే (వాలిడేషన్) ప్రక్రియలో లోపాలున్నాయి.

**(పేరా 5.2)**

### 1.7.4.3 వరద బాధితుల ఇళ్ళ నిర్మాణంలో జాప్యం

గుంటూరు, కృష్ణా, కర్నూలు, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలో **2009** సెప్టెంబరు - అక్టోబరు నెలల్లో వచ్చిన వరదలవల్ల ఇళ్ళు కోల్పోయిన వారికి ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ రూపంలో **1,00,000** ఇళ్ళ నిర్మాణానికి అనుమతించింది (తుదకు **31,991** ఇళ్ళు మాత్రమే మంజూరు చేసి, చేపట్టింది). వరద బాధిత కుటుంబాలకు ఊరట కలిగించటం కోసం మంజూరు చేసిన ఇళ్ళ నిర్మాణం మొత్తం పూర్తిచేయలేదు. నిర్మించిన ఇళ్ళకు సైతం మౌలిక సదుపాయాలు కల్పించకపోవటంతో లబ్ధిదారులు వాటిని స్వాధీనపరచుకోలేదు. అందువల్ల వరదలు వచ్చి నాలుగు సంవత్సరాలు పైబడినా లబ్ధిదారులకు శాశ్వత ఆశ్రయం లభించలేదు.

**(పేరా 5.3)**

### 1.7.4.4 పరీక్ష రుసుముల జమా లెక్కలు

ప్రభుత్వం (పాఠశాల విద్యా శాఖ) వివిధ ఉద్యోగ నియామక పరీక్షలు, కోర్సులలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సీఈటీ - సెట్) లను నిర్వహిస్తుంది. ఇలాంటి పరీక్షల నిర్వహణ కోసం ప్రతి పరీక్షకూ విడివిడిగా కన్వీనర్లను నియమిస్తారు. సంబంధిత కన్వీనర్లద్వారా ఆయా పరీక్షల నిర్వహణకు పాఠశాల విద్యా శాఖ కమీషనరు మరియు సంచాలకులు బాధ్యత వహిస్తారు. ఖర్చు చేయక మిగిలిన **₹53.62** కోట్లను కమీషనరు ప్రభుత్వ పద్దులకు వెలుపల ఉంచినట్లు, పరీక్ష రుసుముల రూపేణా వసూలైన దాని నుంచి **₹2.45** కోట్లు నియమాలను అతిక్రమించి శాఖాపరమైన అవసరాలకు వాడుకున్నట్లు ఆడిట్ పరిశీలనలో తేలింది.

**(పేరా 5.4)**

### 1.7.4.5 భూ బదలాయింపులో అక్రమాలు

ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, వైద్య కళాశాల, ఫార్మసీ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, దంత వైద్య కళాశాల, ప్రజా ఆరోగ్య సంస్థ, బయోమెడికల్ ఇంజనీరింగ్ కాలేజీ, పూర్తి స్థాయి నివాస ప్రాంగణం, హాస్టళ్ళు, సంబంధిత సామాజిక వసతులతో తమ రెండవ ఆవరణ ఏర్పాటు చేసుకునేందుకుగాను ఒక వైద్య కళాశాలకు చిత్తూరు జిల్లాలోని

చిత్తూరు, గుడిపాల మండలాలలో 640.17 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం 2010 మార్చి నెలలో బదలాయించింది. ప్రభుత్వానికి స్థలం విలువ ఇంకా ₹2.82 కోట్లు కళాశాల చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా, ఆక్రమణదారులకు పరిహారంగా చెల్లించేందుకు జిల్లా యంత్రాంగం ₹1.67 కోట్లను కళాశాలకు తిరిగి ఇచ్చేసింది. ఆవిధంగా కళాశాలకు అనుచిత ప్రయోజనం చేకూర్చింది.

**(పేరా 5.5)**

### 1.7.4.6 ప్రభుత్వ భూమి ఆక్రమణదారుకు బదలాయింపు

ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా రక్షించటంలో చిత్తూరు జిల్లా పాలనా యంత్రాంగం వైఫల్యం వలన ప్రభుత్వానికి ₹57.56 లక్షల నష్టం వాటిల్లింది.

**(పేరా 5.6)**

### 1.7.4.7 అద్దెకు తీసుకున్న వాహనాలకు అక్రమ చెల్లింపులు

ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ అనుబంధ సంస్థలలో వాహనాల కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం 1994 జనవరిలో నిషేధం విధించింది. అత్యవసర పరిస్థితులలో మాత్రం కొన్ని నిబంధనలకు లోబడి వాహనాలను అద్దెకు తీసుకోవడానికి అనుమతిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వులు పాటించడంలో శాఖాధిపతుల వైఫల్యం, క్లెయిమ్‌ల అనుమతి మంజూరులో డ్రాయింగ్ అధికారులు, ట్రెజరీ అధికారులు తగిన పరిశీలన చేయకపోవడంతో అద్దెకు తీసుకున్న వాహనాలకు అక్రమ చెల్లింపులు జరిగాయి.

**(పేరా 5.7)**

### 1.7.4.8 మానసిక ఆరోగ్య సంస్థ, హైదరాబాదు నందు ఖైదీల వార్డు నిర్మాణంలో జాప్యం

జాతీయ మానసిక ఆరోగ్య పథకంలో భాగంగా భారత ప్రభుత్వం, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ హైదరాబాదులోని మానసిక ఆరోగ్య సంస్థను అభివృద్ధిపరచటానికి ఒక్కమారు ఇచ్చే సహాయక గ్రాంటును 2005 సెప్టెంబరులో అందచేసింది. నేరస్తుల వార్డుకు కూడా జైలులో ఉన్నట్లు ఎత్తైన గోడలు, సోలార్ కంచె, క్లోజుడ్ సర్క్యూట్ కెమెరాల వంటి భద్రతలు కల్పించటం దీని ఉద్దేశం. ప్రతి దశలోనూ నిర్మాణంలో జాప్యం, తగినన్ని నిధులు లభించకపోవడంవల్ల ఏడు సంవత్సరాలకాలం గడిచినా ఖైదీల వార్డు నిర్మాణం పూర్తికాకపోవటంతో ఖర్చు చేసిన ₹1.05 కోట్లు ప్రయోజనమివ్వలేదు.

**(పేరా 5.8)**

### 1.7.4.9 ఫైర్ ఔట్‌పోస్టుల సర్వీసు ప్రొవైడర్లకు అనుచిత లబ్ధి

పన్నెండు జిల్లాల్లో, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 21 ఫైర్ ఔట్‌పోస్టులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది (2004 జనవరి). ప్రతీ ఔట్‌పోస్టు కోసం సర్వీసు ప్రొవైడర్లను బహిరంగ టెండర్లద్వారా ఎంపికచేసి 11 జిల్లాల్లోని 19 ఔట్‌పోస్టుల నిర్వహణను వారికి అప్పగించారు. గతంలో గుర్తించిన లోపాల దిద్దుబాటును గమనించుకోకుండా ఫైర్ ఔట్‌పోస్టుల నిర్వహణ కోసం సర్వీసు ప్రొవైడర్లకు కొత్త రేట్లను వెనుకటి తేదీనుండి వర్తింపజేస్తూ చెల్లింపు చేసిన ఫలితంగా, రాష్ట్రంలో అగ్నిమాపక సేవలు, విపత్తులను ఎదుర్కొనే సంసిద్ధత విషయంలో మెరుగుదల లేకుండానే సర్వీసు ప్రొవైడర్లకు ₹1.37 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.

**(పేరా 5.9)**

# అధ్యాయం-2

## సామాజిక భద్రతా పింఛను పథకాల అమలుపై ఆడిట్ సమీక్ష

### పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ

పేజీలు 15 - 34

## 2.1 పరిచయం

సమాజంలోని బలహీనవర్గాలకు, విశేషించి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదవారికి (బీపీఎల్) సాంఘిక భద్రత కల్పించే ఉద్దేశంతో భారత ప్రభుత్వం 'జాతీయ సాంఘిక సహాయ కార్యక్రమం' పేరుతో కేంద్ర సౌజన్య పథకాన్నొకదానిని 1995 ఆగస్టులో ప్రవేశ పెట్టింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమైన సంక్షేమ పథకాలలో ఇది కూడా ఒకటి. జాతీయ వృద్ధాప్య పింఛను పథకం, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, జాతీయ వితంతు పింఛను పథకం, జాతీయ వికలాంగుల పింఛను పథకం, అన్నపూర్ణ పథకం ఇందులో భాగంగా ఉన్నాయి.

జాతీయ సాంఘిక సహాయ కార్యక్రమాన్ని 2002-03 నుంచి రాష్ట్ర ప్రణాళికకు బదిలీచేసి, దానిని అమలు చేయటం కోసం భారత ప్రభుత్వం నిధులను రాష్ట్రాలకు అదనపు ఆర్థిక సాయం రూపంలో అందచేస్తున్నది. లబ్ధిదారులను గుర్తించి, పింఛన్లు మంజూరుచేసి, చెల్లింపులుచేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించారు. నెలవారీ వృద్ధాప్య పింఛను 2006 ఏప్రిల్ ఒకటిన ₹75 నుంచి ₹200 కు పెంచటం, 2009 ఫిబ్రవరి నుంచి వితంతువులకూ, వికలాంగులకూ నెలకు ₹200 చొప్పున పింఛను ఇచ్చే పథకాలను కొత్తగా ప్రవేశపెట్టటం వలన జాతీయ సాంఘిక సహాయ కార్యక్రమం సామాజిక భద్రతా పథకాలలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

### 2.1.1 ఆంధ్రప్రదేశ్‌లో పింఛను పథకాల స్థూల పరిశీలన

రాష్ట్రంలో అమలుజరుగుతున్న పింఛను పథకాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం 2006 ఏప్రిల్ నెలలో ఒకే గొడుగు కిందికి తెచ్చింది. పింఛన్ల మంజూరు, చెల్లింపులలో ఏకరూపత సాధించే ఉద్దేశంతో వీటన్నింటినీ ఈ విధంగా పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోకి తీసుకొచ్చింది. నిధులను విడుదలచేసి, పథకాలను పర్యవేక్షించే బాధ్యతను గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ[1] (సెర్ప్)కు అప్పగించారు (ఇది పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ అనుబంధ సంస్థ). ఈ క్రమంలోనే, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, ఆదర్శ పట్టణ ప్రాంతాలలో సమీకృత నవీన అభివృద్ధి (ఇందిరమ్మ) అనే కార్యక్రమాన్నీ ఆరంభించింది. గ్రామాలలోనూ, పట్టణాలలోనూ ప్రాథమిక మౌలిక వసతులను పరిపూర్ణంగా సమకూర్చటం ఈ పథకం లక్ష్యం (**పరిపూర్ణంగా** అంటే అర్హత కలిగిన ఏ ఒక్కవ్యక్తి లేదా ప్రాంతం ఈ కార్యక్రమ పరిధిలోకి రాకుండా మిగలకూడదు). సామాజిక భద్రతా పింఛన్లు ఇందిరమ్మ కార్యక్రమంలో అతి కీలకమైనవి.

రాష్ట్రంలో అమలవుతున్న పింఛను పథకాలు, వాటి అర్హత ప్రమాణాలు, పింఛను రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి.

| పింఛను వర్గం | అర్హత | | నెలవారీ చెల్లింపు (₹) |
|---|---|---|---|
| | 2011 మార్చి వరకు | 2011 ఏప్రిల్ నుండి | |
| **కేంద్ర ప్రభుత్వం** | | | |
| జాతీయ వృద్ధాప్య పింఛన్లు | 65 సంవత్సరాలు, ఆపైన | 60-79 సంవత్సరాలు | 200 |
| | | 80 సంవత్సరాలు, ఆపైన | 500 |
| వితంతు పింఛన్లు | 40-64 సంవత్సరాలు | 40-59 సంవత్సరాలు | 200 |
| వికలాంగుల పింఛన్లు | 18-64 సంవత్సరాలు (వైకల్యం 40 శాతం పైన ) | 18-59 సంవత్సరాలు (వైకల్యం 40 శాతం పైన ) | 200 |
| **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం** | | | |
| వృద్ధాప్య పింఛన్లు | 65 సంవత్సరాలు, ఆపైన | | 200 |
| వితంతు పింఛన్లు | వయోపరిమితి లేదు | | 200 |

[1] రాష్ట్రంలోని గ్రామీణ పేదలను సామాజికంగా సంఘటితంచేసి, వారి జీవనోపాధి మెరుగుపరచటం ద్వారా పేదరికాన్ని రూపుమాపే దిశగా ఏర్పాటు చేసిన సెర్ప్ అనే స్వతంత్ర స్వయంపాలక సంస్థ పబ్లిక్ సొసైటీస్ చట్టం కింద నమోదయ్యింది

| పింఛను వర్గం | అర్హత | | నెలవారీ చెల్లింపు (₹) |
|---|---|---|---|
| | 2011 మార్చి వరకు | 2011 ఏప్రిల్ నుండి | |
| వికలాంగుల పింఛన్లు | వయోపరిమితి లేదు (వైకల్యం 40 శాతం పైన ) | | 500 |
| నేత కార్మికుల పింఛన్లు | కనీస వయసు : 50 సంవత్సరాలు నేత కార్మిక సంఘం వారై ఉండాలి, నేత పనితో సంబంధం ఉండాలి | | 200 |
| గీత కార్మికుల పింఛన్లు | కనీస వయసు : 50 సంవత్సరాలు గీత కార్మిక సహకార సంఘం సభ్యులు/కల్లుగీత పథకంలో పనిచేసేవారు | | 200 |
| ఎయిడ్స్ రోగుల పింఛన్లు | 65 సంవత్సరాల లోపు | | 200 |
| డా. వైఎస్ఆర్ అభయ హస్తం[2] | 18-50 సంవత్సరాలు స్వయం సహాయక బృందంలో కనీసం ఒక సంవత్సరం క్రియాశీల సభ్యులై ఉండాలి | | 500 |

*ఉమ్మడి అర్హతా ప్రమాణాలు :*

లబ్ధిదారులు

- బీపీఎల్ కుటుంబానికి చెందినవారై ఉండాలి
- ఆ జిల్లాలో స్థానికంగా ఉండేవారు కావాలి
- ఇతర ఏ పింఛను పథకం కిందా ప్రయోజనం పొంది ఉండరాదు

సెర్ప్ రికార్డుల ప్రకారం, 2013 మార్చి నాటికి వివిధ కేంద్ర, రాష్ట్ర పథకాల కింద సుమారు 72.36 లక్షల[3] మంది లబ్ధి పొందుతున్నారు.

## 2.2 వ్యవస్థాగత నిర్మాణం

రాష్ట్రంలో సామాజిక భద్రతా పింఛనులన్నీ పంచాయతీ రాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ అమలు చేస్తున్నది. ఈ శాఖ ముఖ్య కార్యదర్శి పింఛను పథకాల అమలుకు బాధ్యత వహిస్తారు. గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనరు, ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెర్ప్ డైరెక్టర్, స్వయం సహాయక సమూహాలు, ఇంకా ఇతర సిబ్బందీ ఆయనకు సాయపడతారు. ఇక సెర్ప్ సంస్థలో డైరెక్టర్ (ఎస్‌హెచ్‌జీ) నేతృత్వంలోని ఎస్ఎస్‌పీ సెల్ ఈ పథకాల అమలును చూసుకొంటుంది.

## 2.3 ఆడిట్ విధివిధానాలు

### 2.3.1 ఆడిట్ లక్ష్యాలు

సామాజిక భద్రతా పింఛను పథకాల అమలు తీరులో ఈ దిగువ విషయాలను నిర్ధారించుకొనేందుకు ఆడిట్ పరిశీలన నిర్వహించటం జరిగింది :

- ప్రతి పథకంలోనూ లక్షిత లబ్ధిదారులను గుర్తించేందుకు అనువైన వ్యవస్థ రూపుదిద్దుకొని, అది కార్యసాధకంగా పని చేస్తున్నదా;
- పథకం నిధులను ఇతర అవసరాలకు మళ్ళించకుండా పింఛనుదారులకోసం సక్రమంగా వినియోగిస్తున్నారా;

---

[2] డా. వైఎస్ఆర్ అభయహస్తం పథకాన్ని 2009 నవంబరులో ప్రవేశపెట్టి, 2011 సెప్టెంబరులో సామాజిక భద్రతా పింఛను పథకాలలో విలీనం చేశారు.

[3] (i) కేంద్ర ప్రభుత్వానివి : వృద్ధాప్య పింఛన్లు: 11.36 లక్షలు; వితంతు పింఛన్లు : 4.21 లక్షలు; వికలాంగుల పింఛన్లు : 0.42 లక్ష; (ii) రాష్ట్ర ప్రభుత్వానివి : వృద్ధాప్య పింఛన్లు : 31.53 లక్షలు; నేత కార్మిక పింఛన్లు : 1.45 లక్షలు; వితంతు పింఛన్లు : 13.57 లక్షలు; వికలాంగుల పింఛన్లు : 8.42 లక్షలు; గీత కార్మికుల పింఛన్లు : 1 లక్ష; ఎయిడ్స్ రోగుల పింఛన్లు : 0.40 లక్ష

- ఇటువంటి లావాదేవీలలో స్వతస్సిద్ధంగా ఇమిడిఉండే హానికర పరిస్థితుల పట్ల ప్రభుత్వ శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తూ, తగు అంతర్గత నియంత్రణావ్యవస్థను పాదుకొల్పి, కొనసాగిస్తున్నదా;

- ప్రభుత్వ శాఖ, సెర్ప్ సంస్థ ఈ పథకాల అమలును పర్యవేక్షిస్తూ, పింఛనుదారులకు తగిన ఊతమిచ్చి, కార్యకలాపాలను క్రమంతప్పకుండా పర్యవేక్షణ చేసి, అవసరమైన చోట దిద్దుబాటు చర్యలు చేపడుతున్నదా;

- సమస్యల పరిష్కారానికి అనువైన యంత్రాంగం ఉందా; అది కట్టుదిట్టంగా పని చేస్తున్నదా.

### 2.3.2 ఆడిట్ ప్రామాణికంగా తీసుకున్న అంశాలు

ఆడిట్ గమనించిన అంశాలను ఈ దిగువ పేర్కొన్న వాటిని ప్రామాణికంగా తీసుకుని తులనాత్మక పరిశీలన చేయటం జరిగింది ః

- పథకం మార్గదర్శకాలు, కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన పలు ఉత్తర్వులు;

- రాష్ట్ర వార్షిక ప్రణాళిక, బడ్జెట్, ఇంకా పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన ఫలితాల బడ్జెట్;

- ఆంధ్రప్రదేశ్ ఆర్థిక నియమావళి.

### 2.3.3 ఆడిట్ పరిధి, విధివిధానాలు

సామాజిక భద్రతా పింఛను పథకాల[4] అమలుపై ఆడిట్ పరిశీలన 2012 మే నెల నుంచి 2013 ఫిబ్రవరి వరకు నిర్వహించి, ఇందులో జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (కేంద్ర ప్రభుత్వం), వయోవృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు, గీత కార్మికులకు, ఎయిడ్స్ రోగులకు ఇస్తున్న ఇందిరమ్మ పింఛనుల (రాష్ట్ర పథకాలు) మంజూరు, చెల్లింపులకు సంబంధించి 2008-13 సంవత్సరాలలోని లావాదేవీలను తనిఖీ చేయటం జరిగింది.

పంచాయతీ రాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, సెర్ప్ అదనపు కార్యనిర్వహణాధికారితో 2012 జూన్ నెలలో సమీక్షారంభ సమావేశం నిర్వహించి ఆడిట్ లక్ష్యాలు, విధివిధానాలు, పరిధి, ప్రామాణికంగా తీసుకున్న అంశాలు, ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న నమూనా వంటివి వారికి వివరించి, ఖరారు చేసుకోవడం జరిగింది. ఆడిట్ ప్రక్రియలో భాగంగా ఈ పథకాలకు సంబంధించిన రికార్డులను, దస్త్రాలను సచివాలయం, కమీషనర్ కార్యాలయం, సెర్ప్, ఇంకా ఎంపిక చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, గ్రామపంచాయతీ, వార్డు కార్యాలయాలలో పరిశీలించటం జరిగింది. సమీక్షానంతర సమావేశం 2013 నవంబరులో నిర్వహించి, ఆడిట్ గమనించిన విషయాలను పంచాయతీ రాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, సెర్ప్ కార్యనిర్వహణాధికారితో చర్చించి, ఆ మీదట ప్రభుత్వం వ్యక్తీకరించిన అభిప్రాయాలనూ, సమాధానాలనూ ఈ నివేదికలో తగు రీతిన పొందుపరచటం జరిగింది.

---

[4] స్వయం సహాయ సమూహాలకు వర్తించే డా. వైఎస్ఆర్ అభయ హస్తం పథకం ఇతర పింఛను పథకాలకు భిన్నమైనది కావటం వలన దానిని ఈ సమీక్షలో స్పృశించలేదు. ఈ పథకం కింద లబ్ధిదారులనుండీ, ప్రభుత్వం నుండీ సమాన మొత్తాలను గ్రహించి వాటిని జీవిత బీమా సంస్థకు బదిలీ చేస్తారు. ఆ విధంగా లబ్ధిదారునికి 60 సంవత్సరాల వయసు వచ్చే వరకూ జమ చేసిన మొత్తాన్ని అతనికి 60 సంవత్సరాల వయసు వచ్చినంతనే నెలవారీ పింఛనుగా చెల్లిస్తారు. అంగవైకల్యం, మరణ బీమా, ఇంకా మహిళలకైతే పిల్లల స్కాలర్‌షిప్పులు కూడా ఈ పథకంలో ఉన్నాయి

### 2.3.3.1 నమూనా పరిమాణం

పింఛను పథకాల అమలుమీద రంగారెడ్డి జిల్లాలో 2012 మే నెలలో పూర్వాధ్యయనం (పైలట్ స్టడీ) చేపట్టటం జరిగింది. అటుతర్వాత ఆయా జిల్లాల బడ్జెట్ కేటాయింపులు, వెనుకబాటుతనం ప్రాతిపదికన రాష్ట్రంలోని మూడు ప్రాంతాలనుంచి (కోస్తాంధ్ర[5], తెలంగాణ[6], రాయలసీమ[7]) రెండేసి జిల్లాల చొప్పున ఎంపిక చేసుకొని ఆడిట్ పరిశీలన చేపట్టటం జరిగింది. దీంతోపాటు విశాఖపట్నం జిల్లా పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలో క్షేత్ర స్థాయి అధ్యయనం కూడా ఆడిట్ నిర్వహించింది. ప్రతి జిల్లాలో 25 శాతం మండలాలనూ, పట్టణ స్థానిక సంస్థలను పింఛనుదారుల సంఖ్య ఆధారంగా ఎంపిక చేసుకోవటం జరిగింది. ఆ విధంగా, నమూనా తనిఖీ కోసం ఎంచుకున్న ఎనిమిది జిల్లాలలోని 425 యూనిట్లకుగాను 103 యూనిట్లను (***అనుబంధం-2.1***) క్షేత్ర స్థాయి అధ్యయనం కోసం ఆడిట్ ఎంపిక చేసింది. అంతేకాకుండా, పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన డేటాబేస్‌ని కూడా విశ్లేషించి, అక్కడ గమనించిన విషయాలను క్షేత స్థాయి రికార్డులతో సరిపోల్చుకోవడం జరిగింది.

ఇదేకాక, పింఛను కోసం ఆయా యూనిట్లకు వచ్చిన లబ్ధిదారులలో 6,572 మందిని యాదృచ్ఛిక నమూనా విధానంలో ఎంపిక చేసి, వారిని ఆడిట్ అధికారులు స్వయంగా సంప్రదించి, లబ్ధిదారుల గుర్తింపు, పింఛను మంజూరు, చెల్లింపు ప్రక్రియల విషయంలో వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు (క్యాటగిరీలవారీ, జిల్లాలవారీ వివరాలు ***అనుబంధం-2.2***లో ఉన్నాయి). ప్రభుత్వ శాఖ, సెర్ప్ అధికారులతో వివిధ స్థాయిలలో చర్చలుకూడా చేపట్టారు.

ఆడిట్ గమనించిన విషయాలు ఈ దిగువ పేరాలలో వివరించడమైనది.

## 2.4 ఆర్థిక నిర్వహణ, వాస్తవ పురోగతి

రాష్ట్రంలో సామాజిక భద్రతా పింఛను పథకాలను అమలుచేసేందుకు సెర్ప్ ఒక నోడల్ ఏజన్సీగా పని చేస్తున్నది. గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ ప్రధాన నియంత్రణాధికారిగా వ్యవహరిస్తూ, ప్రభుత్వం నుంచి నిధులను డ్రా చేసి సెర్ప్‌కు పంపితే, సెర్ప్ వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు వీలుగా బ్యాంకులకూ, పింఛను చెల్లింపు అధికారులకూ అందచేస్తుంది.

ఇందుకోసం 2008-13 మధ్య అయిదు సంవత్సరాలలో చేసిన బడ్జెట్ కేటాయింపులు, అయిన వ్యయాల వివరాలు సంవత్సరాలవారీగా ఈ కింది విధంగా ఉన్నాయి.

**పట్టిక - 2.1 : సంవత్సరాలవారీ కేటాయింపులు, వ్యయం**

(₹ కోట్లలో)

| సంవత్సరం | కేంద్రం ఇచ్చినది | కేంద్రం ఇచ్చినదానితో కలిపి రాష్ట్ర కేటాయింపు | వ్యయం | వినియోగం కాని మొత్తం |
|---|---|---|---|---|
| **2008-09** | 157.16 | 1609.90 | 1603.00 | 6.90 |
| **2009-10** | 309.07 | 2036.62 | 1875.07 | 161.55 |
| **2010-11** | 331.13 | 1931.97 | 1910.72 | 21.25 |
| **2011-12** | 331.13 | 1950.84 | 1950.24 | 0.60 |
| **2012-13** | 637.70 | 2188.23 | 2188.23 | 0 |
| మొత్తం | **1766.19** | **9717.56** | **9527.26** | |

*మూలం : ఆయా సంవత్సరాల వినిమయ పద్దులు, సెర్ప్ ఇచ్చిన సమాచారం*

5 ఎస్‌పిఎస్ నెల్లూరు, శ్రీకాకుళం
6 మహబూబ్‌నగర్, నల్గొండ
7 అనంతపురం, చిత్తూరు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛను పథకాలలో లబ్ధిదారులు ఎక్కువభాగం ఇందిరమ్మ వృద్ధాప్య పింఛన్లు, వితంతు పింఛనులలో (65 శాతం) ఉండగా, జాతీయ వృద్ధాప్య పింఛనులలో (22 శాతం), వికలాంగుల పింఛనులలో (12 శాతం) ఉన్నారు. వివిధ పథకాల కింద లబ్ధి పొందుతున్న పింఛనుదారుల వివరాలు సంవత్సరాలవారీగా ఈ కింది చార్టులో ఉన్నాయి.

**చార్టు 2.1 : వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలు సంవత్సరాలవారీగా**




*మూలం : గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన ఫలితాల బడ్జెట్*

*గమనిక : 2012-13 సంవత్సరపు పింఛనుదారుల లెక్క 2013 జనవరి వరకు మాత్రమే*

ఆయా పథకాలను అమలు చేయటంలో ఆర్థికపరమైన, వాస్తవిక పురోగతి ఈ కింది విధంగా ఉన్నది :

- 2007-08 సంవత్సరంతో పోలిస్తే 2008-09 లో బడ్జెట్ కేటాయింపు 80 శాతం, ఖర్చు 93 శాతం పెరగగా పింఛనుదారుల సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయింది (వృద్ధాప్య, వితంతు పింఛన్లు 84 శాతం పెరగటంతో మొత్తంమీద 23 లక్షలు). వికలాంగుల పింఛన్లు 2008-09 తో పోలిస్తే 2009-10 లో 342 శాతం పెరిగాయి. ప్రభుత్వం దీనిని ధృవీకరిస్తూ, 2006 ఏప్రిల్ నెలలో ఇందిరమ్మ పథకాన్ని ప్రవేశపెట్టడం, ఇంకా 2011 లో 'రచ్చబండ' పేరుతో బహిరంగ కార్యక్రమాలు నిర్వహించి గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయిలో ఎమ్‌పీడీఓలు దరఖాస్తులను నేరుగా తీసుకోవటం వలన పింఛనుదారుల సంఖ్య 52.83 లక్షలు పెరిగిందని బదులిచ్చింది (2013 ఆగస్టు). వికలాంగుల నెలవారీ పింఛను మొత్తం పెరగటం వలన (నెలకు ₹500) అంతవరకూ వృద్ధాప్య, వితంతు పింఛన్లు పొందుతున్నవారు ఈ పింఛను వర్గంలోకి మారటంతో వికలాంగుల పింఛను లబ్ధిదారుల సంఖ్య పెరిగిందని ప్రభుత్వం తెలిపింది. ఈ విషయాన్ని సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కూడా అంగీకరించారు.

- ప్రభుత్వం బడ్జెట్‌ను స్తంభింపచేయటంవలన నిధులు విడుదలకాక 2009-11 సంవత్సరాలలో ₹182.80 కోట్ల మిగులు ఏర్పడిందని గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనరు తెలిపారు (2013 జూన్). లబ్ధిదారుల ఎంపిక పూర్తికానందువలన ఈ రెండు సంవత్సరాలలో ఎయిడ్స్ రోగుల పింఛన్లు ₹19.20 కోట్లు మిగిలిపోయాయని కూడా తెలిపారు.

- 2011-12, 2012-13 సంవత్సరాలలో వ్యయం బడ్జెట్ కేటాయింపులమేరకే జరిగింది. అధిక వ్యయంగానీ, నిధులు మిగిలిపోవటంగానీ జరగలేదు. గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనరు మొత్తం బడ్జెట్ కేటాయింపును నెలవారీగా డ్రా చేసి ఆ నెలలో వాస్తవంగా చేసిన చెల్లింపులతో సంబంధం లేకుండా ఆ మొత్తాన్ని ఖర్చుగా చూపటం వలన ఈ విధంగా జరిగింది. సామాజిక భద్రతా పింఛన్లను 2011 జూలై నుంచి 'గ్రీన్ ఛానల్'గా పరిగణించే సేవల వర్గంలోకి తీసుకురావటం, ఆ విధానం ప్రకారం వినియోగంతో నిమిత్తం లేకుండా సంవత్సరానికి సరిపడా నిధులను విడుదల చేయటమే ఇందుకు కారణం. జరిగిన చెల్లింపులకు సంబంధించిన బిల్లులను ఎంతకాలానికొకసారి సమర్పించవలసిందీ స్పష్టం చేస్తూ ఆర్థిక శాఖ 2011 జూలై నెలలో ఆదేశాలు జారీ చేసింది. ఏవిధమైన ఆటంకాలు లేకుండా పింఛను పథకాలు సజావుగా అమలు జరిగే విధంగా సంబంధిత శాఖలను బాధ్యులను చేసింది.

  అయితే, స్టేట్ నోడల్ అకౌంట్‌ను నిర్వహించటంలోనూ, బ్యాంకులకు నిధులను ఎలక్ట్రానిక్ పద్ధతిలో బదిలీ చేసి, మిగులు నిధులను సెర్ప్ అట్టిపెట్టుకొనే విషయంలోనూ నియంత్రణ కోసం ప్రభుత్వం తగు యంత్రాంగాన్ని రూపొందించలేదని ఆడిట్ గమనించింది. అంతేకాక, సెర్ప్ దగ్గర మిగిలి పోయిన మొత్తాలను రికన్సయిల్ చేసుకునేందుకు అవసరమైన విధానమేదీ గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించలేదు. ఈ పరిస్థితులలో, పింఛను చెల్లింపుల కోసం గ్రామీణాభివృద్ధి శాఖ నిధులను డ్రా చేసి, చెల్లింపులు చేయకనే ఆ మొత్తాన్ని ఖర్చుగా చూపించటం వలన నిధులు ప్రభుత్వ పద్దులకు ఆవల ఉండటానికీ, రికన్సీలియేషన్ కూడా జరగక పోవటానికీ ఇది దారి తీస్తోంది (2013 మార్చి నాటికి ₹153.29 కోట్లు). అంతేకాకుండా, స్టేట్ నోడల్ అకౌంట్‌కూ, భాగస్వామ్య బ్యాంకులకు మధ్యన కూడా రికన్సీలియేషన్ జరగటం లేదు.

- తన కార్యకలాపాలకు సంబంధించి సెర్ప్ నగదుపుస్తకం వంటి రికార్డులేవీ రాయటంలేదనీ, తన లావాదేవీలన్నింటికీ బ్యాంకులనుంచి వచ్చిన నివేదికలనే ప్రామాణికంగా పరిగణిస్తున్నదనీ ఆడిట్ పరిశీలనలో తేలింది. నమూనా తనిఖీ జరిపిన 103 యూనిట్లకుగానూ మరో ఆరు[8] యూనిట్లలో నగదుపుస్తకం రాయటం లేదు.

- నమూనా తనిఖీ చేపట్టిన 103 యూనిట్లలో మరికొన్ని నియంత్రణాలోపాలు కూడా వెలుగు చూశాయి. వాటిలో కొన్ని ఈ దిగువ ఉదహరించడమైనది :

  ⇒ మొత్తం 103 యూనిట్లలో 84 చోట్ల (82 శాతం) రాబడులను నగదు పుస్తకాలలో రాయటం లేదు;

  ⇒ 86 యూనిట్లలో (83 శాతం) నగదు పుస్తకంలోని అంకెలను బ్యాంకు పద్దులతో రికన్సయిల్ చేయటం లేదు;

  ⇒ వినియోగ ధృవపత్రాలను పంపించటంలో 21 యూనిట్లలో (20 శాతం) జాప్యం జరుగుతోంది.

ఈ సమస్యలను చక్కబెట్టేందుకు తగిన నియంత్రణలను ఏర్పరచగలమని ప్రభుత్వం బదులిచ్చింది (2013 ఆగస్టు). సెర్ప్, ఇంకా ఇతర యూనిట్లలో నగదు పుస్తకాలు లేకపోవటం తీవ్రమైన లోపమేనని అంగీకరిస్తూ, నిధుల గమనాన్ని పర్యవేక్షించటం, ఆధార్ కార్డులతో అనుసంధానం చేయటం ద్వారా బలహీనతలను అధిగమించ గలమని సమీక్షానంతర సమావేశంలో హామీ ఇచ్చింది.

[8] మల్కాజిగిరి, ధర్మవరం మున్సిపాలిటీలు, దుత్తలూరు, కట్టంగూరు, మేళ్ళ చెరువు, వలిగొండ మండలాలు

## 2.5 కార్యక్రమం అమలు

### 2.5.1 లబ్ధిదారుల గుర్తింపు

నిర్వహణ మార్గదర్శకాల ప్రకారం[9], అర్హత కలిగిన పింఛనుదారులను గ్రామ సభలలోనూ, వార్డు సభలలోనూ ఎంపికచేయాలి. (మంజూరు చేయటంలోని దశలు, గ్రామ సభలు - వార్డు సభలలో సంబంధిత అధికారుల వివరాలు ***అనుబంధం-2.3***లో చూడవచ్చును). ఈ విషయమై 103 యూనిట్‌లలో రికార్డులను పరిశీలించి, లబ్ధిదారులను కూడా విచారించిన మీదట నమూనా తనిఖీ చేసిన 22 యూనిట్లలో పింఛనుదారుల గుర్తింపు ప్రక్రియ చేపట్టలేదని తెలిసింది. పింఛను దరఖాస్తులను పరిశీలించి, అర్హతను నిర్ణయించవలసిన అధికారులు[10] అందుకు అవసరమైన విధానాలు అనుసరించలేదనీ, రేషన్ కార్డులు, వయసు ధృవీకరణ, వితంతు పింఛనుల విషయంలోనైతే భర్త మరణ ధృవపత్రం వంటివి సరిచూడలేదనీ తెలిసింది. పింఛను దరఖాస్తుల మాన్యతను ఐదంచెలలో సవిస్తరంగా నిగ్గుతేల్చవలసి ఉంటుంది (***అనుబంధం-2.4***). దరఖాస్తులతో జత చేసిన రేషన్ కార్డులను పరిశీలించటంతోపాటు ఇప్పటికే పింఛను పొందుతున్న వారి సమాచారం (డేటాబేస్) తో పరిశీలించి ఒక్కరికే రెండుసార్లు పింఛను మంజూరు చేయటం వంటివి నివారించాలి. అయితే, ఈ మొత్తం ప్రక్రియను 2010 లో ఒక ప్రైవేటు సంస్థకు నామినేషన్ పద్ధతిలో అప్పగించారు. ఈ ప్రక్రియద్వారా మంజూరైన పింఛన్లను పరిశీలించి, నిర్ధారించేందుకు ప్రభుత్వ స్థాయిలో తగు యంత్రాంగమేదీ లేదు.

నమూనా పరిశీలన చేసిన 89 యూనిట్లలో పింఛను మంజూరైన విషయం దరఖాస్తుదారులకు తెలియచేసే ఏర్పాటు కూడా లేదు. వితంతు పింఛనులను మగవారికీ, భర్త జీవించి ఉన్న మహిళలకూ ఇవ్వటం, వయసు ధృవీకరణ పత్రాలు లేకుండానే వృద్ధాప్య పింఛన్లు ఇవ్వటం, ఒకే వ్యక్తికి ఒకటి కన్నా ఎక్కువ పింఛన్లు మంజూరు చేయటం, అర్హత లేని వ్యక్తులు పింఛను పొందటం, దరఖాస్తులను ఆమోదించేటప్పుడూ, తిరస్కరించినప్పుడూ అందుకు తగిన రిమార్కులు రాయకపోవటం మొదలైన పలు లోటుపాట్లు ఆడిట్ దృష్టికి వచ్చాయి. వాటి వివరాలు ***అనుబంధం-2.5***లో ఉన్నాయి.

పింఛను వ్యవస్థలోని సమాచారం ఎంతో క్రియాశీలమైనది, మార్పు చేర్పులకు లోనయ్యేది. ఇందుకు సంబంధించి 2012 మే, డిసెంబరు నెలల డేటాబేస్‌ను విశ్లేషించిన మీదట పలు అవకతవకలు బయటపడ్డాయి. అటువంటి వాటిలో కొన్నింటిని ఈ దిగువ వివరించటం జరిగింది.

#### *2.5.1.1 పెన్షన్ డేటాబేస్‌తో సరిపోలని పౌర సరఫరాల శాఖ డేటాబేస్*

దారిద్ర్య రేఖ దిగువన ఉన్నవారికి (బీపీఎల్) మాత్రమే పింఛను పథకాలు వర్తిస్తాయి. వీరు తెల్ల రేషన్ కార్డు[11] కలిగి ఉండాలి. అయితే, మొత్తం 71.12 లక్షల పింఛన్లకుగాను 5.54 లక్షల మందికి అసలు రేషన్ కార్డు నెంబర్లే డేటాబేస్‌లో పొందుపరచలేదు. అంతేకాకుండా, మిగతా 65.58 లక్షల మందిలో 10.62 లక్షల రేషన్ కార్డు నెంబర్లకు సంబంధించి పింఛనుదారుల డేటాబేస్‌కూ పౌర సరఫరాల శాఖ దగ్గర ఉన్న సమాచారం, బీపీఎల్ డేటాకూ[12] సరిపోలటం లేదు. లబ్ధిదారుల సర్వేలో కూడా, 52 కేసులలో రేషన్ కార్డు నెంబర్లు, పేర్లు రేషన్ కార్డు వివరాలతో సరిపోలేదని ఆడిట్ గుర్తించింది (పింఛనుదారులు స్వచ్ఛందంగా తమ రేషన్ కార్డులు తెచ్చిన సందర్భాలలో).

---

[9] పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి (ఆర్‌డీ-II) శాఖ జీఓఎమ్ఎస్ నెం. 83 తేదీ 2006 మార్చి 27

[10] గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పట్టణ ప్రాంతాలలో బిల్ కలెక్టర్, మునిసిపల్ కమీషనర్

[11] దారిద్ర్య రేఖ ఎగువన ఉన్న (ఏపీఎల్) వారికి గులాబీ రంగు రేషన్ కార్డులు ఉపయోగిస్తారు

[12] పౌర సరఫరాల శాఖ డేటాకు సంబంధించి డబ్ల్యుఏపీ, వైఏపీ, ఏఏపీ, టీఏపీ, ఆర్ఏపీ, ఐసీఎఫ్ఎస్ కార్డులలో ఉన్నవి

### 2.5.1.2 వృద్ధాప్య, నేతపనివారి పింఛన్లను అర్హతలేని వారికి ఇవ్వటం

కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న జాతీయ వృద్ధాప్య పింఛను పథకానికి నిర్ణయించిన కనీస వయోపరిమితి 60 సంవత్సరాలు కాగా, రాష్ట్ర ప్రభుత్వ పథకమైన ఇందిరమ్మ పింఛన్లకు ఇది 65 సంవత్సరాలు. అయితే, 60 సంవత్సరాలకన్నా తక్కువ వయసు కలిగిన 5,754 మందికి జాతీయ వృద్ధాప్య పింఛన్లు, అదే విధంగా 65 సంవత్సరాలలోపు వయసున్న 17,462 మందికి ఇందిరమ్మ పింఛన్లు ఇస్తున్నారు. అంతేకాక, నేతపనివారి పింఛన్ల మంజూరుకు 50 ఏళ్ళు నిండినవారే అర్హులుకాగా, చిత్తూరుజిల్లాలో 50 ఏళ్ళ వయసుకన్నా తక్కువ ఉన్న 244 మందికి ఈ పింఛన్లు మంజూరు చేసారు.

### 2.5.1.3 ఒకే వ్యక్తికి ఒకటికన్నా ఎక్కువ పింఛన్లు, పలు విడతల చెల్లింపులు

పింఛను డేటాబేస్‌ను విశ్లేషించగా రాష్ట్రంలోని 24,595 కేసులలో ఒక్కొక్క వ్యక్తికీ ఒకే రేషన్ కార్డుమీద ఒకటికన్నా ఎక్కువ పింఛన్లు అందచేశారు. (నమూనా పరిశీలన చేసిన జిల్లాలలో వీటి సంఖ్య 16,418). పది యూనిట్ కార్యాలయాలలో[13] చేపట్టిన నమూనా పరిశీలనలో ఇటువంటి డబుల్ చెల్లింపు కేసులు 151 బయటపడ్డాయి.

### 2.5.1.4 డేటాబేస్‌లో మరికొన్ని వైరుధ్యాలు

- గులాబీరంగు రేషన్ కార్డు కలిగిన అధికాదాయ వర్గాలవారికి ఈ పింఛన్ల అర్హత లేకపోయినా, 2012 డిసెంబరు నాటికి అటువంటి వారు 14,225 మంది పింఛన్లు పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వీటి మీద ₹19.63 కోట్లు చెల్లించింది. ఈ విధంగా సంవత్సరానికి సుమారు ₹3.41 కోట్లు చెల్లించవలసి ఉంటుంది. ఇలాంటి అనర్హులైన వారిని జాబితానుంచి తొలగించేందుకు ఆదేశాలు జారీ చేస్తామని సెర్ప్ బదులిచ్చింది (2013 మార్చి).

- పింఛనుదారుల వయసును డేటాబేస్‌లో '0' అని సూచించిన వారు 4,786 మంది ఉన్నారు. అదే విధంగా 4,543 మంది మగవారికి వితంతు పింఛన్లు ఇస్తున్నారు.

పింఛను దరఖాస్తులను పరిశీలించవలసిన యంత్రాంగంలో పలు లోపాలున్నట్లు దీనిని బట్టి స్పష్టమవుతోంది. పింఛను మంజూరు విధానాలను దరఖాస్తుల పరిశీలన దశలోనే బలోపేతం చేస్తామనీ, అనుమతించిన పింఛన్ల వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శనకు ఉంచుతామనీ ప్రభుత్వం సమీక్షానంతర సమావేశంలో తెలిపింది. ఇక డేటాబేస్‌లోని పొరపాట్ల విషయంలో, ఆడిట్ లేవనెత్తిన విషయాలపై విచారణ జరిపి దిద్దుబాటుకు తగు చర్యలు గైకొనవలసిందిగా ఆయా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థల ప్రాజెక్టు డైరెక్టర్లను 2013 ఆగస్టులో ఆదేశించామని ప్రభుత్వం పేర్కొన్నది. అంతేకాకుండా, ప్రభుత్వ శాఖలో పలువిధాలైన డేటాబేస్‌లు ఉన్నాయనీ వీటన్నిటినీ సమీకరించి సమగ్ర సమాచారం (మాస్టర్ డేటాబేస్) రూపొందించే విధంగా చర్యలు చేపడతామనీ సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం తెలిపింది (2013 నవంబరు).

## 2.5.2 పెండింగులో దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కార్యక్రమం కింద 2008-09 వరకూ పింఛనులను మూడు విడతలలో సంపూర్ణంగా మంజూరు చేసింది. అటుతర్వాత, కొత్త దరఖాస్తులు వస్తే పాత పింఛనుదారు మరణకారణంగా ఏర్పడే ఖాళీలను బట్టి కొత్తవారికి మంజూరు చేస్తోంది. ప్రభుత్వం, 2011 నవంబరులో నిర్వహించిన 'రెండో విడత రచ్చబండ' కార్యక్రమంలో కొత్త దరఖాస్తులను స్వీకరించింది.

[13] గూడూరు (1), వంగర (2), కొత్తూరు (5), పోలాకి (10), శ్రీకాకుళం ఎమ్‌సీ (9), లావేరు (7), చింతపల్లి (39), కొయ్యూరు (4), జీకే వీధి (63) ఏర్పేడు (11)

పింఛన్లు కోరుతూ 2010 ఆగస్టు నుంచి 2012 ఏప్రిల్ నెలల మధ్యన మండల పరిషత్ కార్యాలయాలకు, మున్సిపల్ కార్పొరేషన్లకూ 30.03 లక్షల దరఖాస్తులు అందాయి. వీటిని పరిశీలించిన మీదట 17.89 లక్షల మంది అర్హులుగా తేలారు. అయితే, ఇందులో ఇంచుమించు 25 శాతం (4.45 లక్షల) దరఖాస్తుదారులకు 2013 మార్చి నాటికి పింఛన్లు మంజూరు కాలేదు. అంతేకాకుండా, ఆడిట్ చేపట్టిన నమూనా పరిశీలనలో (రంగారెడ్డి, శ్రీకాకుళం, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లాలు) ***పింఛను కోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలన, మంజూరుకు ఎదురుచూస్తూ మండల పరిషత్, మునిసిపల్ కార్యాలయాలలో కట్టలు కట్టలుగా పడి ఉండటం కనిపించింది. ఈ కట్టలను అసలు తీసిచూడకపోవడం, వీటిని పరిష్కరించేందుకు తగిన రిజిస్టర్లు కూడా నిర్వహించకపోవటంవలన ఇటువంటి దరఖాస్తులు ఎన్ని ఉన్నదీ ఆడిట్ లెక్కకట్టలేదు.***

అర్హులైన 4.45 లక్షలమందికి 2013 జూలై నుంచి పింఛన్లు ఇస్తున్నామని ప్రభుత్వం తెలిపింది (2013 ఆగస్టు).

అయితే, సమీక్ష పూర్వాధ్యయనం చేపట్టిన రంగారెడ్డి జిల్లాలో నిధులు అందకపోవటం వలన 2013 అక్టోబరు నాటికీ వాస్తవంగా పింఛను చెల్లింపులు జరగలేదని తదుపరి పరిశీలనలో తెలిసింది. సమీక్షానంతర సమావేశంలో ముఖ్య కార్యదర్శి కూడా దరఖాస్తుల పరిశీలన గురించి ప్రముఖంగా ప్రస్తావించి, వీటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

## 2.5.3 పింఛను చెల్లింపులు

### *2.5.3.1 స్మార్ట్ కార్డ్ విధానం*

సామాజిక భద్రతా పింఛనులను 2007-08 వరకు పంచాయతీ కార్యదర్శి, స్వయం సహాయ గ్రూపులద్వారా సాంప్రదాయ (మాన్యువల్) విధానంలో చెల్లింపు చేసేవారు. ఈ విధానం వలన అర్హతలేని వారికీ, ఇతర వ్యక్తులకు చెల్లింపుచేయటం, మరణించిన వారి పింఛనులను మరొకరు తీసుకోవటం వంటి వాటికి ఆస్కారం ఏర్పడుతుంది. పింఛనులను సకాలంలో చెల్లించటం, చెల్లింపులలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా పింఛను చెల్లింపులను బయోమెట్రిక్ విధానంలో స్మార్ట్ కార్డ్ ఆధారంగా చేయాలని తలపెట్టి 10 బ్యాంకులతో ఒప్పందం కుదుర్చుకున్నారు (2007). మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో వేతనాలను కూడా ఈ పద్ధతిలోనే చెల్లిస్తున్నారు. ఈ బ్యాంకులు పింఛనుదారుల నమోదు పూర్తిచేసి, ఆ కార్డుల ద్వారా, బయోమెట్రిక్ విధానంలో చెల్లింపులు చేయాలి. బాధ్యత అప్పగించిన ఆరు నెలల్లోగా బ్యాంకులు చెల్లింపు ఆరంభించాలి. పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ 2008 జూలై - 2010 ఫిబ్రవరి నెలల మధ్యన పది బ్యాంకులతో అవగాహన ఒప్పందం చేసుకున్నది. ప్రాథమికంగా ఈ ఒప్పందం మూడు సంవత్సరాలకు కుదిరింది. చెల్లింపు చేసిన మొత్తంలో రెండు శాతం సర్వీసు ఛార్జీలుగా బ్యాంకులకు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, పింఛనుదారుల నమోదు, పింఛను చెల్లింపులలో సమయపాలన పాటించనప్పుడు బ్యాంకులకు అపరాధ రుసుము విధించే నిబంధన ఏదీ అవగాహన ఒప్పందంలో లేదు.

ఆ తర్వాత, 2011 జూన్ నెలలో పంచాయతీరాజ్ శాఖ ఇటువంటి ఒప్పందాన్నే భారత తపాలా శాఖతో కుదుర్చుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం 2013 ఆగస్టు నాటికి సర్వీసు ఛార్జీల రూపంలో 10 బ్యాంకులకూ[14], తపాలా శాఖకు ₹32.02 కోట్లు చెల్లించింది. ఈ మూడు చెల్లింపు విధానాల తులనాత్మక చిత్రణ ***అనుబంధం-2.6***లో ఉన్నది. ఇందుకు సంబంధించి ఆడిట్ గమనించిన విషయాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

- నాలుగు బ్యాంకులతో (యాక్సిస్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీజీవీ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) చేసుకున్న ఒప్పందాల గడువు 2012 మార్చి, ఏప్రిల్ నెలల్లో ముగిసింది. కానీ అవి లావాదేవీలు కొనసాగిస్తున్నాయి. ఈ విషయం ఆడిట్‌లో ప్రస్తావించిన మీదట, గ్రామీణాభివృద్ధి శాఖ యాక్సిస్ బ్యాంకుతో ఒప్పందాన్ని తిరగరాసుకొని, మిగతా మూడు బ్యాంకులతో ఒప్పందాలను రద్దు చేసుకున్నది.

[14] యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్, ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, యాక్సిస్ బ్యాంక్, ఏపీజీవీ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్

- అవగాహన ప్రకారం, ప్రభుత్వ శాఖ పూర్తి సమాచారాన్ని బ్యాంకులకు, తపాలా శాఖకు ఎలక్ట్రానిక్ విధానంలో అందచేయాలి. ఆమీదట వారు క్షేత్ర స్థాయిలో లబ్ధిదారుల నమోదు చేపట్టి, పదింట ఆరు వేలి ముద్రలను, ఫోటోలను, వ్యక్తిగత వివరాలను సేకరించాలి. ఈ బ్యాంకులూ, తపాలా శాఖ ఆరు నెలల్లోగా నమోదు ప్రక్రియ చేపట్టి స్మార్ట్ కార్డులు జారీ చేయవలసి ఉండగా, అయిదు సంవత్సరాలు దాటినాగానీ, 2013 ఫిబ్రవరి నాటికి 70.96 లక్షల పింఛనుదారులలో 47.15 లక్షల మందికి (66 శాతం) మాత్రమే స్మార్ట్ కార్డులు ఇచ్చారు.

- పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ ఈ బ్యాంకుల పనితీరును సమీక్షించి వాటిలో నాలుగు బ్యాంకులను [15] జాబితా నుంచి తొలగించాలనీ ఆ ప్రాంతాలను తపాలా శాఖకు కేటాయించాలనీ నిశ్చయించింది (2013 మార్చి). ఈ నాలుగు బ్యాంకులూ తమ ప్రాంతాలలో ఇప్పటికే చేసిన నమోదులను తపాలా శాఖ ఉపయోగించుకోలేదు. ఇక్కడ తపాలా శాఖ నమోదు ప్రక్రియను మరోసారి చేపట్టవలసి వచ్చింది. ఈ నమోదు కార్యక్రమం పూర్తయ్యే వరకూ పింఛను చెల్లింపులను పాత పద్ధతిలోనే చేస్తున్నారు. ఆ విధంగా కార్డు కలిగిన పింఛనుదారుల సంఖ్య 47.15 లక్షలనుంచి 43.61 లక్షలకు పడిపోయింది. ఇంకా 2013 ఆగస్టు నాటికి 31.43 లక్షల (42 శాతం) పింఛనుదారులను నమోదు చేయవలసి ఉన్నది. దాదాపు సగం మంది పింఛనుదారులకు చెల్లింపులను సాంప్రదాయ పద్ధతిలోనే చేస్తుండటం వలన స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టిన లక్ష్యం పూర్తిగా నెరవేరలేదు. సాంప్రదాయ (మాన్యువల్) రీతిలో చేసిన చెల్లింపుల వాస్తవికతను ఆడిట్ ధృవీకరించుకొనలేదు.

- ఒప్పందం ప్రకారం బ్యాంకులు, తపాలా శాఖ స్మార్ట్ కార్డు ప్రాజెక్టు అమలు చేసేందుకు తగిన పాయింట్ ఆఫ్ సేల్ పరికరాలను సమకూర్చుకొని అక్కడ పనిచేసేందుకు స్వయం సహాయక సమూహాలలోని మహిళలను నియోగించాలి. ఒక్కొక్క పరికరానికీ ₹20,000 వంతున స్వయం సహాయక మహిళలకు ఇవ్వాలని నిశ్చయించిన (2010 జనవరి) ప్రభుత్వం మొత్తం 7,425 పరికరాల కోసం ₹14.85 కోట్లను బ్యాంకులకు విడుదల చేసింది (2010 మార్చి నుంచి 2011 అక్టోబరు మధ్యన). ఐతే, స్వయం సహాయక బృందాల స్త్రీలను వినియోగదారుల సేవా కేంద్రాలుగా (సీఎస్‌పీ) [16] నియోగించే విధంగా పంచాయతీరాజ్ శాఖ పట్టుపట్టలేదు. వాస్తవానికి ఈ మేరకు నిబంధన ఏదీ ఈ సమయంలో చేసుకున్న అవగాహన పత్రాలలో పొందుపరచలేదు. తదుపరి, 2013 మార్చి నెలలో ఆంధ్రా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ అఫ్ హైదరాబాద్‌లను జాబితానుంచి తొలగించారు. ఆ రెండు బ్యాంకులకు ఈ పరికరాల కోసమని అప్పటికే మొత్తం ₹10.04 కోట్లు చెల్లించారు (ఆంధ్రా బ్యాంకుకు ₹5.14 కోట్లు, స్టేట్ బ్యాంక్ అఫ్ హైదరాబాద్‌కు ₹4.90 కోట్లు). బ్యాంకులను జాబితానుంచి తొలగించిన సందర్భాలలో ఈ పరికరాలపై యాజమాన్య హక్కుల గురించి అవగాహన పత్రంలో నిబంధన ఏదీ లేకపోవటంవలన ప్రభుత్వం ఈ పరికరాలను వాడుకొనలేకపోయింది. ఇది వృధా ఖర్చుకు దారితీసింది.

  పనితీరు సరిగా లేకపోవటం వలనా, ఆధార్ కార్డ్ అనుసంధానం చేయకపోవటం వలనా, ఈ ప్రాజెక్టులో పని చేసేందుకు ఆసక్తి చూపకపోవటం వలనా నాలుగు బ్యాంకులను ఈ ప్రాజెక్టునుంచి తప్పించామని ప్రభుత్వం ధృవీకరించింది (2013 ఆగస్టు). ఈ పరికరాలు బ్యాంకుల సొంతమవుతాయని చెబుతూ పింఛను పంపిణీ వ్యవస్థలో మరింత పట్టు సాధించే దిశగా గ్రామీణ సంస్థలను (వీఓ) వినియోగదారుల సేవాకేంద్రాలుగా నియమించతలచామని ప్రభుత్వం సమీక్షానంతర సమావేశంలో తెలిపింది.

---

[15] ఆంధ్రా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ అఫ్ హైదరాబాద్, ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్

[16] నమూనా తనిఖీ చేసిన శ్రీకాకుళం జిల్లాలో 231 మంది మగవారిని వినియోగదారులకు సేవలనందించేందుకు నియోగించారు

- పాయింట్ ఆఫ్ సేల్ పరికరాలు సరిగా పనిచేయకపోవటం, వేలిముద్రలను అవి గుర్తించకపోవటం వంటి సమస్యలవలన పింఛను చెల్లింపులను 'కార్డెడ్ - బట్ - మాన్యువల్' విధానంలో చేస్తున్నారు. ఈ పద్ధతిలో చేసే సగటు చెల్లింపులు 21 శాతం (యాక్సిస్ బ్యాంక్) ఉంటున్నాయి. స్మార్ట్ కార్డ్ విధానం అమలు చేయటం సాధ్యపడిన చోట్ల సంప్రదాయ (మాన్యువల్) పద్ధతిలో చేసిన మొత్తాలను ఆయా బ్యాంకులు ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలి[17]. ఇందుకు సంబంధించి 2012 ఫిబ్రవరి నుంచి సెప్టెంబరు మధ్యన రికార్డులను ఆడిట్ పరిశీలించగా ప్రభుత్వం బ్యాంకులనుంచి వసూలు చేసుకొనవలిసిన మొత్తం ₹88.15 కోట్లుగా లెక్క తేలింది.

  తమకు రావలసిన సొమ్ము కోసం సంబంధిత బ్యాంకులకు నోటీసులు ఇచ్చామని ప్రభుత్వం బదులిచ్చింది (2013 ఆగస్టు) కానీ ఎంత మొత్తానికి నోటీసులు జారీ చేసినదీ చెప్పలేదు. వసూలు వివరాలు కూడా వెల్లడించలేదు. ఈ లావాదేవీలలో బ్యాంకుల పనితీరు సరిగాలేదనీ, లబ్ధిదారుల నమోదు, పింఛను చెల్లింపుల విషయంలో సమయపాలన సక్రమంగా అమలు జరిగేందుకు అవసరమైన నిబంధనలను ఒప్పంద పత్రాలలో చేరుస్తామని ప్రభుత్వం సమీక్షానంతర సమావేశంలో తెలిపింది.

### *2.5.3.2 చిత్తూరు జిల్లాలో స్మార్ట్ కార్డు ప్రాజెక్టు*

చిత్తూరు జిల్లాలోని 66 మండలాలకుగాను 48 మండలాలలోనూ, మొత్తం ఎనిమిది మున్సిపాలిటీలలోనూ స్మార్ట్ కార్డు ప్రాజెక్టును 2008 జూలై నెలలో ప్రవేశపెట్టారు. ఈ పనిని ఆరు బ్యాంకులకు అప్పగించారు. ఈ జిల్లాలో జరిగిన పింఛను చెల్లింపులను పరిశీలించినప్పుడు ఆడిట్ ఈ కింది విషయాలను గమనించింది ః

- మండలాలలో జరిగిన చెల్లింపుల వివరాలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు పంపిస్తే అక్కడ వాటిని క్రోడీకరించి నెలకోసారి ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుంది. అయితే, ఇక్కడ స్మార్ట్ కార్డు ద్వారా, కార్డెడ్ - బట్ - మాన్యువల్ పద్ధతిన, సాంప్రదాయక విధానంలో పింఛన్లు పొందిన వారి వివరాలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ దగ్గర లేవు.

- పింఛను చెల్లింపులలో నాలుగు రోజుల నుంచి 34 రోజుల వరకూ జాప్యం చోటు చేసుకున్నది. నమోదు పనులు పూర్తి కాకపోవటం, ఎలక్ట్రానిక్ నగదు బదిలీ విధానంలో ఎదురవుతున్న చిక్కులను బ్యాంకులు తొలగించకపోవటం కూడా జరుగుతున్నది.

- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ తుదకు 2012 జూన్‌లో సాంప్రదాయక చెల్లింపు విధానాన్నే ప్రారంభించింది. స్మార్ట్ కార్డు మీద చెల్లింపులను ఆరు మండలాలకు, ఎనిమిది మున్సిపాలిటీలకు మాత్రం పరిమితం చేసింది.

- ఈ ఆరు మండలాలలో కూడా నమోదు ప్రక్రియ పూర్తవలేదు. కార్డు రహిత లబ్ధిదారుల చెల్లింపులు మూడు శాతం (కార్వేటినగరం) నుంచి 84 శాతం (వెదురుకుప్పం) మధ్యన ఉన్నాయి. ఇక మున్సిపాలిటీల విషయంలో ఇవి ఎనిమిది శాతం (పుంగనూరు) మొదలు 22 శాతం (తిరుపతి) దాకా ఉన్నాయి.

బ్యాంకులు స్మార్ట్ కార్డు విధానంలో పింఛనుదారుల నమోదు ఇంకా పూర్తి చేయకపోవటంతో, ప్రభుత్వం ఈ జిల్లాలో స్మార్ట్ కార్డు ద్వారా పింఛన్లు చెల్లించే బాధ్యతను 2013 మార్చిలో తపాలా శాఖకు అప్పగించింది. పింఛనుదారులను నమోదు చేసేందుకు తపాలా శాఖకు కనీసవ్యవధి ఇవ్వకుండానే, ప్రభుత్వం ఆధార్ కార్డు అనుసంధానంతో లబ్ధిదారుల జాబితా రూపొందించేందుకు ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన ఐదు జిల్లాలలో 2013 మే నెల నుంచి చిత్తూరును కూడా చేర్చింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం తపాలా శాఖకూ ఆధార్ కార్డులకూ మధ్యన ఏవిధమైన లంకె వ్యవస్థీకరించలేదు. ఈ ప్రాజెక్టు కోసం తపాలా శాఖ, బ్యాంకులు చేసిన కృషిని వినియోగించుకొనే వ్యూహమేదీ ప్రభుత్వం యోచించలేదు.

---

[17] పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సర్క్యులర్ నెం. 1417/ఆర్‌డీ_ఎస్‌హెచ్‌జీ/ఈబీటీ/2010 తేదీ 2010 ఆగస్టు 31

బ్యాంకులు రూపొందించిన సమాచారం తపాలా శాఖ ఉపయోగించుకొనకపోవడం గురించి బదులిస్తూ ఈ పరికరాలు బ్యాంకుల సొంతమనీ, మొత్తం ప్రక్రియ తిరిగి చేపట్టటం తప్ప మరో మార్గంలేదనీ సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం తెలిపింది. తగు ప్రణాళిక లోపించటం, ఆధునిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవటంలో దిశానిర్దేశం కొరవడటం వలన ఇది మొత్తం కసరత్తును మరోమారు చేపట్టవలసిన పరిస్థితి కల్పించింది. పింఛను చెల్లింపులు పాత విధానంలోనే జరుగుతుండటంతో లబ్ధిదారులు సకాలంలో పింఛన్లు పొందటంపై ఇది ప్రభావం చూపుతుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థల దగ్గర పూర్తి సమాచారం లేకపోవటం వలన ఈ చెల్లింపులలోని విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతుంది.

ఆధార్‌తో అనుసంధానం గురించి ప్రభుత్వం వివరిస్తూ (2013 నవంబరు), లబ్ధిదారులందరి నుంచీ ఆధార్ కార్డు వివరాలు సేకరించమని గ్రామీణ సంస్థలను ఆదేశించామనీ మరో రెండు మూడు నెలలో ఈ పని పూర్తవుతుందనీ తెలిపింది.

### *2.5.3.3 తపాలా శాఖ ద్వారా చెల్లింపులు*

నల్గొండ జిల్లాలో సామాజిక భద్రతా పింఛన్లను చెల్లించే బాధ్యతను 2011 లో తపాలా శాఖకు అప్పగించారు. ఇక్కడ సుమారు నాలుగు లక్షల మంది పింఛనుదారులు ఉండగా, 2013 మార్చి నాటికి 3.77 లక్షలమందిని బయోమెట్రిక్ విధానంలో చెల్లింపులకు నమోదు చేశారు. అలాగే, జిల్లాలో 59 మండలాలు ఉండగా, 53 మండలాలలో 2011 జూన్ నుంచి పింఛను చెల్లింపులను పాయింట్ ఆఫ్ ట్రాన్సాక్షన్ పరికరాలు ద్వారా చేస్తున్నారు. వీటికి సంబంధించి ఆడిట్ గమనించిన విషయాలు ఈ విధంగా ఉన్నాయి :

- అసలు పింఛనుదారుల తరపున పింఛను తీసుకునేందుకు 14,132 మందిని మెసెంజర్లు, నామినీలుగా తపాలా శాఖ నమోదుచేసింది. అమలులో ఉన్న ఆదేశాల[18] ప్రకారం, నామినేషన్ పత్రాలను నిర్ణీత విధానంలో పరిశీలించిన తర్వాతనే ఈ రకమైన చెల్లింపులను అనుమతించాలి. ఐతే, ఇందుకు సంబంధించిన వివరాలను ఆడిట్ ముందుంచకపోవటంవలన ఆయా పత్రాలను సక్రమంగా పరిశీలించిన విషయం నిర్ధారణ కాలేదు.

  పన్నెండు గ్రామ పంచాయతీలలో 20,826 మందికి పింఛన్లు చెల్లించేందుకు వీలుగా అదనంగా మరిన్ని సీఎస్‌పీలు, యంత్ర పరికరాలను 2013 జనవరి 30 లోగా సమకూర్చమని ప్రభుత్వం ఆదేశించింది (2013 జనవరి). అయితే, 2013 మార్చి నాటికీ అదనపు సీఎస్‌పీలను నియమించలేదు.

- వేలిముద్రలు సరిపోలకపోవటం, పింఛనుదారులు తాత్కాలికంగా వలస వెళ్ళటం, మరణించటం వంటి వివరాలను పింఛను చెల్లించే సిబ్బంది కానీ, సీఎస్‌పీలు కానీ పాయింట్ ఆఫ్ ట్రాన్సాక్షన్ డివైస్‌లో పొందుపరచటం లేదు. దీని వలన, ఏదైనా కారణంచేత ఒక నెలలో పింఛను తీసుకోలేని వారికి తదుపరి నెలలో ఇబ్బందులెదురవుతున్నాయి.

- బయోమెట్రిక్ విధానంలో చెల్లింపులకు నమోదు చేసుకున్న 60,685 మంది కొత్త పింఛనుదారులకు సెర్ప్ నుంచి బకాయిలు మంజూరు కానందువలన 2011 జూలై నుంచి అక్టోబరు వరకు పింఛన్లు అందలేదు. ఇలా చెల్లించవలసిన మొత్తం ₹2.90 కోట్లు ఉన్నది.

- నల్గొండ, నిజామాబాద్ జిల్లాలలో ఇందిరమ్మ పింఛనుదారుల కోసం 4.44 లక్షల[19] సేవింగ్స్ ఖాతాలను ఆరంభించేందుకు వీలుగా ఖాతాకు ₹50 చొప్పున మొత్తం ₹2.22 కోట్లను గ్రామీణాభివృద్ధి శాఖ 2011 మార్చినెలలో తపాలా శాఖకు రిఫండబుల్ అడ్వాన్సు రూపంలో చెల్లించింది. ఈ మొత్తాన్ని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి చెల్లించారు. ఈ అడ్వాన్సును మొదటి ఐదు నెలల

[18] గ్రామీణాభివృద్ధి శాఖ సర్క్యులర్ నెం. 2672/ఆర్‌డీ-ఎస్‌హెచ్‌జీ/ఈబీటీ/2011, తేదీ 2011 జూన్ 7
[19] నల్గొండ : 2,57,443; నిజామాబాద్ : 1,86,846

పింఛను నుండి నెలకు ₹10 చొప్పున 2011 ఆగస్టు నాటికి వసూలుచేసి గ్రామీణాభివృద్ధి శాఖకు చెల్లించాలి. ఈ పింఛనుదారుల కోసం జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరవమని ప్రభుత్వం తపాలా శాఖను కోరింది (2011 ఆగస్టు) కానీ సంవత్సరం గడిచినా ఇందులో పురోగతి లేదు. ప్రభుత్వం తపాలా శాఖనుంచి ₹2.22 కోట్ల మొత్తాన్ని 2011 ఆగస్టు నాటికే వసూలు చేయాల్సి ఉన్నా, 2013 మార్చి నాటికీ వసూలు చేయలేదు.

### *2.5.3.4 వికలాంగుల పింఛన్లు వైకల్యం ప్రాతిపదికన చెల్లించకపోవటం*

అంతవరకూ ₹200గా ఉన్న వికలాంగుల నెలవారీ పింఛన్లను ప్రభుత్వం 2008 నవంబరులో ₹500కు పెంచింది. ఇందులో శ్లాబు విధానం ప్రవేశపెట్టి 40 - 60 శాతం వైకల్యం కలవారికి నెలకు ₹500, వైకల్యం 61 - 80 శాతం ఉన్నవారికి ₹600, అలాగే 81 శాతం అంతకు మించిన వారికి ₹700 చొప్పున చెల్లించ తలచింది. అయితే, సాఫ్ట్‌వేర్ ఫర్ అసెస్‌మెంట్ ఆఫ్ డిజేబిలిటీ ఫర్ యాక్సెస్, రీహాబిలిటేషన్, ఎమ్‌పవర్‌మెంట్ (సదరమ్) ద్వారా సెర్ప్ సంస్థ ఆయా వికలాంగుల వైకల్యం స్థాయిననుసరించి పింఛను అర్హతను నిర్ణయించే పనిని 2010 జనవరిలోనే ఆరంభించినాగానీ, వారికి వైకల్యం స్థాయిని అనుసరించి పింఛన్లను చెల్లించటం లేదు. వైకల్యం తీవ్రతకు తగినట్టు పింఛను చెల్లించాలని ప్రభుత్వం ఎప్పుడో 2008లో చేసిన నిర్ణయం ఆవిధంగా 2013 ఆగస్టు నాటికీ (ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయనందున) అమలు కాలేదు. అంగ వైకల్యం హెచ్చు స్థాయిలో ఉండి, ఎక్కువ పింఛను అవసరమైన వారు దీని వలన ప్రయోజనం కోల్పోతున్నారు. వికలాంగుల పింఛన్లను సవరించిన రేట్ల ప్రకారం చెల్లించటం లేదని ప్రభుత్వం సమీక్షానంతర సమావేశంలో (2013 నవంబరు) అంగీకరించింది.

### *2.5.3.5 చెల్లింపు ఎక్విటెన్సులు*

నమూనా తనిఖీ కోసం ఎంపిక చేసిన 103 యూనిట్‌లలో 2012 జూన్ నెల పింఛన్ల (జూలైలో చెల్లించినవి) ఎక్విటెన్సులను పరిశీలించగా కొన్ని లోపాలు వెలుగు చూశాయి. ఇక్కడ అబ్‌స్ట్రాక్ట్‌లను (చెల్లింపుల సంగ్రహం) రూపొందించటం లేదు. చెల్లింపు తేదీలు, వలస వెళ్లిన విషయం, మరణించిన విషయం, చెల్లింపులలోని జాప్యం, సీబీఎమ్ చెల్లింపులు మొదలైన వివరాలు నమోదు చేయటం లేదు. ఆడిట్ పరిశీలనలో ఈ దిగువ వివరాలు కూడా తెలిశాయి :

- తనిఖీ చేపట్టిన 103 యూనిట్లలో 90 చోట్ల చెల్లింపు సంగ్రహం రూపొందించటం, చెల్లించిన అధికారులు (పీడీఏ) వాటిమీద సంతకం చేయటం జరగలేదు. ఫలితంగా, వివిధ వర్గాలకు చేసిన చెల్లింపులు, తిప్పి పంపిన మొత్తాల వివరాలు తెలియటం లేదు.

- అలాగే, 99 యూనిట్లలో అధికారులు పింఛను చెల్లించిన తేదీలను రాయలేదు. సాంకేతిక సమస్యల కారణంగా, 103 యూనిట్లకుగాను, 47 యూనిట్లలో కొందరు పింఛనుదారుల పేర్లు కూడా ముద్రించలేదు. ప్రింటెడ్ ఎక్విటెన్స్‌ల ప్రకారమే సీఎస్‌పీలు చెల్లింపు చేస్తున్నందున చెల్లింపులు సరైన వ్యక్తులకే జరిగాయని ఆడిట్ ధృవీకరించు కొనలేకపోయింది.

- పింఛనుదారుడు మరణించిన తేదీ, తాత్కాలికంగానో శాశ్వతంగానో వలస వెళ్లిన విషయం నమోదు చేయకపోవటం 63 యూనిట్లలో కనిపించింది. పింఛనులను సకాలంలో నిలుపుదల చేయటానికీ, బకాయి మొత్తాలు లెక్క కట్టేందుకూ ఈ సమాచారం అవసరమవుతుంది. అనంతపురం జిల్లాలోని మడకసిర, పరిగి, హిందూపురం మండలాలలో చనిపోయిన వారి పింఛన్లను వేరేవారు తీసుకున్న ఐదు కేసులను ఆడిట్ గుర్తించింది. పరిగి, హిందూపురం మండలాభివృద్ధి అధికారులు ఆడిట్ గమనించిన విషయాలను ధృవీకరించి (2012 సెప్టెంబరు/2013 మార్చి), అలా చెల్లించిన మొత్తాలను తిరిగి రాబట్టవలసిందిగా సీఎస్‌పీలను ఆదేశించినట్లు తెలిపారు.

- మొత్తం 45 యూనిట్లలో చెల్లింపులను పర్యవేక్షించిన గుర్తుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారిగానీ మునిసిపల్ కమీషనర్‌గానీ వారి సిబ్బందికానీ ఎక్విటెన్స్‌ల మీద సంతకాలు చేయలేదు.

- మరో 60 యూనిట్లలో లబ్ధిదారుల వేలిముద్రలు మాత్రం తీసుకుని వారి పేర్లు రాయలేదు.

- ఇంకొక 26 యూనిట్లలో స్మార్ట్ కార్డులు పనిచేయకపోవటం, పరికరాలు వేలిముద్రలను గుర్తించకపోవటం వంటి కారణాల వలన చెల్లింపులను పాత పద్ధతిలోనే (మాన్యువల్‌గా) చేశారు.

- తపాలా కార్యాలయాలలో చెల్లింపులు చేస్తున్న నల్గొండ జిల్లాలోని 13 యూనిట్లలో ఎక్విటెన్స్‌లను మండల పరిషత్‌కు పంపటం లేదు.

- ఆడ/మగ వివరం 52 యూనిట్లలో తప్పుగా రాశారు.

- రంగారెడ్డిజిల్లా శంషాబాద్ మండలంలో 13 కేసులలో అసలు పింఛనుదారులకు కాకుండా వేరే వ్యక్తులకు చెల్లింపులు చేసి ఎక్విటెన్సుల మీద ఇతరుల సంతకాలు తీసుకున్నారు.

- జీహెచ్ఎమ్‌సీలోని[20] మల్కాజిగిరి సర్కిల్‌లో పింఛనుదారుల కోసం బ్యాంకు ఖాతాలు ఆరంభించి నెలనెలా పింఛను ఈ ఖాతాలలోనే వేస్తున్నారు. కాబట్టి, ఈ సర్కిల్‌లో ఎక్విటెన్సులు ఉండవు. మల్కాజిగిరి మునిసిపల్ కార్యాలయంలో బ్యాంకు స్క్రోల్స్ (నివేదికలు) పరిశీలించగా ఇక్కడ పింఛన్లు బ్యాంకు ఖాతాలకు జమ చేయటంలో 82 నుంచి 87 రోజుల తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది.

- మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో ఒకే చిరునామా, ఒకే ఖాతా నెంబరుతో ఇద్దరు, ముగ్గురు లబ్ధిదారులకు పింఛన్లు చెల్లిస్తున్నారు. మొత్తం 1,567 మందిలో ఇటువంటివి 78 కేసులు ఉన్నాయి. అసలైన లబ్ధిదారుల పేర్లు సర్కిల్ కార్యాలయంలోని డేటాలో కనిపించలేదు. అలాగే, 225 కేసులలో ఒకే ఇంట్లో ఉంటున్న పలువురికి పింఛన్లు చెల్లిస్తున్నారు.

- శంషాబాద్ మండలంలో చెల్లింపులు నిర్ణీత తేదీలలో (ప్రతినెలా 1 నుంచి 5 వరకు) జరగటం లేదు. ఆవిధంగా, 2012 మార్చి, ఏప్రిల్, మే నెలల పింఛన్లు నాలుగు రోజులు ఆలస్యంగా చేశారు. ఇంకా 2011 అక్టోబరు, 2012 జనవరి పింఛన్లు 30 రోజులు ఆలస్యంగా చేశారు.

మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమీషనర్లు ఎక్విటెన్సులను క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నారని ప్రభుత్వం తెలిపింది (2013 ఆగస్టు). నమూనా తనిఖీ చేపట్టిన యూనిట్లలో గమనించిన వాటిని బట్టి ఈ సమాధానం సరైనదికాదు. సింక్రనైజ్ చేసిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సామాజిక భద్రతా పింఛన్ల (ఎస్ఎస్‌పీ) సర్వర్‌తో పంచుకుంటున్నామని కూడా ప్రభుత్వం తెలిపింది. ఐతే, ఈ విధానాలు అమలు జరిగేలా చూసేందుకు తగిన వ్యవస్థ సెర్ప్ సమకూర్చుకొనవలసి ఉంటుంది. ఈ విషయం పరిశీలించి, సమాచారాన్ని (డేటాను) సకాలంలో వాస్తవంగా సరిచూసుకొనే అవకాశాలను అన్వేషించగలమని సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం తెలిపింది.

### *2.5.3.6 లబ్ధిదారుల సర్వే*

నమూనా పరిశీలనకు ఎంపికచేసిన యూనిట్లలో 6,572 మంది లబ్ధిదారులతో ఆడిట్ అధికారులు మాట్లాడినప్పుడు ఈ కింది విషయాలు తెలిశాయి :

⇒ లబ్ధిదారులలో 32 శాతం మంది వయసు రేషన్ కార్డులో సూచించిన దానికి ఎక్విటెన్సులు/డేటాబేస్‌లో పేర్కొన్న దానికీ పొంతన లేదు.

[20] హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

⟹ చెల్లింపు విధానం పట్ల 20 శాతం లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

⟹ లబ్ధిదారులలో 19 శాతం మంది పలుమార్లు ప్రయత్నించిన మీదట తమకు పింఛను మంజూరైనట్లు తెలిపారు.

⟹ పింఛను చెల్లింపులలో జాప్యం జరుగుతున్నదని 16 శాతం పింఛనుదారులు పేర్కొన్నారు.

## 2.6 ఆర్థిక నిర్వహణ

### 2.6.1 ఎలక్ట్రానిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (ఈ-ఎఫ్ఎమ్ఎస్), వినియోగ ధృవపత్రాలు

ఎలక్ట్రానిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఈ-ఎఫ్ఎమ్ఎస్) అనే కొత్త విధానం ప్రవేశపెట్టి 2012 జనవరి నుంచి పింఛను చెల్లింపులలో పలు మార్పులు తీసుకు వచ్చారు. దీని ప్రకారం, గుర్తించిన బ్యాంకులలో సెర్ప్ సంస్థకు చెందిన స్టేట్ నోడల్ అకౌంట్ (ఎస్ఎన్ఏ) నుంచి నిధులను, ఎంపికచేసిన నిర్వాహక సంస్థలకు నేరుగా విడుదల చేస్తారు. ఖర్చుకాని మొత్తాలను బ్యాంకులకు తిప్పి పంపితే, తదుపరి నెల పింఛను విడుదల చేస్తూ సెర్ప్ వాటిని సర్దుబాటు చేస్తుంది. బ్యాంకులు కూడా తమకు రావలసిన కమీషను మొత్తాన్ని రాబట్టుకోవటం కోసం సెర్ప్‌కు వినియోగ ధృవపత్రాలు పంపించాలి. ఇందుకు సంబంధించి ఆడిట్ గమనించిన విషయాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

పింఛను చెల్లింపు అధికారులకు (ఎమ్ఎమ్ఎస్‌లు/మండలాభివృద్ధి అధికారులు/మండల కోఆర్డినేటర్లు) విడుదల చేసిన మొత్తాలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు తమ ఆర్థిక నివేదికలలో "సెక్టోరల్ అధికారులకు ఇచ్చిన అడ్వాన్సులు"గా చూపుతాయి. వినియోగ ధృవపత్రాలు, చెల్లింపుకాని మొత్తాల రిఫండ్లు అందిన మీదట ఈ అడ్వాన్సులను సర్దుబాటు చేస్తారు.

నమూనా పరిశీలన చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలకు 2012 మార్చి నాటికి (తదుపరి సంవత్సరానికి పద్దులు ఖరారు అవలేదు) సుమారు ₹751 కోట్ల మొత్తానికి[21] వినియోగ ధృవపత్రాలు అందవలసి ఉన్నది. చిత్తూరు జిల్లా విషయంలోనైతే, చిత్తూరు, తిరుపతి, మదనపల్లి ఆర్‌డీఓలకు 2006-07 కంటే ముందు ఇచ్చిన ₹4.66 కోట్లకు వినియోగ ధృవపత్రాలు ఇంకా రాలేదు. అంతేకాకుండా, చిత్తూరు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వార్షిక పద్దులు అమలు సంస్థలకు ప్రతిగా ₹1.25 కోట్ల ఋణాత్మక నిల్వలను చూపుతున్నాయి. నిధుల వినియోగం, మిగులు నిధుల వాపసు విషయంలో ఇది సందేహాలకు తావిస్తున్నది.

అంతేకాకుండా, 2006 మార్చి నెలలో ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారం, సెర్ప్ సంస్థ పింఛను పథకాల కోసం చేసిన చెల్లింపులకు సంబంధించి ప్రతి త్రైమాసికంలోనూ వినియోగ ధృవపత్రాలనూ, సమీక్షాకాలంలో మూల్య నిర్ధారణ (ఎవాల్యుయేషన్) అధ్యయనంపై వార్షిక సమగ్ర నివేదికనూ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాల్సి ఉన్నది. పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ రికార్డులు పరిశీలించగా సెర్ప్ నుంచి ఇటువంటి నివేదికలు అందిన ఆనవాళ్లు లేవు.

కేంద్ర ప్రభుత్వానికి పంపిన వినియోగ ధృవపత్రాలు జీఎఫ్ఆర్ - 19ఏ ప్రకారం లేవు. నిధులను నిర్దేశిత లక్ష్యాల మేరకే ఖర్చు చేశారని నమ్మకం కలిగించే విధంగా ఆ నిధులను అందుకున్న సంస్థ (ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం) చేపట్టిన పరిశీలనలను బహిర్గతం చేస్తాయి కనుక ఈ పత్రాలు ఎంతో కీలకమైనవి.

సెర్ప్ నియమించిన ఛార్టర్డ్ అకౌంటెంట్లు ఈ జిల్లాలలో ఇంకా ఆడిట్ చేయవలసి ఉన్నదని చెబుతూ వినియోగ ధృవపత్రాలను కేంద్రం సూచించిన నమూనాలోనే సమర్పిస్తున్నామని ప్రభుత్వం బదులిచ్చింది (2013 ఆగస్టు). ఐతే, ఈ ధృవపత్రం కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన సాధారణ ఆర్థిక నియమావళిలోని 19-ఏ నమూనాలో లేదని

[21] అనంతపురం : ₹7.24 కోట్లు; చిత్తూరు : ₹137.38 కోట్లు; మహబూబ్‌నగర్ : ₹192.54 కోట్లు; నల్గొండ : ₹3.05 కోట్లు; రంగారెడ్డి : ₹3.14 కోట్లు; ఎస్‌పీఎస్ నెల్లూరు : ₹7.76 కోట్లు; : శ్రీకాకుళం : ₹73.80 కోట్లు; విశాఖపట్నం : ₹325.90 కోట్లు

ఆడిట్ పరిశీలనలో తేలింది. ఈ విషయం మరోమారు పరిశీలించగలమని ప్రభుత్వం సమీక్షానంతర సమావేశంలో హామీ ఇచ్చింది.

### 2.6.2 పలు బ్యాంకు ఖాతాల నిర్వహణ

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలకు నిధుల పంపిణీ, వినియోగాలను గాడినపెట్టే ఉద్దేశంతో, ఈ-ఎఫ్ఎమ్ఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌ను (ఎస్‌బీహెచ్) నోడల్ బ్యాంకుగా నియమించింది. ఇందుకు సంబంధించి ఆడిట్ ఈ కింది విషయాలను గమనించింది.

- ఎస్‌బీహెచ్ వారి ఆదర్శనగర్ శాఖ 2011 నవంబరులో ఒక సేవింగ్స్ ఖాతాను సెర్ప్ సంస్థ సీఈఓ పేరున తెరిచింది. ఈ సంస్థ రాష్ట్రంలోని అన్ని పీడీఏలకు నిధులను విడుదల చేసేందుకు ఎస్ఎన్ఏగా - వ్యవహరిస్తున్నది. పద్దులవారీగా (హెడ్‌వైజ్) ఖాతాలను తెరవాలన్న ప్రభుత్వ ఉత్తర్వులను ఇక్కడ పాటించలేదు. అందువలన, విడుదలైన నిధులు, వాటినుంచి చేసిన వ్యయం వివరాలు క్యాటగిరీలవారీగా లెక్కతేలటం లేదు.

- సెర్ప్ సంస్థ కూడా 2012 ఫిబ్రవరిలో మరొక సేవింగ్స్ ఖాతాను ఎస్‌బీహెచ్, ఆదర్శనగర్ శాఖలో ఆరంభించి, ఆయా యూనిట్‌లు వినియోగించుకోగా మిగిలిన మొత్తాలను ఇందులో జమ చేస్తున్నది. ఈ ఖాతాలో 2013 మార్చి చివరి నాటికి ₹153.29 కోట్ల నిల్వ ఉన్నది. ఈ విధంగా చెల్లింపుకాక మిగిలిన నిధుల వినియోగం గురించి ఆడిట్‌కు బదులిస్తూ ఈ నిధుల వినియోగం విషయంలో నిర్దిష్ట యోచన ఏదీ లేదనీ, కేటాయించిన పింఛన్లను మించి మంజూరైన వాటి చెల్లింపుల కోసం ఈ నిధులను ఖర్చు చేస్తామనీ సెర్ప్ తెలిపింది (2013 మార్చి).

- ఖర్చుకాక మిగిలిన మొత్తాలను ఎస్ఎన్ఏ ఖాతాకు బదిలీ చేయాల్సి ఉండగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు, మండలాభివృద్ధి అధికారులు (33 యూనిట్లు) ఇంకా పలు బ్యాంకు ఖాతాలను కొనసాగిస్తూ, మిగులు నిధులను తమ దగ్గర అట్టిపెట్టుకొంటున్నాయి. నమూనా తనిఖీ చేసిన యూనిట్లలో మొత్తం ₹2.18 కోట్లు (61 యూనిట్లు) మండలాభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమీషనర్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకుగానీ సెర్ప్‌కుగానీ జమ చేయలేదు. అంతేకాకుండా, నమూనా తనిఖీ చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు కూడా 2012 మార్చి నాటికి మొత్తం ₹14.53 కోట్ల[22] మిగులు నిధులను సెర్ప్‌కు తిప్పి పంపలేదు. (తదుపరి కాలానికి పద్దులు ఇంకా ఖరారు కాలేదు). సామాజిక భద్రతా పింఛనుల ఆర్థిక వ్యవహారాలనుంచి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలను 2012 జనవరిలోనే తప్పించారు.

బహుళ ఖాతాలను రద్దు చేసి, ఒక్కటే ఖాతా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం తెలిపింది (2013 ఆగస్టు).

### 2.6.3 ఎన్ఓఏపీఎస్ కింద కేంద్రం ఇచ్చిన నిధుల వినియోగం

కేంద్ర ప్రభుత్వం జాతీయ వృద్ధాప్య పింఛను పథకం (ఎన్ఓఏపీఎస్) కింద అర్హతకు వయోపరిమితిని 65 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు తగ్గించింది. దీనిని 2011 ఏప్రిల్ నుంచి వర్తింప చేసింది. ఈ మేరకు 60-64 సంవత్సరాల మధ్య వయసుగల లబ్ధిదారులను గుర్తించమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, 80 సంవత్సరాలు పైబడిన లబ్ధిదారుల పింఛను మొత్తాన్ని ₹500 కు పెంచింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం పథకాన్ని సామాజిక భద్రతా పింఛనుల పరిధిలోకి తెచ్చి 60-64 సంవత్సరాల

[22] అనంతపురం : ₹0.90 కోటి; చిత్తూరు : ₹1.83 కోట్లు; మహబూబ్‌నగర్ : ₹3.20 కోట్లు; నల్గొండ : ₹2.76 కోట్లు; రంగారెడ్డి : ₹2.49 కోట్లు; ఎస్‌పీఎస్ నెల్లూరు : ₹0.04 కోటి; శ్రీకాకుళం : ₹1.66 కోట్లు; విశాఖపట్నం : ₹1.65 కోట్లు

వయసు కలిగి, ఇప్పటికే అభయ హస్తం పథకంలో పింఛను పొందుతున్న మహిళా లబ్ధిదారులను (4,14,692) మాత్రం గుర్తించింది. ఈ వ్యక్తులకు జాతీయ వృద్ధాప్య పింఛన్లను మంజూరుచేసి (2011 సెప్టెంబరు[23]), రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం పథకంలో 2011 సెప్టెంబరు నుంచి 2013 ఫిబ్రవరి మధ్యన తన ఆర్థిక భారాన్ని ₹149.29 కోట్ల మేరకు (నెలకు సుమారు ₹8.30 కోట్లు) తగ్గించుకున్నది.

ఆవిధంగా, 60-64 సంవత్సరాల వయోపరిమితిలో అర్హత కలిగిన స్త్రీ, పురుషులందరికీ పింఛన్లు ఇవ్వవలసిన రాష్ట్ర ప్రభుత్వం, అభయ హస్తం పింఛన్ల కోసం కేంద్ర నిధులను వెచ్చించింది. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం 80 సంవత్సరాలు దాటిన పింఛనుదారులకు సవరించిన రేటున (నెలకు ₹500) చెల్లింపు చేయటం లేదు.

కేంద్ర ప్రభుత్వ నిధులను ఖర్చు చేస్తున్న విషయాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనరు ధృవీకరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం మీద టాపప్ ఆవశ్యకతను తగువిధంగా తగ్గించుకుంటున్నట్లు తెలిపారు (2013 జనవరి). అర్హులైనవారందరికీ పింఛన్లు ఇస్తుండటం వలన బడ్జెట్ కేటాయింపులు పెరిగిపోవటంతో సవరించిన రేటున పింఛన్లు చెల్లించటంలేదని సెర్ప్ అంగీకరించింది (2013 మార్చి). అర్హత కలిగిన వారందరికీ పింఛను ఇవ్వాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి చేసిన నిర్ణయమే కనుక తన ప్రాధాన్యతలకు తగిన నిధులు కేటాయించాలి తప్ప నిర్దిష్ట ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను మళ్ళించకూడదు.

## 2.7 అంతర్గత నియంత్రణలు

ఇంతకు ముందు పేరాలలో వివరించిన విధంగా లబ్ధిదారుల ఎంపిక, దరఖాస్తుల పరిశీలన, పింఛన్ల మంజూరు, చెల్లింపు వంటి విషయాలలో అంతర్గత నియంత్రణలు బలహీనంగా ఉండి, అది ఈ వ్యవస్థలో చేతివాటానికి అవకాశమిస్తూ సమాజంలోని పీడిత వర్గాలకు పింఛను ప్రయోజనాలను దూరం చేసే స్థితి కల్పిస్తున్నది.

అంతర్గత నియంత్రణలు అసమగ్రంగా ఉన్న కొన్ని కీలకాంశాలు ఈ దిగువ వివరించడమైంది.

| లబ్ధిదారుల గుర్తింపు | పింఛను మంజూరు | పింఛను చెల్లింపు |
|---|---|---|
| • పింఛను కోసం చేసే దరఖాస్తులు ఏకరీతిన లేకపోవటం<br>• దరఖాస్తుదారుల అర్హతను పంచాయతీ కార్యదర్శి సమగ్రంగా పరిశీలించక పోవటం | • పింఛను మంజూరైన విషయం లబ్ధిదారునికి తెలియచేయక పోవటం వలన ఇది పింఛను మొత్తం దుర్వినియోగానికి ఆస్కారమివ్వటం | • మండల కోఆర్డినేటర్లు జిల్లా కేంద్రం నుంచి నగదు డ్రా చేసి మండల కేంద్రాలకు తరలించటం |
| • మండలాభివృద్ధి అధికారి స్థాయిలో పరిశీలన కొరవడి, వయసుకు సంబంధించి అవాస్తవిక సమాచారం నమోదు చేయటం<br>• దరఖాస్తులలో వెలిబుచ్చిన సమాచారాన్ని పౌర సరఫరాల శాఖ డేటాబేస్‌లో లభించే బీపీఎల్ కుటుంబాల వివరాలతో సరిచూసుకోకపోవటం | • దరఖాస్తుదారుని సరైన వివరాలు పంపనందుకు మండలాభివృద్ధి అధికారిని బాధ్యులను చేసే యంత్రాంగం లేకపోవటం<br>• దరఖాస్తులతోపాటు అవసరమైన పత్రాలన్నీ జతచేసినట్లు నిర్ధారించుకునే యంత్రాంగం లేకపోవటం | • పాయింట్ ఆఫ్ సేల్ పరికరాలు పనిచేయకపోవటం, వేలిముద్రలు సరిపోలకపోవటం, స్మార్ట్ కార్డులు పోగొట్టుకోవటం వంటి కారణాలను చూపి సీఎస్‌పీ చెల్లింపులను మాన్యువల్‌గా చేయటం<br>• చెల్లింపుకాని నిధుల విషయంలో మండలాభివృద్ధి అధికారుల మధ్య అంతర్గత సమన్వయం లేకపోవటం |

[23] పంచాయతీ రాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ జీఓఎమ్ఎస్ నెం. 314, తేదీ 2011 సెప్టెంబరు 7

### 2.7.1 ప్రభుత్వ ఆదేశాలు పాటించకపోవటం

అందరు మండలాభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమీషనర్లు (యూనిట్ అధికారులందరూ) సంతకాలతో కూడిన ఎక్విటెన్సులను అన్ని గ్రామాలనుంచీ ప్రతి నెలా 10 వ తేదీలోగా తెప్పించుకుని మొత్తం చెల్లింపు సమాచారాన్ని ఇందు కోసం రూపొందించిన సిస్టంలో 15వ తేదీ లోపున ఎలక్ట్రానికల్‌గా పొందుపరచాలని ప్రభుత్వం ఆదేశించింది[24] (2011 డిసెంబరు). అంతేకాకుండా, యూనిట్ అధికారులు సామాజిక భద్రతా పింఛన్ల పద్దులను తరచుగా సమన్వయం చేసుకోవాలనీ, నెలకొకసారి అంతర్గతంగా లెక్కల తనిఖీ చేపట్టాలని కూడా ప్రభుత్వం సూచించింది.

నమూనా తనిఖీ చేసిన యూనిట్లలో ఈ కింది విషయాలు తెలిశాయి :

- కస్టమర్ సర్వీస్ ప్రొవైడర్ల (సీఎస్‌పీ) నుంచి రావలసిన ఎక్విటెన్సులను గమనించటం కోసం యూనిట్ అధికారులు తగిన రిజిస్టర్లు నిర్వహించటం లేదు.
- పింఛనుదారులు తాత్కాలికంగా వలసవెళ్లటం, మరణించటం, అభయ హస్తం పథకంలోకి మారిపోవటంవంటి పరిణామాలను గుర్తించే దిశగా యూనిట్ అధికారులు ఎక్విటెన్సులను పరిశీలించటం లేదు. ఈ విషయంలో బ్యాంకులు నియమించిన మండల కోఆర్డినేటర్లు ఇచ్చే సమాచారం మీదనే వారు ఆధార పడుతున్నారు.
- చెల్లింపుల ఆబ్‌స్ట్రాక్ట్‌లను, క్యాటగిరీలవారీగా చెల్లింపుకాని మిగులు మొత్తాల వివరాలనూ సీఎస్‌పీలు రూపొందించటం లేదు. ఫలితంగా మండల కోఆర్డినేటర్లు యూనిట్ అధికారులకు ఖాళీ ఆబ్‌స్ట్రాక్ట్‌లనే అందచేస్తున్నారు. ఈ సమాచారం లేకపోవటం వలన, చెల్లింపు మొత్తాలలోని వాస్తవికతను పరిశీలించే అవకాశం మండలాభివృద్ధి అధికారులకు ఉండటం లేదు.

బ్యాంకులు ఎక్విటెన్సులను అందచేయటంలో ఆలస్యం జరుగుతున్నందున ఈ విధమైన పరిశీలన చేసేందుకు మండలాభివృద్ధి అధికారులకు సమయం సరిపోవటం లేదని సెర్ప్ అంగీకరించింది (2013 మార్చి).

లబ్ధిదారులను గుర్తించటం, పింఛన్లు మంజూరు చేయటం, చెల్లింపులు చేయటం వంటి కార్యకలాపాలలోనే కాక, ఆర్థికపరమైన లావాదేవీలు, రాబడులను లెక్క చెప్పటం, మిగలిన సొమ్ము వివరాలను సరిచూసుకోవటం వంటి విషయాలలో కూడా పేరా 2.6 లో వివరించిన విధంగా పలు నియంత్రణ లోపాలు చోటు చేసుకున్నాయి.

## 2.8 పర్యవేక్షణ

ఏదైనా సంక్షేమ కార్యక్రమం విజయవంతమయ్యేలా చూడటంలో పర్యవేక్షణ కీలకమవుతుంది. విశేషించి, ప్రైవేటు సంస్థలు, బ్యాంకులు, ఇతర భాగస్వాములు పాలుపంచుకునే సందర్భాలలో ఇది మరింత ప్రాధాన్యత సంతరించుకుంటున్నది. ఈ పథకాల అమలుపై పర్యవేక్షణకు సంబంధించి, ఆడిట్ గమనించినవి ఈ విధంగా ఉన్నాయి.

### 2.8.1 రాష్ట్ర స్థాయి నిఘా మరియు పర్యవేక్షణ సమితి

రాష్ట్ర స్థాయి నిఘా, పర్యవేక్షణ సమితిని 1995 అక్టోబరులో ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో అమలవుతున్న గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలన్నింటినీ ఇది సమీక్షించవలసి ఉంటుంది. వివిధ పథకాల అమలుతీరును అవగతం చేసుకుని, వివిధ స్థాయిలలో వాటికి నిధుల కేటాయింపు, నిధుల విడుదల, మిగులు నిధుల వినియోగం వంటివి పరిశీలించటం కోసం ఈ సమితి ప్రతి త్రైమాసికంలోనూ (మూడు నెలలకొకసారి) సమావేశమవ్వాలి. ప్రస్తుతం ఉన్న సమితి 2010 జనవరిలో ఏర్పడింది. ఇది 2010 ఏప్రిల్ నుంచి 2012 సెప్టెంబరు మధ్యకాలంలో (ఆడిట్ నిర్వహించిన తేదీ నాటికి) పది సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా, కేవలం

---

[24] పంచాయతీ రాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ జీఓఎమ్ఎస్ నెం. 380, తేదీ 2011 డిసెంబరు 1

రెండుసార్లు[25] మాత్రమే సమావేశమయిందని సెర్ప్ రికార్డుల పరిశీలనలో తెలిసింది. జాతీయ సాంఘిక సహాయ కార్యక్రమం కింద ఎనభై ఏళ్ళు దాటిన వారికి సవరించిన రేటున పింఛను చెల్లింపు, ఇంకా గ్రామీణాభివృద్ధికి మరికొన్ని కేంద్ర సౌజన్య పథకాలకు సంబంధించిన విషయాలనే ఈ సమావేశాలలో ప్రధానంగా చర్చించారు.

### 2.8.2 సామాజిక భద్రతా పింఛను పథకాల ఆడిట్

నమూనా తనిఖీ చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలలో ఛార్టర్డ్ అకౌంటెంట్లు ప్రతి ఏటా చేయవలసిన ఆడిట్ 2011-12 వరకు పూర్తయింది. ఐతే, సామాజిక భద్రతా పింఛను పథకాలను మూడు నెలలకొకసారి (త్రైమాసిక) ఆడిట్ చేయాలని ప్రభుత్వం 2009 అక్టోబరులోనే ఆదేశించినాగానీ, రాష్ట్రంలో ఏ స్థాయిలోనూ ఇలా చేయటం లేదు. నమూనా తనిఖీ చేసిన జిల్లాలలో రికార్డులు పరిశీలించిన మీదట పద్దులను అసలు త్రైమాసిక ప్రాతిపదికన రూపొందించలేదనీ, ఈ విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులు కార్యరూపం దాల్చలేదనీ తెలిసింది. అదేవిధంగా, ప్రభుత్వం 2011 డిసెంబరులో స్పష్టంగా సూచించినప్పటికీ, మండలాభివృద్ధి అధికారులు అంతర్గత తనిఖీల కోసం 2013 మార్చి నాటికి ఏ విధమైన చర్య తీసుకొనలేదు. అంతేకాకుండా, పథకాల అమలును పరిశీలించి, విధివిధానాలు పాటించని సందర్భాలను గుర్తించేందుకు తగిన అంతర్గత ఆడిట్ విభాగం సెర్ప్ సంస్థలో లేదు.

ఆడిట్‌ను త్రైమాసిక ప్రాతిపదికన నిర్వహించటం లేదని అంగీకరిస్తూనే, వార్షిక ఆడిట్ కోసం ఎంపిక చేసిన ఛార్టర్డ్ అకౌంటెంట్ల జాబితాను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలకు అందచేశామని సెర్ప్ బదులిచ్చింది (2012 జూలై).

### 2.8.3 ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

ఫిర్యాదుల పరిష్కారానికని సెర్ప్ 2012 సెప్టెంబరులో నెలకొల్పిన ఆన్‌లైన్ వ్యవస్థ ఇంకా శైశవ దశలోనే ఉన్నది. మొత్తం 16,460 ఫిర్యాదులు అందగా, వీటిలో 2013 జనవరి నాటికి 10,178 ఫిర్యాదులను[26] పరిష్కరించి మిగతా 6,282 ఫిర్యాదులను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలకు తిప్పి పంపారు. మండలాభివృద్ధి అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు మాత్రమే ఈ ఆన్‌లైన్ వ్యవస్థను చూసే అవకాశం ఉన్నది. పింఛనుదారులు తమ ఫిర్యాదుల గురించి తెలుసుకునేందుకు లాగిన్ అయే అవకాశం లేకపోవడం గమనార్హం.

అంతేకాకుండా, నమూనా తనిఖీ చేపట్టిన యూనిట్లలో (నల్గొండ జిల్లాలో తపాలా శాఖ బ్యాంకుగా వ్యవహరిస్తున్న 16 యూనిట్లు మినహా) సీఎస్‌పీ, మండల కోఆర్డినేటర్ల పేర్లు, ఫోన్ నెంబర్లను గ్రామపంచాయతీ, మండల ప్రజాపరిషత్ కార్యాలయాలలో ప్రదర్శించటం లేదు. నమూనా తనిఖీ చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలలో సైతం ఈ విధమైన సమాచారం, బ్యాంకు పేరు, సర్వీసు ప్రొవైడర్ వివరాలు ప్రదర్శించటం లేదు.

గ్రామీణాభివృద్ధి కాల్ సెంటర్ (టోల్ ఫ్రీ నెంబర్ 1800 200 4455) ద్వారా ఫిర్యాదులను గ్రామ పంచాయతీ స్థాయిలోనే నమోదు చేయవచ్చునని ప్రభుత్వం బదులిచ్చింది (2013 ఆగస్టు). ఫిర్యాదులను, పింఛను కోసం వచ్చే కొత్త దరఖాస్తులనూ గ్రామ స్థాయి నుంచి స్వీకరించేందుకు సామాజిక హక్కు ప్రాతిపదికన ఒక మొబైల్ అప్లికేషన్ ప్రవేశపెట్ట తలచామని కూడా ప్రభుత్వం తెలిపింది.

## 2.9 సారాంశం

***రాష్ట్ర ప్రభుత్వం వివిధ పింఛను పథకాల కింద 2013 మార్చి నాటికి సుమారు 72 లక్షల మందికి ప్రయోజనం కల్పించినా, యూనిట్ కార్యాలయాలలో తగిన రిజిష్టర్లు నిర్వహించకపోవటంతో, ఇంతవరకు అందిన దరఖాస్తుల సంఖ్య, అందులో ఆమోదించినవీ, తిరస్కరించినవీ, తిరస్కరించటానికీ, మంజూరులో జాప్యానికీ గల కారణాలు, మొదలైన వాటి విషయంలో స్పష్టత లేదు.***

[25] 2010 అక్టోబరు 18న, తర్వాత 2012 ఆగస్టు 25న

[26] తాత్కాలికంగానో, శాశ్వతంగానో వలస పోయినవారికి రద్దు చేసిన పింఛన్ల పునరుద్ధరణ, ఒకచోట నుంచి మరొక చోటకు బదిలీ వంటివి

***స్మార్ట్ కార్డ్ ఆధారంగా పింఛను చెల్లింపుల విధానం చేపట్టి ఐదు సంవత్సరాలు దాటినా 2013 ఫిబ్రవరి నాటికి మొత్తం పింఛనుదారుల్లో 66 శాతం మందికే స్మార్ట్ కార్డులు అందడంతో చెల్లింపులలో పారదర్శకత సాధించే లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరలేదు.***

***మండలాభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమీషనర్లు ఎక్విటెన్సుల పరిశీలన సమగ్రంగా చేయటం లేదు. ఆబ్‌స్ట్రాక్ట్‌లు రూపొందించకపోవటం, చెల్లింపు తేదీలు సూచించకపోవటం, తాత్కాలిక/శాశ్వత వలసలు, పింఛనుదారుల మరణం, చెల్లింపులో జాప్యం, సీబీఎమ్ చెల్లింపులు మొదలైన వివరాలు రాయకపోవటం వంటి పలు లోపాలు చోటు చేసుకున్నాయి. బహుళ బ్యాంకు ఖాతాలను నిర్వహించటం, చెల్లింపుకాని నిధులను మండలాభివృద్ధి అధికారులు గ్రామీణాభివృద్ధి సంస్థలకూ, అటునుంచి సెర్ప్ సంస్థకూ జమ చేయకపోవటం, పథకాలను అమలుచేసే సంస్థలు వినియోగ ధృవపత్రాలను అందచేయకపోవటం వంటివి ఆర్థిక నిర్వహణ లోపాలను బహిర్గతం చేస్తున్నాయి. రికార్డుల నిర్వహణ పేలవంగానూ, అంతర్గత నియంత్రణలు బలహీనంగానూ ఉండి ఇవి నిర్వహణ వ్యవస్థలో లోపాలకూ, నష్ట భయానికీ అవకాశమిస్తున్నాయి. పింఛన్ల మంజూరు, చెల్లింపుల మీద పర్యవేక్షణ పటిష్టంగా లేదు. పింఛను పథకాలను అమలు చేయటంలో నియమాలను, విధానాలను అనుసరించే రీతిపై ధీమా కల్పించేందుకు సెర్ప్‌లో అంతర్గత ఆడిట్ విభాగం లేదు.***

పింఛనుదారుల డేటాబేస్‌ను ప్రక్షాళనచేసి, ఆధార్ కార్డు అనుసంధానంతో లబ్ధిదారులను సక్రమంగా గుర్తించే దిశగా పలు చర్యలు ఆరంభించినట్లు ప్రభుత్వం బదులిచ్చింది (2013 ఆగస్టు). పింఛను విధానంలో స్పష్టమైన విచ్ఛిన్నతలు ఉన్నాయని అంగీకరించిన ప్రభుత్వం ఈ వ్యవస్థను గాడిన పెట్టేందుకు చేపట్టిన చర్యలను పునరుద్ఘాటిస్తూ, ఆడిట్ ప్రస్తావించిన అన్ని విషయాలలోనూ దిద్దుబాటు చేపడతామని 2013 నవంబరులో నిర్వహించిన సమీక్షానంతర సమావేశంలో హామీ ఇచ్చింది.

## 2.10 సిఫార్సులు

- సామాజిక భద్రతా పింఛన్ల డేటాబేస్ ప్రక్షాళన ఒక నిర్ణీత కాలవ్యవధిలో పూర్తయ్యే విధంగా దానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి. అనర్హులైన పింఛనుదారులను జాబితానుంచి తొలగించాలి. అర్హతగల లబ్ధిదారుల సమాచారం ప్రభుత్వ స్థాయిలో సరిచూసుకునేందుకు తగిన యంత్రాంగాన్ని ఏర్పాటుచేయాలి.
- పింఛన్లను స్మార్ట్ కార్డుల ద్వారా చెల్లించాలన్న తన నిర్ణయాన్ని ప్రభుత్వం గట్టిగా అమలు చేయాలి; అందుకు అవసరమయ్యే సాధన సంపత్తిని సమకూర్చుకోవాలి.
- పథకాలవారీగా, క్యాటగిరీలవారీగా దరఖాస్తు రిజిస్టర్లను, ఇతర ముఖ్యమైన రిజిస్టర్లను యూనిట్ కార్యాలయాలు సక్రమంగా నిర్వహించేలా చూడాలి.
- వికలాంగుల పింఛన్లను వారి వైకల్యం తీవ్రతను అనుసరించి నిర్ణీత రేట్లలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

ఈ సిఫార్సులను సమీక్షానంతర సమావేశంలో చర్చించగా, ప్రభుత్వం వీటికి అంగీకరించింది. పథకం అమలు చేసే వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తగిన చర్యలు గైకొనగలమని కూడా ప్రభుత్వం హామీ ఇచ్చింది.

# అధ్యాయం-3

## ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అమలుపై ఆడిట్ సమీక్ష

### గృహ నిర్మాణ శాఖ

పేజీలు 35 - 54

## 3.1 పరిచయం

### 3.1.1 గృహ నిర్మాణ పథకాల అవలోకనం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని బలహీన వర్గాలకు గృహ వసతి కల్పించటంకోసం గత మూడు దశాబ్దాలుగా పలు పథకాలను చేపడుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం, ఇంకా కేంద్ర ప్రభుత్వం సౌజన్యంతో అమలు జరుగుతున్న ఆ పథకాల వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి :

| రాష్ట్ర పథకాలు | కేంద్ర పథకాలు |
|---|---|
| గ్రామీణ శాశ్వత గృహ నిర్మాణం | ఇందిరా ఆవాస్ యోజన |
| పట్టణ శాశ్వత గృహ నిర్మాణం | రాజీవ్ ఆవాస్ యోజన |
| వరద బాధితులకు గృహ నిర్మాణం | సమీకృత గృహ నిర్మాణం మరియు మురికివాడల అభివృద్ధి కార్యక్రమం |
| రాజీవ్ గృహకల్ప | బీడీ కార్మికులకు సమీకృత గృహ నిర్మాణ పథకం |
| రాజీవ్ స్వగృహ | వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన |

నిధులు సమకూరే విషయంలోనూ, ఆచరణ వ్యూహంలోనూ ఈ కార్యక్రమాల మధ్య పలు వ్యత్యాసాలున్నాయి. ప్రభుత్వం 2005లో రాష్ట్ర ప్రాయోజిత గృహ నిర్మాణ కార్యక్రమాలన్నింటినీ కలగలిపి 'గ్రామీణ ప్రాంతాలు, ఆదర్శ పురపాలక ప్రాంతాలలో సమీకృత ఆధునిక అభివృద్ధి' (ఇందిరమ్మ) గృహ నిర్మాణ పథకాన్ని సూత్రీకరించింది. (రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థికసాయంలేని రాజీవ్ గృహకల్ప, రాజీవ్ స్వగృహ కార్యక్రమాలను మాత్రం ఇందులో చేర్చలేదు). ఇందిరమ్మ పథకాన్ని 2006లో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలన్నిటికీ (బీపీఎల్) పరిపూర్ణంగా[1] మూడు సంవత్సరాలలో దశలవారీగా పక్కా ఇళ్ళు సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

*ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం విశిష్టతలు*

- ⇒ శాశ్వత గృహవసతి లేని బీపీఎల్ కుటుంబాలన్నీ ఈ పథకం కిందికి వస్తాయి
- ⇒ ఈ కుటుంబాలకు మరే ఇతర గృహ నిర్మాణ కార్యక్రమం కిందా ప్రయోజనం ఇచ్చి ఉండకూడదు
- ⇒ ఇంటి నిర్మాణం పనులను లబ్ధిదారులే స్వయంగానూ, పరస్పర సాయం ప్రాతిపదికనా చేపట్టాలి
- ⇒ సబ్సిడీ రూపేణా, ఋణాల రూపేణా ప్రభుత్వం ఆర్థిక సాయమందిస్తుంది
- ⇒ ఆర్థిక సాయంతో పాటు, ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ (ఏపీఎస్‌హెచ్‌సీఎల్) తగిన సాంకేతిక సాయం, రాయితీ ధరలపై సిమెంట్ మొదలైన నిర్మాణ సామగ్రిని కూడా అందచేస్తుంది

### 3.1.2 వ్యవస్థాగత నిర్మాణం

గృహ నిర్మాణ శాఖ ముఖ్యకార్యదర్శి ఇందిరమ్మ పథకం అమలుకు సమగ్ర పర్యవేక్షణాధికారి. బలహీనవర్గాల గృహ నిర్మాణ పథకం కమిషనర్ సమన్వయకర్తగానూ, ఇక ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఈ పథకం అమలుకు నోడల్ ఏజన్సీగానూ వ్యవహరిస్తారు.

[1] పరిపూర్ణంగా అంటే ఈ కార్యక్రమం కింది పథకాల పరిధిలోకి వచ్చే అన్ని ప్రాంతాలకు, అర్హులైన అందరు వ్యక్తులకూ ప్రయోజనాలు కల్పించటం

ఇందిరమ్మ పథకం అమలుకు సంబంధించిన వ్యవస్థాగత నిర్మాణం ఈ కింది విధంగా ఉంటుంది.




## 3.2 ఆడిట్ వ్యూహం

### 3.2.1 ఆడిట్ లక్ష్యాలు

ఈ దిగువ అంశాలను అంచనా వేయటం పనితీరు తనిఖీ లక్ష్యాలు :

- లక్షిత జనాభాకు పక్కా ఇళ్ళు సమకూర్చేందుకు పటిష్టమైన ప్రణాళికను గృహ నిర్మాణ శాఖ, ఏపీఎస్‌హెచ్‌సీఎల్ అనుసరించాయా;
- పథకాల అమలుకు అవసరమైన ఆర్థిక వనరులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించారా;
- ఒక్కో పథకం కింద లబ్ధిదారులను గుర్తించేందుకు అనువైన వ్యవస్థ ఉన్నదా, అది సమర్థవంతంగా పని చేస్తున్నదా;
- ఋణాల వసూలు కోసం ఏపీఎస్‌హెచ్‌సీఎల్ తగిన యంత్రాంగాన్ని ఏర్పరచుకుని, కార్యసాధకంగా పని చేస్తున్నదా;
- గృహ నిర్మాణ శాఖలో అంతర్గత నియంత్రణ యంత్రాంగం, పర్యవేక్షణ తగినంతగా ఉండి, అది కట్టుదిట్టంగా పని చేస్తున్నదా.

### 3.2.2 ఆడిట్ ప్రామాణికంగా తీసుకున్న అంశాలు

ఆడిట్ పరిశీలనలను ఈ కింది ప్రామాణికాంశాలతో సరిచూసుకోవటం జరిగింది :

- పథకం అమలుకోసం పలు విడతలుగా జారీ చేసిన మార్గదర్శకాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, సర్క్యులర్లు;
- ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలు;
- ఆంధ్రప్రదేశ్ ఆర్థిక నియమావళి;
- ఆయా పథకాలకు బడ్జెట్ కేటాయింపులు

## 3.2.3 ఆడిట్ పరిధి, ప్రక్రియ

ఇందిరమ్మ పథకం అమలుతీరు తనిఖీని 2012 నవంబరు నుంచి 2013 జూన్ వరకు నిర్వహించి ఇందులో 2008-09 నుండి 2012-13 సంవత్సరాల మధ్య చేపట్టిన గృహ నిర్మాణ పథకం అమలును పరిశీలించటం జరిగింది. గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, ఏపీఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌లతో 2012 నవంబరులో సమీక్షారంభ సమావేశం నిర్వహించి ఆడిట్ లక్ష్యాలు, పరిధి, ప్రామాణికాంశాలు, ప్రక్రియాపరమైన పలు విషయాలను విశదీకరించి, వారి సహకారం అపేక్షించటం జరిగింది.

ఆడిట్ ప్రక్రియలో భాగంగా ఈ పథకానికి సంబంధించి పలు రికార్డులు, దస్త్రాల పరిశీలన రాష్ట్ర సచివాలయంలోని గృహ నిర్మాణ శాఖ, కమీషనర్ కార్యాలయం, ఏపీఎస్‌హెచ్‌సీఎల్, ఇంకా ఖమ్మం, కృష్ణా, కర్నూలు, నల్గొండ, రంగారెడ్డి, విజయనగరం, వైఎస్ఆర్ కడప జిల్లాలకు చెందిన ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయాలలో నిర్వహించటం జరిగింది. అంతేకాకుండా నమూనా తనిఖీకి ఎంపిక చేసిన ప్రతి జిల్లా నుంచి కార్యనిర్వాహక ఇంజనీరు (ఈఈ) కార్యాలయం ఒకటి, అలాగే ఉప కార్యనిర్వాహక ఇంజనీరు (డీఈఈ) కార్యాలయాలు రెండు, సహాయక ఇంజనీరు (ఏఈ) కార్యాలయాలు రెండు చొప్పున ఎంచుకున్నాము. ఇంకా ఈ పథకానికి సంబంధించి ఏపీఎస్‌హెచ్‌సీఎల్ అందచేసిన (2013 మార్చి నాటికి) సమాచారాన్ని కూడా విశ్లేషించటం జరిగింది. ఆడిట్ పరిశీలనలను 2013 డిసెంబరులో నిర్వహించిన సమీక్షానంతర సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, ఏపీఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్, ఇంకా శాఖాధికారులతో చర్చించటం జరిగింది. ప్రభుత్వం ఇచ్చిన సమాధానాలను ఈ నివేదికలో తగిన విధంగా పొందుపరచటం జరిగింది.

### *3.2.3.1 నమూనా పరిమాణం*

తొలుత రంగారెడ్డి జిల్లాలో పూర్వాధ్యయనం చేపట్టి అక్కడ గమనించిన విషయాల విశ్లేషణ ఆధారంగా సవిస్తర తనిఖీ కోసం రాష్ట్రంలోని మూడు ప్రాంతాలైన కోస్తాంధ్ర[2], తెలంగాణ[3], రాయలసీమ[4]ల నుంచి రెండేసి జిల్లాల చొప్పున పక్క పటంలో చూపిన విధంగా ఎంపిక చేయటం జరిగింది. ఈ ఏడు జిల్లాలలోని ఈఈ, డీఈఈ, ఏఈ కార్యాలయాలను సాధారణ యాదృచ్ఛిక నమూనా విధానంలో ఎంపిక చేయటం జరిగింది. అంతే కాకుండా వీటిలో ప్రతి జిల్లా నుంచి రెండేసి మండలాలు, అలాగే ప్రతి మండలం నుంచి ఒక్కొక్క గ్రామాన్ని యాదృచ్ఛిక నమూనా పద్ధతిలో తీసుకుని పరిశీలన చేయటం జరిగింది. ఈ 14 గ్రామాలతో పాటు గిరిజన, వరద ప్రభావిత గ్రామాలు ఏడింటిని కూడా తనిఖీ కోసం ఎంపిక చేయటం జరిగింది. ప్రతి గ్రామంలోనూ 30 మంది లబ్ధిదారులతో ఆడిట్ అధికారులు ముచ్చటించారు. ఈ లబ్ధిదారులకు సంబంధించినవి ఒక్కొక్క గ్రామం నుంచి 30 ఇళ్ళను (వేరు వేరు నిర్మాణపు దశలలో ఉన్నవి) శాఖాధికారులతో కలసి ఉమ్మడి పరిశీలన చేపట్టడమైంది (ఆవిధంగా ఈ జిల్లాలన్నింటిలో మొత్తం 733 ఇళ్ళను సందర్శించడం జరిగింది).




ఆడిట్ కనుగొన్న ముఖ్యమైన విషయాలు తదుపరి పేరాలలో చర్చించటం జరిగింది.

[2] కృష్ణా, విజయనగరం జిల్లాలు
[3] ఖమ్మం, నల్గొండ జిల్లాలు
[4] కర్నూలు, వైఎస్ఆర్ కడప జిల్లాలు

## 3.3 ఆర్థిక మరియు వాస్తవిక నిర్వహణ

### 3.3.1 నిధుల కూర్పు

ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ, ఋణం రూపంలోనూ, లబ్ధిదారు పెట్టుబడి రూపంలోనూ నిధులు సమకూరుతాయి. యూనిట్ ఖరీదులోనూ, ప్రభుత్వం ఇచ్చే నిధుల పరిమాణంలోనూ ఈ సమీక్షా కాలంలో చోటు చేసుకున్న మార్పులు ఈ కింది విధంగా ఉన్నాయి.

**పట్టిక 3.1**

| జీఓ వివరాలు | | యూనిట్ ఖరీదు (₹) | సబ్సిడీ (₹) | ఋణం (₹) | లబ్ధిదారుని పెట్టుబడి (₹) |
|---|---|---|---|---|---|
| జీఓ 34, తేదీ 4.12.2007 | గ్రామీణ | 25000 | 7000 | 17500 | 500 |
| | పట్టణ | 40000 | 3000 | 35000 | 2000 |
| జీఓ 41, తేదీ 27.11.2008 | గ్రామీణ | 31200 | 13200 | 17500 | 500 |
| | పట్టణ | 43000 | 6000 | 35000 | 2000 |
| జీఓ 15, తేదీ 28.5.2011 | గ్రామీణ | 45000 | 13200 | 31300 | 500 |
| | పట్టణ | 55000 | 6000 | 47000 | 2000 |

*మూలం: యూనిట్ ఖరీదు విషయమై ప్రభుత్వం ఇచ్చిన పలు ఉత్తర్వులు*

### 3.3.2 బడ్జెట్ కేటాయింపు, ఖర్చు

ఇందిరమ్మ పథకం అమలు చేయటం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఋణాలు, సబ్సిడీల పరంగా తన సాధారణ వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. ఈ పథకానికి 2008-09 నుంచి 2012-13 సంవత్సరాల మధ్య చేసిన కేటాయింపులు, అయిన ఖర్చుల వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**పట్టిక 3.2**

**(₹ కోట్లలో)**

| సంవత్సరం | బడ్జెట్ కేటాయింపు | విడుదల చేసినది | ఖర్చు |
|---|---|---|---|
| **2008-09** | 5075.00 | 3511.28 | 3969.86 |
| **2009-10** | 956.25 | 612.05 | 1421.72 |
| **2010-11** | 1121.25 | 931.82 | 764.64 |
| **2011-12** | 1510.87 | 1082.44 | 1200.32 |
| **2012-13** | 1523.80 | 1296.08 | 1513.29 |
| మొత్తం | **10187.17** | **7433.67** | **8869.83** |

*మూలం: బడ్జెట్ కేటాయింపు, విడుదల వివరాలు ఆయా సంవత్సరాల వినిమయ పద్దులలోనివి; ఖర్చుల వివరాలు ఏపీఎస్‌హెచ్‌సీఎల్ నివేదించినవి*

ప్రభుత్వం 2008-13 మధ్య ఏ సంవత్సరంలోనూ బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో విడుదల చేయలేదని పై పట్టిక చూస్తే తెలుస్తోంది (ఈ ఐదు సంవత్సరాలలో కొరత ₹2,753.50 కోట్లు). ఈ కొరత 2012-13లో 15 శాతం ఉండగా 2009-10 సంవత్సరంలో ఏకంగా 36 శాతం ఉన్నది. దాదాపు అన్ని సంవత్సరాలలోనూ చివరి త్రైమాసికం నిధులు రాలేదని గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి సమీక్షానంతర సమావేశంలో తెలిపారు. 2008-09, 2009-10, 2011-12, 2012-13 సంవత్సరాలలో కేటాయింపును మించి ఖర్చు అయింది. గత సంవత్సరాల (2006-07, 2007-08[5]) మిగుళ్ళ నుంచి ఈ వ్యయం చేశారు. నిర్మాణంలోని పురోగతిని అనుసరించి యూనిట్ వ్యయాన్ని

[5] 2008 ఏప్రిల్ 1 నాటికి పీడీ ఖాతాలో మిగులు: ₹1,200 కోట్లు; బ్యాంకులలో: ₹487.42 కోట్లు

చెల్లిస్తున్నామనీ, అందువలన ఏపీఎస్‌హెచ్‌సీఎల్ దగ్గర కొంత మొత్తం పంపిణీ కాకుండా ఉండే అవకాశం ఉన్నదనీ ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. అయితే, 2008-09 నుంచి 2012-13 వరకు ప్రతి ఆర్థిక సంవత్సరం చివరన పీడీ ఖాతాలలో పెద్ద మొత్తాలు[6] వాస్తవంగా ఉన్నట్లు ఆడిట్ గమనించింది.

### 3.3.3 వాస్తవ ప్రగతి

ఇందిరమ్మ పథకంలో మంజూరైన ఇళ్ళు ఆ సంవత్సరంలోనే పూర్తి చేయాలి. ఈ పథకం కింద మంజూరైన ఇళ్ళు, వాటి నిర్మాణంలో పురోగతి ఈ కింది విధంగా ఉన్నది.

పట్టిక 3.3

| మంజూరు విడత | మంజూరు చేసిన సంవత్సరం | మంజూరైన ఇళ్ళ సంఖ్య | పూర్తైనవి | ఇంకా పూర్తి కావలసినవి |
|---|---|---|---|---|
| మొదటి దశ | 2006-07 | 19,24,480 | 16,26,572 | 2,97,908 |
| రెండవ దశ | 2007-08 | 20,14,740 | 14,54,535 | 5,60,205 |
| మూడవ దశ | 2008-09 | 15,59,523 | 8,34,319 | 7,25,204 |
| రచ్చబండ* | 2010-11 | 3,50,957 | 2,52,667 | 98,290 |
| రచ్చబండ-I | 2011-12 | 5,29,367 | 1,38,452 | 3,90,915 |
| రచ్చబండ-II | 2012-13 | 53,039 | 11,765 | 41,274 |
| మొత్తం | | **64,32,106** | **43,18,310** | **21,13,796** |

*మూలం: ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఇచ్చిన సమాచారం*

** ప్రజాసమస్యలను పరిష్కరించేందుకూ, పాలనను ప్రజల ముంగిలికే తీసుకువెళ్ళేందుకూ ఉద్దేశించిన ప్రభుత్వ పథకం*

మంజూరైన ఇళ్ళలో 2013 మార్చి నాటికి 33 శాతం ఇళ్ళ నిర్మాణం ఇంకా పూర్తి కావలసి ఉండటంతో పథకం ప్రారంభించిన ఆరు సంవత్సరాలకు కూడా అందరికీ గృహవసతి కల్పించాలన్న ప్రభుత్వలక్ష్యం నెరవేరలేదని పై పట్టిక చూస్తే తెలుస్తుంది.

రచ్చబండతోపాటు మొత్తం మీద 2008-13 మధ్యన మంజూరు చేసిన ఇళ్ళు, అందులో పూర్తి చేసిన వాటి వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

చార్టు 3.1




*మూలం: ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఇచ్చిన సమాచారం*

[6] 2008-09లో ₹785.68 కోట్లు, 2009-10లో ₹75.63 కోట్లు, 2010-11లో ₹297.05 కోట్లు, 2011-12లో ₹138.58 కోట్లు, 2012-13లో ₹12.94 కోట్లు

మంజూరు చేసిన 40.60 లక్షల ఇళ్ళకుగాను 2008-13 సంవత్సరాలలో 23.47 లక్షల ఇళ్ళు మాత్రమే పూర్తి చేయగా ఇంకా దాదాపు 42 శాతం ఇళ్ళు అసంపూర్తిగానే ఉన్నాయని పై వివరాలను బట్టి తెలుస్తోంది. ఇళ్ళ నిర్మాణం కోసం నిర్ణయించిన లక్ష్యం 2008-09 సంవత్సరంలో అధికంగా ఉన్నది. మొదటి రెండు దశలకు 2006-07, 2007-08 సంవత్సరాలలో ఆమోదించిన ఇళ్ళను కూడా ఇందులో చేర్చారు. అందువలన నిర్మాణంలో జోరు ఈ భారీ లక్ష్యాలను అందుకోలేదు (చార్టు 3.2 లో చూపిన విధంగా).

ఒక్కొక్క సంవత్సరం వివిధ దశలలో నిర్మాణ పురోగతి బహుస్వల్పంగా ఉన్నది. మూడవ విడత ఇళ్ళ నిర్మాణంలో ప్రగతి నామమాత్రంగా (ఒక శాతం కన్నా తక్కువగా) ఉన్నది. అన్ని దశలలోనూ కలిపి మొత్తం 64.32 లక్షల ఇళ్ళు మంజూరు చేయగా 2013 మార్చి నాటికి కేవలం 4.93 లక్షల ఇళ్ళను మాత్రం (7.66 శాతం) మంజూరైన సంవత్సరంలోనే పూర్తి చేశారు.



మూలం: ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఇచ్చిన సమాచారం

ఇళ్ళ నిర్మాణంలోని ఆలస్యానికి ప్రధాన కారణం పేరా 3.4.1లో వివరించిన విధంగా ప్రభుత్వం వీటి ఖరీదుని వాస్తవికంగా నిర్ధారించకపోవడమే.

మొదట నిర్ణయించిన యూనిట్ ధరకూ వాస్తవంగా అవుతున్న ఖర్చుకూ మధ్యన అంతరం ఎక్కువగా ఉండటం వలన ఈ లోటును భర్తీ చేసుకొనేందుకు అవసరమయ్యే వనరులను లబ్ధిదారులే సమకూర్చుకొనవలసి రావడంతో ఇది నిర్మాణంలో జాప్యానికి దారి తీస్తున్నదని ప్రభుత్వం అంగీకరించింది (2013 అక్టోబరు). దాదాపు 42 శాతం ఇళ్ళ నిర్మాణంలోని ఆలస్యానికి కారణం అదనపు వనరులు సమీకరించుకోవటంలో లబ్ధిదారుల సమర్థతతో ఇది ముడిపడి ఉండటమేననీ, నిర్మాణాలను పూర్తి చేసుకునేలా వారిని వత్తిడి చేసే అధికారం తమకు లేదనీ ఏపీఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సమీక్షానంతర సమావేశంలో పేర్కొన్నారు. నిర్మాణాలకు తగిన సదుపాయం కల్పించటమే తప్ప తమ సంస్థ మరేవీ సమకూర్చే విధంగా పని చేయటం లేదు కనుక నిర్మాణ నాణ్యతనూ, డిజైన్లను అనుసరించటాన్నీ, సమయపాలననూ తమ సంస్థ నిర్ధారించుకొనజాలదని కూడా చెప్పారు.

## 3.4 ప్రణాళిక

రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణ పథకాలను మూడు దశాబ్దాలకుపైగా అమలు చేస్తోంది కానీ లబ్ధిదారులను గుర్తించటం కోసం ఒక బహువిధ సర్వేను 2005లో ఇందిరమ్మ పథకం అమలుకు ముందు చేపట్టింది. ఈ విధంగా సేకరించిన సమాచారాన్ని ఆఫ్‌లైన్‌లోనే ఉంచింది.

తరవాత, 2008 మార్చి నెలలో, ఒక ఆన్‌లైన్ డేటాబేస్‌ను రూపొందించి నిర్వహించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్[7]కు అప్పగించింది. ఐతే సమాచారాన్ని ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్ విధానంలోకి బదిలీ చేసేందుకు తగిన ప్రణాళిక రూపొందించు కొనకపోవటం వలన ఇప్పుడున్న సమాచారం సమగ్రత, స్వచ్ఛతలపట్ల భరోసా లేదు. పర్యవసానంగా, ఈ డేటాబేస్‌లోని సమాచారం అసమగ్రం, లోపభూయిష్టమై పేరా 3.5.1లో వివరించినట్లు పలు సందర్భాలలో అధిక చెల్లింపులకు దారి తీసింది.

[7] ప్రభుత్వ శాఖలలో పరిశోధనలు, వృత్తిపరమైన సలహాలు, పరివర్తిత యాజమాన్య కార్యక్రమాల నిర్వహణకోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సుపరిపాలన కేంద్రం)ను రూపొందించారు

సమాచారాన్ని ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్ విధానంలోకి మార్పిడి చేయటంలో కొన్ని తప్పులు దొర్లాయని అంగీకరిస్తూ క్షేత్ర స్థాయి సిబ్బంది రూపొందించిన రికార్డులను పరిశీలించి ఆ తర్వాత దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు). ఐతే లబ్ధిదారుల అర్హతా ప్రమాణాలపరంగా ఆడిట్ లేవనెత్తిన విషయాలపై గైకొన్న చర్యల వివరాలను మాత్రం ప్రభుత్వం విశదీకరించలేదు.

### 3.4.1 అవాస్తవికంగా ఉన్న యూనిట్ ధర

ఇందిరమ్మ ఇళ్ళ యూనిట్ ధరను పలుమార్లు సవరించి తుదకు 2011-12లో ₹45,000 చేశారు. ఇందిరమ్మ పథకంలో, 225 చ.అ. విస్తీర్ణంగల ఇంటి నిర్మాణం చేపట్టేందుకు చ.అ.కు హీన పక్షం ₹400 ఖర్చవుతుందని 2011 జూలై నెలలో ఏపీఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ కూడా అంచనా వేశారు. ఆలెక్కన ఒక్కొక్క ఇంటికీ ₹90,000 అవుతుంది.

ఆ విధంగా, ప్రభుత్వం నిర్ణయించిన యూనిట్ ధర ఇళ్ళు పూర్తి చేయటానికి సరిపోవటం లేదు. ఈ అదనపు వ్యయానికి అవసరమయ్యే సొమ్ము సమకూర్చుకోవటం నిరుపేదలకు సాధ్యపడటం లేదు. ఫలితంగా పథకం చేపట్టి ఆరు సంవత్సరాలు గడిచినా 2012-13 నాటికీ మొత్తం 64.32 లక్షల ఇళ్ళకుగాను 12.87 లక్షల ఇళ్ళు (20 శాతం) ఆరంభం కాలేదు.

ఇళ్ళకు నిర్ణయించిన యూనిట్ ధరకూ, నిర్మాణానికి వాస్తవంగా అవుతున్న వ్యయానికీ మధ్య వ్యత్యాసం భారీగా ఉన్నట్టు ప్రభుత్వం కూడా అంగీకరించింది (2013 అక్టోబరు).

## 3.5 పథకం అమలు

### 3.5.1 లబ్ధిదారుల ఎంపిక

లబ్ధిదారుల ఎంపికకు అనుసరించవలసిన విధానం 2005 డిసెంబరు 6న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులో వివరించారు. ఈ ఆదేశాలననుసరించి గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి, మండల రెవెన్యూ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సహాయక ఇంజనీర్ (గృహ నిర్మాణం)లతో కూడిన బృందం గ్రామ స్థాయిలో సర్వే చేపట్టి సొంత ఇళ్ళులేని ప్రజల వివరాలు సేకరించింది. ఈ సమాచారాన్ని 2008 మార్చి నెలలో గృహ నిర్మాణ శాఖ వెబ్‌సైట్‌లోకి అప్‌లోడ్ చేశారు.

ఈ పథకం మార్గనిర్దేశకాల ప్రకారం గ్రామాలలో ₹20,000, పట్టణ ప్రాంతాలలో ₹28,000 లోపు ఆదాయంగల కుటుంబాలను అల్పాదాయ కుటుంబాలు (బీపీఎల్)గా పరిగణించాలి (ఈ ఆదాయ పరిమితిని 2008 జూలై నెలలో ₹60,000, ₹75,000గా సవరించారు). వీరందరికీ ఇందిరమ్మ కార్యక్రమంలో దశలవారీగా గృహ వసతి కల్పించాలి (మొదటి దశ : 2006-07, రెండవ దశ : 2007-08, మూడవ దశ : 2008-09). సాంఘిక సంక్షేమ పథకాలన్నింటిలోనూ లబ్ధిదారుల గుర్తింపుకు పౌర సరఫరాల శాఖ ఇచ్చిన రేషన్ కార్డు కీలకమైనది. ఐతే, ఇందిరమ్మ గృహ నిర్మాణ కార్యక్రమం మొదటి దశవరకూ లబ్ధిదారుల గుర్తింపు కోసం ఈ ప్రామాణికాన్ని పాటించలేదు. తర్వాత, 2007-08లో చేపట్టిన రెండవ దశ కార్యక్రమం నుంచి ఇళ్ళ మంజూరుకు తెల్ల రేషన్ కార్డుల నిబంధన పెట్టారు.

రేషన్ కార్డులకు అంకెలు, అక్షరాలు కలిసి 15 స్థానాలున్న విశిష్ట సంఖ్య (సాధారణ రేషన్ కార్డుల మాదిరిగా) లేకపోవటం వలన సిస్టంలో అనేక తప్పులు దొర్లాయి. ఈ కార్యక్రమం అన్ని దశలకు సంబంధించిన (మొదటి దశ నుంచి రచ్చబండ రెండవ దశవరకు) డేటాబేస్‌ను పౌర సరఫరాల శాఖ డేటాబేస్‌తో సరిపోల్చిచూడగా పలు అక్రమ మంజూరీలు, అక్రమ చెల్లింపులు ఆడిట్ దృష్టికి వచ్చాయి. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

- మొత్తం 6.64 లక్షల రేషన్ కార్డుల నెంబర్ల విషయంలో ఈ రెండు డేటాబేస్‌లకూ మధ్య పొంతనలేదు. ఈ రేషన్ కార్డులుగల లబ్ధిదారులకు చెల్లించిన మొత్తం 2013 మార్చి 31 నాటికి ₹1,611 కోట్లు.

- డేటాబేస్‌లో 64.32 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా 14.89 లక్షల మందికి సరైన కార్డు నెంబర్ల స్థానంలో జంక్ నెంబర్లను నమోదు చేశారు (ఉదా : WAP0, WAP01290, నెంబర్ లేకపోవడం వంటివి). వీరికి ఇళ్ళ నిర్మాణం కోసం 2013 మార్చి నాటికి మొత్తం ₹3,782 కోట్లు చెల్లించారు (నమూనా తనిఖీ చేపట్టిన ఏడు జిల్లాలలో 3.72 లక్షల మందికి ₹656.09 కోట్లు చెల్లించారు).
- ఇందిరమ్మ పథకం రెండవ దశ (ఈ దశనుంచే రేషన్ కార్డులను తప్పనిసరి చేశారు) నుంచి రేషన్ కార్డుల సమాచారం విశ్లేషించగా 3.5 లక్షల మంది లబ్ధిదారులకు సరైన రేషన్ కార్డు నెంబర్లు లేకుండానే (2007-08 నుంచి 2012-13 సంవత్సరాల మధ్య) ₹838.32 కోట్లు చెల్లించారు.
- లబ్ధిదారుల అర్హతను నిర్ణయించేందుకు వారి ఆదాయ పరిమితిని గ్రామాలలో ₹60,000, పట్టణాలలో ₹75,000 అని నిర్దేశించగా ₹75,000 పైన ఆదాయం వెల్లడించినవారు 5,384 మంది ఉన్నారు.

లబ్ధిదారులను నమోదు చేసే సమయంలో రేషన్ కార్డులను తప్పనిసరి చేయలేదని ప్రభుత్వం అంగీకరించింది (2013 అక్టోబరు). పలు అల్పాదాయ (బీపీఎల్) కుటుంబాలకు రేషన్ కార్డులు లేని నేపథ్యంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం మొదటి దశలో లబ్ధిదారుల గుర్తింపుకు రేషన్ కార్డులను తప్పనిసరి చేయవద్దని ప్రభుత్వం ఆదేశించినట్లు ఏపీఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సమీక్షానంతర సమావేశంలో (2013 డిసెంబరు) తెలిపారు. అందువలన, రెవెన్యూ అధికారులు ఇచ్చిన అర్హతా పత్రాల మీదనే ప్రభుత్వం ఆధారపడింది. ఐతే, లబ్ధిదారుల సమాచారం మళ్ళీ రూపొందించి తప్పులు సరిదిద్దేవిధంగా ప్రాజెక్టు డైరెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. గృహ నిర్మాణ సంబంధ డేటాబేస్ (సమాచారం)లో కొంత జంక్ డేటా ఉన్న విషయాన్ని ఏపీఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సమీక్షానంతర సమావేశంలో అంగీకరించారు. రేషన్ కార్డుల డేటాబేస్‌ను ఆధార్ కార్డుల సమాచారంతో అనుసంధానం చేసి అప్‌డేట్ చేసే ప్రక్రియ ఆరంభమైందనీ మరో మూడు, నాలుగు నెలల్లో ఇది పూర్తవుతుందనీ ఆయన తెలిపారు.

### 3.5.2 ప్రామాణిక నియంత్రణల లేమి

గృహ నిర్మాణ కార్యక్రమాలలో ప్రామాణిక నియంత్రణలు అల్పంగా ఉండటం వలన పలు అక్రమ మంజూరీలు, చెల్లింపులు జరిగాయి. ఈ డేటాబేస్‌ను ఆడిట్‌లో విశ్లేషించగా ఈ దిగువ విషయాలు తెలిశాయి.

- ఈ పథకం విధివిధానాల ప్రకారం ఒక కుటుంబానికి ఒక్క ఇంటిని మాత్రమే (మహిళా సభ్యురాలి పేరున) మంజూరు చేయాలి. అయితే, నమూనా తనిఖీ చేపట్టిన ఏడు జిల్లాల సమాచారం పరిశీలించగా 4,335 మంది లబ్ధిదారులకు రెండేసికన్నా ఎక్కువ ఇళ్ళు మంజూరు చేశారని తెలిసింది.

  చెల్లింపులు నిర్మాణంలోని పురోగతితో ముడిపడి ఉండటం, నిర్మాణాల ప్రస్తుత పరిస్థితి తెలియకపోవటం వలన ఈ లబ్ధిదారులకు ఇంకా విడుదల చేయవలసిన మొత్తాలను ఆడిట్ అంచనా వేయలేదు.

- పధ్నాలుగు మంది లబ్ధిదారులకు ఖమ్మం జిల్లా ఖానాపూర్ హవేలీలో రెండేసి ఇళ్ళు చొప్పున మంజూరు చేశారు (మూడవ దశలో). వీరందరి విషయంలో లబ్ధిదారుని పేరు లేదా తండ్రి/భర్త పేరును స్వల్ప మార్పులతో నమోదు చేశారు. ప్రభుత్వం ఈ లోపాలను ధృవీకరించి, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది.
- నమూనా తనిఖీకి ఎంచుకున్న గ్రామాలలోని ఇళ్ళను స్వయంగా పరిశీలించినప్పుడు మొత్తం ఐదు[8] సందర్భాలలో ఒకే లబ్ధిదారు/కుటుంబానికి రెండేసి ఇళ్ళు మంజూరైనట్లు ఆడిట్ గమనించింది.

[8] నల్గొండ జిల్లా కేశవపూర్‌లో 1, కర్నూలు జిల్లా లక్ష్మీనగరంలో 1, వెల్దుర్తిలో 1, లద్దగిరిలో 1, కృష్ణా జిల్లా ఎలిచెట్లదిబ్బలో 1

- నమూనా తనిఖీ చేపట్టిన జిల్లాలలో కొన్ని ఇళ్ళను ప్రత్యక్షంగా పరిశీలించగా కృష్ణా జిల్లా, నాగాయలంక మండలం, ఎలిచెట్లదిబ్బ గ్రామంలో పరిశీలించిన 31 ఇళ్ళలో మూడు ఇళ్ళను రెండు యూనిట్ల బదులు ఒకే యూనిట్‌గా నిర్మించినట్లు తెలిసింది. నూజివీడు (పట్టణ) మండలం ఎమ్.ఆర్.అప్పారావు కాలనీలో కూడా ఒకఇంటిని ఈ విధంగానే నిర్మించారు.

ఆడిట్ ప్రస్తావించిన విషయాలను పరిశీలించి సరిదిద్దగలమని ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు).

### 3.5.3 దరఖాస్తులలో అసమగ్ర సమాచారం

ఇళ్ళ మంజూరుకోసం చేసే దరఖాస్తుతో పాటుగా రేషన్ కార్డు, పట్టా/స్వాధీన పత్రం నకళ్ళు, కచ్చా ఇంటిలో నివసిస్తున్నట్లు ధృవపత్రం, ఇంకా కుటుంబం ఛాయాచిత్రం కూడా జత చేయవలసి ఉంటుంది. నమూనా తనిఖీ చేసిన జిల్లాలలో 4,457 దరఖాస్తులను ఆడిట్‌లో పరిశీలించగా ఈ దిగువ విషయాలు వెలుగులోకొచ్చాయి.

- పలు దరఖాస్తులలో రేషన్ కార్డు కాపీలు, లబ్ధిదారుల సంతకాలు, ఛాయా చిత్రాలు లేవు. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి:

**పట్టిక 3.4**

| జిల్లా | పరిశీలించిన దరఖాస్తులు | రేషన్ కార్డు లేనివి | లబ్ధిదారు ఫోటో లేనివి | పాత ఇంటి ఫోటో లేనివి | స్థలం వివరాలు లేనివి | స్వాధీన పత్రంపై ఎమ్ఆర్‌ఓ సంతకం లేనివి |
|---|---|---|---|---|---|---|
| ఖమ్మం | 131 | 31 | 68 | 42 | 63 | 81 |
| కృష్ణా | 1357 | 461 | 221 | 640 | 0 | 0 |
| కర్నూలు | 581 | 254 | 393 | 412 | 0 | 58 |
| నల్గొండ | 400 | 4 | 201 | 0 | 400 | 4 |
| రంగారెడ్డి | 1141 | 35 | 371 | 168 | 965 | 295 |
| విజయనగరం | 205 | 2 | 127 | 158 | 100 | 14 |
| వైఎస్ఆర్ కడప | 642 | 85 | 147 | 489 | 0 | 1 |
| **మొత్తం** | **4457** | **872** | **1528** | **1909** | **1528** | **453** |

*మూలం: నమూనా తనిఖీకి ఎంపిక చేసిన జిల్లాలలో పరిశీలించిన దరఖాస్తులు*

ఆడిట్ సూచించిన లోపాలను సరిచేసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది (2013 అక్టోబరు).

- లబ్ధిదారుల ఫోటోలు, వారు నివసిస్తున్న కచ్చా ఇంటితో ఫోటోలు, అలాగే పక్కా ఇంటి నిర్మాణంలో వివిధ దశల ఫోటోలు తీసుకోవటం లబ్ధిదారుల వాస్తవికతను తెలుసుకునేందుకు ఉపకరిస్తాయి. ఈ డేటాబేస్‌ను ఆడిట్‌లో పరిశీలించగా మొత్తం 64.32 లక్షల ఇళ్ళకుగాను 53.09 లక్షల ఇళ్ళ విషయంలో ఈ విధమైన ఫోటోలు లేవని తెలిసింది. అదేవిధంగా, 45.95 లక్షల దరఖాస్తులలో పునాదుల వరకు ఫోటోలు, మరో 29.79 లక్షల కేసుల్లో కాంక్రీటు శ్లాబు వేశాక తీసిన ఫోటోలు లేవు. అనేక కేసులలో స్క్రీన్‌సేవర్‌లు మొదలైన పలు పొంతనలేని ఫోటోలు పెట్టారు.

- శ్రీకాకుళం జిల్లాలో 1,400 ఇళ్ళకూ, మహబూబ్‌నగర్ జిల్లాలో 1,661 ఇళ్ళకూ కలిపి మొత్తం 3,061 ఇళ్ళకు సంబంధించి ఆయా దశలలో తీసిన ఫోటోలను డేటాబేస్‌లో పొందుపరచలేదు. అయినాగానీ, ఈ లబ్ధిదారులకు ప్రభుత్వం 2011 జనవరిలో ₹14 కోట్లు విడుదల చేసింది. ఈ రెండు జిల్లాలలో సహాయక ఇంజనీర్లు తరచుగా బదిలీ కావటం వలన ఫోటోలను అప్‌లోడ్ చేయలేదని ఏపీఎస్‌హెచ్‌సీఎల్ బదులిచ్చింది.

సమాచారాన్ని సిస్టంలో పొందుపరిచే సమయంలో కొన్ని పొరపాట్లు దొర్లాయనీ, ఫోటోలను పరిశీలించి అవసరమైన దిద్దుబాట్లు చేపట్టే బాధ్యతను జిల్లాఅధికారులకు అప్పగించామనీ ప్రభుత్వం బదులిచ్చింది (2013 అక్టోబరు). ఈ కసరత్తును వెంటనే ఆరంభించవలసిందిగా ప్రాజెక్టు డైరెక్టర్లకు సూచించామని కూడా ప్రభుత్వం పేర్కొంది.

- అంతేకాకుండా, నిర్మాణ క్రమంలోని వివిధ దశలను (కచ్చా ఇల్లు, పునాదులు, కాంక్రీటు శ్లాబు స్థాయి) చూపిస్తూ తీసిన డిజిటల్ ఫోటోలను సర్వర్‌కు అప్‌లోడ్ చేయాలి. దశలవారీ ఫోటోలను సర్వర్‌కు పంపేవరకూ చెల్లింపులు చేయరాదని ఈ పథకం మార్గదర్శకాలలోనే స్పష్టం చేశారు. ఐతే, ఈ విధంగా ఫోటోలను సర్వర్‌లో పొందుపరచని సందర్భాలలో చెల్లింపులను ఆపుచేసేందుకు తగిన ఏర్పాటు సాఫ్ట్‌వేర్‌లో కల్పించలేదు. నమూనా తనిఖీ చేపట్టిన జిల్లాలలో పలు చోట్ల నిర్మాణానికి సంబంధించి ఒక దశలోని ఫోటోలను మాత్రమే పొందుపరచటంగానీ ఫోటోలను అసలే పెట్టకపోవటంగానీ జరిగింది. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

పట్టిక 3.5

| జిల్లా | పరిశీలించిన ఇళ్ళు | ఫోటోలు లేనివి | కచ్చా ఇంటి ఫోటోలు లేనివి | పునాదుల ఫోటోలు లేనివి | కాంక్రీటు శ్లాబు ఫోటోలు లేనివి | పొంతనలేని, పొసగని ఫోటోలు |
|---|---|---|---|---|---|---|
| ఖమ్మం | 102 | 4 | 2 | 8 | 2 | 0 |
| కృష్ణా | 103 | 9 | 37 | 12 | 4 | 0 |
| కర్నూలు | 125 | 54 | 94 | 96 | 91 | 3 |
| నల్గొండ | 90 | 6 | 41 | 50 | 4 | 2 |
| రంగారెడ్డి | 84 | 7 | 51 | 56 | 30 | 33 |
| విజయనగరం | 90 | 0 | 3 | 12 | 0 | 8 |
| వైఎస్ఆర్ కడప | 139 | 9 | 61 | 84 | 37 | 1 |
| మొత్తం | 733 | 89 | 289 | 318 | 168 | 47 |

*మూలం: నమూనా తనిఖీ చేపట్టిన జిల్లాలలో ఎంపిక చేసిన లబ్ధిదారుల ఆన్‌లైన్ సమాచారం పరిశీలన*

## 3.6 ఇళ్ళ మంజూరు

### 3.6.1 మగవారి పేరున మంజూరు చేసిన ఇళ్ళు

ఇందిరమ్మ పథకంలోని మార్గదర్శకాల ప్రకారం నివాస గృహాలను కుటుంబంలోని మహిళల పేరునే మంజూరు చేయాలి. ఇందుకు బదులుగా వీటిని భార్యాభర్తలిరువురి పేరున కేటాయించవచ్చును.

ఈ విధానాలకు భిన్నంగా, మొత్తం 64.32 లక్షలకుగాను 7.11 లక్షల ఇళ్ళను (11 శాతం) పురుషుల పేరున కేటాయించారు. ఈ విషయంలో నల్గొండ జిల్లా 23 శాతంతో ముందుండగా, తర్వాతి స్థానాలలో కర్నూలు జిల్లా (22 శాతం), రంగారెడ్డి జిల్లా (19 శాతం), విజయనగరం జిల్లా (14 శాతం) ఉన్నాయి.

పట్టాలను భార్యాభర్తలిద్దరి పేరున బదిలీ చేయటం కాలహరణంతో కూడుకున్నది కనుక లబ్ధిదారులకు చెల్లింపులలో జాప్యం నివారించేందుకు కొన్ని చోట్ల పట్టాలను మగవారి పేరున జారీ చేసినట్లు ప్రభుత్వం బదులిచ్చింది (2013 అక్టోబరు). ఈ విషయమై దిద్దుబాటు చర్యలు తీసుకోమని జిల్లా అధికారులను ఆదేశిస్తామని కూడా చెప్పింది.

### 3.6.2 గులాబీ రేషన్ కార్డుదారులకు ఇళ్ళ కేటాయింపు

ఇందిరమ్మ ఇళ్ళను ఈ పథకం విధివిధానాలననుసరించి అల్పాదాయ (బీపీఎల్) కుటుంబాలకు మాత్రమే మంజూరు చేయాలి.

దీనికి సంబంధించిన డేటాబేస్‌ను పరిశీలించగా గులాబీ రంగు రేషన్ కార్డులు కలిగిన 4,754 కుటుంబాలకు ఈ పథకం కింద ఇళ్ళు మంజూరు చేశారని తెలిసింది. వీటిపై వ్యయం ₹12.85 కోట్లు (నమూనా తనిఖీ చేసిన జిల్లాలలో గుర్తించిన 1,182 కేసులలో వ్యయం ₹2.33 కోట్లు). వాస్తవానికి, ఈ 4,754 మంది లబ్ధిదారులలో కేవలం 675 మందికి మాత్రమే సరైన రేషన్ కార్డులున్నట్లు పౌర సరఫరాల డేటాబేస్‌ను పరిశీలించినప్పుడు తెలిసింది.

తెల్ల రేషన్ కార్డులు జారీ చేయటంపై ఉన్న నిషేధం కారణంగా కొన్ని జిల్లాలలో రెవెన్యూ అధికారులు అల్పాదాయ కుటుంబాలకు గులాబీ రంగు కార్డులు ఇచ్చిన విషయం ప్రభుత్వం అంగీకరించింది (2013 అక్టోబరు). ఐతే, విషయం మరింత విపులంగా పరిశీలించేందుకు వీలుగా వాటి వివరాలను ప్రభుత్వం ఆడిట్‌కు అందచేయలేదు.

### 3.6.3 ఇదివరకే ఆరంభించిన ఇళ్ళకు తదనంతర మంజూరు

కచ్చా ఇళ్ళు, పాక్షిక స్థిరనివాసాలలో ఉండేవారిని మాత్రమే ఎంపిక చేసి, ఆర్థికసాయం అందచేయాలనీ, నిర్మాణంలోని వివిధ దశలను[9] గమనించి ఆమేరకే గృహ నిర్మాణ శాఖ చెల్లింపులు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

అయితే, తన మార్గదర్శకాలను తానే అతిక్రమించి అప్పటికే నిర్మాణంలో ఉన్న, పూర్తికావచ్చిన 4,70,571 ఇళ్ళకు రచ్చబండ కార్యక్రమంలో భాగంగా 2010 జూలైలో చెల్లింపులకు అనుమతించింది. కనుక ఈ పథకం ప్రయోజనాలను కచ్చా ఇళ్ళలో ఉంటున్నవారికి మాత్రమే వర్తింపచేశారన్న విషయం మాత్రం నిర్ధారించుకొనలేదు. అంతేకాకుండా, మంజూరుకన్నా ముందే నిర్మాణం చేపట్టటంవలన కట్టుబడిలోని వివిధ దశలను పరిశీలించే అవకాశం ప్రభుత్వ శాఖకు ఉండదు. ఈ విధంగా, 2013 మార్చి నాటికి 3,22,362 ఇళ్ళకు మొత్తం ₹1,344.56 కోట్లు చెల్లించారు. ఇందులో పూర్తయినవి 2,51,876 ఇళ్ళుకాగా, వివిధ దశలలో ఉన్నవి 70,486.

పూర్తయిన ఇళ్ళకూ, నిర్మాణంలో ఉన్న వాటికీ చెల్లింపులు చేయటం వలన లబ్ధిదారుల ఎంపికలోని యధార్థతనూ, నిర్మాణంలో దశలవారీ పురోగతినీ సమీక్షించుకోవటం క్షేత్ర స్థాయి సిబ్బందికి సాధ్యం కాదు. కనుక, అర్హతలేని వారిని ఎంపిక చేసేందుకుగల అవకాశాలను తోసిపుచ్చలేము. అప్పటికే నిర్మాణంలో ఉన్న ఇళ్ళకు తదనంతర అనుమతిని (ఆ ఒక్కసారికే) ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇచ్చామని ఏపీఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సమీక్షానంతర సమావేశంలో తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఇందిరమ్మ పథకం కోసం తాను రూపొందించిన విధివిధానాలకే విరుద్ధంగా ఉన్నది.

## 3.7 నిర్మాణ సామాగ్రి పంపిణీ, విడుదల

### 3.7.1 కొలతలు తీసుకోకుండా చెల్లింపులు

పథకం మార్గదర్శకాలప్రకారం, ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, దశలవారీగా కొలతలను మెజర్‌మెంట్ పుస్తకాలలో నమోదు చేయాలి. లబ్ధిదారులకు చెల్లింపులను ఈ కొలతల మేరకే చేయాలి.

[9] పునాదులకన్నా ముందు దశ, పునాదుల దశ, లింటెల్ స్థాయి, పైకప్పు స్థాయి, కాంక్రీటు శ్లాబు స్థాయి

నమూనా తనిఖీ చేపట్టిన జిల్లాలలో ఎంపిక చేసిన 666 కేసులకుగాను 586 మందికి (88 శాతం) అసలు కొలతలు నమోదు చేయకనే మొత్తం ₹1.91 కోట్లు చెల్లింపు చేశారు. ఈ జిల్లాలలో ఖమ్మం, విజయనగరం జిల్లాలు తప్ప మరెక్కడా నిర్మాణాల కొలతలను నమోదు చేయలేదని కూడా ఆడిట్ గుర్తించింది.

ఎమ్‌హెచ్ఓ ఇచ్చిన ధృవీకరణపత్రాల ఆధారంగా చెల్లింపులు చేయాలని గతంలో ఇచ్చిన ఆదేశాలు రద్దు చేశామనీ ప్రస్తుతం కొలతల పుస్తకాలలో వివరాలు రాసిన తర్వాతే చెల్లింపులు జరుగుతున్నాయనీ ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు). ఆడిట్ గమనించిన విషయాలను ప్రాజెక్టు డైరెక్టర్లందరికీ తెలియపరచి, కొలతల పుస్తకాలు సక్రమంగా నిర్వహించేలా చూస్తామనికూడా హామీ ఇచ్చింది.

## 3.7.2 సిమెంటు పంపిణీ

ఇందిరమ్మ పథకం కింది లబ్ధిదారులు స్వయంగా ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం ఋణం, సబ్సిడీల రూపేణా ఆర్థిక సాయం అందజేస్తూనే సిమెంటు, ఆర్‌సీసీ ద్వారబంధాలు, కిటికీలవంటి నిర్మాణ సామగ్రిని మార్కెట్ రేట్లకన్నా తక్కువకు అందచేస్తుంది. ప్రభుత్వం సిమెంటును ఉత్పత్తిదారుల నుంచి సేకరించి లబ్ధిదారులకు తక్కువ ధరకు సరఫరా చేస్తున్నది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా మండల/గ్రామ స్థాయిలో గోదాములను నిర్వహిస్తున్నారు. నిర్మాణక్రమంలోని వివిధ దశలలో (పునాదులు, పైకప్పు, కాంక్రీటు దశలలో) గృహ నిర్మాణ శాఖ ఇచ్చే ఉత్తర్వుల (సీఆర్ఓ) ఆధారంగా లబ్ధిదారులు గోదాముల నుంచి సిమెంటు తీసుకుంటారు.

### *3.7.2.1 పరిమితిని మించి సిమెంట్ పంపిణీ*

తక్కువ ధరకు అందచేసే సిమెంటును ఒక్కొక్క లబ్ధిదారునికీ 50 బస్తాలకన్నా ఎక్కువ ఇవ్వకూడదు. అది కూడా వివిధ దశలలో పదేసి బస్తాల[10] గుణిజాలలో విడుదల చేయాలి.

| పట్టిక 3.6 | |
|---|---|
| 4,642 కేసులు | 51-60 బస్తాలు |
| 29 కేసులు | 61-70 బస్తాలు |
| 5 కేసులు | 71-80 బస్తాలు |
| 2 కేసులు | 81-90 బస్తాలు |

ఇందుకు సంబంధించిన డేటాబేస్‌ను పరిశీలించగా, 4,678 కేసులలో (నమూనా తనిఖీ చేసిన జిల్లాలలో 4,390 కేసులు) లబ్ధిదారులకు సిమెంటు బస్తాలను 50 కంటే ఎక్కువగా, 90 బస్తాల వరకూ పంపిణీ చేసినట్లు తెలిసింది. పరిమితికి మించి సిమెంటు బస్తాలను జారీ చేయటం సాఫ్ట్‌వేర్‌లో సాధ్యంకాదనీ, ఆఫ్‌లైన్‌లోని ఎంట్రీలను మాన్యువల్‌గా ఆన్‌లైన్ విధానంలోకి నమోదు చేయటం వలన ఈ సంఘటనలు చోటు చేసుకున్నాయనీ ప్రభుత్వం ప్రత్యుత్తరమిచ్చింది (2013 అక్టోబరు). ఐతే, ఆఫ్‌లైన్ విధానంలో అదనపు సిమెంటు జారీ అయ్యే సమస్యను ప్రభుత్వం పరిష్కరించలేదు. నియమాలను అతిక్రమించిన వారిపై చేపట్టతలచిన చర్యలను కూడా వెల్లడించలేదు. అంతేకాక, ఆన్‌లైన్ విధానం అమల్లోకొచ్చిన తర్వాత కూడా పరిమితిని మించి సిమెంట్ పంపిణీ చేసిన 845 కేసులను ఆడిట్ గుర్తించింది.

### *3.7.2.2 దశలవారీగా కాకుండా ఒక్కసారిగా సిమెంట్ విడుదల*

నిర్మాణపు వివిధ దశలలో ఎంతెంత సిమెంట్ అందచేయవలసినదీ మార్గదర్శకాలలోనే స్పష్టంగా పేర్కొన్నారు. ఇందుకు విరుద్ధంగా జరిగినప్పుడు సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలి.

మచ్చుకు తనిఖీ చేసిన మూడు జిల్లాలలో ₹13 లక్షల విలువ కలిగిన 8,790 బస్తాల సిమెంటు దశలవారీగా కాకుండా ఒక్కమారుగా పంపిణీ చేశారు. వీటిలో కొన్ని నిర్మాణాలు పురోగతిలో ఉండగా కొన్ని నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

---

[10] పునాదిలోపు 10 బస్తాలు, పునాది దశలో 10 బస్తాలు, పైకప్పుకు 20 బస్తాలు, కాంక్రీటు శ్లాబుకు 10 బస్తాలు

పట్టిక 3.7

| జిల్లా | నిర్మాణంలో ఉన్న ఇళ్ళకు ఒక్కసారిగా ఇచ్చిన సిమెంటు | | నిర్మాణం పూర్తయిన ఇళ్ళకు ఒక్కసారిగా ఇచ్చిన సిమెంటు | |
|---|---|---|---|---|
| | బస్తాల సంఖ్య | విలువ (₹) | బస్తాల సంఖ్య | విలువ (₹) |
| ఖమ్మం | 0 | 0 | 1340 | 227800 |
| కర్నూలు | 520 | 77480 | 6660 | 956440 |
| రంగారెడ్డి | 270 | 38460 | 0 | 0 |
| **మొత్తం** | **790** | **115940** | **8000** | **1184240** |

*మూలం: నమూనా తనిఖీ చేపట్టిన జిల్లాలలో సిమెంట్ జారీ ఆదేశాల పరిశీలన*

ఈ విధంగా పెద్ద మొత్తంలో సిమెంటును ఇవ్వటం మార్గదర్శకాలకు విరుద్ధం. ఇందుకు ప్రభుత్వం స్పష్టమైన కారణాలేవీ పేర్కొనలేదు (2013 అక్టోబరు).

### *3.7.2.3 సీఆర్ఓ జారీ చేసినాగానీ సిమెంట్ సరఫరా చేయలేదు*

సిమెంట్ ధరలను 2011 జూన్ నెలలో సవరించిన నేపథ్యంలో ఈ హెచ్చు ధరలపై సేకరించిన సిమెంట్‌ను 2011 జూన్ 14 కన్నా ముందు జారీ చేసిన సీఆర్ఓలపై పంపిణీ చేయరాదని ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఆదేశించింది (2011 జూలై). తొమ్మిది జిల్లాలలో వివిధ రేట్లపై కొనుగోలు చేసిన 7,28,598 బస్తాల సిమెంట్ (మొత్తం విలువ ₹10.30 కోట్లు) లబ్ధిదారులకు పంపిణీ కాకుండా సీఆర్ఓల రూపంలోనే ఉండిపోయింది.

పట్టిక 3.8

| జిల్లా | బస్తాల సంఖ్య | విలువ (₹ లక్షలలో) |
|---|---|---|
| విజయనగరం | 38878 | 64.34 |
| ఖమ్మం | 43340 | 59.83 |
| తూర్పుగోదావరి | 8517 | 10.90 |
| శ్రీకాకుళం | 122 | 0.15 |
| నల్గొండ | 118444 | 170.10 |
| ఎస్‌పీఎస్ నెల్లూరు | 154231 | 217.40 |
| చిత్తూరు | 179197 | 229.37 |
| కృష్ణా | 14140 | 20.79 |
| వైఎస్ఆర్ కడప | 171729 | 257.37 |
| **మొత్తం** | **728598** | **1030.25** |

*మూలం: ఏపీఎస్‌హెచ్‌సీఎల్ రికార్డుల నుంచి తీసుకున్న సమాచారం*

సరఫరా చేయని సిమెంట్ విలువ మేరకు ప్రత్యేక ఫండ్ ట్రాన్స్‌ఫర్ రిక్విజిషన్ జారీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, వివిధ జిల్లాలలోని ఏపీఎస్‌హెచ్‌సీఎల్ సంస్థకు చెందిన ప్రాజెక్టు డైరెక్టర్ల నుంచి ప్రతిపాదనలు అందినాగానీ 2013 జూన్ వరకూ ఈ విషయంలో చర్య తీసుకొనలేదు. ఆమేరకు లబ్ధిదారులు ప్రయోజనం కోల్పోయారు.

సీఆర్ఓలను ఆన్‌లైన్ పద్ధతిలో జారీ చేయటం వలన వీటికి ప్రతిగా లబ్ధిదారులు సిమెంట్ వాస్తవంగా తీసుకున్నదీ, లేనిదీ తెలుసుకునే అవకాశం లేదు. ఆవిధంగా, లబ్ధిదారునికి చెల్లింపు/సిమెంట్ నిజంగా అందినట్లు రూఢి చేసుకునేందుకు తగిన నియంత్రణ వ్యవస్థ ఏపీఎస్‌హెచ్‌సీఎల్ వద్ద లేదు.

ఆన్‌లైన్ వ్యవస్థకు సిమెంట్ గిడ్డంగులతో అనుసంధానం లేదనీ, గోడౌన్లలో ఉన్న సిమెంటు నిల్వలకు తగినట్లు సీఆర్ఓలను జారీ చేసేందుకు అనువైన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నామనీ, ఇటువంటి వ్యూహాత్మకమైన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వస్తే ఈ లోపాలు చక్కబడతాయనీ ప్రభుత్వం బదులిచ్చింది (2013 అక్టోబరు).

### 3.7.2.4 తగ్గిన గోడౌన్లు

లబ్ధిదారులకు సిమెంట్‌ను మార్కెట్‌కన్నా తక్కువ ధరకు సులువుగా అందచేసేందుకు వీలుగా ఎపీఎస్‌హెచ్‌సీఎల్ ఉత్పత్తిదారులనుంచి సేకరించిన సిమెంట్‌ను తన సొంత గిడ్డంగులలో నిల్వ చేస్తున్నది.

ఐతే ఈ గోడౌన్ల సంఖ్య 2008-09లో 1,458 ఉండగా అది ఏటికేడాది తగ్గిపోతూ పక్క చార్టులో చూపినట్లు 2012-13 నాటికి 418కి తగ్గిపోయింది. ఫలితంగా, 2013 జూన్ నాటికి ఒక్కొక్క గిడ్డంగి మూడు మండలాలలోని లబ్ధిదారుల అవసరాలు తీర్చాల్సి వస్తున్నది.




మూలం: ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఇచ్చిన సమాచారం

నమూనా తనిఖీ చేసిన జిల్లాలలో గోడౌన్ల పరిస్థితి ఈ కింది విధంగా ఉన్నది.

పట్టిక 3.9

| జిల్లా | గృహ నిర్మాణం మండలాలు | గోడౌన్ల సంఖ్య (సంవత్సరాల వారీగా) | | | | |
|---|---|---|---|---|---|---|
| | | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | 2012-13 |
| ఖమ్మం | 52 | 54 | 17 | 17 | 23 | 22 |
| కృష్ణా | 55 | 89 | 81 | 56 | 28 | 19 |
| కర్నూలు | 59 | 55 | 98 | 24 | 16 | 24 |
| నల్గొండ | 63 | 75 | 67 | 58 | 18 | 15 |
| రంగారెడ్డి | 45 | 40 | 30 | 25 | 19 | 12 |
| విజయనగరం | 38 | 51 | 38 | 23 | 20 | 16 |
| వైఎస్ఆర్ కడప | 58 | 58 | 56 | 25 | 24 | 20 |
| **మొత్తం** | **370** | **422** | **387** | **228** | **148** | **128** |

మూలం: ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఇచ్చిన సమాచారం

ఇంటి నిర్మాణం పూర్తయ్యేలోపు లబ్ధిదారులు సిమెంటు కోసం మొత్తం నాలుగు సార్లు గోడౌనుకు వెళ్ళవలసి వస్తోంది. ఈ విధంగా గోడౌన్లనుంచి సిమెంటు తీసుకువెళ్ళటంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు అందుబాటులో ఉన్న గోడౌన్లు ఏదైనా గ్రామానికి 30 కి.మీ. కంటే ఎక్కువ దూరంలో ఉన్న చోట్ల అదనపు గోడౌన్లు ఏర్పాటు చేయాలని ఏపీఎస్‌హెచ్‌సీఎల్ 2013 మే నెలలో ఆదేశాలు జారీ చేసింది. ఈ విధంగా చూసినా, లబ్ధిదారులు ప్రతిసారీ (పునాది దశలో, శ్లాబు స్థాయిలో, కాంక్రీటు దశలో) కనీసం 60 కి.మీ. ప్రయాణం చేసి తనకు రావలసిన సిమెంటును తెచ్చుకోవలసి ఉంటుంది. తక్కువ ధరకు సిమెంటు పొందగోరేవారికి ఇది శ్రమదాయకమే కాక ఆర్థికంగా కూడా భారమవుతుంది.

గిడ్డంగుల అద్దెలు బాగా పెరిగిపోవటం వలన అన్ని గోదాములను నిర్వహించటం సాధ్యం కాదని ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు). లబ్ధిదారులు ఎదుర్కొంటున్న అసౌకర్యాన్ని పరిగణించి వారికి సిమెంటు విడుదల చేస్తున్న వాయిదాల సంఖ్యను కుదించామని కూడా పేర్కొంది. ఐతే, లబ్ధిదారుడు తనకు వాస్తవంగా రావలసిన సిమెంటును పూర్తిగా తీసుకొనేలోపు గోడౌనుకు కనీసం నాలుగు మార్లు వెళ్ళిరావలసిన పరిస్థితులు నెలకొన్నట్టు ఆడిట్ గమనించింది.

### 3.7.3 నిర్మితి కేంద్రాల ద్వారా నిర్మాణ సామగ్రి సరఫరా

బలహీనవర్గాల ఇళ్ళ నిర్మాణవ్యయం తగ్గించే విధంగా నిర్మాణ సామగ్రిని చౌకగా ఉత్పత్తి చేసేందుకు నిర్మితి కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో, ఈ నిర్మితి కేంద్రాలు 88 ఏర్పాటవగా వీటిలో 2013 మార్చినాటికి 49 మాత్రమే పని చేస్తున్నాయి. నమూనా తనిఖీ కోసం ఎంపిక చేసిన ఏడు జిల్లాలలో జిల్లాకు రెండు చొప్పున నిర్మితి కేంద్రాలను ఆడిట్ ప్రత్యక్ష పరిశీలన చేయగా ఈ దిగువ విషయాలు తెలిశాయి.

- ఐదు నిర్మితి కేంద్రాలలో[11] లబ్ధిదారులకు నిర్మాణ సామగ్రి సరఫరా కోసం మొత్తం ₹3.97 కోట్లు సర్దుబాటు కావలసి ఉన్నది.
- మూడు నిర్మితి కేంద్రాలలో[12] ₹9.42 లక్షల విలువైన సామగ్రి నిరుపయోగంగా పడి ఉన్నది.
- రంగారెడ్డి జిల్లా అహ్మద్‌గూడ నిర్మితి కేంద్రంలో 12,000 చ.అ. స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకున్నారు.
- కడప నిర్మితి కేంద్రంలో ₹6.76 లక్షల ఖరీదైన వస్తుసామగ్రి దెబ్బతినిపోగా, స్టాకుల్లో వ్యత్యాసం ₹1.97 లక్షలమేర ఉన్నది.
- వైఎస్ఆర్ జిల్లాలోని రాజంపేట నిర్మితి కేంద్రంలో ₹3.75 లక్షలు, ఇంకా కడపలో ₹5.69 లక్షల యంత్ర పరికరాలు (మొత్తం మీద ₹9.44 లక్షల విలువైనవి) పనిచేయని స్థితిలో ఉన్నాయి.
- వైఎస్ఆర్ జిల్లా రాజంపేట నిర్మితి కేంద్రంలో ఇసుక కొరత వలన 2012-13 సంవత్సరంలో సిమెంటు ఇటుకలు ఉత్పత్తి చేయలేదు.
- వైఎస్ఆర్ జిల్లా కడప నిర్మితి కేంద్రంలో సిమెంట్ ఇటుకలు తయారు చేసేందుకు ఉపయోగించే ₹6.10 లక్షల విలువైన హైడ్రాలిక్ యంత్రం అది నెలకొల్పినప్పటి నుంచీ (2008 అక్టోబరు) వినియోగించటం లేదు.

రాష్ట్రంలోని నిర్మితి కేంద్రాలను పటిష్టపరిచేందుకు వీలుగా ₹1.40 కోట్ల సాయం కోసం కేంద్ర ప్రభుత్వానికి అభ్యర్థనలు పంపామనీ, అంతేకాక ఉత్పత్తి ప్రారంభించటం కోసం ప్రతి నిర్మితి కేంద్రానికీ ₹2 లక్షల చొప్పున అడ్వాన్సు రూపేణా ఆర్థికసాయం కూడా అంద చేస్తున్నామనీ ఏపీఎస్‌హెచ్‌సీఎల్ తెలిపింది. ఇప్పటికే మనుగడలో ఉన్న నిర్మితి కేంద్రాలన్నింటినీ పరిపుష్టం చేసే విధంగా పలు చర్యలు ఆరంభించినట్లు ప్రభుత్వం కూడా పేర్కొన్నది (2013 అక్టోబరు).

### 3.7.4 గ్రామీణ నిర్మితి కేంద్రాలు

సిమెంటు ఇటుకలు, సెంటరింగ్ సామగ్రి విషయంలో డిమాండుకూ సరఫరాకూ మధ్య అంతరాన్ని తొలగించేందుకు ఇందిరమ్మ రెండవ దశలో ప్రభుత్వం 2,945 గ్రామీణ నిర్మితి కేంద్రాలను గ్రామీణ సంస్థల ద్వారా ఏర్పాటు చేసింది. ఇటుకల ఉత్పత్తి యూనిట్ కొనుగోలు కోసం ₹85,000, అదే విధంగా సెంటరింగ్ యూనిట్ కోసం ₹1,70,000 చొప్పున ఏపీఎస్‌హెచ్‌సీఎల్ సంస్థ వీటికి వడ్డీలేని ఋణాలను అందజేసింది. నిర్మాణ సామగ్రి సరఫరా ఆరంభించిన నాటి నుండి 12 నెలల్లోగా ఈ ఋణాలను తిరిగి చెల్లించవలసి ఉంటుంది. వీరు ఆ గ్రామంలోని ఇందిరమ్మ పథకం లబ్ధిదారులకు మాత్రమే నిర్మాణ సామగ్రి సరఫరా చేయాలి.

[11] కృష్ణా జిల్లాలోని విజయవాడలో ₹0.73 కోటి, పామర్రులో ₹0.38 కోటి; కర్నూలు జిల్లా నంద్యాలలో ₹0.27 కోటి; వైఎస్ఆర్ కడప జిల్లా కేంద్రంలో ₹1.20 కోట్లు, రాజంపేటలో ₹1.39 కోట్లు

[12] ఖమ్మం జిల్లా భద్రాచలంలో ₹0.67 లక్ష; రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలో ₹7.24 లక్షలు, విజయనగరం జిల్లా కేంద్రంలో ₹1.51 లక్షలు

ఈ విషయమై ఆడిట్ ఈ కింది విషయాలను కనుగొన్నది :

- ప్రభుత్వం 2008 జనవరిలో స్థాపించిన మొత్తం 2,945 కేంద్రాలూ 2013 మార్చి నాటికి పని చేయటం లేదు.
- గ్రామీణ నిర్మితి కేంద్రాల ఏర్పాటు కోసం వడ్డీలేని ఋణం రూపంలో విడుదల చేసిన ₹26.10 కోట్ల మొత్తానికిగానూ ఆయా గ్రామీణ సంస్థలనుంచి 2008 సెప్టెంబరు నుంచి ₹13.05 కోట్లు వసూలవగా 2013 మార్చి నాటికి ఇంకా ₹13.05 కోట్లు బాకీ ఉన్నది. ఇలా వసూలు చేసినదానిలో ₹3 కోట్ల విలువైన యంత్ర సామగ్రి[13] కూడా ఉన్నది. వివిధ నిర్మితి కేంద్రాలలో ఉన్న ఈ సామగ్రిని వాడకపోవటంతో ఇది పాడైపోతున్నది.

గ్రామీణ నిర్మితి కేంద్రాలు నడవకపోవటానికి స్పష్టమైన కారణాలను ప్రభుత్వం పేర్కొనలేదు. అయితే, వీటిని పటిష్ఠం చేసే చర్యలు ఇప్పటికే చేపట్టినందున అందుబాటులో ఉన్న యంత్రపరికరాలన్నీ వినియోగంలోకి వస్తాయనీ, ఋణాలు కూడా వసూలవుతాయనీ ప్రభుత్వం ధీమా వ్యక్తం చేసింది (2013 అక్టోబరు).

## 3.7.5 ఇళ్ళ నిర్మాణం

### *3.7.5.1 నమూనా డిజైన్లను అనుసరించటం*

రాష్ట్రంలోని ఇందిరమ్మ ఇళ్ళన్నీ ఒక నమూనా డిజైన్ ప్రకారం ఒకే తీరుగా 25 చ.మీ./267 చ.అ. నిర్మాణ విస్తీర్ణం, ఆర్‌సీసీ పైకప్పు కలిగి ఉండాలని విధివిధానాలలోనే స్పష్టం చేశారు (2007 డిసెంబరు). మొదటి దశ ఇళ్ళు 20 చ.మీ./215 చ.అ. విస్తీర్ణానికి తగ్గకూడదు. రెండు, మూడవ దశలలోని నిర్మాణాల విస్తీర్ణం 25 చ.మీ./ 269 చ.అ. ఉండాలి.

ఈ సందర్భంగా ఆడిట్ ఈ దిగువ విషయాలు గమనించింది :

- లబ్ధిదారులు నిర్మాణ సమయంలో నమూనా డిజైన్లను అనుసరించలేదు. ప్రభుత్వ శాఖ కూడా ఈ విషయంలో పట్టుపట్టలేదు. ఈ విషయమై నియమాలను అనుసరిస్తూనే ఉన్నారని నిర్ధారించుకొనేందుకు ఏపీఎస్‌హెచ్‌సీఎల్ సిబ్బంది అవసరమైనన్నిసార్లు నిర్మాణ ప్రాంతాలను సందర్శించలేదు. ఖమ్మం జిల్లాలో 45 ఇళ్ళకు సంబంధించిన కొలతల పుస్తకాలను మచ్చుకి పరిశీలించగా వాటిలో 23 ఇళ్ళను నమూనా డిజైన్‌లకు భిన్నంగా నిర్మించారని తెలిసింది. మచ్చుకి తనిఖీ కోసం ఎంపిక చేసుకున్న అన్ని జిల్లాలలో కలిపి 733 ఇళ్ళను ఆడిట్ ప్రత్యక్ష తనిఖీ చేపట్టినప్పుడు వీటిలో 19 ఇళ్ళు (ఖమ్మం-8; నల్గొండ-1; విజయనగరం-10) నమూనా డిజైన్ అనుసరించి రూపొందలేదని తెలిసింది.
- కొలతల పుస్తకాలను పరిశీలించగా ఖమ్మం జిల్లాలో 23 ఇళ్ళ వైశాల్యం 500 చ.అ. మించి ఉన్నట్లు తేలింది. కొలతల పుస్తకాలలో వివరాలు నమోదు చేయకపోవటం వలన మిగతా జిల్లాలలో ఇటువంటి అతిక్రమణలను ఆడిట్ అంచనా వేయలేదు.
- ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళ వైశాల్యం 267 నుంచి 500 చ.అ. వరకు పలు విడతలుగా సడలించింది (దీనిని 2008 డిసెంబరులో 350 చ.అ. వరకూ, 2011 ఆగస్టులో 450 చ.అ. వరకూ, ఆ తర్వాత 2012 ఏప్రిల్ నెలలో 500[14] చ.అ. వరకూ సవరించింది). మచ్చుకి తనిఖీ చేసిన జిల్లాలలోని ఇళ్ళ ప్రత్యక్ష పరిశీలన చేపట్టగా 19[15] ఇళ్ళు నిర్ణీత విస్తీర్ణం మించి కట్టినట్టు తేలింది.

---

[13] ఇటుక తయారీ యూనిట్లు,సెంటరింగ్ యూనిట్లు

[14] 269 వరకు (2006 మే), 300 నుంచి 350 వరకు (2008 డిసెంబరు), 450 వరకు (2011 ఆగస్టు), 500 వరకు (2012 ఏప్రిల్)

[15] ఖమ్మం (8), నల్గొండ (1), విజయనగరం (10)

### 3.7.5.2 ఇందిరమ్మ ఇళ్ళుగా చూపిన ఐఏవై ఇళ్ళు

కేంద్ర సౌజన్య పథకమైన ఐఏవై గృహ నిర్మాణ పథకంలో మొత్తం నిర్మాణవ్యయం సబ్సిడీ రూపంలో చెల్లించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 75:25 నిష్పత్తిలో భరిస్తాయి (ఇందిరమ్మ పథకంలో నిర్మాణ వ్యయాన్ని కొంత సబ్సిడీగానూ, మిగిలింది ఋణంగానూ ఇస్తారు).

ఇళ్ళలోని పురోగతిని పరిశీలించగా ఐఏవై పథకం కింద మంజూరు చేసి, నిధులిచ్చిన (భారతప్రభుత్వం నిధులు విడుదల చేసింది) అన్ని ఇళ్ళనూ ఇందిరమ్మ పథకంలో విలీనం చేశారని తెలిసింది. ఆవిధంగా 2008-13 మధ్యకాలంలో 54.09 లక్షల ఇళ్ళు లక్ష్యంకాగా 37.41 లక్షల ఇళ్ళను ఇందిరమ్మ పథకం కింద నిర్మించినట్లు చూపించారు. వీటిలో 13.94 లక్షల ఇళ్ళు (37.26 శాతం) కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఐఏవై పథకానికి చెందినవి.




మూలం: ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఇచ్చిన సమాచారం

అంతేకాకుండా, ఐఏవై పథకం కోసం కేంద్రం ఇచ్చిన నిధులకు వినియోగ ధృవపత్రాలను పంపుతూ ఈ ఇళ్ళనే ఐఏవై పథకం కింద నిర్మించినవిగా చూపించారు.

ఈ విషయంలో ప్రభుత్వం నిర్దిష్ట సమాధానమేదీ ఇవ్వలేదు.

### 3.7.5.3 ఇందిరమ్మ ఇళ్ళుగా చూపిన బీడబ్ల్యూహెచ్‌పీ ఇళ్ళు

కేంద్ర ప్రభుత్వ సాయంతో అమలు జరుగుతున్న 'బీడీ కార్మికుల సమీకృత గృహ నిర్మాణ పథకం' (బీడబ్ల్యూహెచ్‌పీ) కింద నిర్మించిన ఇళ్ళను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకంతో ముడిపెట్టింది. వీటి యూనిట్ ధర ₹45,000 (కేంద్రం సబ్సిడీ ₹40,000 కాగా లబ్ధిదారుని వంతు ₹5,000). నిర్మాణంలో అయ్యే అదనపు వ్యయాన్ని లబ్ధిదారులే భరించాలి. మార్గదర్శకాల ప్రకారం, ఈ పథకాన్ని అమలు చేస్తున్న ఏజన్సీ దరఖాస్తులన్నీ పరిశీలించి అందులో అర్హులైనవారిని గుర్తించి, సబ్సిడీ కోసం సిఫార్సు చేస్తూ కేంద్ర ప్రభుత్వంలోని కార్మిక-ఉపాధి మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపించాలి.

ఐతే, ఈ పథకానికి కూడా అమలు సంస్థగా వ్యవహరిస్తున్న ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఇందిరమ్మ పథకంలో ఇళ్ళు పొందిన లబ్ధిదారులను ఎంపిక చేసి కేంద్ర ప్రభుత్వ గ్రాంటును వినియోగించింది. దరఖాస్తుదారులైన బీడీ కార్మికుల వాటా ₹5,000 ను వసూలు చేయలేదు. బీడీకార్మికుల కోసం 40,758 ఇళ్ళ నిర్మాణానికని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ₹118.85 కోట్లకుగాను రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణం పూర్తి చేసుకున్న 24,282 ఇళ్ళు, ఇంకా నిర్మాణంలో ఉన్న మరికొన్ని ఇళ్ళపై మొత్తం మీద ₹116.38 కోట్లు ఖర్చు చేసింది. ఈ పథకం కోసం కేంద్రం ఇచ్చిన నిధుల నుంచి చేసిన వ్యయానికి వినియోగ ధృవపత్రాలుగానీ నిర్మాణాలు పూర్తయినట్లు నివేదికలుగానీ ఏపీఎస్‌హెచ్‌సీఎల్ సంస్థ పంపించలేదు.

బీడబ్ల్యూహెచ్‌పీ పథకం కింద మంజూరైన ఇళ్ళను 18 నెలల్లోపు పూర్తి చేయాలి. కానీ, 2008-10లో ఆమోదించిన 12,999 ఇళ్ళలో కేవలం 2,693 మాత్రమే పూర్తవగా, 707 ఇళ్ళు వివిధ దశలలో ఉన్నాయి. మిగిలిన 9,599 ఇళ్ళు 2013 జూన్ నాటికి ఇంకా మొదలు పెట్టలేదు.

ఇందిరమ్మ, బీడబ్ల్యూహెచ్‌పీ పథకాలు రెండూ విభిన్న మార్గదర్శకాలు, నిధులు సమకూరే విధానాలు అనుసరిస్తున్నందున ఈ రెంటినీ ముడిపెట్టకూడదు. ఈ రెండు పథకాల మధ్య నెలకొన్న వ్యత్యాసాలను ఏవిధంగా సానుకూలం చేసినదీ ప్రభుత్వం తన సమాధానంలో (2013 అక్టోబరు) వివరించలేదు.

## 3.8 ఆర్థిక నిర్వహణ

### 3.8.1 ఆఫ్‌లైన్ చెల్లింపులకు ఎక్విటెన్స్‌లు తీసుకోనకపోవటం

వివిధ స్థాయిలలో ఇళ్ళ నిర్మాణ పురోగతి ఆధారంగానే లబ్ధిదారులకు చెల్లింపులు చేయాలి. గృహ నిర్మాణ పథకం మొదటి రెండు దశలలో ఏపీఎస్‌హెచ్‌సీఎల్ చెల్లింపులను (2007 జూలై నుంచి) గ్రామీణ సంస్థలు, స్వయంసహాయక గ్రూపుల ద్వారా విడుదల చేసింది. అయితే, 2009 డిసెంబరు నుంచి ఈ విధానానికి స్వస్తి చెప్పి ఆన్‌లైన్ చెల్లింపులను ఆరంభించింది.

లబ్ధిదారులకు 2007 జూలై నుంచి 2009 డిసెంబరు మధ్యకాలంలో గ్రామీణ సంస్థలు/స్వయం సహాయక బృందాల ద్వారా ₹3,322.35 కోట్లు విడుదల చేసింది. ఆఫ్‌లైన్ చెల్లింపు విధానం 2009 డిసెంబరులోనే ఆపేసినాగానీ, 2013 ఫిబ్రవరి నాటికి ₹3,061.14 కోట్లకు మాత్రమే ఎక్విటెన్సులు తీసుకున్నది. అప్పటికే మూడు నుంచి ఐదు సంవత్సరాలు గడిచిపోయింది. ఫలితంగా, లబ్ధిదారులకు చేసిన చెల్లింపులలోని కచ్చితత్వం ఆడిట్ పరిశీలించలేకపోయింది. లబ్ధిదారులకు యూనిట్ ధరను గ్రామీణ సంస్థల ద్వారా పంపిణీ చేసినప్పుడు అక్రమాలు చోటుచేసుకున్నాయని ఏపీఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సమీక్షానంతర సమావేశంలో తెలిపారు.

### 3.8.2 ఋణాల వసూలు

ఏపీఎస్‌హెచ్‌సీఎల్ రూపొందించిన డిమాండు, వసూలు, బకాయిల నివేదిక పరిశీలించగా లబ్ధిదారుల నుండి వసూలు కావలసిన బాకీ మొత్తం ₹7,442.15 కోట్లకుగానూ 2013 మార్చినాటికి ₹326.90 కోట్లు (నాలుగు శాతం) మాత్రమే వసూలైంది. సంవత్సరాల వారీగా డిమాండు, వసూలు వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

చార్టు 3.5




*మూలం: ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఇచ్చిన సమాచారం*

ఋణాల వసూలు వైఎస్ఆర్ కడప జిల్లాలో చాలా తక్కువగా (రెండు శాతం) ఉన్నది.

లబ్ధిదారులనుంచి బాకీలను వసూలు చేయమని జిల్లా స్థాయి యూనిట్లకు ఎప్పటికప్పుడు సూచిస్తూనే ఉన్నామనీ, తమ ఆర్థిక స్థితిగతులు సరిగాలేనందువల్ల లబ్ధిదారులు వాయిదాలను సక్రమంగా చెల్లించటంలేదనీ ప్రభుత్వం పేర్కొన్నది (2013 అక్టోబరు). ఋణాల వసూళ్ళను మెరుగుపరచే ఉద్దేశంతో బకాయిలపై వడ్డీ మాఫీ చేస్తూ లబ్ధిదారులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో ఒక అవకాశం ఇచ్చామని కూడా ప్రభుత్వం తెలిపింది.

ఋణాలవసూలు లేశమాత్రంగా ఉన్నదని ఏపీఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సమీక్షానంతర సమావేశంలో అంగీకరిస్తూ, వసూళ్ళపై పట్టుపట్టకూడదన్నది ప్రభుత్వవిధానమని బదులిచ్చారు. అయితే, ఇందుకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులేవీ ఆడిట్‌కు చూపించలేదు. లబ్ధిదారుల నుంచి వసూలు కావలసిన ఋణాలు, ప్రభుత్వానికి

చెల్లించవలసినవీ ఏపీఎస్‌హెచ్‌సీఎల్ వార్షిక పద్దులలో చూపుతున్నారు. బాకీల వసూలుకు పట్టుపట్టకూడదని ప్రభుత్వం నిజంగానే నిర్ణయించిన పక్షంలో ఈ మొత్తాలను ఏపీఎస్‌హెచ్‌సీఎల్ పద్దులలో చూపటంలో ఔచిత్యం లేదు.

### 3.8.3 పాలనాపరమైన ఛార్జీల వసూలు

పాలనాపరమైన ఛార్జీలను యూనిట్ ధరలో మూడు శాతం చొప్పున లెక్కించి లబ్ధిదారులకు చేసే చెల్లింపులనుంచి ఎప్పటికప్పుడు వసూలు చేయాలని మార్గదర్శకాలలో సూచించారు. తదుపరి కాలంలో ఈ ఛార్జీలను పల్లెలలో ₹750 గానూ పట్టణప్రాంతాలలో ₹1,200 గానూ నిర్ణయించారు. అయితే, ఆన్‌లైన్‌లో వసూలు చేసే మొత్తాలలో ఏకరూపత ఉండటంలేదని ఇందుకు సంబంధించిన డేటాబేస్ పరిశీలించినప్పుడు తెలిసింది. మొత్తం 40.29 లక్షల ఇళ్ళు నిర్మాణం పూర్తి చేసుకొనగా, ఇందులో 4.10 లక్షల మంది లబ్ధిదారుల నుంచి ₹750 కన్నా తక్కువగా వసూలు చేశారు. వారిలో 22,929 మంది నుంచి పాలనాపరమైన ఖర్చులు అసలే వసూలు చేయలేదు.

ఈ లోపాన్ని ప్రభుత్వం కూడా అంగీకరించింది (2013 అక్టోబరు). సమాచారాన్ని ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్‌కు బదిలీ చేస్తున్నప్పుడు డేటాఎంట్రీలో చోటు చేసుకున్న తప్పిదంగా దీన్ని విశ్లేషించింది.

## 3.9 పర్యవేక్షణ

గృహ నిర్మాణ పథకం అమలుకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకొనే విషయంలో ఏపీఎస్‌హెచ్‌సీఎల్ లోని రాష్ట్ర పర్యవేక్షక విభాగం (ఎస్ఎమ్‌యూ) ఒక నోడల్ ఏజన్సీ[16]గా పని చేస్తుంది. నిధుల దుర్వినియోగం వంటి కేసులను ఎస్‌ఓ/పీడీ/ఎన్‌జీఓలకూ, ఇతర కేసులను ప్రాజెక్టు డైరెక్టర్లకూ సందర్భానుసారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల ప్రకారం అప్పగిస్తారు. రెండింతలుగా చేసిన చెల్లింపులు, పాత ఇళ్ళకు చేసిన చెల్లింపులు, అసలు నిర్మాణమే జరగని వాటికి చేసిన చెల్లింపుల వంటి వాటిని తీవ్రమైన నేరాలుగా పరిగణించి రాష్ట్ర పర్యవేక్షక విభాగం విచారిస్తుంది. అంతేకాక లబ్ధిదారుల ఆన్‌లైన్ జాబితా నుంచి డబుల్ ఎంట్రీలను తొలగించవలసి ఉంటుంది.

సమీకృత సర్వే చేపట్టి 5,22,707 మంది అనర్హులైన లబ్ధిదారులకు చెల్లించిన ₹485.19 కోట్లను గుర్తించారు. మరో 1,02,447 మందికి చెల్లించిన ₹36.86 కోట్ల మొత్తం స్వచ్ఛంద వెల్లడి పథకం వలన బయట పడింది. అయితే వీరికి ఇచ్చిన అనుమతులను రద్దు చేసి, ఆయా మొత్తాలను తిరిగి రాబట్టేందుకు ఇటు ఏపీఎస్‌హెచ్‌సీఎల్ కానీ, అటు ప్రభుత్వం కానీ చర్యలు చేపట్టలేదు.

ప్రభుత్వం ఇందుకు సమాధానమిస్తూ (2013 అక్టోబరు), రికవరీలను క్రమంతప్పకుండా సమీక్షిస్తున్నామనీ అర్హతలేని వారి నుంచి అన్ని మొత్తాలనూ వసూలు చేసేందుకు రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించాల్సిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించామనీ పేర్కొన్నది. అంతేకాకుండా, అర్హతలేని లబ్ధిదారులందరినీ కంప్యూటర్ సిస్టంలో డిసేబుల్ చేయటం జరిగింది కనుక వారికి తదుపరి చెల్లింపులు జరగవని కూడా ప్రభుత్వం తెలిపింది.

### 3.9.1 ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

రాష్ట్రంలో గృహ నిర్మాణ పథకం లబ్ధిదారుల నుంచి అందిన ఫిర్యాదులను నమోదు చేసుకొని వాటిని చక్కదిద్దేందుకు గాను ప్రభుత్వం ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థనొకదాన్ని వెబ్ ఆధారితంగా ప్రవేశపెట్టింది (2007 ఆగస్టు). ఇందుకోసం ఒక టోల్‌ఫ్రీ నెంబరును (1100) కూడా ఏర్పాటు చేసింది. ఆ విధంగా వచ్చిన ఫిర్యాదులను ఏపీఎస్‌హెచ్‌సీఎల్ పరిష్కరించి, వారం రోజులలో లబ్ధిదారునికి సంక్షిప్త సందేశం (ఎస్ఎమ్ఎస్) ద్వారా సమాధానం పంపించాలి.

[16] ఏపీఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ నియంత్రణలో పనిచేసే ఒక స్వతంత్ర నిఘా వ్యవస్థ

డేటాబేస్‌లో 2013 మార్చి నాటికి అపరిష్కృతంగా ఉన్న ఫిర్యాదులను పరిశీలించగా 2010-13 మధ్య కాలంలో వచ్చిన 2,823 ఫిర్యాదులకుగాను[17] 664 ఫిర్యాదులు అప్పటికి పరిష్కారమయ్యాయి. నాలుగు ఫిర్యాదులను పరిష్కరించ లేనివిగా పరిగణించారు. ఫిర్యాదులపై వారంలోగా చర్య తేసుకోవలసి ఉండగా, 2,155[18] ఫిర్యాదులు మూడు సంవత్సరాలకు పైగా పెండింగులో ఉన్నాయి.

కొన్ని ఫిర్యాదుల పరిష్కారానికి విచక్షణాత్మక దర్యాప్తు అవసరమవుతుందనీ ఫిర్యాదుదారులు, సాక్ష్యాలు అందుబాటులో లేకపోవటం వలన జాప్యం జరుగుతున్నదనీ ప్రభుత్వం బదులిచ్చింది.

## 3.10 సారాంశం

***నిరుపేద కుటుంబాలకు గృహవసతి కల్పించటం కోసం అమలు చేస్తున్న 'ఇందిరమ్మ' పథకంలో లబ్ధిదారుల గుర్తింపు, నిధుల వినియోగం, నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయటం వంటి విషయాలలో పలు లోపాలు చోటు చేసుకున్నాయి. ప్రామాణిక, ఉత్పాదక నియంత్రణలు కొరవడటం, దరఖాస్తుల పరిశీలన సమగ్రంగా లేకపోవటం, ఇళ్ళకు అనుమతి మంజూరు ప్రక్రియ సక్రమంగా లేకపోవటం మొదలైన కారణాలవలన కొందరు అనర్హులు ఈ పథకంలో ప్రయోజనం పొందారు.***

***ఇళ్ళ నిర్మాణానికి ప్రభుత్వం నిశ్చయించిన యూనిట్ ధర అవాస్తవికంగా ఉండి, ఇది లబ్ధిదారులు పక్కా ఇళ్ళను నిర్దిష్ట ప్రమాణాలలో అదే ధరకు పూర్తి చేసుకొనలేని పరిస్థితికి దారి తీసింది. సిమెంటు తదితర నిర్మాణ సామగ్రి సజావుగా సమకూర్చేలా చూడలేదు. పలు నిర్మితికేంద్రాలు, ఇంకా 2008లో ఏర్పాటు చేసిన గ్రామీణ నిర్మితి కేంద్రాలేవీ పనిచేయటంలేదు.***

***ఈ పథకం కింద మంజూరు చేసిన ఇళ్ళను అదే సంవత్సరంలో పూర్తి చేయాల్సి ఉండగా, సుమారు 42 శాతం ఇళ్ళు అసంపూర్తిగానే ఉన్నాయి. పర్యవేక్షణ పటిష్ఠంగా లేకపోవటంతో అనర్హులైన లబ్ధిదారుల నుంచి సొమ్ము తిరిగి రాబట్టేందుకు చర్యలు తీసుకోలేదు.***

## 3.11 సిఫార్సులు

- ఈ పథకానికి చెందిన డేటాబేస్‌ను విపులంగా సమీక్షించి నిస్సార, నిరుపయోగ సమాచారాన్ని తొలగించేందుకు ప్రభుత్వం పూనుకోవాలి. బీపీఎల్ కుటుంబాల వివరాలు, రేషన్ కార్డు నెంబర్లను పౌర సరఫరాల శాఖ డేటాబేస్‌తో సరిచూసుకోవాలి.
- అప్లికేషన్‌లో ప్రామాణిక నియంత్రణలను బలోపేతంచేసి డేటాలో చోటు చేసుకునే మార్పు చేర్పులను తగు స్థాయిలో సాధికారం చేసి, క్రమం తప్పకుండా వీటిని సమీక్షిస్తూండాలి.
- ఇళ్ళ నిర్మాణానికయ్యే యూనిట్ ధరను తరచూ సమీక్షించి వాస్తవ లెక్కల ఆధారంగా సవరించాలి.
- నిర్మితి కేంద్రాలను, గ్రామీణ నిర్మితి కేంద్రాలను పరిపుష్టంచేసే దిశగా కార్యసాధకంగా అడుగులు వేయాలి.
- కేంద్ర సౌజన్య పథకాల కింద వచ్చిన నిధుల వినియోగం, పూర్తి చేసిన ఇళ్ళ నిర్మాణం విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సరైన వినియోగ ధృవపత్రాలు పంపించేందుకు అవసరమైన యంత్రాంగాన్ని నెలకొల్పాలి.

ఆడిట్ సిఫార్సులను ప్రభుత్వం అంగీకరించి, వాటిని అమలు పరిచేందుకు హామీనిచ్చింది (2013 అక్టోబరు).

[17] చెల్లింపులలో జాప్యం, సిమెంటు బస్తాలు ఇవ్వకపోవటం, అర్హతలేని వారికి చెల్లింపులు చేయటం, వర్క్ ఇనస్పెక్టర్లు పర్యవేక్షణకు రాకపోవటం వంటివి ఈ ఫిర్యాదులలో ఉన్నాయి

[18] 2010-11 లో 322; 2011-12 లో 1,031; 2012-13 లో 802

# అధ్యాయం-4

## పౌర సరఫరాల శాఖ పనితీరుపై ఆడిట్ సమీక్ష

### వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాల శాఖ

## 4.1 పరిచయం

పౌర సరఫరాల శాఖ 1977 వరకు రెవెన్యూ బోర్డులో అంతర్భాగంగా ఉండేది. ఆ తర్వాత ఈ శాఖ ప్రత్యేక గుర్తింపు సంతరించుకుంది. పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యకలాపాలు ఈ కింది విధంగా ఉంటాయి :

- రాష్ట్ర సంస్థలు, భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ద్వారా కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ)కి ధాన్యం కొనుగోలు;
- కేంద్రీయ నిల్వలకోసం లెవీ బియ్యం సేకరణ;
- ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కోసం బియ్యం, గోధుమలు, చక్కెర, కిరోసిన్, పామాయిల్, కందిపప్పు వంటి నిత్యావసర వస్తువుల కొనుగోలు;
- చౌకధరల దుకాణాల (ఎఫ్‌పీఎస్) ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ;
- దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఇవ్వటం;
- బహిరంగ మార్కెట్లో ధరల నియంత్రణ కోసం అవసరమైన సందర్భాల్లో నిత్యావసర వస్తువుల ధరల పర్యవేక్షణ చేస్తూ విపణి వ్యవహారాలలో జోక్యం చేసుకోవటం;
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కార్యకలాపాల వ్యవస్థీకరణ.

### 4.1.1 సంస్థాగత నిర్మాణం

పౌర సరఫరాల శాఖ కమీషనరు ఆ శాఖకు అధిపతి. కమీషనరు తన పదవిరీత్యా ప్రభుత్వ కార్యదర్శిగానూ, ఆ శాఖకు ముఖ్య నియంత్రణాధికారి (సీసీఓ)గానూ వ్యవహరిస్తారు. రాష్ట్ర స్థాయిలో పౌర సరఫరాల సంచాలకులు, జిల్లా స్థాయిలో జిల్లా సరఫరా అధికారులు కమీషనరుకు విధి నిర్వహణలో సహాయ పడతారు. వివిధ స్థాయిల్లో పౌర సరఫరాల శాఖ వ్యవస్థాగత నిర్మాణాన్ని ఈ కింది పటంలో చూడవచ్చును.



## 4.2 ఆడిట్ విధివిధానాలు

### 4.2.1 ఆడిట్ లక్ష్యాలు

ఈ కింది అంశాలను మదింపు చేయడానికి పౌర సరఫరాల శాఖ పనితీరుపై ఆడిట్ సమీక్షను నిర్వహించడమైంది :

- కనీస మద్దతు ధరల అమలు కార్యక్రమాలకూ, ప్రజాపంపిణీ వ్యవస్థకూ సంబంధించి ప్రణాళికా ప్రక్రియ రాష్ట్ర ఆహారధాన్యాల అవసరాలను తీర్చేవిధంగా పటిష్ఠంగానూ, ప్రభావశీలంగానూ ఉన్నాయా;
- ఆహారధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువుల సేకరణ పొదుపుగానూ, సమర్ధవంతంగానూ, కార్యసాధకం గానూ జరిగిందా;
- ప్రజాపంపిణీ పథకాల లబ్ధిదారుల గుర్తింపు యంత్రాంగం లోపరహితంగా ఉన్నదా; లక్షిత లబ్ధిదారులకు ప్రయోజనాలు చేరేలా చర్యలు చేపట్టారా;
- నిత్యావసర వస్తువుల సేకరణ, రవాణా, నిల్వ, నిర్వహణ, పంపిణీలను పొదుపుగానూ, సమర్ధవంతంగానూ, కార్యసాధకంగానూ నిర్వహించేందుకు తగిన సంస్థాగత యంత్రాంగం ఉన్నదా.

### 4.2.2 ఆడిట్ ప్రామాణికంగా తీసుకున్న అంశాలు

ఆడిట్‌లో కనుగొన్న విషయాలను ఈ కింది ప్రామాణిక అంశాలతో సరిచూసుకోవడమైంది :

- నిత్యావసర వస్తువుల చట్టం, 1955;
- ఆంధ్రప్రదేశ్ (లెవీ) బియ్యం సేకరణ ఉత్తర్వు, 1984;
- ప్రజాపంపిణీ వ్యవస్థ (నియంత్రణ) ఉత్తర్వు, 2001;
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ (నియంత్రణ) ఉత్తర్వు, 2008;
- ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్ ;
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలువిడతలుగా జారీచేసిన ఆదేశాలు, మార్గదర్శకాలు, సర్క్యులర్లు మొదలైనవి;
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ల బోర్డు సమావేశ నిర్ణయాలు.

### 4.2.3 ఆడిట్ పరిధి, పద్ధతి

పౌర సరఫరాల శాఖ 2008-13 మధ్యగల ఐదేళ్ళకాలంలో నిర్వహించిన కార్యకలాపాలను 2012 జూలై నుండి 2013 ఏప్రిల్ మధ్య ఆడిట్‌లో సమీక్షించడమైంది.

పౌర సరఫరాల శాఖ కమీషనరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కార్యాలయాల్లోనూ, ఎంపిక చేసుకున్న ఎనిమిది[1] జిల్లాల్లోని జిల్లా సరఫరా అధికారులు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ల కార్యాలయాల్లోనూ రికార్డులను పరిశీలించి ధాన్యం విషయంలో కనీస మద్దతు ధరల అమలు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువుల సేకరణ, నిల్వ, రవాణా, పంపిణీలను సమీక్షించటం జరిగింది.

[1] ఆదిలాబాద్, అనంతపురం, తూర్పు గోదావరి, గుంటూరు, కరీంనగర్, రంగారెడ్డి, విశాఖపట్నం, వైఎస్ఆర్ కడప

పౌర సరఫరాల కమీషనరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టరులతో 2012 జూన్‌లో నిర్వహించిన సమీక్షారంభ సమావేశంలో ఆడిట్ లక్ష్యాలు, పరిధి, పద్ధతి, ప్రామాణికాంశాలు, ఆడిట్ శాంపిల్‌లగురించి వివరించి, అంగీకారానికి రావడమైంది. ఆడిట్‌లో భాగంగా, వివిధ స్థాయిల్లోని ప్రభుత్వ అధికారులకు ప్రశ్నావళిని ఇవ్వడం, వారితో చర్చలు జరపడమైంది. 2013 డిసెంబరులో జరిగిన సమీక్షానంతర సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమీషనరు, పౌర సరఫరాల సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టరు, పౌర సరఫరాల శాఖలోని ఇతర అధికారులతో, ఆడిట్ కనుగొన్న విషయాలను చర్చించడమైంది. ప్రభుత్వ సమాధానాలను ఈ నివేదికలో తగువిధంగా పొందుపర్చడం జరిగింది.

### *4.2.3.1 నమూనా తనిఖీ*

అన్ని జిల్లాల్లోని ధాన్యం సేకరణ, పౌర సరఫరాల వ్యవస్థ కార్యకలాపాల పరిమాణం ఆధారంగా, రాష్ట్రంలోని మూడు ప్రాంతాల[2] నుండి కనీసం రెండేసి జిల్లాల చొప్పున మొత్తం ఎనిమిది జిల్లాలను ఆడిట్‌కు ఎంపిక చేసుకోవడమైంది. ఇలా ఎంపిక చేసుకున్న ప్రతి జిల్లాలోనూ రెండు మండల స్థాయి నిల్వ కేంద్రాల (ఎమ్ఎల్ఎస్ పాయింట్) రికార్డులను తనిఖీ చేయడమైంది. ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న ఎనిమిది జిల్లాల్లోనూ, జిల్లాకు నాలుగు చొప్పున చౌకధరల దుకాణాలను[3] (ఎఫ్‌పీఎస్‌లను) తనిఖీ చేయడంతోపాటు, వీటి పరిధిలోని 30,695 రేషన్ కార్డుల గురించి వారి ఇళ్ళ వద్ద సర్వే నిర్వహించడమైంది. నమూనా తనిఖీ వివరాలను ***అనుబంధం-4.1***లో ఇవ్వడమైంది.

ఆడిట్ సమీక్షా ఫలితాలను తదుపరి పేరాలలో చర్చించడమైంది.

## 4.3 బడ్జెట్, ఖర్చు

పౌర సరఫరాల శాఖకు సంబంధించి 2008-13 మధ్య కాలంలో బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుల వివరాలను ఈ కింది చార్టులో ఇవ్వడమైంది.




*మూలం : వార్షిక వినిమయ పద్దులు*

ఈ శాఖ 2008-13 మధ్య కాలంలో చేసిన మొత్తం ఖర్చు ₹12,862 కోట్లు కాగా, అందులో బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులపై సబ్సిడీకి ₹11,739 కోట్లు[4] (91 శాతం) ఖర్చు కాగా మిగిలిన ₹1,123 కోట్లు సిబ్బంది వ్యవహారాలు, ఇతర కార్యకలాపాలపై ఖర్చయింది.

కేటాయింపులలో ప్రతిఏటా మిగుళ్ళు ఉన్నాయి. ఈ మిగుళ్ళు ₹175 కోట్లు (2008-09) నుండి ₹1,160 కోట్లు (2009-10) వరకు ఉన్నాయి. 'బియ్యంపై సబ్సిడీ' పద్దు కింద 2008-09లో ₹119 కోట్లు (ఐదు శాతం), 2009-10లో ₹1,150 కోట్లు (33 శాతం), 2010-11లో ₹750 కోట్లు (25 శాతం), 2011-12లో ₹220 కోట్లు (తొమ్మిది శాతం), 2012-13లో ₹500 కోట్లు (17 శాతం) చొప్పున మిగుళ్ళేర్పడ్డాయి. ప్రభుత్వం నుండి బడ్జెట్

[2] కోస్తాంధ్ర (3), రాయలసీమ (2) తెలంగాణ (3)

[3] నాలుగు కంటే ఎక్కువ ఎఫ్‌పీఎస్‌లను తనిఖీ చేసిన జిల్లాలు : రంగారెడ్డి (7), కరీంనగర్ (6)

[4] 2008-09: ₹2,343 కోట్లు; 2009-10: ₹2,354 కోట్లు; 2010-11: ₹2,254 కోట్లు; 2011-12: ₹2,284 కోట్లు; 2012-13: ₹2,504 కోట్లు

విడుదల ఉత్తర్వులు, పరిపాలనా మంజూరీలు రాకపోవడం ఈ ఐదేళ్ళలో ప్రతిఏటా మిగుళ్ళేర్పడటానికి కారణాలని పౌర సరఫరాల శాఖ తెలిపింది (2013 జూన్).

ప్రజాపంపిణీ కార్యకలాపాల కోసం మూడునెలలకోసారి పౌర సరఫరాల సంస్థకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. ఈ నిధుల వినియోగానికి సంబంధించి పూర్తి వివరాలతో కూడిన క్లెయిమ్‌లను పౌర సరఫరాల సంస్థ ప్రభుత్వానికి పంపించాలి. ఈ సంస్థ వినియోగ ధృవపత్రాలు (యూసీలు) సమర్పిస్తున్నప్పటికీ 2007-08 నుండి వివరణాత్మక క్లెయిమ్‌లను మాత్రం సమర్పించడంలేదు. 2008-11 మధ్య కాలానికి సంబంధించి, పౌర సరఫరాల సంస్థ వార్షిక పద్దులను సమీక్షించగా (2011-12, 2012-13 సంవత్సరాలకు పద్దులు ఇంకా ఖరారు కాలేదు) యూసీలలో పేర్కొన్న మొత్తం కంటే అకౌంట్లలో సబ్సిడీగా చూపిన మొత్తం తక్కువగా ఉందని వెల్లడైంది. ఆ వివరాలు ఈ కింది చార్టు 4.2లో ఉన్నాయి.




*మూలం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ పద్దులు*

విడుదల చేయాల్సిన నిత్యావసర సరుకుల మేరకు అడ్వాన్సుగా విడుదల చేసిన సబ్సిడీ మొత్తానికి రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ యూసీలను ఇస్తుందనీ, 2007-08 నుండి 2010-11 మధ్యగల కాలానికి వివరణాత్మక క్లెయిమ్‌లను సమర్పించే ప్రక్రియ కొనసాగుతోందనీ ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు).

## 4.4 ప్రణాళిక

చౌకధరల దుకాణాల ద్వారా ప్రజాపంపిణీ కోసం ధాన్యం, బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను కొనుగోలు చేయడం పౌర సరఫరాల శాఖ ప్రధాన విధి. దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్), ఎగువన (ఏపీఎల్) ఉన్న వారికి, ఇతరులకు, ప్రజా పంపిణీ ద్వారా ఇచ్చే ఆహారధాన్యాలను భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) కొనుగోలు చేసి, కేంద్ర అమ్మకం ధర (సీఐపీ)కు రాష్ట్రాలకు ఇస్తుంది. వాటి కొనుగోలు, అమ్మకం ధరల మధ్య వ్యత్యాసాన్ని సబ్సిడీ[5] రూపేణా భారత ప్రభుత్వం భారత ఆహార సంస్థకు విడుదల చేస్తుంది. బీపీఎల్ కుటుంబాలకిచ్చే ఆహారధాన్యాల ధరను మరింత తగ్గించి, ఆ సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది.

భారత ప్రభుత్వం ఇచ్చే కేటాయింపుల ఆధారంగా వివిధ వర్గాల ప్రజలకు పంపిణీ చేయాల్సిన నిత్యావసరాల పరిమాణాన్ని నిర్ణయించడం జరుగుతుంది. భారత ప్రభుత్వం ఇచ్చే ఈ కేటాయింపుల ప్రకారం ప్రతి బీపీఎల్ కుటుంబానికి నెలకు 35 కి.గ్రా. బియ్యం/గోధుమలు, కిలో చక్కెర, కిలో కందిపప్పు, ఒక లీటరు పామాయిల్, ఐదు లీటర్ల కిరోసిన్ ఇవ్వాలి. ఏపీఎల్ కుటుంబాలకు నెలకు 35 కి.గ్రా.ల బియ్యం ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ ద్వారా బీపీఎల్ కుటుంబాలకు 2008 ఏప్రిల్ నుండి 2011 అక్టోబరు మధ్య కాలంలో కిలో బియ్యం రెండు రూపాయల చొప్పున ఇచ్చింది. ఈ ధరను 2011 నవంబరు నుండి మరింత తగ్గించి కిలో బియ్యం ఒక రూపాయికే ఇస్తోంది. ఇది ఎఫ్‌సీఐ నుండి కొనుగోలు చేసే ధర (బీపీఎల్ కుటుంబాల కోసం కి.గ్రా.కు ₹5.65, ఏపీఎల్ కుటుంబాల కోసం కి.గ్రా.కు ₹8.30) కంటే తక్కువ.

---

[5] 2008-09లో ₹4,039 కోట్లు; 2009-10లో ₹4,482 కోట్లు; 2010-11లో ₹5,049 కోట్లు; 2011-12లో ₹5,833 కోట్లు; 2012-13లో ₹6,022 కోట్లు (కేంద్ర సబ్సిడీ ఆహార ధాన్యాల రూపంలో ఉంటుంది. దీనిని పౌర సరఫరాల సంస్థ తీసుకున్న బియ్యం, గోధుమలు, పామాయిలు పరిమాణానికి లెక్కకడతారు)

భారత ప్రభుత్వ లెక్కలకూ, రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన బీపీఎల్ కుటుంబాల సంఖ్యకూ మధ్య వ్యత్యాసం ఉందని ఆడిట్‌లో గమనించడమైంది. భారత ప్రభుత్వం బీపీఎల్ కార్డుదారులకు ఒక్కో కుటుంబానికి నెలకు 35 కి.గ్రా. చొప్పున 25.05 లక్షల కుటుంబాలకు ఏడాదికి 10.52 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం, 2008 జూలైలో, బీపీఎల్ కుటుంబాలుగా పరిగణించడానికి అవసరమైన వార్షిక ఆదాయ పరిమితిని గ్రామీణ ప్రాంతాల్లో ₹20,000 నుండి ₹60,000కు, పట్టణ ప్రాంతాల్లో ₹24,000 నుండి ₹75,000కు పెంచింది. ఫలితంగా, 2012-13 నాటికి రాష్ట్రంలో 2.17 కోట్ల బీపీఎల్ కుటుంబాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం, ఒక్కో కుటుంబానికి నెలకు 35 కి.గ్రా. చొప్పున బియ్యం కేటాయిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం బీపీఎల్ కార్డు ఉన్న వాళ్ళకు కుటుంబానికి నెలకు 20 కి.గ్రా. చొప్పున ఇస్తోంది (2008-13). అంతేకాక, కేంద్ర ప్రభుత్వం ఏపీఎల్ కోటా కింద కేటాయించిన బియ్యాన్ని బీపీఎల్ కార్డుల వారికి ఇస్తుండటంవల్ల రాష్ట్రంలో ఏపీఎల్ కుటుంబాలకు బియ్యం పంపిణీ జరగటంలేదు. అందువలన, వీటి ధరలోని ₹2.65 (కి.గ్రా.కు) వ్యత్యాసాన్ని[6] రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సివస్తోంది. ఆ విధంగా, 2008-13 మధ్య ఏపీఎల్ కోటానుండి మళ్ళించిన బియ్యం 87.96 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, రాష్ట్ర ప్రభుత్వంపై పడిన అదనపు భారం ₹2,330 కోట్లు.

## 4.5 ఆహారధాన్యాల సేకరణ

భారత ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ కోసం ఎఫ్‌సీఐ ద్వారానూ, వికేంద్రీకృత కొనుగోలును అమలు చేస్తున్న కొన్ని రాష్ట్రాల ద్వారానూ ఆహారధాన్యాలను సేకరిస్తోంది. అలా, 2012 అక్టోబరు 1 నుండి వికేంద్రీకరణ విధానంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు భారత ప్రభుత్వం గుర్తించిన ఎనిమిది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఈ విధానం కింద రాష్ట్ర ప్రభుత్వం ఏడు జిల్లాల్లో[7] ధాన్యం కొనుగోలును ప్రారంభించింది. దశలవారీగా దీన్ని మిగిలిన జిల్లాలకు విస్తరించాలని యోచించింది.

### 4.5.1 కనీస మద్దతు కార్యక్రమం కింద ధాన్యం సేకరణ

రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు ప్రోత్సాహక ధర లభించేలా చూడటానికి, మిల్లర్లు, వ్యాపారుల దోపిడీకి గురికాకుండా వారిని కాపాడేందుకు, వ్యవసాయోత్పత్తుల స్థిరీకరణ కోసం భారత ప్రభుత్వం మద్దతు ధరల కార్యక్రమాలు చేపడుతోంది. ఈ కార్యక్రమాల కింద, ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకి వ్యవసాయ ఉత్పత్తులను రైతుల నుండి నేరుగా కొనడం జరుగుతుంది. వ్యవసాయ ఖర్చులు, ధరలకు సంబంధించిన కమీషను సిఫార్సుల ఆధారంగా, ప్రతి ఏటా మార్కెటింగ్ సీజను మొదలవ్వడానికి ముందు భారత ప్రభుత్వం అన్ని వ్యవసాయ ఉత్పత్తులకూ కనీస మద్దతు ధరలను నిర్ణయించి, రాష్ట్రాలకు సమాచారమిస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వివిధ జిల్లాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల (పీపీసీ) ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి వాటిని కస్టమ్ మిల్లింగు చేపట్టి, ఆతర్వాత ఎఫ్‌సీఐకి తరలించే ఉద్దేశంతో మిల్లర్లకు ఇస్తుంది. ప్రతి సీజనులోనూ చేసే ధాన్యం కొనుగోలు ప్రక్రియ వివరాలను ***అనుబంధం-4.2***లో చూపడమైంది. జిల్లాల వారీగా చేసిన ధాన్యం కొనుగోలు వివరాలను ***అనుబంధం-4.3***లో చూడవచ్చును.

రాష్ట్రంలో పండించిన ధాన్యం, రాష్ట్రంలో వినియోగానికి కావలసిన ధాన్యం, రైతుల నుండి నేరుగా సేకరించిన ధాన్యం వివరాలు ఈ కింది పట్టికలో ఉన్నాయి.

---

[6] కేంద్ర ప్రభుత్వ అమ్మకం ధరలు ఏపీఎల్ కోటాకు కి.గ్రా.కు ₹8.30, బీపీఎల్ కోటాకు కి.గ్రా.కు ₹5.65 మధ్య వ్యత్యాసం

[7] చిత్తూరు, గుంటూరు, కరీంనగర్, నల్గొండ, ఎస్‌పీఎస్ నెల్లూరు, ప్రకాశం, వరంగల్

పట్టిక 4.1

(లక్షల మెట్రిక్ టన్నులు)

| | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | 2012-13* |
|---|---|---|---|---|---|
| రాష్ట్రంలో వినియోగించిన బియ్యం | 106 | 107 | 107 | 107 | 108 |
| ధాన్యం నుండి 68 శాతం చొప్పున బియ్యం వస్తే, కావలసిన ధాన్యం | 155 | 157 | 157 | 157 | 159 |
| రాష్ట్రంలో ఉత్పత్తి అయిన బియ్యం | 142 | 108 | 144 | 129 | 112 |
| రాష్ట్రంలో ఉత్పత్తి అయిన ధాన్యం | 209 | 159 | 212 | 190 | 165 |
| రాష్ట్ర ప్రభుత్వం సేకరణ లక్ష్యం | 10 | 10 | 10 | 33 | 11 |
| రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన పరిమాణం | 10 | 3 | 21 | 20 | 14 |
| ఎఫ్‌సీఐ కొనుగోలు చేసిన పరిమాణం | 2 | 1 | 3 | 1 | 0 |
| ప్రైవేటు మిల్లర్లు కొనుగోలు చేసిన పరిమాణం | 166 | 145 | 164 | 131 | 103 |

*మూలం : అర్థ-గణాంక శాఖ సంచాలకులు ప్రచురించిన 'ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం సేకరణ', పౌర సరఫరాల శాఖ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థల రికార్డులు*

*గమనిక : పట్టికలోని పరిమాణాలు ప్రతిఏటా ఖరీఫ్, రబీ సీజన్లు రెండింటినీ కలిపి ఇవ్వడమైంది*

** 2012-13వ సంవత్సరపు ఖరీఫ్ మార్కెటింగ్ సీజనులో ధాన్యం కొనుగోలు పద్దులు 2013 మే 31 వరకు*

ఈ అంశంపై ఆడిట్‌లో కనుగొన్న విషయాలు ఈ కింద పేర్కొనడమైంది :

### *4.5.1.1 ప్రభుత్వం సేకరణ తక్కువగా ఉండటం*

భారత ప్రభుత్వం అంచనా ప్రకారం, ధాన్యం నుండి 68 శాతం చొప్పున బాయిల్డ్ రైస్ వస్తుంది. ఈ లెక్కన, ఆంధ్రప్రదేశ్‌లో ఏడాదికి 155 నుండి 159 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అవసరమవుతుంది. రాష్ట్రంలో వినియోగం అయ్యే పరిమాణం కంటే అధికంగానే ధాన్యం ఉత్పత్తి అవుతున్నప్పటికీ, 2008-13 మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి నేరుగా కొనుగోలు చేసిన ధాన్యం 3 నుండి 21 లక్షల మెట్రిక్ టన్నుల వరకు (అంటే 2 నుండి 11 శాతం వరకు) మాత్రమే ఉంటున్నది. ఫలితంగా, మిల్లర్లు సేకరించే ధాన్యం కంటే ప్రభుత్వ సేకరణ తక్కువగా ఉండటంతో, రైతులు మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సివస్తోంది.

రాష్ట్రంలో ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోళ్ళు తక్కువగా ఉండటానికి మార్కెట్ ధరలు, ధాన్యం సేకరణకు సాంప్రదాయక మార్గాలు అందుబాటులో ఉండటం, రాష్ట్రంలో అధిక సంఖ్యలో బియ్యం మిల్లులు ఉండటంవంటి పలు అంశాలు కారణాలని ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు). రైతుల నుండి కనీస మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేసినట్లు బియ్యం మిల్లర్లు ధృవపత్రాలు సమర్పించాల్సి ఉంటుందని కూడా ప్రభుత్వం తెలిపింది. రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చూసేందుకు చెక్కులు, ఆన్‌లైన్ పేమెంటు ద్వారా మిల్లర్లు చెల్లింపులు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టరు సమీక్షానంతర సమావేశంలో హామీ ఇచ్చారు (2013 డిసెంబరు).

### *4.5.1.2 మార్కెట్ ఫీజు, గ్రామీణాభివృద్ధి సెస్సులకు వినియోగ ధృవపత్రాలను సమర్పించకపోవడం*

రెగ్యులేటెడ్ మార్కెట్ కమిటీలు (ఆర్ఎమ్‌సీలు) నిర్వహించే మార్కెట్ యార్డులు/తాత్కాలిక యార్డుల వద్ద రైతుల నుండి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుంది. ఇందుకోసం కనీస మద్దతు ధరపై ఒక శాతంను మార్కెట్ ఫీజుగానూ, ఐదు శాతాన్ని గ్రామీణాభివృద్ధి (ఆర్‌డీ) సెస్సుగానూ చెల్లిస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల (2010 సెప్టెంబరు) ప్రకారం, మార్కెట్ యార్డుల్లో సరైన మౌలిక వసతులను కల్పించేందుకు ఆర్ఎమ్‌సీలు ఈ మార్కెట్ ఫీజును వినియోగించి, వినియోగ ధృవపత్రాలు సమర్పించాలి. జిల్లా పాలనా యంత్రాంగం, ఆర్‌డీ సెస్సుతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టి, రాష్ట్ర ప్రభుత్వానికి వినియోగ ధృవపత్రాలు సమర్పించాలి. కేంద్ర ప్రభుత్వం నుండి ఈ మొత్తాలకు సంబంధించిన రీఇంబర్స్‌మెంట్‌ను పొందేందుకు

అవసరమైన ధృవపత్రాలను పంపటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయినందువల్ల, 2012-13 నాటికి మార్కెట్ ఫీజు తాలూకు ₹3.49 కోట్లు[8], ఆర్‌డీ సెస్సు తాలూకు ₹18.51 కోట్ల క్లెయిమ్‌లను భారత ఆహార సంస్థ నిలిపివేసింది.

## 4.5.2 కస్టమ్ మిల్డ్ రైస్

ప్రభుత్వ సంస్థలు (ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల సంస్థ/భారత ఆహార సంస్థ) సేకరించిన ధాన్యాన్ని, కస్టమ్ మిల్లింగ్ కోసం రైస్ మిల్లర్లకు ఇవ్వడం జరుగుతుంది. దీనికి సంబంధించి, ఆడిట్‌లో కనుగొన్న విషయాలను ఈ కింద పేర్కొనడమైంది:

### *4.5.2.1 మిల్లర్లతో ఒప్పందాలు*

ధాన్యం కొనుగోలు, కస్టమ్ మిల్లింగ్‌లకు విధానాలను నిర్దేశిస్తూ భారత ప్రభుత్వం ప్రతి ఏటా (2000 సంవత్సరం నుండి) సీజను మొదలుకావడానికి ముందే మార్గదర్శకాలను రూపొందిస్తోంది. ఐతే, 2011-12 వరకు, మిల్లర్లతో ఒప్పందాలను కుదుర్చుకోలేదు. దీనివల్ల మిల్లింగ్ బియ్యాన్ని సకాలంలో సరఫరాచేసేలా నిర్దేశించేందుకు, జాప్యం జరిగిన సందర్భాల్లో జరిమానాలు విధించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు వీలుకాలేదు.

ఖరీఫ్ మార్కెటింగ్ సీజను 2011-12 వరకు ఒప్పందాలను కుదుర్చుకోలేదనీ, మిల్లింగ్ ద్వారా వచ్చిన బియ్యం సరఫరా కోసం రైస్ మిల్లర్ల సంఘంతో అవగాహన ఒప్పంద పత్రాలను తీసుకోవడం జరిగిందనీ ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు).

### *4.5.2.2 కస్టమ్ మిల్లింగ్ బియ్యం సరఫరాలో జాప్యం*

ధాన్యం సేకరించి, మిల్లర్లకు ఇచ్చిన నాటినుండి 15 రోజుల్లోగా మిల్లరు ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యం ఇవ్వాలని మార్గదర్శకాల్లో సూచించారు. ధాన్యం కొనుగోలు, మిల్లింగ్‌ల వ్యవహారాలను, ఎఫ్‌సీఐకు బియ్యం సరఫరాను జాయింట్ కలెక్టర్లు, జిల్లా, క్షేత్ర స్థాయిల్లో సంబంధిత అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని కూడా మార్గదర్శకాల్లో సూచించారు. ఎఫ్‌సీఐకు సరఫరా చేసిన బియ్యం తాలూకు చెల్లింపులను క్లెయిమ్ చేసేందుకు, భారత రిజర్వు బ్యాంకు నుండి పొందిన క్యాష్ క్రెడిట్‌ను తిరిగి చెల్లించేందుకు ఈ విధమైన పర్యవేక్షణ అత్యంతావశ్యకం. అయితే, ఏ జిల్లాలోనూ నిర్దేశిత పర్యవేక్షణ యంత్రాంగం లేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరాలో జరిగిన జాప్యాలు ఈ విధమైన పర్యవేక్షణ లోపాన్ని నిర్ధారిస్తున్నాయి. ఆవిధంగా, 2008-13 మధ్య, ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్లలో సాలీనా జరిగిన సగటు జాప్యాలు 46 రోజులు (2008-09) నుండి 110 రోజులు (2011-12) వరకు ఉన్నాయి. ఇదే కాలానికి, ఈ జాప్యాల కారణంగా క్యాష్ క్రెడిట్‌పై వడ్డీ రూపేణా ₹171 కోట్లు[9] చెల్లించవలసివచ్చింది.

బియ్యం సరఫరాలో జాప్యం జరుగుతోందని ప్రభుత్వం అంగీకరించింది. ఐతే, ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయడంతోపాటు లెవీ బియ్యం, బహిరంగ మార్కెట్‌లో అమ్మే బియ్యంకోసం మిల్లర్లు కూడా ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లింగ్ చేస్తుండటంవల్ల జిల్లా అధికారులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ ఈ జాప్యాలు జరుగుతున్నాయని ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు). ఐతే, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే మార్గదర్శకాల్లో 15 రోజుల వ్యవధిని నిర్ధారించారు. కాబట్టి ప్రభుత్వ సమాధానంలో పేర్కొన్న కారణాలను అంతకు ముందే పరిగణనలోకి తీసుకోవడం జరిగింది.

## 4.5.3 ఇతర సరుకుల కొనుగోలు

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఇవ్వడానికి బియ్యంతో పాటుగా, గోధుమలు, చక్కెర, కందిపప్పు, పామాయిల్, కిరోసిన్ వంటి ఇతర నిత్యావసర వస్తువులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. మార్కెట్ ధరల నియంత్రణ చర్యల్లో భాగంగా పౌర సరఫరాల శాఖ ఈ కార్యకలాపాలు చేపడుతోంది.

---

[8] ఈ మొత్తంలో మూడేళ్ళ క్రితం క్లెయిమ్‌లు కూడా ఉన్నాయి

[9] రెండు నెలల కాలానికి ఎఫ్‌సీఐ అనుమతించిన వడ్డీని తీసివేసిన తర్వాతనే బియ్యం ధరను లెక్కించడమైంది

### 4.5.3.1 కిరోసిన్

ప్రభుత్వం నిర్ణయించిన ధరకు చిల్లర వర్తకుల (ఎఫ్‌పీఎస్) వద్దకు టోకు వర్తకులు కిరోసిన్‌ను సరఫరా చేయాలి. టోకు వర్తకుల లాభం, ఆయిల్ డిపో నుండి టోకు వర్తకం జరిగేచోటుకు, అక్కడి నుండి చిల్లర వర్తకం జరిగేచోటుకు అయ్యే రవాణా ఖర్చులు కలుపుకుని పీడీఎస్ కిరోసిన్ ధర, ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే ఎక్కువ ఉంటే ఈ వ్యత్యాసాన్ని కిరోసిన్ ప్రైస్ ఈక్వలైజేషన్ ఫండ్ (కేపీఈఎఫ్) నుండి టోకు వర్తకులకు జిల్లా కలెక్టరు చెల్లించాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే వాస్తవ వ్యయం తక్కువగా ఉంటే జిల్లా కలెక్టరు, ఈ ధరల వ్యత్యాసాన్ని టోకు వర్తకుల నుండి వసూలు చేసి కేపీఈఎఫ్‌కు జమచేయాలి. పీడీఎస్ కిరోసిన్‌కు సంబంధించి ఈ ధరల వ్యత్యాసాన్ని ఖరారు చేసి, గత నెలలో చిల్లర వర్తకులకు విడుదల చేసిన కిరోసిన్ పరిమాణం ఆధారంగా ప్రతి నెలా 10వ తేదీ నాటికి బకాయిలు తమకు చెల్లింపులు జరిగేలా చూడాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. టోకు వర్తకులకు చెల్లించాల్సిన బకాయిలేమైనా ఉంటే కేపీఈఎఫ్ నుండి చెల్లించాలి. వసూళ్ళు లేదా చెల్లింపుల వివరాలను ప్రతి నెలా 20వ తేదీ నాటికి నివేదించాలి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను ప్రతి నెలా 10వ తేదీ నాటికి చెల్లించకపోతే, తదుపరి కోటా కిరోసిన్‌ను విడుదల చేయకూడదు. అంతేకాక, గత నెలాఖరునాటికి ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాలేవీ బకాయి లేవని సంబంధిత జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్‌ఓ) ధృవపత్రాన్ని అందచేయాలి.

ఐతే, డిమాండు, వసూళ్ళు, బకాయిల వివరాల (డీసీబీ) రిజిస్టరును, లావాదేవీల పూర్తి వివరాలను ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న ఏఒక్క జిల్లాలోనూ సక్రమంగా నిర్వహించడంలేదని పరిశీలనలో వెల్లడైంది. మచ్చుకు తనిఖీ చేసిన ఎనిమిది జిల్లాలకుగానూ, ఏడు జిల్లాలకు సంబంధించి 'సండ్రీ డెటార్స్' జాబితాను పరిశీలించగా డీలర్ల నుండి ₹9.69 కోట్లు[10] వసూలు కావల్సి ఉందని తెలిసింది. ఐతే, డీసీబీ రిజిస్టర్లలో లావాదేవీల పూర్తి వివరాలు లేని కారణంగా, 'సండ్రీ డెటార్స్' కింద చూపిన మొత్తాల ఖచ్చితత్వాన్ని ఆడిట్‌లో పరిశీలించడం వీలుకాలేదు. టోల్‌గేట్ ఫీజు, వ్యాట్‌లను మినహాయించాలని కిరోసిన్ టోకు వర్తకుల సంఘం చేసిన విజ్ఞప్తి ఇంకా పరిష్కరించాల్సి ఉందనీ, ఈ అంశం పరిష్కారమైన తర్వాత తాజా డిమాండు పంపుతామని గుంటూరు జిల్లా పౌర సరఫరాల అధికారి సమాధానమిచ్చారు (2013 జనవరి).

### 4.5.3.2 చక్కెర

రాష్ట్రం లోపల, బయట ఉన్న వివిధ చక్కెర కర్మాగారాల నుండి లెవీ చక్కెరను పొందేలా రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం కేటాయింపులు చేస్తుంది. రేషన్ కార్డులున్న వారికి రాష్ట్రంలోని చౌకధరల దుకాణాల ద్వారా చక్కెర పంపిణీ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున లెవీ చక్కెర వ్యవహారాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చూస్తుంది. కొనుగోలు ధరకు, అమ్మకం ధరకు మధ్య వ్యత్యాసాన్ని మార్జిన్లతో కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు కేంద్ర ప్రభుత్వం తరపున భారత ఆహార సంస్థ చెల్లిస్తుంది. పౌర సరఫరాల సంస్థ సమర్పించిన 'లెవీ సుగర్ ప్రైస్ ఈక్వలైజేషన్ ఫండ్' క్లెయిమ్‌ల ఆధారంగా ఈ చెల్లింపులు జరుగుతాయి. ఇందుకు సంబంధించి, ఆడిట్ పరిశీలనలో వెల్లడైన అంశాలు ఈ విధంగా ఉన్నాయి :

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ భారత ఆహార సంస్థకు క్లెయిమ్‌లను సమర్పించడంలో 2002-03 నుండి 2011-12 మధ్య 8 నెలల నుండి 30 నెలల వరకు జాప్యం జరిగింది. ఫలితంగా, పౌర సరఫరాల సంస్థకు ₹29.30 కోట్ల నష్టం వాటిల్లింది (జాప్యం జరిగిన కాలానికి క్లెయిమ్‌ల ద్వారా వచ్చిన

[10] రంగారెడ్డి : ₹2.76 కోట్లు (2009 మార్చి నుండి బకాయిలో ఉంది); అనంతపురం : ₹2.26 కోట్లు (2012 జులై నుండి బకాయిలో ఉంది), కరీంనగర్ : ₹1.44 కోట్లు (2011 అక్టోబరు నుండి బకాయిలో ఉంది); విశాఖపట్నం : ₹1.41 కోట్లు (2012 మార్చి నుండి బకాయిలో ఉంది); గుంటూరు : ₹0.91 కోటి (2011 ఏప్రిల్ నుండి బకాయిలో ఉంది); తూర్పు గోదావరి : ₹0.74 కోటి (2012 అక్టోబరు నుండి బకాయిలో ఉంది); ఆదిలాబాద్ : ₹0.17 కోటి (2010 జూన్ నుండి బకాయిలో ఉంది)

మొత్తంపై లెక్కించడమైంది[11]). ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ 2011-12 సంవత్సరానికి క్లెయిమ్‌లను సమర్పించలేదు. అంతేకాక, 2012-13 సంవత్సరపు పద్దులు (2013 జూన్ నాటికి) ఖరారు కాలేదు.

ఆడిటర్ల నుండి ధృవపత్రాలను పొందిన తర్వాత పౌర సరఫరాల సంస్థ క్లెయిమ్‌లను సమర్పిస్తోందనీ, పద్దులు ఖరారు కావడంలోనూ, వాటి ఆడిట్‌లోనూ జరిగే జాప్యంవల్ల క్లెయిమ్‌లలో ఆలస్యం జరుగుతోందనీ ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు). పౌర సరఫరాల సంస్థ తమ వార్షిక పద్దులను సకాలంలో పూర్తి చేసుకుని, వెంటనే క్లెయిమ్‌లను పంపేవిధంగా చర్యలు తీసుకోవలసి ఉన్నందున పై సమాధానం అంగీకారయోగ్యం కాదు.

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ రవాణా చార్జీల క్లెయిమ్‌లను వాస్తవ ఖర్చుల ఆధారంగా ఎఫ్‌సీఐకు సమర్పిస్తోంది. 2007-08 నుండి 2010-11[12] మధ్యకాలంలో మెట్రిక్ టన్నుకు ₹388.10 నుండి ₹1,152.77 వరకు రవాణా చార్జీలపై ఖర్చయింది. ఐతే, భారత ప్రభుత్వం నిర్ణయించిన మార్జిన్ల మేరకు, ఎఫ్‌సీఐ రవాణా చార్జీల క్లెయిమ్‌లను మెట్రిక్ టన్నుకు ₹354.30 చొప్పున మాత్రమే చెల్లించింది. ఫలితంగా, చక్కెర రవాణా కోసం రాష్ట్ర పౌర సరఫరాల సంస్థపై ₹14.14 కోట్ల అదనపు భారం పడింది. భారత ప్రభుత్వం నిర్ణయించిన మార్జిన్ల మేరకు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఖర్చులను పరిమితం చేసుకుని ఉంటే, ఈ అదనపు భారాన్ని నివారించి ఉండవచ్చు.

  చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏలు) ఇచ్చిన ధృవపత్రాల ఆధారంగా, భారత ప్రభుత్వం మార్జిన్లను సవరించిన తర్వాత మొత్తం రవాణా ఖర్చులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ రీఇంబర్స్‌మెంట్ పొందుతుందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 అక్టోబరు). ఐతే, సీఏ ఇచ్చిన ధృవపత్రాల ఆధారంగా 2010-11 వరకు సమర్పించిన క్లెయిమ్‌ల పూర్తి మొత్తాలను భారత ఆహార సంస్థ ఆమోదించ లేదని ఆడిట్ పరిశీలనలో తెలిసింది.

### 4.5.3.3 పామాయిల్

బహిరంగ మార్కెట్‌లో వంటనూనెల ధరల పెరుగుదలను నియంత్రించేందుకు ఆర్‌బీడీ[13] పామాయిల్‌ను దిగుమతి చేసుకుని కి.గ్రా.కు ₹15 లేదా 910 గ్రాముల ప్యాకెట్‌కు ₹13.65 చొప్పున సబ్సిడీతో బీపీఎల్ కుటుంబాలకు పంపిణీ చేసేందుకు భారత ప్రభుత్వం 2008 జూన్‌లో ఒక పథకాన్ని రూపొందించింది. ప్రతి కుటుంబానికి లేదా రేషన్ కార్డుకు నెలకు గరిష్టంగా ఒక లీటరు పామాయిల్‌ను పంపిణీ చేయాలి. ఆర్‌బీడీ పామాయిల్‌ను దిగుమతి చేసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి సరఫరా చేసే బాధ్యతను భారత ప్రభుత్వం ఎమ్‌ఎమ్‌టీసీ[14]కి అప్పగించింది. తిరిగి రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ కొనుగోలు, పంపిణీ బాధ్యతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు అప్పగించింది.

ఆర్‌బీడీ పామాయిల్ దిగుమతి, సరఫరా కోసం రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ 2008-09లో ఎమ్‌ఎమ్‌టీసీతో ఒప్పందం కుదుర్చుకుంది. తర్వాత ఈ ఒప్పందాన్ని 2012-13 వరకు పొడిగించారు. దిగుమతి చేసుకున్న ఆర్‌బీడీ పామాయిల్‌ను కాకినాడ, కృష్ణపట్నం పోర్టుల వద్ద ఉన్న ప్యాకింగ్ యూనిట్ల ద్వారా ఒక లీటరు ప్యాకెట్లలో ఎమ్‌ఎమ్‌టీసీ సరఫరా చేస్తోంది. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ 2008-09 నుండి 2012-13 మధ్యకాలంలో ₹31.18 కోట్ల ట్రేడ్ మార్జిన్‌ను చెల్లించింది.

---

[11] క్యాష్ క్రెడిట్‌పై చెల్లించిన సగటు వడ్డీ రేటు (12 శాతం)తో నష్టాన్ని లెక్కించడమైంది (2011-12 సంవత్సరానికి తీసుకున్న అంకెలు తాత్కాలికం)

[12] 2011-12, 2012-13 సంవత్సరాల క్లెయిమ్‌లు ఖరారు కాలేదు

[13] రిఫైన్డ్, బ్లీచ్డ్, డీయోడరైజ్డ్ (శుద్ధి చేసిన, తెల్లబరచిన, చెడువాసనను పోగొట్టిన)

[14] భారతీయ లోహాలు, ఖనిజాల వ్యాపార సంస్థ (మెటల్స్ అండ్ మినరల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్)

పామాయిల్ దిగుమతి కోసం ఎమ్ఎమ్టీసీకి చేసిన చెల్లింపులను ఆడిట్‌లో సమీక్షించగా, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎమ్ఎమ్టీసీతోనూ, రవాణా కాంట్రాక్టర్లతోనూ కుదుర్చుకున్న ఒప్పందాల్లో డెమరేజి చార్జీలు, హ్యాండ్లింగ్ నష్టాలు, వడ్డీ చెల్లింపులు, ఇన్సూరెన్సు చార్జీలకు సంబంధించిన నిబంధనల విషయంలో కొన్ని లోపాలున్నాయని వెల్లడైంది. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

| అంశం | ఆడిట్‌లో కనుగొన్న విషయం |
|---|---|
| *డెమరేజి చార్జీలు* | ఒప్పందంలో డెమరేజి చార్జీల గురించి నిర్దిష్ట నిబంధనేదీ లేదు. కానీ, 2008-13 మధ్య కాలంలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎమ్ఎమ్టీసీకి ₹3.32 కోట్లను డెమరేజి చార్జీలుగా చెల్లించింది. |
| *హ్యాండ్లింగ్ నష్టాలు* | అనుమతించదగ్గ కనిష్ట, గరిష్ట హ్యాండ్లింగ్ నష్టాల గురించి ఒప్పందంలో ప్రస్తావించలేదు. ఒక్కో ఓడ ద్వారా దిగుమతి చేసుకున్న మొత్తం పామాయిల్ పై చార్జి చేసిన హ్యాండ్లింగ్ నష్టాలు 0.15 శాతం నుండి 1.55 శాతం వరకు, మెట్రిక్ టన్నుకు ₹24.04 నుండి ₹687.32 వరకు ఉన్నాయి. 2008-09 నుండి 2012-13 మధ్య కాలంలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ హ్యాండ్లింగ్ నష్టాల రూపేణా ₹22.04 కోట్లు చెల్లించింది. |
| *వడ్డీ చెల్లింపులు* | • ఒప్పందంలోని నిబంధనల ప్రకారం, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చేసే చెల్లింపుల్లో జాప్యం జరిగితే ఎమ్ఎమ్టీసీ, ల్యాండెడ్ కాస్ట్‌పై 12.5 శాతం చొప్పున వడ్డీని క్లెయిమ్ చేయవచ్చు. జాప్యంతో జరిగిన చెల్లింపులపై ఏరోజు నుండి వడ్డీని లెక్కించాలనే అంశంపై ఒప్పందంలో నిర్దిష్ట నిబంధనేదీ లేనికారణంగా, ప్రొఫార్మా ఇన్వాయిస్‌లు అందిన తేదీ నుండి చెల్లింపు జరిగిన తేదీ వరకూ జరిగిన జాప్యానికి మాత్రమే వడ్డీని చార్జి చేయడానికి బదులు, సరుకు ఎక్కించిన పోర్టులో ఓడ బయల్దేరిన రోజు నుండి ఓడ నుండి ఆయిల్‌ను పూర్తిగా ఖాళీ చేసిన రోజు వరకూ ఎమ్ఎమ్టీసీ వడ్డీని చార్జి చేసింది. ఫలితంగా, ₹6.81 కోట్లను వడ్డీ రూపేణా అధికంగా చెల్లించినట్లైంది. |
| | • సబ్సిడీ రూపేణా కి.గ్రా.కు ₹15 చొప్పున భారత ప్రభుత్వం నుండి ఎమ్ఎమ్టీసీకి నేరుగా వస్తుంది. సబ్సిడీని కి.గ్రా.కు ₹15 లేదా ఒక లీటరు ప్యాకెట్ (910 గ్రాములు)కు ₹13.65 చొప్పున మినహాయించి నికరధర ప్రకారం మొత్తం నూనె ధరను రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, ఎమ్ఎమ్టీసీకి చెల్లిస్తుంది. సబ్సిడీ రీఇంబర్స్‌మెంట్ అంశంతో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు సంబంధంలేదు. కాబట్టి దీని చెల్లింపుపై జాప్యానికి పౌర సరఫరాల సంస్థ బాధ్యత వహించనవసరం లేదు. 2009-10లో మొత్తం 12 ఓడల సరుకుపై ప్రతి కేసులోనూ 90 రోజులకు, భారత ప్రభుత్వం చెల్లించే ₹15 సబ్సిడీని కూడా కలుపుకుని 11.25 శాతం వడ్డీని ఎమ్ఎమ్టీసీ చార్జి చేయగా రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఆమేరకు చెల్లింపులు చేసింది. దీనివల్ల ₹3.73 కోట్ల అధిక చెల్లింపు జరిగింది. ఎమ్ఎమ్టీసీ సబ్సిడీని భారత ప్రభుత్వం నుండి పొందుతుంది కాబట్టి, సబ్సిడీపై వడ్డీని చార్జి చేయడం ఒప్పందానికి విరుద్ధం. |
| *పామాయిల్ రవాణా* | ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, రవాణా కాంట్రాక్టర్లతో కుదుర్చుకున్న ఒప్పందాలను పరిశీలించగా, ఇన్సూరెన్స్ చార్జీలను ట్రాన్స్‌పోర్టర్లే చెల్లించే విషయంలో వివిధ జోన్లలోని ఒప్పందాల్లో ఒకే విధానాన్ని అనుసరించలేదని వెల్లడైంది. రవాణా కాంట్రాక్టర్లే ఇన్సూరెన్సు చార్జీలను చెల్లించేట్లు, ఒకే విధమైన నిబంధనను ఒప్పందాల్లో చేర్చని కారణంగా రవాణా/సముద్ర మార్గ ప్రయాణం తాలూకు ఇన్సూరెన్సు చార్జీల రూపేణా ₹0.82 కోటి[15] చెల్లింపు చేయాల్సివచ్చింది. |

ఆడిట్‌లో కనుగొన్న ఈ అంశాలను ప్రభుత్వం అంగీకరిస్తూ, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ రిఫండ్ క్లెయిమ్‌లను ఎమ్ఎమ్టీసీకి పంపించిందని తెలిపింది (2013 అక్టోబరు).

[15] 2008-12 మధ్యకాలంలో, మొత్తం ఎనిమిది జిల్లాలకూ సంబంధించిన మొత్తం

### 4.5.3.4 ట్రేడింగ్ మార్జిన్ రూపేణా అధిక చెల్లింపు

భారత ప్రభుత్వ మార్గదర్శకాల్లోని పేరా 8 ప్రకారం కేంద్రం కి.గ్రా.కు ఇచ్చే ₹15 సబ్సిడీని మినహాయించి, పామాయిల్ దిగుమతికి అయిన మొత్తం ఖర్చు[16]ను రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. మార్గదర్శకాల్లోని 9వ పేరా ప్రకారం, ఆయిల్ ల్యాండెడ్ కాస్ట్, మార్గదర్శకాల్లోని 8వ పేరాలో ప్రస్తావించిన విధంగా ఎమ్ఎమ్‌టీసీ భరించిన మిగతా అన్ని చార్జీలను కలుపుకున్న మొత్తంపై గరిష్టంగా 0.75 శాతం వరకు ట్రేడింగ్ మార్జిన్‌ను (పాలనాపరమైన ఖర్చులు) ఎమ్ఎమ్‌టీసీ రాష్ట్ర ప్రభుత్వంపై చార్జి చేయవచ్చు.

2008-13 మధ్యకాలంలో దిగుమతి చేసుకున్న పామాయిల్ తాలూకు లావాదేవీలను ఆడిట్‌లో సమీక్షించగా, రేవు సుంకం, డెమరేజీ చార్జీలు, హ్యాండ్లింగ్ నష్టాలు, సర్వే ఛార్జీలు, స్టోరేజీ చార్జీలు, స్టోరేజీ ఇన్సూరెన్సు, చెల్లింపుల జాప్యంపై వడ్డీవంటి ఇతర అనుబంధ చార్జీలను మినహాయించకుండా సరుకు దిగుమతిపై అయిన మొత్తం ఖర్చుపై 0.75 శాతం చొప్పున ట్రేడింగ్ మార్జిన్‌ను చెల్లించినట్లు వెల్లడైంది. ఫలితంగా, ఎమ్ఎమ్‌టీసీకి అధిక చెల్లింపు జరిగింది.

పైన పేర్కొన్న అంశాన్ని ప్రభుత్వం అంగీకరిస్తూ, అధిక చెల్లింపుల తాలూకు రిఫండ్ క్లెయిమ్ (₹15.34 లక్షలు) ఎమ్ఎమ్‌టీసీకి సమర్పించడం జరిగిందని తెలిపింది (2013 అక్టోబరు).

## 4.6 ప్రజాపంపిణీ వ్యవస్థ

అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీ ధరలకు నిత్యావసర సరుకులను అందజేసేందుకు ఉద్దేశించిన సామాజిక భద్రతా యంత్రాంగమే ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్). వివిధ ప్రజాపంపిణీ పథకాల కింద భారత ప్రభుత్వం ఆహార ధాన్యాలు (బియ్యం, గోధుమలు), లెవీ చక్కెరను రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తనవంతు సహాయాన్ని కూడా అందిస్తూ, బియ్యం, కందిపప్పు, కిరోసిన్, పామాయిల్ వంటి సరుకులను బీపీఎల్ కుటుంబాలకు సబ్సిడీ ధరలకు అందిస్తోంది. ప్రజాపంపిణీ వ్యవస్థలోని వివిధ దశలను ఈ కింద చిత్రంలో చూడవచ్చును.




[16] పీఎస్‌యూలు భరించిన పోర్టు చార్జీలు, రవాణా ఖర్చులు, బ్యాంకు చార్జీలు, మారకం విలువ హెచ్చు తగ్గుల వల్ల ఉత్పన్నమయ్యే చార్జీలు, ట్రేడింగ్ మార్జిన్, వడ్డీ, శుద్ధికి, ప్యాకింగుకు అయిన ఖర్చులు, స్టోరేజి చార్జీలు, మొదలైన వాటితో కలుపుకుని ప్యాకింగు పూర్తయ్యే వరకు వర్తించే అన్ని ఖర్చులు

### 4.6.1 లబ్ధిదారుల గుర్తింపు

రేషన్ కార్డులు జారీ చేయడానికి పౌర సరఫరాల శాఖ 2005లో పౌరుల విశిష్ట గుర్తింపు కోసం ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్ విధానాన్ని అనుసరించింది. ఈ విధానంలో రాష్ట్రంలోని ప్రజలందరి ఐరిస్‌లను, కుటుంబాల ఫోటోలను, ఆదాయం, చిరునామా మొదలైన వివరాలను సేకరించారు. లబ్ధిదారుల గుర్తింపులో చోటు చేసుకున్న లోపాలను తదుపరి పేరాల్లో చర్చించడమైంది.

#### *4.6.1.1 ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్ వ్యవస్థ ద్వారా సేకరించిన సమాచారాన్ని సమీకృతం చేయకపోవడం*

ఒకే డీపీఎల్[17] కేంద్రం నుండి ఒకే కుటుంబానికి ఒకటి కంటే ఎక్కువ రేషన్ కార్డులు జారీకాకుండా ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్ వ్యవస్థ నిలువరించలేకపోయిందని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. అంతేకాక, వివిధ డీపీఎల్ కేంద్రాల్లో సేకరించిన ఐరిస్ ఇమేజ్‌ల డేటాను సమీకృతం చేయకపోవడంవల్ల ఒకే కుటుంబంలోని సభ్యులకు వేరువేరు డీపీఎల్ కేంద్రాల వద్ద ఒకటికి మించి రేషన్ కార్డులు జారీచేయడం జరిగింది.

#### *4.6.1.2 కుటుంబాల సంఖ్యను మించి జారీ అయిన రేషన్ కార్డులు*

సంవత్సరాల వారీగా బీపీఎల్ కుటుంబాల సంఖ్యలోని మార్పును చార్టు 4.3లో చూపడమైంది.




*మూలం : పౌర సరఫరాల శాఖ రికార్డులు*

2008-12 మధ్యకాలంలో బీపీఎల్ కుటుంబాల సంఖ్య పెరిగిందనీ, 2012-13లో స్వల్పంగా తగ్గిందనీ పక్కనున్న చార్టు నుండి తెలుస్తోంది. బీపీఎల్ కుటుంబాల సంఖ్య 2009-10లో అంతకు ముందున్న ఏడాది కంటే 16 లక్షల (తొమ్మిది శాతం) మేర ఒకేసారి పెరగడానికి బీపీఎల్ కుటుంబాల వార్షిక ఆదాయ పరిమితిని 2008 జూలై నుండి గ్రామీణ ప్రాంతాల్లో ₹20,000 నుండి ₹60,000కు, పట్టణ ప్రాంతాల్లో ₹24,000 నుండి ₹75,000కు పెంచడం కారణం కావచ్చు.

రాష్ట్రంలోని మొత్తం కుటుంబాల సంఖ్య 2011 జనాభా లెక్కల ప్రకారం, 210.23 లక్షలు. ఐతే, 2010-11లో బీపీఎల్ కార్డుల సంఖ్య (ఏఏవై, అన్నపూర్ణ కార్డులను కలుపుకుని) 204.02 లక్షలు, అంటే రాష్ట్రంలోని మొత్తం కుటుంబాల సంఖ్యలో 97 శాతం. అంతేకాక, 2010-11లో ఏపీఎల్ కార్డుల సంఖ్య 29.94 లక్షలు. లబ్ధిదారులను బయోమెట్రిక్ విధానంలో గుర్తించినప్పటికీ జారీ అయిన మొత్తం రేషన్ కార్డుల సంఖ్య (233.96 లక్షలు), రాష్ట్రంలోని మొత్తం కుటుంబాల సంఖ్య (210.23 లక్షలు) కంటే అధికంగా ఉంది.

రాష్ట్రంలోని మొత్తం జనాభా 8.47 కోట్లు (2011 జనాభా లెక్కలు) కాగా, బీపీఎల్[18] క్యాటగిరీ కింద 7.14 కోట్ల జనాభా (84 శాతం)కు నిత్యావసర సరుకుల కేటాయింపు జరిగినట్లు ప్రభుత్వం తెలిపింది (2013 డిసెంబరు). బీపీఎల్ కార్డులను జారీ చేసేముందు, అందుకు నిర్ణయించిన అర్హతలను సక్రమరీతిలో తనిఖీ చేయలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. ఆ వివరాలను తదుపరి పేరా (4.6.1.3)లో చర్చించడమైంది.

---

[17] డీపీఎల్ : డిజిన్నేటెడ్ ఫోటోగ్రఫీ లొకేషన్

[18] భారత ప్రభుత్వ అంచనాల ప్రకారం, 2012 మార్చి 1 నాటికి రాష్ట్రంలో బీపీఎల్ జనాభా 78.78 లక్షలు మాత్రమే (మొత్తం జనాభాలో 9.20 శాతం)

### 4.6.1.3 తనిఖీ ప్రక్రియ పటిష్టంగా లేకపోవడం

ప్రభుత్వ ఆదేశాల (2005 మే) ప్రకారం, బీపీఎల్ కార్డును జారీ చేసే ముందు దరఖాస్తుదారులు వెల్లడించిన వివరాలను క్షేత్ర స్థాయిలో తనిఖీలద్వారా నిర్ధారించుకోవాలి. దరఖాస్తుదారునకు బీపీఎల్ కార్డు అర్హత లేదని నిర్ధారణ అయితే, ఏపీఎల్ కార్డును జారీ చేయాలి. దరఖాస్తుదారు నివాసం ఉండేచోటు ఆధారంగా అతడి/ఆమె వ్యక్తిగత గుర్తింపు ప్రాతిపదికన మాత్రమే బీపీఎల్ (తెల్ల) రేషన్ కార్డుల జారీ జరుగుతోందని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. దరఖాస్తుదారు కల్గి ఉన్న భూ కమతాలు, వార్షిక కుటుంబ ఆదాయం (అద్దెలు, స్థిరాస్తులు మొదలైన ఇతర వనరుల నుండి వచ్చే ఆదాయంతో సహా) వంటి ఇతర అర్హతలను పరిశీలించిన దాఖలా లేదు.

ప్రభుత్వ రంగంలోని ఉద్యోగస్తులు, 750 చ.అ. లేదా అంతకుమించిన ప్లింత్ ఏరియాతో పక్కా భవనాలున్నవారు, నాలుగు చక్రాల వాహనాల యజమానులు బీపీఎల్ కార్డులు పొందడానికి అర్హులుకారు. ఐతే, పౌర సరఫరాల శాఖ డేటాబేస్‌ను పరిశీలించగా, 17,940 మంది ప్రభుత్వోద్యోగులు, 89,850 మంది నాలుగు చక్రాల వాహనాలు కలవారు, ఇంకా 750 చ.అ. మించి ప్లింత్ ఏరియా కల్గిన ఇళ్ళున్న 20,545 మందికి బీపీఎల్ కార్డులు జారీచేసినట్లు వెల్లడైంది.

రేషన్ కార్డుల మంజూరుకోసం ప్రజల నుండి వచ్చిన దరఖాస్తుల నమోదు, తనిఖీ, కార్డుల జారీ, నియమిత కాలవ్యవధుల్లో తాజా స్థితిపై సమీక్ష, బీపీఎల్ కార్డుకుగల అర్హతలను మించి ఉన్నత స్థితిలోకి వెళ్ళినవాళ్ళ కార్డుల తొలగింపు వంటి అంశాలకు సంబంధించి ఎలాంటి యంత్రాంగం లేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న జిల్లాల్లోని 37 చౌకధరల దుకాణాల పరిధిలోని 30,695 రేషన్ కార్డులకు సంబంధించి లబ్ధిదారుల సర్వేను ఆడిట్ నిర్వహించగా, 5,471 కార్డులకు (18 శాతం) సంబంధించి, లబ్ధిదారుల ఆచూకీ లభించలేదు. మరో 1,797 కార్డుల (ఆరు శాతం) విషయంలో లబ్ధిదారులకు కావలసిన అర్హతలు లేవని వెల్లడైంది (ఈ కార్డులపై 2008 ఏప్రిల్-2013 మార్చి మధ్య ఇచ్చిన సబ్సిడీ విలువ ₹4.11 కోట్లు). రేషన్ కార్డులను రెగ్యులర్‌గా తనిఖీ చేసేందుకు, బోగస్ కార్డుల ఏరివేతకు ఎలాంటి యంత్రాంగమూ లేదు. దీనివల్ల అనర్హులకు అనుచితలబ్ధి చేకూరింది. ఫలితంగా, ప్రభుత్వ ఖజానాపై సబ్సిడీ భారం అధికంగా పడింది.

మచ్చుకు తనిఖీ చేసిన ఎనిమిది జిల్లాల్లో నిర్వహించిన లబ్ధిదారుల సర్వేలో, ఆడిట్ కనుగొన్న అంశాలను ఈ కింది పట్టికలో చూపడమైంది.

పట్టిక 4.2

| జిల్లా | చౌకధరల దుకాణాల సంఖ్య | | బీపీఎల్ కార్డుల సంఖ్య | | | కార్డుల నుండి తొలగించని వ్యక్తుల సంఖ్య (మరణం/శాశ్వత వలసలు, మొదలైనవి) |
|---|---|---|---|---|---|---|
| | మొత్తం | మచ్చుకు తనిఖీ చేసినవి | ఆడిట్‌లో పరిశీలించినవి | ఆచూకీ దొరకనివి | బీపీఎల్ అర్హతలేనివి | |
| ఆదిలాబాద్ | 618 | 4 | 2739 | 476 | 23 | 254 |
| అనంతపురం | 686 | 4 | 2747 | 450 | 58 | 227 |
| తూర్పు గోదావరి | 1394 | 4 | 3308 | 215 | 153 | 53 |
| గుంటూరు | 1069 | 4 | 3656 | 804 | 58 | 113 |
| కరీంనగర్ | 866 | 6 | 4398 | 445 | 107 | 466 |
| రంగారెడ్డి | 941 | 7 | 6399 | 1435 | 801 | 204 |
| విశాఖపట్నం | 918 | 4 | 5910 | 1492 | 493 | 388 |
| వైఎస్ఆర్ కడప | 452 | 4 | 1538 | 154 | 104 | 186 |
| **మొత్తం** | **6944** | **37** | **30695** | **5471** | **1797** | **1891** |

పౌరులు బీపీఎల్ క్యాటగిరీ కిందకు వస్తారాలేదా అనే ప్రాతిపదికనే వారికి సామాజిక భద్రతా పథకాలన్నింటినీ వర్తింపచేస్తారు కాబట్టి, బీపీఎల్ కుటుంబాల గుర్తింపు, రేషన్ కార్డుల జారీ కోసం లోపాలకు ఆస్కారంలేని పటిష్టమైన యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం తప్పనిసరి.

రేషన్ కార్డులను క్రమంతప్పకుండా తనిఖీ చేసేందుకూ, బోగస్ కార్డులను తొలగించేందుకూ లోపరహితమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం తన సమాధానంలో పేర్కొంది (2013 డిసెంబరు).

### 4.6.1.4 బోగస్/నకిలీ రేషన్ కార్డుల చలామణి

ప్రజా పంపిణీ ఆదేశాలు-2001 ప్రకారం, అనర్హులను తొలగించి, అర్హులైన వారిని ప్రజాపంపిణీ వ్యవస్థ పరిధిలోకి తీసుకురావడానికి ప్రతి ఏటా బీపీఎల్, ఏఏవై కుటుంబాలపై సమీక్ష జరపాలి. ఐతే, పౌర సరఫరాల శాఖ మాత్రం ఇందుకోసం ప్రతి ఏటా సమీక్షలు నిర్వహించలేదు. ఫలితంగా, బోగస్ కార్డులు చలామణిలో ఉండటంవలన వీటికి విడుదల చేసిన ఆహారధాన్యాలు, ఇతర నిత్యావసర సరుకులపై సబ్సిడీ రూపేణా ₹1,136 కోట్ల నివారించదగ్గ భారం (2013 మార్చి నాటికి) రాష్ట్ర ప్రభుత్వంపై పడింది. ప్రభుత్వం చేపట్టిన నకిలీ కార్డుల తొలగింపు (2009 ఆగస్టు-2011 మార్చి), చౌకధరల దుకాణాల డీలర్ల ద్వారా రేషన్ కార్డుల అప్పగింత (2012 ఆగస్టు - 2012 అక్టోబరు), ఆధార్ అనుసంధానం[19] (2012 ఏప్రిల్ నుండి) ప్రక్రియల్లో 2013 మార్చినాటికి 23.93 లక్షల రేషన్ కార్డులు బోగస్‌వనీ, రేషన్ కార్డుల్లో నమోదైన కుటుంబ సభ్యుల్లో మరో 2.94 లక్షల మంది అనర్హులనీ గుర్తించడం జరిగింది.

అంతేకాక, పౌర సరఫరాల శాఖ కంప్యూటరీకరించిన డేటా, డైనమిక్ కీ రిజిస్టరు (2012 డిసెంబరు)లపై నిర్వహించిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఆడిట్‌లో ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- నకిలీ కార్డుల తొలగింపు ప్రక్రియ చేపట్టిన తర్వాత కూడా, 2012 డిసెంబరు నాటికి, బీపీఎల్ రేషన్ కార్డులో కుటుంబంలోని కనీసం ఒక్క సభ్యుని ఐరిస్ డేటా కూడా లేనివి 13.63 లక్షలు ఉన్నాయి.

- నియమాల ప్రకారం, కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో ₹60,000 కంటే తక్కువ, పట్టణ ప్రాంతాల్లో ₹75,000 కంటే తక్కువ ఉన్న కుటుంబాలకు బీపీఎల్ కార్డులు జారీ చేయవచ్చు. వెల్లడించిన ఆదాయం నిర్దేశిత పరిమితికి మించి ఉన్న రేషన్ కార్డుదారులు గ్రామీణ ప్రాంతాల్లో 829, పట్టణ ప్రాంతాల్లో 110 ఉన్నారని ఆడిట్ పరిశీలనలో గమనించడమైంది.

- 16.42 లక్షల బీపీఎల్ కార్డుల్లో కుటుంబ వార్షికాదాయం వివరాలు లేవు. మరో 2,606 కార్డుల్లో కుటుంబ పెద్ద పేర్లు నమోదుకాలేదు. ఈ కేసులలో, ఏ ప్రాతిపదికన ఆ కుటుంబాన్ని బీపీఎల్ క్యాటగిరీగా పరిగణించారో, ఆ రేషన్ కార్డులను ఎవరికి జారీ చేసారో స్పష్టం కాలేదు.

- ఆడిట్ పరిశీలించిన 191.65 లక్షల రేషన్ కార్డులకుగానూ, 93,012 బీపీఎల్ కార్డుల్లో నకిలీ ఫొటోలు ఉన్నాయి (ఒకటి కంటే ఎక్కువ కార్డుల్లో ఒకే ఫొటోను వినియోగించుకోవడం/మనుషుల ఫొటోలు కానివి ఉపయోగించడం జరిగింది) (2008-13 మధ్య కాలంలో వీటిపై ఇచ్చిన సబ్సిడీ విలువ : ₹52.62 కోట్లు).

ప్రభుత్వం చేపట్టిన నకిలీ కార్డుల తొలగింపు ప్రక్రియ సంపూర్ణంగా జరగలేదనీ, ఫలితంగా, బోగస్ కార్డుల చలామణి కొనసాగుతోందనీ పైన పేర్కొన్న అంశాలు తెలియజేస్తున్నాయి.

[19] విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ జారీ చేసిన విశిష్ట గుర్తింపు సంఖ్య (ఆధార్)తో రేషన్ కార్డులను అనుసంధానం చేయటం

### 4.6.2 ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఇచ్చే బియ్యం

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఇచ్చే బియ్యం (పీడీఎస్ బియ్యం)ను కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చౌకధరల దుకాణాలకు బియ్యం సరఫరా జరుగుతుంది. పీడీఎస్ బియ్యంకు సంబంధించి ఆడిట్ పరిశీలనలో కనుగొన్న అంశాలను ఈ కింద పేర్కొనడమైంది :

- దేశీయ బహిరంగ మార్కెట్ అమ్మకాల (ఓఎమ్ఎస్ఎస్-డీ) పథకం కింద ఎఫ్‌సీఐ ద్వారా బహిరంగ టెండర్లు పిలిచి టోకు వినియోగదారులకు గోధుమలు, బాయిల్డ్ రైస్ అమ్మకాలను భారత ప్రభుత్వం 2009 అక్టోబరులో ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద, 2009 అక్టోబరు - డిసెంబరు మధ్యకాలంలో, రాష్ట్రానికి 2,78,490 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు. ఓఎమ్ఎస్ఎస్ క్యాటగిరీ కింద బియ్యం కేటాయింపులు బహిరంగ మార్కెట్‌లో ధరల నియంత్రణకు ఉద్దేశించినవి. ఐతే, రాష్ట్ర ప్రభుత్వం ఈ వాస్తవాన్ని విస్మరించి, కేవలం పీడీఎస్ కింద లోటు భర్తీ చేసేందుకు 2,76,924[20] మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఈ పథకం కింద కొనుగోలు చేసింది. ఎఫ్‌సీఐ నుండి కొనుగోలు చేసిన ధర, బహిరంగ మార్కెట్ ధర ఇంచుమించు ఒకటే కావడం వల్ల బహిరంగ మార్కెట్‌లో ఈ బియ్యం అమ్మకాలు అంత ప్రోత్సాహకంగా ఉండవని ప్రభుత్వ ఉద్దేశం. కేంద్ర ప్రభుత్వం ఏపీఎల్/బీపీఎల్ క్యాటగిరీ కింద అదనపు కేటాయింపులు చేసినందువల్ల ఈ బియ్యం పీడీఎస్ కింద వినియోగానికి అవసరంలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఈ బియ్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్మలేకపోవడంవల్ల, ఈ పథకం కింద కొన్న మొత్తం బియ్యాన్నీ పీడీఎస్ కింద విడుదల చేయడం జరిగింది. ఆ విధంగా, అవసరం లేకపోయినా ఓఎమ్ఎస్ఎస్ క్యాటగిరీ కింద బియ్యం కొనుగోలు చేయడంవల్ల ఏపీఎల్ క్యాటగిరీ కింద కొనే బియ్యం ధరను మించి ₹207.66 కోట్లు అదనంగా ఖర్చయ్యింది.

  పీడీఎస్ కింద లోటును భర్తీ చేసేందుకు ఆ బియ్యం సేకరించారని ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు).

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ 2009 అక్టోబరు - 2010 ఏప్రిల్ మధ్య కాలంలో కరువు ఉపశమనం కోసం ఉద్దేశించిన 1,25,251 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అధిక ధరలకు (53,679 మెట్రిక్ టన్నులను కి.గ్రా. ₹14.63 చొప్పున; 71,572 మెట్రిక్ టన్నులను కి.గ్రా. ₹15.37 చొప్పున) కొనుగోలు చేసి, ఆ బియ్యాన్ని పీడీఎస్ కోసం వినియోగించడం ద్వారా ₹84.58 కోట్లు అధికంగా ఖర్చు చేసింది.

  కేటాయింపుల మేరకు ఆ స్టాకును తీసుకోవడం జరిగిందనీ, కరువు ఉపశమనం కింద బియ్యాన్ని విడుదల చేయని కారణంగా, ఎక్కువ కాలం నిలవ చేసినందువల్ల స్టాకు పాడైపోతుందని ఆ బియ్యాన్ని పీడీఎస్ అవసరాలకు వినియోగించడం జరిగిందని ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు).

ఆడిట్‌కు అందచేసిన రికార్డుల ప్రకారం పీడీఎస్ అవసరాలకు బియ్యం కొరత లేదు. ఒకవేళ కొరత ఉంటే, ఓఎమ్ఎస్ఎస్/కరువు ఉపశమనం కింద నిర్దేశిత అవసరాల కోసం అధిక ధరలకు కొన్న బియ్యాన్ని వినియోగించుకునే బదులు పీడీఎస్ కింద అదనపు కేటాయింపుల కోసం అడిగి ఉండాలి. అంతేకాక, నిర్దిష్ట కేటాయింపులను మళ్ళించిన విషయాన్ని తదుపరి కేటాయింపులను నిర్ణయించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయలేదు.

### 4.6.3 అమ్మకాల ద్వారా వచ్చిన సొమ్మును ప్రభుత్వ పద్దుకు జమ చేయకపోవడం

ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ కోడ్, అనుబంధ నియమం - 1 కింది ఎస్ఆర్ 10(బి) ప్రకారం, ప్రభుత్వం తరపున డబ్బు తీసుకునే ప్రభుత్వ ఉద్యోగి అదే రోజున లేదా వీలైనంత త్వరగా ట్రెజరీ/బ్యాంకులో జమచేయాలి.

[20] 1,52,334 మెట్రిక్ టన్నులను క్వింటాలుకు ₹1,614.68 చొప్పున; 1,24,590 మెట్రిక్ టన్నులను క్వింటాలుకు ₹1,537.31 చొప్పున

తహసీల్దార్లు/సహాయ సరఫరా అధికారులు ఒక్కో లబ్ధిదారు నుండి ల్యామినేట్ చేసిన ఐరిస్ రేషన్ కార్డు కోసం ₹70 (దరఖాస్తుకు ₹10, కార్డుకు ₹60 చొప్పున), మొదటి, రెండవ విడత రచ్చబండ కార్యక్రమంలో జారీ చేసిన ఒక్కో కూపన్‌కు ₹5 చొప్పున, ఏపీవై కార్డుకు ₹10 చొప్పున వసూలు చేసారు. ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న ఎనిమిది జిల్లాలకుగాను ఆరు జిల్లాల్లో, పైన పేర్కొన్న అంశాలకు సంబంధించి తహసీల్దార్లు వసూలు చేసిన ₹1.09 కోట్లను[21] ప్రభుత్వ ఖాతాకు జమ చేయకుండా తమవద్దనే ఐదేళ్ళకు మించి అట్టిపెట్టుకున్నారు.

### 4.6.4 నిధుల మళ్ళింపు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వద్ద ఉన్న నిధుల్లో బియ్యం సబ్సిడీకి సంబంధించిన ₹96.18 కోట్లు, కిరోసిన్ ఈక్వలైజేషన్ ఫండ్‌కి సంబంధించి ₹6.50 కోట్లు, మొత్తం ₹102.68 కోట్ల నిధులను మళ్ళించి (2006-2009 మధ్యకాలంలో), ఐరిస్ రేషన్ కార్డుల జారీ, నకిలీ కార్డుల ఏరివేతకు సంబంధించిన చెల్లింపులకు వినియోగించారు.

  పీడీఎస్ కోసం రాష్ట్ర బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు, పై కార్యకలాపాలకు కూడా వర్తిస్తాయని ప్రభుత్వం తన సమాధానంలో తెలిపింది (2013 అక్టోబరు). కానీ, ఐరిస్ రేషన్ కార్డుల జారీ కోసం చేసిన చెల్లింపులు 'పీడీఎస్ సబ్సిడీ'గా పరిగణించలేము.

- 2009-13 మధ్య కాలంలో ఎల్‌పీజీ సబ్సిడీపై, బడ్జెట్ కేటాయింపులను మించి చేసిన ₹363.20 కోట్ల ఖర్చుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ 'బియ్యం సబ్సిడీ' నిధులను వినియోగించింది.

  ఎల్‌పీజీ సబ్సిడీకి చాలినంత నిధులు కేటాయించకపోవడంవల్ల ఆ పథకం నిరాటంకంగా కొనసాగడానికి బియ్యం సబ్సిడీ నిధులను వినియోగించాల్సివచ్చిందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 డిసెంబరు).

### 4.6.5 నిధులు మురిగిపోవడం

- సంక్షేమ వసతి గృహాలకు బియ్యం కొనుగోలు కోసం 2008-09లో ప్రభుత్వం కేటాయించిన ₹7.94 కోట్లను పౌర సరఫరాల శాఖ పీడీ అకౌంటులో ఉంచారు. నిధులను వినియోగించకపోవడం వల్ల ఈ మొత్తం డీటీఓ వద్ద కాలదోషం పట్టిపోయింది (2011 జూన్).
- అదేవిధంగా, ఐదు జిల్లాల్లో ప్రకృతి విపత్తుల ఉపశమనం కోసం బియ్యం, కిరోసిన్‌ల పంపిణీకి 2009 అక్టోబరులో కేటాయించిన ₹100 కోట్ల మొత్తంలో, ₹61.07 కోట్ల నిధులు వినియోగంకాకపోవడంవల్ల మురిగిపోయాయి (2011 నవంబరు).
- అంతేకాక, వినియోగదారుల సంక్షేమ నిధి కోసం ఉద్దేశించిన ₹53.30 లక్షలు ఖర్చుకాకుండా పీడీ అకౌంటులో ఉండిపోయినందువల్ల ఈ మొత్తంకూడా మురిగిపోయింది (2013 జనవరి).

నిధులు ఈ విధంగా మురిగిపోయిన విషయాన్ని ప్రభుత్వం తన సమాధానంలో నిర్ధారించింది.

### 4.6.6 రవాణా

నిత్యావసర సరుకుల రవాణాలో రెండు దశలున్నాయి. మొదటి దశలో, భారత ఆహార సంస్థ గిడ్డంగులు/చక్కెర కర్మాగారాలు/ఎస్‌టీసీ ఆయిల్ పాయింట్లు లేదా మరేఇతర ప్రదేశం నుండి సరుకులను ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్లకు రవాణా చేస్తారు. రెండవ దశలో సరుకులను ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్ల నుండి చౌకధరల దుకాణాలకు తరలిస్తారు.

---

[21] తూర్పు గోదావరి: ₹46.01 లక్షలు; గుంటూరు: ₹34.94 లక్షలు; వైఎస్ఆర్ కడప: ₹16.47 లక్షలు; ఆదిలాబాద్: ₹6.01 లక్షలు; అనంతపురం: ₹5.05 లక్షలు; రంగారెడ్డి : ₹0.88 లక్ష

### 4.6.6.1 రవాణాపై అధికఖర్చు

భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ఇచ్చిన విడుదల ఉత్తర్వుల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఆహారధాన్యాలను ఎఫ్‌సీఐ డిపోల నుండి ఎమ్ఎల్ఎస్ పాయింట్లకు రవాణా చేస్తుంది. కేటాయింపుల మేరకు, సరిపడా స్టాకును నిర్దేశిత ఎఫ్‌సీఐ డిపోలవద్ద ఉంచడం ఎఫ్‌సీఐ బాధ్యత. నిర్దేశిత ఎఫ్‌సీఐ గిడ్డంగి నుండి ఎమ్ఎల్ఎస్ పాయింటుకు మధ్య దూరం కంటే వాస్తవంగా సరుకులను తీసుకున్న ఎఫ్‌సీఐ డిపోకు, ఎమ్ఎల్ఎస్ పాయింట్‌కు మధ్య దూరం ఎక్కువగా ఉందని ఆడిట్ పరిశీలనలో తెలిసింది. నిర్దేశిత గిడ్డంగులవద్ద స్టాకు అందుబాటులో లేకపోవడమే దీనికి కారణం. దూరం ఎక్కువగా ఉన్న డిపోల నుండి ఆహారధాన్యాల తరలింపుకు ఎక్కువ ఖర్చు కావడంవల్ల, 2008-12 మధ్యకాలంలో మొదటి దశ రవాణాపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ₹37.79 కోట్లు అదనంగా ఖర్చు చేసింది. నిర్దేశిత గిడ్డంగుల వద్ద స్టాకు అందుబాటులో ఉన్నట్లయితే, ఈ అదనపు ఖర్చు జరిగేదికాదు. ఈ విధమైన అధికఖర్చు ₹0.06 కోటి (విజయనగరం జిల్లా) నుండి ₹8.05 కోట్లు (చిత్తూరు జిల్లా) వరకు ఉంది. వివరాలు ***అనుబంధం-4.4***లో ఉన్నాయి.

పైన పేర్కొన్న ఆడిట్ పరిశీలనను ప్రభుత్వం అంగీకరించింది. సరుకుల తరలింపులో ఖర్చు ఎక్కువ కావడానికి హమాలీ[22] సమస్యలు, వే‌బ్రిడ్జి సమస్యలు, ఎఫ్‌సీఐ 'ముందు వచ్చిన సరుకును ముందుగా బయటకు పంపే (ఫిఫో) పద్ధతి'ని అనుసరించడం, మొదలైనవి కారణాలని ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు).

## 4.6.7 స్టోరేజి

భారత ఆహార సంస్థ గిడ్డంగుల నుండి తీసుకున్న బియ్యాన్ని, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, రాష్ట్రంలోని 439 ఎమ్ఎల్ఎస్[23] పాయింట్లలోని తన గిడ్డంగులకు తరలిస్తుంది (సొంత గిడ్డంగుల సామర్థ్యం: 107 ఎమ్ఎల్ఎస్ పాయింట్ల వద్ద 1,12,032 మెట్రిక్ టన్నులు; అద్దె గిడ్డంగుల సామర్థ్యం: 332 ఎమ్ఎల్ఎస్ పాయింట్ల వద్ద 9,43,990 మెట్రిక్ టన్నులు). ప్రతి జిల్లాలోని మొత్తం స్టోరేజీ సామర్థ్యం, అందులో సొంత గిడ్డంగుల సామర్థ్యం వివరాలు ***అనుబంధం-4.5***లో చూడవచ్చు.

రాష్ట్రంలోని 23 జిల్లాలకు గానూ, 9 జిల్లాల్లో, 2012-13 సంవత్సరంలో ₹7.13 కోట్ల విలువగల 1,334 మెట్రిక్ టన్నుల కందిపప్పు స్టోరేజి కాలంలో నాణ్యత తగ్గిపోవడం వల్ల ₹4.54 కోట్ల నష్టానికి (2012 మార్చి - 2013 జూన్ మధ్య కాలంలో) వేలం ద్వారా అమ్మినట్లు ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

దీనికి సంబంధించి, ఆడిట్‌లో ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- స్టాకు పేరుకుపోవడం వల్ల కందిపప్పు నాణ్యత పాడైంది. మండల స్థాయి అధికారులు చౌకధరల దుకాణాలకు పూర్తి స్థాయిలో స్టాకును విడుదల చేయకపోవడమే స్టాకు పేరుకుపోవడానికి ప్రధాన కారణం.
- కందిపప్పును విడుదల చేసేటప్పుడు 'ముందు వచ్చిన సరుకును ముందుగా బయటకు పంపే (ఫిఫో) పద్ధతి'ని కొందరు జిల్లా మేనేజర్లు పాటించలేదు. దీనివల్ల ముందు వచ్చిన పప్పు అలానే ఉండిపోయి, ఎక్కువ కాలం నిల్వ ఉన్నందువల్ల అది పాడైపోయింది.
- ఎక్కువ కాలం నిల్వ ఉన్నందువల్ల కందిపప్పు పాడైన విషయాన్ని, దానిపై తీసుకున్న చర్యల గురించి నెలవారి ప్రత్యక్ష తనిఖీల నివేదికల్లో ప్రస్తావించలేదు.
- ఎనిమిది కేసులలో, కందిపప్పు పాడైందని గుర్తించిన తర్వాత వేలం వేయడంలో ఆరు నెలలకు పైగా జాప్యం జరగడంవల్ల పప్పు బరువులో 38.406 మెట్రిక్ టన్నుల తరుగుదల వచ్చింది (విలువ : ₹20.53 లక్షలు).

[22] సరుకు లోడింగ్, అన్‌లోడింగ్ చేసే వ్యక్తులను హమాలీ అంటారు
[23] రాష్ట్రంలోని 1,177 మండలాలకు గానూ, 439 ఎమ్ఎల్ఎస్ పాయింట్లు మాత్రమే ఉన్నాయి

నిర్దేశిత గడువును మించి స్టాకు పేరుకుపోవడం, కందిపప్పు నాణ్యత తగ్గిపోవడానికి సంబంధించి ఆడిట్ పరిశీలనలను ప్రభుత్వం అంగీకరిస్తూ, చౌకధరల దుకాణాల డీలర్లు సరుకును తక్కువగా తీసుకోవడం, డీలర్లు డిమాండు డ్రాఫ్టులను జమచేసేలా చూడటంలో ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు తగుచర్యలు తీసుకోకపోవడం ఇందుకు కారణాలని తెలిపింది (2013 అక్టోబరు).

### 4.6.7.1 గిడ్డంగుల నిర్మాణం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ 2008-13 మధ్యకాలంలో నిర్మాణం చేపట్టిన 93 గిడ్డంగులకుగానూ 2013 జూన్ నాటికి 79 గిడ్డంగులు పూర్తికాగా, 14 గిడ్డంగుల నిర్మాణం కొనసాగుతోంది. రెండు[24] కేసులలో తప్ప, మిగిలిన వాటి విషయంలో 30 నెలల వరకు జాప్యం[25] జరిగింది. నిర్మాణం చేపట్టిన 14 గిడ్డంగులకు గానూ, రెంటి విషయంలో స్థల వివాదంవల్ల పని ప్రారంభంకాలేదు. న్యాయపరమైన చిక్కులవల్ల నాలుగు కేసులలో పని నిలిచిపోయింది. ఎనిమిది చోట్ల పని పురోగతిలో ఉంది (జాప్యం రెండు కేసులలో 19 నెలలు, ఆరు కేసులలో రెండు నెలలు).

గిడ్డంగుల నిర్మాణంలో ఆలస్యానికి ఇసుక కొరత, రెవెన్యూ అధికారుల అభ్యంతరాలు కారణాలని ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు).

అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలలోని బీపీఎల్ కుటుంబాలకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో సొంత గిడ్డంగులను నిర్మించలేదు. గిడ్డంగుల నిర్మాణానికీ, విస్తరణకూ 13 జిల్లాల్లోని 81 చోట్ల స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికీ, జిల్లా మేనేజర్లు దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఏడాది క్రితమే పంపినప్పటికీ పౌర సరఫరాల సంస్థ నిర్మాణం చేపట్టలేదు.

ప్రతిపాదనలు 81 స్థలాలకు సంబంధించిరాగా, మూడు జిల్లాల్లోని 22 స్థలాల్లో నిర్మాణానికి అంచనాలు తయారయ్యాయనీ, వీటిలో, అనంతపురం జిల్లాలోని తొమ్మిది స్థలాల్లో నిర్మాణం పురోగతిలో ఉందనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 అక్టోబరు). మిగిలిన జిల్లాల్లో పని చేపడతామని కూడా ప్రభుత్వం తెలిపింది.

స్టోరేజి చార్జీలపై చేసిన ఖర్చు, కొనుగోలు చేసిన మొత్తం ఆహారధాన్యాలు, 2008-13 సంవత్సరాల మధ్య సొంత గిడ్డంగుల్లో ఉన్న నిల్వ సామర్థ్యం వివరాలను ఈ కింది పట్టికలో చూడవచ్చు.

**పట్టిక 4.3**

| సంవత్సరం | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | 2012-13 |
|---|---|---|---|---|---|
| పౌర సరఫరాల సంస్థ కొనుగోలు చేసిన మొత్తం ఆహారధాన్యాలు (లక్షల మెట్రిక్ టన్నులు) | 42.42 | 46.11 | 42.79 | 42.17 | 38.84 |
| సగటున నెలకు కొనుగోలు చేసిన ఆహార ధాన్యాలు (లక్షల మెట్రిక్ టన్నులు) | 3.54 | 3.84 | 3.57 | 3.51 | 3.24 |
| సొంత గిడ్డంగుల నిల్వ సామర్థ్యం (మెట్రిక్ టన్నులు) | 73300 | 78400 | 82150 | 109200 | 112032 |
| సగటున నెలకు కొనుగోలు చేసే ఆహారధాన్యాల పరిమాణంలో నిల్వ సామర్థ్యం శాతం | 21 | 20 | 23 | 31 | 35 |
| ప్రైవేటు గిడ్డంగుల అద్దెపై చేసిన ఖర్చు (₹ కోట్లలో) | 2.43 | 3.68 | 10.06 | 15.58 | 16.22 |

*మూలం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ రికార్డులు*

[24] విశాఖపట్నం జిల్లాలో వడ్లపూడి గిడ్డంగి నంబరు - II, గంభీరం గిడ్డంగి నంబరు - II

[25] రెండు నిర్మాణాలలో జాప్యం రెండేళ్ళు అంతకుమించి; ఏడుచోట్ల ఆలస్యం ఏడాది, అంతకుమించి; మరో 36 కట్టడాలలో జాప్యం ఆరు నెలలు, అంతకుమించి

సగటున నెలకు కొనుగోలు చేసిన ఆహారధాన్యాల పరిమాణంతో పోల్చితే, సొంత గిడ్డంగుల సామర్థ్యం 20 శాతం నుండి 35 శాతం వరకు ఉంది. సొంత గిడ్డంగులను నిర్మించకపోవడం వల్ల గత ఐదేళ్ళలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ అద్దెరూపేణా ₹47.97 కోట్లు చెల్లించింది. ప్రైవేటు గిడ్డంగుల అద్దెకోసం చెల్లించిన మొత్తంతో, ఒక్కొక్కటి ₹24 లక్షల ఖర్చుతో 600 మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల 200 కొత్త గిడ్డంగులను నిర్మించవచ్చు (2011-12 నాటి ఒక ఒప్పందంలోని లెక్కల ప్రకారం). 2012-13 నాటికి రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ సొంత గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 1,27,200 మెట్రిక్ టన్నులు కాగా, ఆ సంస్థ కార్యకలాపాలకు అందుబాటులో ఉన్న స్టోరేజి సామర్థ్యం 1,12,032 మెట్రిక్ టన్నులు మాత్రమేనని, మిగతా స్థలాన్ని ఇతర ప్రభుత్వ శాఖలు వినియోగించుకుంటున్నాయనీ ఆడిట్ పరిశీలనలో తెలిసింది. నల్గొండ జిల్లాలో, 7,500 మెట్రిక్ టన్నుల స్టోరేజి స్థలాన్ని తహసీల్దార్ల కార్యాలయాల కోసం, గత ఎనిమిదేళ్ళుగా ఎలాంటి అద్దెనూ చెల్లించకుండా వినియోగించుకుంటున్నారు (అద్దె విలువ : ₹67.50 లక్షలు).

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ద్వారా చాలినన్ని సొంత గిడ్డంగుల నిర్మాణం కోసం తగిన చర్యలు చేపడతామని ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు). గిడ్డంగులను వినియోగించుకున్న ప్రభుత్వ శాఖల నుండి అద్దె వసూలుకు చర్యలు తీసుకుంటునట్లు కూడా ప్రభుత్వం తెలిపింది.

### *4.6.7.2 గిడ్డంగుల నిర్వహణ*

నమూనా తనిఖీ కోసం ఎంపిక చేసుకున్న జిల్లాల్లో 16 ఎమ్ఎల్ఎస్ పాయింట్ల పరిధిలోని గిడ్డంగుల ఉమ్మడి ప్రత్యక్ష తనిఖీని పౌర సరఫరాల సంస్థ సిబ్బందితో కలిసి నిర్వహించగా (2012 జూన్ - అక్టోబరు) గిడ్డంగులు, ఎమ్ఎల్ఎస్ పాయింట్ల నిర్వహణకు సంబంధించి ఈ కింది లోపాలు వెల్లడయ్యాయి.

- గిడ్డంగుల తలుపులు, కిటికీలకు సన్నని తీగె జల్లెడను ఏర్పాటుచేయలేదు.
- గిడ్డంగుల నిర్మాణాలు గాలిచొరబడని విధంగా లేవు.
- గిడ్డంగులకు మెట్లు విడిగా లేవు.
- ఎలుకలు రాకుండా ఉండేలా గిడ్డంగుల ప్లింత్ స్థాయిలో స్లాబును బయటకు చొచ్చుకువచ్చేలా నిర్మించలేదు.
- మచ్చుకు తనిఖీ చేసిన 16 గిడ్డంగులకు గానూ 8 గిడ్డంగులకు సిమెంటు కాంక్రీటు రోడ్లు లేవు.
- ఎనిమిది గిడ్డంగుల పైకప్పుకు చిల్లులు ఉన్నాయి. వర్షపునీరు కారుతోంది. అంతేకాక, వీటికి టార్పాలిన్ కవర్లను ఏర్పాటు చేయలేదు.



*ఆదిలాబాద్ జిల్లా, జైనాథ్ ఎమ్ఎల్ఎస్ పాయింటు గిడ్డంగి పైకప్పుకు చిల్లులు ఉన్న దృశ్యం*



*విశాఖపట్నం జిల్లా లమ్మసింగి ఎమ్ఎల్ఎస్ పాయింటు గిడ్డంగికి అప్రోచ్‌రోడ్డు లేని దృశ్యం*

- 14 గిడ్డంగులకు విద్యుత్ సౌకర్యంలేదు.
- పౌర సరఫరాల సంస్థ పాత గిడ్డంగులకు సున్నాలు వేయడంలేదు.

- వైఎస్ఆర్ కడప జిల్లా, ముద్దనూరులో నిరుపయోగంగా ఉన్న పాత సినిమా హాలును, కనీస మౌలిక వసతులు లేకపోయినా గిడ్డంగిగా వినియోగిస్తున్నారు.
- మాన్యువల్ నియమాల ప్రకారం, గిడ్డంగుల వద్ద ప్రథమ చికిత్స పెట్టెను ఉంచాలి. కానీ 14 గిడ్డంగుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు లేవు.
- రెండు గిడ్డంగుల్లో స్టాకు బోర్డులు లేవు. మరో ఎనిమిది గిడ్డంగుల్లో స్టాకు బోర్డులున్నప్పటికీ వాటిని వినియోగించడం లేదు.
- ఎమ్ఎల్ఎస్ పాయింట్ల బాధ్యత వహిస్తున్న వ్యక్తులు ఫిర్యాదుల పుస్తకాలు నిర్వహించడంలేదు.
- ఫ్యుమిగేషన్ (పొగపెట్టడం), ప్రొఫైలాక్టిక్ ట్రీట్‌మెంట్ (తెగులు నివారణ చర్యలు) ఇతర నాణ్యతా నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తెలిపే రికార్డులను ఎమ్ఎల్ఎస్ పాయింట్ల వద్ద నిర్వహించడం లేదు.
- ఎమ్ఎల్ఎస్ పాయింట్ల వద్ద 0.3 మెట్రిక్ టన్ను, ఒక మెట్రిక్ టన్ను సామర్థ్యంగల బరువుతూచే యంత్రాలు మాత్రమే ఏర్పాటు చేసారు. అందువలన పీడీఎస్ సరుకులను తూచడం చాలా ప్రయాసతో కూడుకుంది.

అనంతపురం, రంగారెడ్డి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో, 2011-12లో, ప్రైవేటు గిడ్డంగులను గరిష్టంగా 70-75 శాతం సామర్థ్యం మేరకు మాత్రమే వినియోగించుకున్నారని కూడా ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. వాస్తవ అవసరాలను అంచనా వేయకుండా గిడ్డంగులను అద్దెకు తీసుకున్నారని దీన్ని బట్టి తెలుస్తోంది.

పైన పేర్కొన్న లోపాల విషయంలో తగిన దిద్దుబాటు చర్యలు చేపడతామని జిల్లా మేనేజర్లు హామీ ఇచ్చారు (2012 జూన్ - అక్టోబరు). క్షేత్ర స్థాయి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని ప్రభుత్వంకూడా తెలిపింది (2013 అక్టోబరు). గిడ్డంగుల్లో సౌకర్యాలు మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటామని సమీక్షానంతర సమావేశంలో కమీషనరు తెలిపారు (2013 డిసెంబరు).

## 4.6.8 నిత్యావసర వస్తువుల పంపిణీ

### *4.6.8.1 చౌకధరల దుకాణాల డీలర్లకు లైసెన్సుల మంజూరీ*

రేషన్ కార్డులున్న వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడానికి చౌకధరల దుకాణాల డీలర్లకు ప్రభుత్వం లైసెన్సులు జారీ చేస్తుంది. మొదటిసారి జారీ చేసినపుడు ఇవి రెండేళ్ళ పాటు చెల్లుబాటు అవుతాయి. ఆ తర్వాత ప్రతి మూడేళ్ళకోసారి ఈ లైసెన్సులను నవీకరించుకోవాలి. మచ్చుకు తనిఖీ చేసిన ఎనిమిది జిల్లాలకు గాను, ఏడు జిల్లాల్లో 2,069 చౌకధరల దుకాణాలు వాటి లైసెన్సుల గడువు ముగిసినప్పటికీ తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది (2008-09లో గడువు ముగిసినది ఈ జాబితాలో అతిపాతది).

లైసెన్సులను గడువులోపు నవీకరించేలా, లైసెన్సుల గడువు ముగిసిన డీలర్లకు నిత్యావసర సరుకులను కేటాయించకుండా చూడాలని పౌర సరఫరాల కలెక్టర్లను ఆదేశించామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 డిసెంబరు).

### *4.6.8.2 చౌకధరల దుకాణాల హేతుబద్ధీకరణ*

రేషన్ కార్డులున్నవారి సౌకర్యం కోసం, డీలర్లకు లాభదాయకంగా ఉండేలా చూడటం కోసం ప్రతి దుకాణానికీ తగు సంఖ్యలో కార్డులను కేటాయిస్తూ రాష్ట్రంలోని చౌకధరల దుకాణాల హేతుబద్ధీకరణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది (2007). నిర్దేశిత ప్రమాణాల ప్రకారం, ఒక్కో చౌకధరల దుకాణానికీ గరిష్టంగా, గ్రామీణ ప్రాంతాల్లో 450, మున్సిపాలిటీలు, ఒకప్పటి తాలూకా కేంద్రాల్లో 550, ఇక నగరాలలోనైతే 650 బీపీఎల్ రేషన్

కార్డులను కేటాయించాలి. ఐతే, 16,653 చౌకధరల దుకాణాల్లో నిర్దేశిత పరిమితిని మించి రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 41 దుకాణాల వద్ద పరిమితి దాటి 2,000 కన్నా ఎక్కువ కార్డులున్నాయి. నిర్దేశిత ప్రమాణాలు, వాటి అమలు వివరాలు కింద పట్టికలో చూడవచ్చును.

పట్టిక 4.4

| ప్రాంతం | ఒక్కో చౌకధరల దుకాణానికి కేటాయించాల్సిన బీపీఎల్ కార్డుల గరిష్ఠ సంఖ్య | పరిమితిని మించి కార్డులున్న దుకాణాల సంఖ్య |
|---|---|---|
| గ్రామీణ ప్రాంతాలు | 450 | 13,749 |
| మున్సిపాలిటీలు, ఒకప్పటి తాలూకా కేంద్రాలు | 550 | 1,764 |
| నగరాలు | 650 | 1,140 |
| మొత్తం | | **16,653** |

*మూలం : పౌర సరఫరాల శాఖ కమీషనరు రికార్డులు*

చౌకధరల దుకాణాల వద్ద నిర్దేశిత ప్రమాణాల మేరకు రేషన్ కార్డులు తగుమాత్రం ఉండేలా వాటి వ్యవస్థీకరణకు చర్యలు తీసుకోవలసిందిగా పౌర సరఫరాల కలెక్టర్లను ఆదేశించామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 డిసెంబరు).

### *4.6.8.3 చౌకధరల దుకాణాల పనితీరు*

రేషన్ కార్డులో పేర్కొన్న ఆదాయం, నివాసం, కుటుంబసభ్యుల సంఖ్య వంటి వివరాల ఖచ్చితత్వాన్ని తనిఖీ చేసేందుకు రెవెన్యూ శాఖ సిబ్బందితో కలసి ఒక ఉమ్మడి సర్వేను ఆడిట్ నిర్వహించింది (2012 జూలై - 2013 మార్చి). ఈ సర్వేలో చౌకధరల దుకాణాల పనితీరును కూడా పరిశీలించడం జరిగింది. మచ్చుకు తనిఖీ చేసిన ఎనిమిది జిల్లాల్లోని 37 చౌకధరల దుకాణాల పరిశీలనలో ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- ప్రజాపంపిణీ వ్యవస్థ (నియంత్రణ) ఆదేశాలు - 2001లో నిర్దేశించిన ప్రకారం, చౌకధరల దుకాణానికి కేటాయింపు ఉత్తర్వులు ఇచ్చిన సమయంలోనే దీనికి సంబంధించి ఒక కాపీని గ్రామ పంచాయతీలు, నగర పాలికలు, విజిలెన్స్ కమిటీలు, లేదా ఈ దుకాణాల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసిన ఇతర సంస్థలకు ఇచ్చేలా సంబంధిత అధికారి చూడాలి. ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన చౌకధరల దుకాణాల్లో ఎక్కడా ఈ పద్ధతి పాటించడంలేదని తెలిసింది.

- కేంద్ర ప్రభుత్వం తాను నియమించిన సంస్థలు, నామినీల ద్వారా ఎఫ్‌సీఐ డిపోలు/గిడ్డంగుల నుండి విడుదల చేసిన నిత్యావసర సరుకులను తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసుకుని, చౌకధరల దుకాణానికి ఈ సరుకులు ఆ నెలలోని మొదటి వారంలోగా చేరేలా చూడాలి. ఐతే, తనిఖీ చేసిన ఏ దుకాణంలోనూ సరుకులు ఇలా నెలలోని మొదటి వారం చేరటంలేదు.

- గ్రామ పంచాయతీలు, నగర పాలికలు, విజిలెన్సు కమిటీలు లేదా దుకాణాల పర్యవేక్షణ కోసం నియమించిన ఇతర సంస్థ, నిత్యావసర సరుకుల స్టాకు వివరాలను దుకాణం బయట నోటీసు బోర్డుపై ప్రదర్శించాలి. ఐతే, తనిఖీ చేసిన చౌకధరల దుకాణాల్లోని ఏఒక్కచోటా ఇలాంటి సమాచారాన్ని ప్రదర్శించటంలేదు.

- ప్రతి చౌకధరల దుకాణంలోనూ బీపీఎల్, అంత్యోదయ లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించాలి. అదే విధంగా, ప్రతి క్యాటగిరి కింద ఇచ్చే సరుకుల వివరాలను కూడా ప్రదర్శించాలి. ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన చౌకధరల దుకాణాల్లో ఎక్కడా ఇలాంటి జాబితాలు లేవు. ప్రతి సరుకుకు సంబంధించి ప్రారంభ నిల్వ, ముగింపు నిల్వ వివరాలను కూడా ప్రదర్శించలేదు.

- (i) తనిఖీ చేసిన 37 చౌకధరల దుకాణాలకుగానూ, 3 దుకాణాలు వ్యాపారవేళలు పాటించటంలేదని తెలిసింది. (ii) ఫిర్యాదులను నమోదు చేసేందుకు ఈ దుకాణాలలో ఫిర్యాదుల పుస్తకాలు లేవు. (iii) రేషన్ కార్డుల జారీకి గతంలో అనుసరించిన విధానంలో (ఐరిస్ ఆధారిత రేషన్ కార్డుల జారీకి ముందు), ఇచ్చిన సరుకుల వివరాలు, ఇచ్చిన తేదీ మొదలైన వివరాలను నమోదు చేసేందుకు అనుకూలంగా రేషన్ కార్డులో కొన్ని పేజీలు ఉండేవి. ఐతే, 2008-13 మధ్య కాలంలో, ఈ విధంగా వివరాల నమోదుకు ఏర్పాట్లు లేనందున పారదర్శకతకు అవకాశం పోయింది. అంతేకాక, అమ్మకాల రిజిస్టరులోని వివరాలను సరిపోల్చి చూసుకునేందుకు వీలుగా ముద్రిత రశీదులను లబ్ధిదారులకు ఇవ్వడంలేదు (కౌంటర్ ఫాయిల్స్ లేవు).

పైన పేర్కొన్న విషయాలకు సంబంధించి, కలెక్టర్లందరికీ అవసరమైన ఆదేశాలు జారీ చేసామని ప్రభుత్వం తన సమాధానంలో తెలిపింది (2013 డిసెంబరు).

## 4.7 పర్యవేక్షణ

### 4.7.1 ఆహార సలహా సంఘం, ధరల పర్యవేక్షణ సంఘాల పనితీరు

ఆహార సలహా సంఘం (ఎఫ్ఏసీ) ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును సమీక్షించేందుకు ఉద్దేశించినది. దీని గడువు 1996లో ముగిసిపోగా, మళ్ళీ 2004లో రాష్ట్ర స్థాయిలో పునరుద్ధరించారు. 2008-13 మధ్యకాలంలో, రాష్ట్ర స్థాయి సంఘం 20 సార్లు సమావేశం కావలసి ఉండగా కేవలం ఒక్కసారి[26] మాత్రమే సమావేశమయ్యింది. జిల్లా, మండల స్థాయిల్లోని ఆహార సలహా సంఘాలు రెండు నెలలకు ఒకసారి, గ్రామ స్థాయి నుండి చౌకధరల దుకాణం స్థాయిల్లోనివి నెలకు ఒకసారి సమావేశం కావాలి. ఐతే, 2012-13 సంవత్సరంలో నిర్వహించిన సమావేశాల వివరాలు కమీషనరు కార్యాలయంలో లేవు. అంతేకాక, 2008-12 మధ్య కాలంలో ఈ సంఘాలు అన్ని స్థాయిల్లో ఏర్పాటు కాలేదు. సంఘాలు ఏర్పాటయిన చోట సైతం నిర్దేశిత కాలవ్యవధిలో సమావేశాలను నిర్వహించలేదు.

ఆహార సలహా సంఘం కింద ఉపసంఘంగా జిల్లా, మండల స్థాయిల్లో 'ధరల పర్యవేక్షణ సంఘం' (పీఎమ్‌సీ) ఏర్పాటు చేయాలని 2009 ఆగస్టులో ప్రభుత్వం నిర్ణయించింది. నిత్యావసర సరుకుల లభ్యతనూ బహిరంగ విపణిలో వాటి ధరలనూ సమీక్షించడానికీ, అక్రమ నిల్వలు, నల్లబజారు విక్రయాలను అరికట్టేందుకు తీసుకోవలసిన చర్యలపై సలహాలిచ్చేందుకూ ఈ సంఘాలను ఏర్పాటు చేయతలచారు. ఈ కమిటీలు వారానికి ఒకసారి సమావేశమవ్వాలి. రాష్ట్రంలోని 23 జిల్లాలకుగానూ 5 జిల్లాల్లో[27] ధరల పర్యవేక్షణ సంఘాల ఏర్పాటుకు సంబంధించిన సమాచారం కమీషనరు వద్దలేదు. వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో ఈ సంఘాలు ఏర్పాటయినప్పటికీ, 2009-12 మధ్య కాలంలో ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు.

పౌర సరఫరాల వ్యవహారాలను ప్రతి జిల్లాలోనూ ఉన్న అధికార యంత్రాంగం చూసుకుంటుంది కనుక ఆహార సలహా సంఘాల సమావేశాలు క్రమంతప్పకుండా నిర్వహించకపోవడంవల్ల ఎలాంటి ప్రతికూల ప్రభావమూ ఉండదని ప్రభుత్వం తన సమాధానంలో తెలిపింది (2013 డిసెంబరు). కానీ, సమావేశాలు నిర్వహించక పోవడం, తదుపరి చర్యలు తీసుకోకపోవడంవల్ల ఈ సంఘాలు నిరర్థకమయ్యాయి.

### 4.7.2 వాస్తవంగా విడుదలైన స్టాకును కేటాయింపు/విడుదల ఉత్తర్వులతో సరిపోల్చి చూసుకోక పోవడం

కమీషనరు కార్యాలయం జిల్లాల వారీగా నిత్యావసర సరుకుల కేటాయింపులను చేయగా, జిల్లా స్థాయిలో వచ్చిన సరుకులకు మండలాల వారీగా కేటాయింపు ఉత్తర్వులిస్తారు. చౌకధరల దుకాణాల డీలర్లకు సరుకుల విడుదల ఉత్తర్వులను తహసీల్దార్లు జారీ చేస్తారు. తహసీల్దార్లు జారీచేసిన పంపిణీ ఉత్తర్వుల ఆధారంగా పౌర సరఫరాల సంస్థ సరుకు విడుదల చేస్తుంది. కేటాయింపు/విడుదల ఉత్తర్వులతో పోల్చి వాస్తవంగా విడుదలైన సరుకులను

---

[26] 2011 జనవరి 11న

[27] ఆదిలాబాద్, అనంతపురం, కర్నూలు, నల్గొండ, విజయనగరం

రికన్సీలియేషన్ చేయడంలేదని ఆడిట్ పరిశీలనలో తెలిసింది. ఈ విధమైన రికన్సీలియేషన్ జరగని కారణంగా, కల్పితమైన విడుదల ఉత్తర్వులతో స్టాకు విడుదల జరగలేదని ఆడిట్‌లో నిర్ధారించుకోవడం వీలుకాలేదు.

సరుకుల కేటాయింపు, పంపిణీల విషయంలో పారదర్శకత కోసం ప్రజా పంపిణీ వ్యవస్థ కార్యకలాపాలను కంప్యూటరీకరించే ప్రక్రియ కొనసాగుతోందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 డిసెంబరు).

### 4.7.3 ప్రజా పంపిణీ వ్యవస్థ (నియంత్రణ) ఆదేశాలు - 2001 పాటింపు

ప్రజా పంపిణీ వ్యవస్థ కార్యకలాపాల పర్యవేక్షణకు సంబంధించి ప్రజా పంపిణీ వ్యవస్థ (నియంత్రణ) ఆదేశాలు 2001లోని కొన్ని ముఖ్యమైన నిబంధనలను పాటించటంలేదని ఆడిట్ పరిశీలనలో తేలింది. ఆవివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

| ప్రజా పంపిణీ వ్యవస్థ నియంత్రణ ఆదేశాలు - 2001లోని నిబంధన | ఆడిట్ కనుగొన్న అంశం |
|---|---|
| సంబంధిత అధికారులు కనీసం ఆరు నెలలకోసారి చౌకధరల దుకాణాల తనిఖీ చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చూడాలి. ఇనస్పెక్షన్ షెడ్యూలు, చెక్‌పాయింట్ల లిస్టును నిర్ధారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయవచ్చు. ఈ ఆదేశాల పాటింపునకు బాధ్యత వహించవలసిన అధికారిని కూడా ఆ ఉత్తర్వుల్లో పేర్కొనాలి. | ప్రజా పంపిణీ వ్యవస్థ (నియంత్రణ) ఉత్తర్వు - 2008లోని నిబంధనలు 16(i), (vii)లో నిర్దేశించినప్పటికీ, ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న చౌకధరల దుకాణాల్లో ఏ ఒక్క చోటా ఇలాంటి తనిఖీలను నిర్వహించలేదు. |
| రాష్ట్ర, జిల్లా, బ్లాకు, చౌకధరల దుకాణం స్థాయిల్లో ప్రజా పంపిణీ వ్యవస్థపై విజిలెన్సు కమిటీల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలి. ఏ తేదీనాడు, ఎంత కాలానికి ఒకసారి జరగాలనే విషయాలను రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టంచేయాలి. అన్ని స్థాయిల్లోనూ మూడు నెలలకు కనీసం ఒక్క సమావేశానికి తగ్గకుండా ఉండేలా సమావేశాల కాలవ్యవధిని నిర్ణయించాలి. | ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న జిల్లాల్లో సమావేశాలను నిర్వహించటంలేదు. |
| జిల్లా ఎన్ఐసీ సెంటర్లలో స్థాపించిన ఎన్ఐసీ కంప్యూటర్ నెట్‌వర్క్ ద్వారా చౌకధరల దుకాణం స్థాయిలో ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షించాలి. ఇందుకుగాను, కంప్యూటరీకరించిన కోడ్‌ను జిల్లాలోని చౌకధరల దుకాణాలన్నిటికీ ఇవ్వాలి. | ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న జిల్లాల్లో, చౌకధరల దుకాణాల పనితీరును పర్యవేక్షించే నెట్‌వర్క్‌లేదు. |

ప్రజా పంపిణీ వ్యవస్థ కింద పేద ప్రజల కోసం ఇచ్చే బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల దుర్వినియోగం/ మళ్ళింపు జరగకుండా చూడటానికి నిర్ణీత వ్యవధిలో తనిఖీలు నిర్వహించమని పౌర సరఫరాల కలెక్టర్లను ఆదేశించినట్టు ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 డిసెంబరు).

- అన్ని ఎమ్ఎల్ఎస్ పాయింట్ల వద్ద మూడు నెలలకొకసారి నూటికి నూరు శాతం స్టాకును ప్రత్యక్ష తనిఖీ చేయాలి. ఐతే, స్టాకు తక్కువగా ఉన్నప్పుడు, అక్రమాలు వెలుగుచూసిన సందర్భాల్లో మాత్రమే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు.

  క్షేత్ర స్థాయి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసామని ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు).

- ఎమ్ఎల్ఎస్ పాయింటు స్టాకు రిజిస్టర్లు, అమ్మకాల లెక్కల రికన్సీలియేషన్‌లో ఒకటి నుండి ఐదు నెలల వరకు జాప్యం చోటు చేసుకుంది.

  రికన్సీలియేషన్‌లో జాప్యాలను నివారించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం తెలిపింది (2013 అక్టోబరు).

## 4.8 సారాంశం

*రాష్ట్రంలో ప్రభుత్వం ద్వారా జరిగే ధాన్యం కొనుగోలు మిల్లర్ల ద్వారా జరిగే కొనుగోలు కంటే తక్కువగా ఉంది. మిల్లర్లు ధాన్యాన్ని మరపట్టించి నిర్దేశిత కాలవ్యవధిలో బియ్యంగా మార్చేలా చూడటంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ విఫలమైంది. ఇది క్యాష్ క్రెడిట్‌పై వడ్డీ చెల్లింపులకు దారితీసింది.*

*ప్రజా పంపిణీ వ్యవస్థలో పాటించే విధానాలు సక్రమంగాలేవు. లబ్ధిదారుల గుర్తింపులో పర్యవేక్షణ తగినంతగా లేదు. బోగస్, నకిలీ రేషన్ కార్డులు కొనసాగుతున్నాయి. గిడ్డంగుల నిర్మాణంలో జాప్యాలున్నాయి. ప్రైవేటు గిడ్డంగులను వాటి పూర్తి సామర్థ్యం మేరకు వినియోగించుకోలేదు.*

*ప్రభుత్వంనుండి అనుమతి (లైసెన్సుల రెన్యువల్) లేకుండానే పలు చౌకధరల దుకాణాలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. అంతేకాక, **16,000** కంటే ఎక్కువ దుకాణాల్లో పరిమితికి మించి కార్డులున్నాయి. మచ్చుకు తనిఖీ చేసిన చౌక ధరల దుకాణాలు నిత్యావసర సరుకులను సమయానికి అందజేయడంలేదు. నిత్యావసర సరుకుల స్టాకు వివరాలను ప్రదర్శించడంలేదు. చౌకధరల దుకాణాలకు వచ్చిన సరుకులతో లబ్ధిదారులకు అందజేసిన సరుకుల రికన్సీలియేషన్ చేయడంలేదు. ఆహార సలహా సంఘం, ధరల పర్యవేక్షణ సంఘం నిర్ణీత వ్యవధిలో సమావేశాలు నిర్వహించడంలేదు. నిత్యావసర సరుకుల లభ్యత, వాటి ధరలను పర్యవేక్షించడంలో ఈ సంఘాలు విఫలమయ్యాయి. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి పర్యవేక్షణ యంత్రాంగం సరిగాలేదని ఇది తెలియజేస్తుంది.*

## 4.9 సిఫార్సులు

- కస్టమ్ మిల్లింగ్ చేసిన బియ్యం భారత ఆహార సంస్థకు సకాలంలో సరఫరా అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.
- రేషన్ కార్డులను జారీ చేసేముందు బీపీఎల్ కుటుంబాలను గుర్తించడానికి వీలుగా ఒక లోపరహిత విధానాన్ని ప్రభుత్వం రూపొందించాలి.
- రవాణాలో పొదుపు సాధించి, సంబంధిత డిపోలవద్ద తగినంత సరుకును అందుబాటులో ఉంచేలా భారత ఆహార సంస్థతో సరైన సమన్వయం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- తగినన్ని సొంత గిడ్డంగులను నిర్మించి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలి.
- చౌకధరల దుకాణాల తనిఖీ క్రమం తప్పకుండా జరిగేలా చూడాలి. ప్రజా పంపిణీ వ్యవస్థ కార్యకలాపాలపై పర్యవేక్షణ యంత్రాంగాన్ని పటిష్టం చేయాలి.

ఈ సిఫార్సులను సమీక్షానంతర సమావేశంలో చర్చించగా (2013 డిసెంబరు), ప్రభుత్వం వీటిని అంగీకరించింది.

# అధ్యాయం-5

## నియమాల పాటింపుపై ఆడిట్ పరిశీలనలు

పేజీలు 79 - 102

# పాఠశాల విద్యా శాఖ

## 5.1 పాఠశాలల్లో మౌలిక వసతులు

పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యా హక్కు (ఆర్‌టీఈ) చట్టం, 2009[1] ప్రకారం పాఠశాలలకు భవనాలు, ఇతర మౌలిక వసతులను, పిల్లలకు ప్రాథమిక సదుపాయాలను కల్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాల్సి ఉంది. ఈ లక్ష్య సాధన కోసం ఆంధ్రప్రదేశ్ పిల్లల ఉచిత, నిర్బంధ విద్యా నియమాలు, 2010 ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించింది (2010 ఏప్రిల్).

ఆర్‌టీఈ చట్టం, 2009 అనుసరించి పాఠశాలల్లో ఉండవలసిన మౌలిక వసతులు ఏమేరకు సమకూర్చినదీ అంచనా వేయటం కోసం ఆడిట్ పరిశీలన చేపట్టింది. ఇందుకుగాను 76,735 పాఠశాలలకు[2] సంబంధించి పాఠశాల విద్యా శాఖ డైరెక్టరు మరియు కమీషనరు (కమీషనరు) రూపొందించిన రాష్ట్ర స్థాయి సమాచారాన్ని (డీఐఎస్ఈ డేటా[3]) విశ్లేషించటంతోపాటు రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్[4] రికార్డులను కమీషనరు కార్యాలయంలోనూ, ఇంకా ఆరు జిల్లాలలోని జిల్లా విద్యా శాఖాధికారుల కార్యాలయాలలోనూ పరిశీలించటం జరిగింది. రాజీవ్ విద్యా మిషన్[5], కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల విషయమై రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టరు, జిల్లా ప్రాజెక్టు అధికారుల[6] దస్త్రాలను 2010-13 మధ్య సంవత్సరాలవి పరిశీలించటం జరిగింది. *నమూనా తనిఖీ చేపట్టిన ఆరు జిల్లాలలోని[7] 19,357 ప్రాథమిక/ప్రాథమికోన్నత/ఉన్నత పాఠశాలల్లోని 154 పాఠశాలలను* 2012-13 సంవత్సరంలో ఆడిట్ మచ్చుకు తనిఖీ చేసింది ***(అనుబంధం-5.1).***

ఆర్‌టీఈ చట్టం నిర్దేశించిన నాణ్యతాప్రమాణాల ప్రకారం ప్రతి పాఠశాలకూ అన్ని వాతావరణ పరిస్థితులను తట్టుకునే భవనం, అందులో ప్రతి ఉపాధ్యాయునికీ కనీసం ఒక తరగతి గది, ఆఫీసుకూ - సామాగ్రికీ ఒక గది, అడ్డంకులు లేని దోవ, బాలబాలికలకు వేరువేరు మరుగుదొడ్లు, పిల్లలందరికీ సరిపడినంత మంచినీటి వసతి, మధ్యాహ్న భోజనం వండుతున్న పాఠశాలలైతే ఒక వంట గది, ఆట స్థలం, భవనానికి రక్షణగా ప్రహరీ గోడ లేదా కంచె వంటివి ఉండాలి.

ఈ విషయమై ఆడిట్ పరిశీలనలో ఈ కింది విషయాలు తెలిశాయి.

### 5.1.1 అన్ని సీజన్లకూ అనువైన భవనాలు

రాష్ట్రంలోని పాఠశాలలలో 96 శాతం వాటికి సొంత భవనాలున్నాయికానీ, ప్రాథమిక పాఠశాల భవనాలలో 19 శాతం వాటికి (10,945 పాఠశాలలు, 15,513 తరగతి గదులు) ప్రధాన మరమ్మతులు అవసరమవుతాయి. నమూనా తనిఖీ చేపట్టిన ఆరు జిల్లాలలో 18 శాతం ప్రాథమిక పాఠశాల భవనాలకు (2,619 పాఠశాలలు, 3,704 తరగతి గదులు) పెద్ద మరమ్మతులు అవసరమని 2012-13 సంవత్సరానికి కమీషనరు ఇచ్చిన డీఐఎస్ఈ డేటా వలన తెలిసింది. భవనాలకు ఎంతకాలంగా మరమ్మతులు అవసరమైనదీ రాజీవ్ విద్యా మిషన్‌కు చెందిన రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టరుకు తెలియలేదు.

---

1 ఆరు నుంచి పధ్నాలుగు సంవత్సరాల మధ్య వయసుగల పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్య కల్పించే ఉద్దేశంతో పార్లమెంటు ఆర్‌టీఈ చట్టం, 2009 అనే చట్టాన్ని ఆమోదించింది

2 ప్రాథమిక పాఠశాలలు : 56,741, ప్రాథమికోన్నత పాఠశాలలు : 8,982, ఉన్నత పాఠశాలలు : 11,012

3 జిల్లాలోని విద్యా సంబంధ సమాచార వ్యవస్థ (డీఐఎస్ఈ)

4 మాధ్యమిక విద్యావకాశాలను మెరుగుపరచి, దాని నాణ్యతనుకూడా ఇనుమడింప చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకం

5 ప్రాథమిక విద్యను సార్వత్రికం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం

6 మహబూబ్‌నగర్, మెదక్, ప్రకాశం, రంగారెడ్డి, విజయనగరం, వైఎస్ఆర్ కడప

7 మహబూబ్‌నగర్ (23), మెదక్ (20), ప్రకాశం (30), రంగారెడ్డి (31), విజయనగరం (28), వైఎస్ఆర్ కడప (22)

ప్రాథమిక పాఠశాలలకు మరమ్మతులను ప్రభుత్వం ప్రతి ఏటా దశలవారీగా చేపడుతున్నదనీ, ఇంకా మిగిలి ఉన్న పనులను రాగల వార్షిక ప్రణాళికలలో పొందుపరుస్తారనీ రాజీవ్ విద్యా మిషన్ చీఫ్ ఇంజనీర్ బదులిచ్చారు (2014 జనవరి).

*నమూనా తనిఖీ చేసిన ఆరు జిల్లాలలో* 188 పాఠశాలలు (*అనుబంధం-5.2*లో వివరించినవి) భవనాలు లేకుండానే పనిచేస్తున్నాయి (వీటిలో 78 పాఠశాలలు ఒక్క విజయనగరం జిల్లాలోనే ఉన్నాయి). వీటిలో చాలా భాగం పట్టణ ప్రాంతాలలో ఉండటం వలన భవన నిర్మాణాలకు తగిన స్థలాలు దొరకటం లేదని చీఫ్ ఇంజనీర్ బదులిచ్చారు. అంతేకాకుండా, 58 పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. (అటువంటి ఒక భవనం ఛాయాచిత్రం పక్కన ఇవ్వటం జరిగింది).



*వైఎస్ఆర్ కడప జిల్లా నాగిరెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (19 ఫిబ్రవరి 2013)*

*నమూనా తనిఖీ చేసిన* ***154*** పాఠశాలల్లో రెండింటికి[8] భవనాలు లేవు. ఈ ఉన్నత పాఠశాలలు ప్రాథమిక పాఠశాల భవనాలలోనూ, చెట్ల కిందా పనిచేస్తున్నాయి. పాఠశాల భవన నిర్మాణానికి రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ కింద 2009-10 లోనే అనుమతి లభించినాకానీ, స్థల వివాదాల కారణంగా ఇది కార్యరూపం దాల్చలేదు.

తొమ్మిది అదనపు గదులు మంజూరయ్యాయనీ, వీటి నిర్మాణం లింటెల్ వరకూ వచ్చిందనీ ప్రభుత్వం తెలిపింది (2014 జనవరి). పూర్తి స్థాయి భవనం వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి వస్తుందని కూడా ప్రభుత్వం పేర్కొన్నది.

వైఎస్ఆర్ కడప జిల్లా, వలసపాలెం పాఠశాల నిధుల కొరత కారణంగా పాక్షికంగా పూర్తయిన భవనంలోనే కొనసాగుతున్నది.

### *5.1.1.1 మంజూరైన నిర్మాణ పనులు*

రాజీవ్ విద్యా మిషన్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ కింద మంజూరైన నిర్మాణ పనులను ఆడిట్‌లో పరిశీలించిన మీదట ఈ దిగువ విషయాలు తెలిశాయి :

- రాజీవ్ విద్యా మిషన్ కింద 2010-13 సంవత్సరాలలో మంజూరైన 1,33,326 పనులకుగాను 1,06,044 పనులు (80 శాతం) మాత్రమే పూర్తయ్యాయి. మరో 12,073 పనులు పురోగతిలో ఉండగా, స్థలాలు లభించకపోవటం, కోర్టు వివాదాలు, నిధుల కొరత కారణంగా 15,209 (11 శాతం) పనులు 2013 ఏప్రిల్ నాటికీ ఆరంభం కాలేదు.
- రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ కింద 2009-11 సంవత్సరాలలో అనుమతి పొందిన 5,580 నిర్మాణ పనులలో[9] 1,902 పనులను ఒకటవ, రెండవ దశలలో పూర్తి చేశారు. ఇక మూడవ దశ కింద 2011-12 సంవత్సరంలో మంజూరైన 3,437 పనులకు అదనపు నిధులు[10] అవసరం కావటం వలన 2013 జూన్ నాటికి ఒక్క పని కూడా చేపట్టలేదు. వీటికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు సరిపోక ఇంకా 331.58 కోట్లు అవసరమయ్యాయి. కమీషనరు తన అభ్యర్థనను 2013 మే నెలలోనే రాష్ట్ర ప్రభుత్వానికి అందచేయగా, 2014 జనవరి నాటికీ అదనపు నిధులు అందలేదు.

---

[8] వైఎస్ఆర్ కడప జిల్లాలోని వలసపాలెం ప్రాథమిక పాఠశాల, సోమేశ్వరపురం ఉన్నత పాఠశాల

[9] మొదటి దశ : 1,656, రెండవ దశ : 487, మూడవ దశ : 3,437

[10] అదనపు తరగతి గదులు (1,011), చేతి పనుల గది (2,044), గ్రంథాలయం (969), మరుగుదొడ్లు (1,741), తాగునీటి వసతి (480), ఇంకా ఎమ్ఎమ్ఈఆర్ కోసం

### *5.1.1.2 పాఠశాలలో చేపట్టవలసిన చిన్న, పెద్ద మరమ్మతులు*

రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ కింద పాఠశాలలో చేపట్ట తలచిన చిన్న, పెద్ద మరమ్మతు పనులను ఆడిట్ విశ్లేషించగా ఈ కింది విషయాలు తెలిశాయి :

- **పెద్ద మరమ్మతులు** చేపట్టటం కోసం 2009-10లో 3,087[11] పాఠశాలలను గుర్తించినప్పటికీ పనులు ఆరంభించేందుకు చర్యలు చేపట్టలేదు. అంతేకాకుండా, 2010-13 సంవత్సరాలలో పెద్ద మరమ్మతులేవీ తలపెట్టలేదు.
- **చిన్న మరమ్మతులు** చేపట్టవలసిన 8,548 పాఠశాలలను 2009-10లో గుర్తించగా, 6,990 (82 శాతం) పాఠశాలల్లో మరమ్మతులు చేశారు. తదుపరి, 2010-13 సంవత్సరాలలో 20,208 పాఠశాలలకు[12] చిన్న మరమ్మతులు చేయాలని భావించగా నిధులు విడుదల కాకపోవడంతో 2013 అక్టోబరు నాటికి ఒక్క పని కూడా ప్రారంభించలేదు.

### *5.1.1.3 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు*

ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలకు చెందిన బాలికలకు ప్రాథమికోన్నత విద్యా స్థాయిలో ఆశ్రమ పాఠశాలలు స్థాపించేందుకు కేంద్ర ప్రభుత్వం 2004 ఆగస్టులో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ పథకం ప్రవేశ పెట్టింది. దేశంలో విద్యావకాశాలపరంగా వెనుకబడిన ప్రాంతాలలో గ్రామీణ మహిళల అక్షరాస్యత జాతీయ సగటు కన్నా తక్కువగానూ, అక్షరాస్యతలో స్త్రీ పురుషులమధ్య అంతరం జాతీయ సగటుకన్నా ఎక్కువగానూ ఉన్న ప్రాంతాలలో ఈ పథకం అమలవుతున్నది. సామాజిక న్యాయం-సాధికారత మంత్రిత్వ శాఖ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఇంకా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఏ పథకం కిందనూ బాలికలకోసం ప్రాథమికోన్నత స్థాయిలో ఆశ్రమ పాఠశాలలు లేని వెనుకబడిన ప్రాంతాలలోనే ఈ ఆశ్రమ పాఠశాలలు నెలకొల్పాలి.

- ఒక్కొక్క పాఠశాలలోనూ 120 మంది బాలికలకు వసతి కల్పించే విధంగా మొత్తం 348 ఆశ్రమ పాఠశాలల భవనాలకు కేంద్ర ప్రభుత్వం 2011 మే నెలలో ఆమోదం తెలిపింది. ఇవి 2012 మార్చిలోగా పూర్తి కావలసి ఉన్నది. వీటిలో 2013 నవంబరు నాటికి 201 పాఠశాలలు పూర్తవగా మరో 136 పనులు కొనసాగుతున్నాయి. ఇసుక కొరత వలనా, అనువైన స్థలం దొరకనందువలనా 11 పనులు ఆరంభం కాలేదు. ఈ సమస్యలను పరిష్కరించామనీ, నిర్మాణాలు పూర్తి చేయటం కోసం టెండర్లు కూడా పిలిచామనీ ప్రభుత్వం తెలిపింది (2014 జనవరి).
- పాఠశాలల్లో అదనపు వసతుల కోసం కేంద్ర ప్రభుత్వం అనుమతించిన 395[13] నిర్మాణాలు 2012 మార్చి నాటికి పూర్తి కావలసి ఉండగా, కేవలం 228 (58 శాతం) పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగతా 167 భవనాలలో 16 నిర్మాణాలకు పనులు మొదలు పెట్టలేదు. మరో 151 భవనాలు వివిధ దశలలో ఉన్నాయి. ఈ పనులన్నీ త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం తెలిపింది (2014 జనవరి).
- జడ్చర్ల, పాఠశాల భవనం 2010 ఆగస్టులోనూ, ఘాత్‌పూర్ భవనం 2011 మే నెలలోనూ పూర్తయ్యాయి. అయితే విద్యుత్తు సరఫరా కల్పించటంలో జాప్యం వలన ఈ భవనాలను 2011 నవంబరు, 2012 జనవరి నెలల్లో పాఠశాల అధికారులకు అప్పగించారు. ఆ విధంగా వీటిలో వరుసగా పదిహేను నెలలు, ఎనిమిది నెలల జాప్యం చోటుచేసుకొంది.

---

[11] మంజూరైన 3,087 పనులలో 56 పనులను కమీషనరు తమ సాధారణ నిర్వహణ బడ్జెట్ నిధులతో చేపట్టారు

[12] 2010-11 లో 9,560; 2011-12 లో 9,597; 2012-13 లో 1,051

[13] మోడల్-I : 363, మోడల్-II : 32

### 5.1.1.4 ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ సెంటర్స్ (ఐఈఆర్‌సీ)

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, తల్లితండ్రులకు, అధ్యాపకులకు కౌన్సిలింగ్ వంటివి చేపట్టేందుకు, వారికి మిగతా పిల్లలతో సమానంగా చదువు చెప్పించేందుకు వీలుగా ఈ తరహా పాఠశాలలను నెలకొల్పారు. ఇటువంటి పిల్లల కోసం ఒకటి రెండు గదులు కేటాయించే విధంగా ఈ కేంద్రాలను మండల రిసోర్స్ సెంటర్లకు సమీపంలో ఏర్పాటు చేసి వారి కోసం శిక్షణ, సమావేశాలు నిర్వహించేలా చూడాలి.

మొత్తం 382 మండలాలను గుర్తించి అక్కడ ఈ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం 2011 జూలైలో పంపిన ప్రతిపాదనను కేంద్రం 2011-12 లోనే ఆమోదించింది. అన్ని ఐఈఆర్‌సీల నిర్మాణం 2012 మార్చి లోపున పూర్తిచేసి, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం 2011 జూలై నెలలో ఆదేశించింది. వీటి విషయంలో నాణ్యత పాటించాలని కూడా సూచించింది. అయితే, మొత్తం 382 ఐఈఆర్‌సీలకుగాను 2013 డిసెంబరు నాటికి 295 నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా పనులు సాగుతున్నాయి.

***నమూనా తనిఖీ చేపట్టిన ఆరు జిల్లాలలో*** 97[14] చోట్ల ఐఈఆర్‌సీ భవనాలు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అనువైన మరుగుదొడ్లు, ర్యాంపులతో సహా నిర్మించేందుకు 2011 అక్టోబరు - 2012 జనవరి నెలల మధ్య అనుమతి లభించింది. అయితే, వీటిలో 64 నిర్మాణాలు[15] మాత్రమే పూర్తయ్యాయి. స్థలాలు లభించకపోవటం, టెండరు ప్రక్రియలో జాప్యం కారణంగా 13 పనులు ఇంకా ప్రారంభం కాలేదు (ప్రకాశం జిల్లాలో : 4, వైఎస్ఆర్ కడప జిల్లాలో : 3, మహబూబ్‌నగర్ జిల్లాలో : 1, విజయనగరం జిల్లాలో : 1, రంగారెడ్డి జిల్లాలో : 4). మిగతా 20 పనులు అసంపూర్తిగా[16] ఉన్నాయి

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అనువైన మరుగుదొడ్లు, ర్యాంపులు 365 మంజూరవగా, వాటిలో 233 పనులు పూర్తయ్యాయనీ, మిగతా చోట్ల కూడా పనులు జరుగుతున్నాయనీ, వాటినీ త్వరలోనే పూర్తి చేయిస్తామనీ ప్రభుత్వం తెలిపింది.

## 5.1.2 తరగతి గదులు

ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రతి ఉపాధ్యాయునికొక తరగతి గది, సామాను గది, హెడ్మాస్టరు గది సమకూర్చవలసి ఉండగా, రాష్ట్రంలోని 24 శాతం పాఠశాలలు ఒకే గదితో సరిపెట్టుకుంటున్నాయి. ***నమూనా తనిఖీ చేసిన ఆరు జిల్లాలలో*** 4,696 పాఠశాలలు[17] (24 శాతం) కేవలం ఒక్క గదిలోనే మనుగడ సాగిస్తున్నాయి ***(అనుబంధం-5.2)***.

చార్టు 5.1 :
రాష్ట్రంలోని పాఠశాలల్లో తరగతి గదుల స్థితి




*మూలం : కమీషనరు కార్యాలయ దస్త్రాలు*

[14] ప్రకాశం జిల్లా :19, విజయనగరం జిల్లా : 12, మెదక్ జిల్లా : 15, వైఎస్ఆర్ కడప జిల్లా :17; మహబూబ్‌నగర్ జిల్లా : 21, రంగారెడ్డి జిల్లా : 13

[15] ప్రకాశం జిల్లా : 11, విజయనగరం జిల్లా : 9, మెదక్ జిల్లా : 11, వైఎస్ఆర్ కడప జిల్లా : 12; మహబూబ్‌నగర్ జిల్లా : 15, రంగారెడ్డి జిల్లా : 6

[16] పునాదుల స్థాయి : 2; లింటెల్ స్థాయి : 3; పై కప్పు స్థాయి : 6, తుది మెరుగుల దశ : 9

[17] మెదక్ జిల్లా : 543; రంగారెడ్డి జిల్లా : 364; మహబూబ్‌నగర్ జిల్లా : 943; విజయనగరం జిల్లా: 943; ప్రకాశం జిల్లా : 920, వైఎస్ఆర్ కడప జిల్లా : 983

***నమూనా తనిఖీ చేపట్టిన 154 పాఠశాలల్లో*** 74 చోట్ల మొత్తంమీద 199 తరగతి గదుల కొరత ఉన్నది. అంతేకాకుండా, 51 గదులు శిథిల దశకు చేరుకున్నాయి.

రాజీవ్ విద్యా మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం 2010-13 సంవత్సరాల మధ్య 56,202[18] అదనపు తరగతి గదులకు ఆమోదం తెలిపింది. ఇవి ఆయా ఆర్థిక సంవత్సరాలలోనే పూర్తి చేయవలసి ఉండగా, 2013 ఏప్రిల్ నాటికి 8,697 (15 శాతం) తరగతి గదులు అసంపూర్తిగా ఉన్నాయి. మరో 5,130 (9 శాతం) గదుల నిర్మాణం మొదలైనా కాలేదు. అనువైన స్థలాలు లేకపోవటం, సరిహద్దుల విషయంలో వివాదాలు, పాఠశాల స్థలాల ఆక్రమణ, పాఠశాల యాజమాన్య కమిటీలు సన్నద్ధంగా లేకపోవటం, ఇసుక కొరత, టెండరు ప్రక్రియలో జాప్యం, న్యాయపరమైన చిక్కులు మొదలైనవి ఈ జాప్యానికి కారణమని రాజీవ్ విద్యా మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ తెలిపారు.

పెద్ద మరమ్మతులను వచ్చే సంవత్సరం పూర్తి చేయనున్నామనీ, అదనపు తరగతి గదులకు సంబంధించిన 7,232 పనులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించనందున వీటిని 2014-15 సంవత్సరానికి వాయిదా వేశామనీ ప్రభుత్వం బదులిచ్చింది (2014 జనవరి). నిర్మాణం పూర్తి కావస్తున్న అదనపు తరగతి గదులను తొందరగా పూర్తి చేసే పనిలో ఉన్నట్టు కూడా ప్రభుత్వం తెలిపింది.

### 5.1.3 ఆటంకాలు లేని దారులు

ఒక్కొక్క ర్యాంపు ఖర్చు ₹0.12 లక్ష అయ్యే విధంగా 21,674 పాఠశాలల్లో ర్యాంపుల నిర్మాణానికి ప్రభుత్వం 2011 జూన్ నెలలో అనుమతి తెలిపింది. ఈ పనులన్నీ 2011 జూలై నాటికి పూర్తి చేయవలసి ఉండగా, 2013 నవంబరు నాటికి 20,974 (97 శాతం) పాఠశాలలు నిర్మాణాలు పూర్తి చేశాయి. అంతే కాకుండా, 2012-13 లో ఆమోదించిన 1,008 ర్యాంపులలో 2013 నవంబరు నాటికి 217 (22 శాతం) ర్యాంపులే పూర్తయ్యాయి. అన్ని పనులనూ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ప్రభుత్వం బదులిచ్చింది.

### 5.1.4 మరుగుదొడ్లు

రాష్ట్రంలోని 32 శాతం పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు, 63 శాతం పాఠశాలలో బాలురకు మరుగుదొడ్లు లేవు. అసలు 42 శాతం పాఠశాలల్లోనైతే కనీసం ఉమ్మడి మరుగుదొడ్లు కూడా లేవు. ***నమూనా తనిఖీ చేపట్టిన ఆరు జిల్లాలలోని*** 38 శాతం (7,320) పాఠశాలల్లో బాలికలకు విడిగానూ, 69 శాతం (13,352) పాఠశాలలో బాలురకు మరుగుదొడ్లు లేవు. ఇంకొక 46 శాతం (8,845) పాఠశాలలో ఉమ్మడిగానైనా మరుగుదొడ్లు లేవు. ఇందుకు సంబంధించి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలవారీగా వివరాలు పక్క చార్టులోనూ, ***అనుబంధం-5.3*** లోనూ చూడవచ్చును.




*మూలం : కమీషనరు కార్యాలయ దస్త్రాలు*

***మచ్చుకు తనిఖీ చేసిన 154 పాఠశాలల్లో*** 87 చోట్ల (56 శాతం) మరుగుదొడ్లు ఉన్నాగానీ అవి ఉపయోగకరంగా లేవు.

[18] 2010-11 లో : 15,214; 2011-12 లో : 20,599; 2012-13 లో : 20,389

గ్రామీణ నీటి సరఫరా - పారిశుధ్య శాఖ ద్వారా 12,150 మరుగుదొడ్లు మంజూరయ్యాయనీ, పనులు కూడా జరుగుతున్నాయనీ ప్రభుత్వం తెలిపింది (2014 జనవరి). నిర్వహణ లోపం, భద్రత లేమి, నీటి కొరత వంటి కారణాల వలన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారినట్లు కూడా ప్రభుత్వం బదులిచ్చింది. అంతేకాకుండా, మరుగుదొడ్ల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకించి గ్రాంటులేవీ ఇవ్వటం లేదని కూడా తెలిపింది.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం రాజీవ్ విద్యా మిషన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ 2012-13 లో ఆమోదించిన 4,997 ప్రత్యేక మరుగుదొడ్లు 2013 మార్చిలోగా పూర్తి కావలసి ఉండగా, 2013 నవంబరు నాటికి కేవలం 3299 (66 శాతం) మాత్రమే పూర్తయ్యాయి. మరో 1,249 (25 శాతం) నిర్మాణంలో ఉండగా మిగతా 449 (తొమ్మిది శాతం) అసలు ఆరంభం కాలేదు.

అనువైన స్థలాలు లభించకపోవటం, నీటి సరఫరా లేకపోవటాన్ని మరుగుదొడ్ల నిర్మాణంలో జాప్యానికి కారణాలుగా ప్రభుత్వం పేర్కొన్నది. మిగతా పనులను 2013-14 ఆర్థిక సంవత్సరంలోగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని కూడా తెలిపింది.

### 5.1.5 తాగునీరు

రాష్ట్రంలోని 36 శాతం పాఠశాలల్లో సురక్షితమైన మంచి నీటిని తగిన పరిమాణంలో సమకూర్చటంలేదు. *నమూనా తనిఖీ చేసిన ఆరు జిల్లాలలోని* 40 శాతం (7,735) పాఠశాలలకు రక్షిత మంచినీటి వసతి లేదు. ఆ వివరాలు ***అనుబంధం-5.3***లో ఉన్నాయి.

చార్టు 5.3 :
రాష్ట్రంలోని పాఠశాలల్లో రక్షిత మంచినీటి సరఫరా లేమి




*మూలం : కమీషనరు కార్యాలయ దస్త్రాలు*

*మచ్చుకు తనిఖీ చేసిన* ***154*** *పాఠశాలలో* 39 చోట్ల (25 శాతం) తాగేందుకు/వాడుకునేందుకు నీటి సౌకర్యం అందుబాటులో లేదు. మరొక 13 (ఎనిమిది శాతం) బడులలో తాగునీటి వసతి ఉన్నాగానీ అది సమృద్ధిగా లేదు.

గ్రామీణ నీటి పారుదల - పారిశుధ్య శాఖ ఇచ్చిన నివేదికల ప్రకారం 5,371 పాఠశాలల్లో తాగునీటి వసతి కల్పించారనీ, మిగతా బడులలోనూ ఏర్పాట్లు జరుగుతున్నాయనీ ప్రభుత్వం తెలిపింది (2014 జనవరి).

### 5.1.6 వంటగదులు

*మచ్చుకు తనిఖీ చేసిన* ***154*** *పాఠశాలలకుగాను* 101 (66 శాతం) బడులలో మధ్యాహ్న భోజనం కోసం వంటగదులు లేవు. ఫలితంగా చెట్లకింద, ఆరుబయటా వంటలు చేసుకోవలసి వస్తోంది.

### 5.1.7 ఆటస్థలాలు

చార్టు 5.4
రాష్ట్రంలోని బడులలో ఆటస్థలాలు లేక పోవటం




*మూలం : కమీషనరు కార్యాలయ దస్త్రాలు*

రాష్ట్రంలోని 53 శాతం పాఠశాలల్లో ఆటస్థలాలు లేవు. *నమూనా తనిఖీ చేసిన ఆరు జిల్లాలలోని* 53 శాతం (10,262) పాఠశాలలకు ఆటస్థలాలు లేవు. వాటి వివరాలు ***అనుబంధం-5.3***లో ఇవ్వడమైంది.

*మచ్చుకు తనిఖీ చేసిన* ***154*** *పాఠశాలల్లో* 70 (45 శాతం) బడులకు ఆటస్థలాల వసతి కల్పించలేదు.

### 5.1.8 పాఠశాల భవనాల భద్రత

రాష్ట్రంలోని 73 శాతం పాఠశాలల్లో భవనాల భద్రతకు అవసరమైన ప్రహరీ గోడలు నిర్మించలేదు. ***నమూనా తనిఖీ చేసిన ఆరు జిల్లాలలో*** 71 శాతం (13,742) బడులకు ప్రహరీ గోడలు లేవు. వీటి వివరాలు ***అనుబంధం-5.3***లో ఉన్నాయి.

***మచ్చుకు తనిఖీ చేసిన 154 పాఠశాలల్లో*** 83 బడులకు (54 శాతం) ప్రహరీ గోడలు ఏర్పడలేదు. మరో ఏడు బడులకు ప్రహరీ గోడలను పాక్షికంగానే నిర్మించారు.

చార్టు 5.5
రాష్ట్రంలో ప్రహరీగోడలు లేని పాఠశాలలు




*మూలం : కమీషనరు కార్యాలయ దస్త్రాలు*

ప్రహరీగోడల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రం అమోదించకపోవటమే ఇందుకు కారణమని బదులిస్తూ, 2014-15 లో మరోమారు అభ్యర్థనలు పంపుతామని ప్రభుత్వం తెలిపింది.

### 5.1.9 గ్రంథాలయ వసతులు

రాష్ట్రంలోని 76,735 పాఠశాలలకుగాను 4,954 (ఆరు శాతం) బడులకు గ్రంథాలయ సౌకర్యం లేదు. అలాగే 2,359 (మూడు శాతం) పాఠశాలల్లోని గ్రంథాలయాలలో పుస్తకాలు లేవు. ***నమూనా తనిఖీ జిల్లాలలో*** 19,357 పాఠశాలలు ఉండగా, 1,512 (ఎనిమిది శాతం) బడులకు గ్రంథాలయ వసతులు లేవు. మరో 717 (నాలుగు శాతం) పాఠశాలల్లో గ్రంథాలయాలు ఉన్నా అక్కడ పుస్తకాలు లేవు. వాటి వివరాలు ***అనుబంధం-5.4***లో ఉన్నాయి. ***మచ్చుకు తనిఖీ చేసిన 154 పాఠశాలలకుగాను*** 36 (23 శాతం) పాఠశాలల్లో గ్రంథాలయాలు లేవు.

ప్రతి పాఠశాలలోని గ్రంథాలయాల పరిస్థితిని గమనించవలసిందిగా మండల విద్యాధికారులను, క్షేత్ర స్థాయి సిబ్బందినీ కోరనున్నట్లు ప్రభుత్వం బదులిచ్చింది (2014 జనవరి). అంతేకాకుండా, రాష్ట్రంలో అన్ని పాఠశాలలకూ క్రియాశీల గ్రంథాలయాలు అమిరేలాగున గదుల నిర్మాణానికీ, మౌలిక వసతుల కల్పనకూ తగిన ప్రతిపాదనలు చేసి కేంద్రానికి పంపుతామని కూడా ప్రభుత్వం తెలిపింది.

### 5.1.10 సారాంశం

***రాష్ట్రంలోని 96 శాతం పాఠశాలలు తమ సొంత భవనాలలోనే పనిచేస్తున్నాయి. కానీ అనేక పాఠశాలల్లో తగినన్ని తరగతి గదులు, అడ్డంకులు లేని విధంగా దోవలు, బాలబాలికలకు వేరువేరుగా మరుగుదొడ్లు, సురక్షితమైన మంచినీరు, మొదలైన మౌలిక వసతులు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన స్థాయిలోగానీ, ఆర్‌టీఈ చట్టం 2009 సూచించిన మేరకుగానీ లేవు.***

## గృహ నిర్మాణ శాఖ

## 5.2 ఇందిరా ఆవాస్ యోజన (ఐఏవై) అమలు

### 5.2.1 పరిచయం

'ఇందిరా ఆవాస్ యోజన (ఐఏవై)' పథకాన్ని భారత ప్రభుత్వం 1996లో ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లోని షెడ్యూలు కూలాలు/షెడ్యూలు తెగలు, వెట్టి చాకిరీ నుండి విముక్తి పొందినవారు, అల్ప సంఖ్యాక వర్గాలు, షెడ్యూలు కులాలు/తెగలకు చెందని ఇతర గ్రామీణ కుటుంబాలకు చెందిన వారిలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి (బీపీఎల్) ఇళ్ళ నిర్మాణం/ఉన్నతీకరణలో సహాయంచేసే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన రక్షణ సిబ్బంది/పారామిలటరీ బలగాల సిబ్బంది భార్యలు, దగ్గరి బంధువులు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తుంటే వారి ఆదాయంతో సంబంధం లేకుండానూ, మాజీ సైనిక సిబ్బంది, పదవీ విరమణపొందిన పారామిలటరీ బలగాల సిబ్బందికి కూడా ఈ పథకం వర్తిస్తుంది.

### 5.2.2 ఆడిట్ విధివిధానాలు

2008-13 మధ్యగల ఐదేళ్ళ కాలంలో ఐఏవై అమలును 2013 జూన్ - సెప్టెంబరు మధ్య నిర్వహించిన ఆడిట్‌లో పరిశీలించడమైంది. ఆడిట్ పరిశీలనలో భాగంగా బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకం కమీషనరు కార్యాలయం, ఈ పథకాన్ని అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ (ఏపీఎస్‌హెచ్‌సీఎల్), తెలంగాణ ప్రాంతంలోని[19] రెండు జిల్లాల్లో (కరీంనగర్, ఖమ్మం) ప్రాజెక్టు డైరెక్టర్ల రికార్డులను పరిశీలించడం జరిగింది. ఆడిట్ పరిశీలనలో భాగంగా, ఈ జిల్లాల్లోని సంబంధిత ప్రాజెక్టు డైరెక్టర్ల రికార్డులను పరిశీలించడంతో పాటు, ఐఏవై నిధులతో నిర్మించినట్లు చెబుతున్న ఇళ్ళను ప్రత్యక్షంగా తనిఖీ చేయడం, ఇంకా ఈ పథకం కింద లబ్ధిపొందిన 660 మందిని సర్వేచేయటం కూడా జరిగింది. ఆడిట్ కనుగొన్న అంశాలను గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు, గృహ నిర్మాణ శాఖకు చెందిన ఇతర సిబ్బందితో 2013 డిసెంబరులో జరిగిన సమీక్షానంతర సమావేశంలో చర్చించడమైంది. ప్రభుత్వ సమాధానాలను ఈ నివేదికలో అవసరమైనచోట్ల పొందుపర్చడం జరిగింది.

### 5.2.3 నిధుల విడుదల - ఖర్చు

ఐఏవై పథకం కింద ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 75:25 నిష్పత్తిలో భరిస్తాయి. 2008-13 మధ్య కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులు, ఖర్చుల వివరాలను ఈ కింది పట్టికలో చూడవచ్చును.

పట్టిక 5.1

(₹ కోట్లలో)

| సంవత్సరం | కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు | రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా విడుదల చేయాల్సిన నిధులు | రాష్ట్ర ప్రభుత్వం వాస్తవంగా విడుదల చేసిన నిధులు | విడుదల చేసిన మొత్తం నిధులు | ఖర్చు |
|---|---|---|---|---|---|
| 2008-09 | 693.47 | 231.16 | 125.00 | 818.47 | 899.38* |
| 2009-10 | 990.85 | 330.28 | 388.53 | 1379.38 | 1307.96 |
| 2010-11 | 873.66 | 291.22 | 291.64 | 1165.30 | 1148.92 |
| 2011-12 | 892.37 | 297.46 | 281.83 | 1174.20 | 1113.01 |
| 2012-13 | 846.79** | 313.05 | 174.13 | 1020.92 | 1132.53* |
| మొత్తం | 4297.14 | 1463.17 | 1261.13 | 5558.27 | 5601.80 |

*మూలం : ఏపీఎస్‌హెచ్‌సీఎల్ రికార్డులు*

** రాష్ట్రంలో ఐఏవై పథకాన్ని 'ఇందిరమ్మ' పథకంతో జతచేసారు. 2008-09, 2012-13 సంవత్సరాల్లో అధికంగా అయిన ఖర్చుకు 'ఇందిరమ్మ' పథకం కింద ఏపీఎస్‌హెచ్‌సీఎల్ వద్ద అందుబాటులో ఉన్న నిధులను వినియోగించారు*

*** హోమ్‌స్టెడ్ స్థలాలకు సంబంధించి 2010-11లో విడుదల చేసిన మొత్తాలకు వినియోగ ధృవపత్రం సమర్పించని కారణంగా, కేంద్ర ప్రభుత్వం, ₹939.16 కోట్ల కేటాయింపుల నుండి ₹92.37 కోట్లను తగ్గించి విడుదల చేసింది*

ఐఏవై పథకం నిధుల నిర్వహణపై ఆడిట్‌లో గమనించిన అంశాలను ఈ కింద పేర్కొనడమైంది :

- ఆడిట్ పరిశీలన జరిపిన 2008-13 మధ్యకాలంలో, ఐఏవై కింద కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త ఇళ్ళలో ఏ ఒక్క దాన్నీ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించలేదు. దీనికి బదులుగా, రాష్ట్ర ప్రాయోజిత పథకమైన 'ఇందిరమ్మ' కింద అంతకుముందే నిర్మించిన ఇళ్లను ఐఏవై కింద నిర్మించినట్లు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించే వినియోగధృవపత్రాల్లో (యూసీలలో) చూపారు. ఐఏవై పథకం, 'ఇందిరమ్మ' పథకంలో కలిసిపోయిందని ప్రభుత్వం తెలిపింది (2013 డిసెంబరు).

[19] ఆడిట్ చేపట్టిన కాలంలో, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో అలజడుల కారణంగా ఈ ప్రాంతాల్లో పథకం అమలుపై ఆడిట్ సాధ్యంకాలేదు

- ఐఏవై పథకం ఆన్‌లైన్ డేటాను పరిశీలించగా, 2008-11 [20] మధ్యకాలంలో 7,60,769 ఇళ్ళను నిర్మించారు[21]. నిర్ణీత ప్రమాణాల ప్రకారం, లబ్ధిదారులకు ₹2,898.63 కోట్లు విడుదల చేయాలి. ఐతే, ఆన్‌లైన్‌లో ఉంచిన ఖర్చుల వివరాల ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం ₹2,531.05 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఐఏవై కింద ఒక్కో యూనిట్‌కూ నిర్దేశించిన ఖర్చు ప్రకారం, కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చేస్తున్న కేటాయింపులకూ, ఐఏవైకి జతపర్చిన 'ఇందిరమ్మ' పథకం కింద ఒక్కో యూనిట్‌కూ తక్కువ ఖర్చుతో అంతకు ముందే ప్రారంభించిన/నిర్మాణం పూర్తయిన ఇళ్ళ పై చేసిన ఖర్చుకూ మధ్య వ్యత్యాసమే ఇందుకు కారణం. ఆఏడాదిలో పూర్తయిన ఇళ్ళకే దీన్ని వర్తింపజేస్తున్నామనీ, గతంలో పూర్తయిన ఇళ్ళకు వర్తింపచేయడంలేదనీ సమీక్షానంతర సమావేశంలో మేనేజింగ్ డైరెక్టరు తెలిపారు. ఐతే, డేటాబేస్‌ను ఆడిట్‌లో విశ్లేషించగా, 8,68,403 కేసుల్లో ('ఇందిరమ్మ' ఒకటి, రెండు, మూడు దశలకు చెందినవి), గత సంవత్సరాల్లో పూర్తయిన ఇళ్ళను కూడా ఐఏవై పథకంకు జతచేసినట్లు వెల్లడైంది.
- ఐఏవై పథకం అమలుకు సంబంధించి, రాష్ట్ర ప్రభుత్వం [22] ఆన్‌లైన్‌లో ఉంచిన ఖర్చుల వివరాలకు, ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఆడిట్‌కు సమర్పించిన వివరాలకు మధ్య వ్యత్యాసం ఉంది. కాబట్టి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఇచ్చిన ఖర్చుల వివరాలను ఆడిట్‌లో ధృవీకరించడం వీలుకాలేదు. ఆన్‌లైన్‌లో ఉంచిన వివరాల్లోని అంకెల్లో కొంత వ్యత్యాసం ఉందనీ, ఈ వ్యత్యాసాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామనీ సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం తెలిపింది.
- ఐఏవై పథకం కింద గ్రామీణ ప్రాంతంలోని 2,04,568 బీపీఎల్ కుటుంబాలకు హోమ్‌స్టెడ్ స్థలాలు (ఇంటి ఆవరణలోనే పంటభూమి ఉన్నవి) ఇచ్చేందుకు 2010-11లో ₹102.28 కోట్లను కేంద్ర ప్రభుత్వం తన వంతు సాయంగా రాష్ట్రంలోని 22 డీఆర్‌డీఏలకు విడుదల చేసింది. జిల్లాయంత్రాంగం ఈ పథకం కింద ఒక్క లబ్ధిదారునూ గుర్తించనందువల్ల, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొత్తానికి వినియోగ ధృవపత్రాన్ని సమర్పించలేదు. హోమ్‌స్టెడ్ స్థలాలకు విడుదల చేసిన మొత్తాలకు యూసీ సమర్పించని కారణంగా, కేంద్ర ప్రభుత్వం, 2012-13 సంవత్సరానికి కేటాయించిన మొత్తం నుండి ₹92.37 కోట్లను తగ్గించి విడుదల చేసింది. ఇళ్ళ స్థలాలకు సంబంధించిన భూసేకరణను సాంఘిక సంక్షేమ శాఖ చేస్తుంది కనుక నిధులను ఆ శాఖకు బదిలీ చేసామని ప్రభుత్వం తెలిపింది (2013 డిసెంబరు).
- కరీంనగర్ జిల్లాలో ఐఏవై నిధులకు సంబంధించిన క్యాష్‌బుక్, బ్యాంకు పాస్‌బుక్‌లను తనిఖీ చేయగా 2009-10 నుండి 2012-13 మధ్య కాలంలో రెండింటి బ్యాలన్స్‌ల రికన్సీలియేషన్ చేయలేదని వెల్లడైంది. రికన్సీలియేషన్ చేయనికారణంగా, క్యాష్‌బుక్, బ్యాంకు పాస్‌బుక్ ముగింపు నిల్వల మధ్య ₹23.38 కోట్ల వ్యత్యాసం 2010 మార్చి నుంచీ కనిపిస్తోంది. అవసరమైన రీకన్సీలియేషన్‌ను చేపడతామని ప్రభుత్వం తెలిపింది (2013 డిసెంబరు).

### 5.2.4 లబ్ధిదారుల గుర్తింపు

బీపీఎల్ జాబితాల ఆధారంగా, సీనియారిటీ ప్రకారం శాశ్వత నిరీక్షణ జాబితాను రూపొందించాలని ఐఏవై మార్గదర్శకాల్లో నిర్దేశించడమైంది. ఆమేరకు గ్రామపంచాయతీలు ఇళ్ళులేని కుటుంబాల జాబితాను తయారు చేయాలి. పదమూడు సామాజిక - ఆర్థిక అంశాల ఆధారంగా లెక్కించిన సంయుక్త స్కోరు ప్రాతిపదికతో నిర్ధారించిన ర్యాంకును ఖచ్చితంగా అనుసరించి గ్రామ పంచాయతీలు ఈ జాబితాను రూపొందించాలి.

---

[20] మంజూరైన ఇళ్ళు రెండేళ్ళలోపు పూర్తవ్వాలి కనుక, 2008-11 మధ్యకాలం వరకు మాత్రమే ఆడిట్ పరిశీలనలను పరిమితం చేయడమైంది

[21] 2008-09లో 1,92,056 ; 2009-10లో 3,32,779 ; 2010-11లో 2,35,934

[22] 2008-09 (ఏపీఎస్‌హెచ్‌సీఎల్ : ₹672.20 కోట్లు, ఆన్‌లైన్ : ₹530.60 కోట్లు - 1,92,056 ఇళ్ళు పూర్తైనవి); 2009-10 (₹1,164.72 కోట్లు, ₹952.59 కోట్లు - 3,32,779 ఇళ్ళు); 2010-11 (₹1,061.70 కోట్లు, ₹1,047.86 కోట్లు - 2,35,934 ఇళ్ళు)

మార్గదర్శకాల ప్రకారం, గ్రామసభలు ఈ నిరీక్షణ జాబితాను డీఆర్‌డీఏలకు పంపాలి. డీఆర్‌డీఏలు ఈ వివరాలను సంబంధిత కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో ఉంచాలి. ఐతే, రాష్ట్రంలో శాశ్వత నిరీక్షణ జాబితాలేదనీ, రాష్ట్ర ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం 'ఇందిరమ్మ' కింద ఎంపికైన లబ్ధిదారులను ఐఏవై కిందకూడా లబ్ధిదారులుగా చూపుతున్నారనీ ఆడిట్ పరిశీలనలో తెలిసింది. లబ్ధిదారుల జాబితాను రూపొందించనందువల్ల, ఇళ్ళను మంజూరు చేసేముందు లబ్ధిదారుల వివరాల పరిశీలన జరగటంలేదు.

రచ్చబండ[23] కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ఐఏవై పథకం కింద నిరీక్షణ జాబితాగా పరిగణించామనీ, ఐఏవై పథకం కింద లబ్ధిదారుల జాబితాను 2013-14 నుండి మాత్రమే వెబ్‌సైట్‌లో ప్రదర్శనకు ఉంచామనీ సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం తెలిపింది.

### 5.2.5 ఇళ్ళ మంజూరు, కేటాయింపు

ఐఏవై మార్గదర్శకాల ప్రకారం, ఇళ్ళ కేటాయింపు కోసం దరఖాస్తుదారుల ప్రాధాన్యతా క్రమాన్ని గుర్తించాలి. మంజూరైన మొత్తం ఇళ్ళలో మూడు శాతాన్ని శారీరక, మానసిక వైకల్యం గలవారికి కేటాయించాలి. ఐతే, ఈ వర్గంలో వాస్తవంగా తక్కువ మందికి ప్రయోజనం కల్పించారు. ఆవివరాలు ఈ కింది చార్టులో చూడవచ్చు.




*మూలం : ఏపీఎస్‌హెచ్‌సీఎల్ రికార్డులు*

ఐఏవై పథకం కింద లబ్ధిదారుల కోసం ప్రత్యేక జాబితాలను నిర్వహించకపోవడమే ఈ వర్గాల్లో తక్కువమందికి లబ్ధి చేకూరడానికి ప్రధానకారణం. జిల్లావారీ కేటాయింపు ఆధారంగా శారీరక, మానసిక వైకల్యంగల వారిలో కొంతమందికి 'ఇందిరమ్మ', 'ఐఏవై' పథకాలకింద లబ్ధిని చేకూర్చామని ప్రభుత్వం తెలిపింది (2013 డిసెంబరు).

### 5.2.6 హౌసింగ్ డేటాబేస్‌లో లోపాలు

ఐఏవై పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లోని వారికి మాత్రమే ఇళ్ళను మంజూరు చేయాలి. పథకాన్ని అమలు చేస్తున్న సంస్థ ఇళ్ళ మంజూరు చేసేముందు లబ్ధిదారుల వాస్తవికతను ధృవీకరించుకోవాలి. ఇళ్ళ మంజూరుకు సంబంధించిన డేటాబేస్‌ను తనిఖీ చేయగా ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి :

- ఖమ్మం, కర్నూలు, కరీంనగర్ జిల్లాల్లో ఏపీఎస్‌హెచ్‌సీఎల్ పింక్ రేషన్ కార్డులున్న[24] 19 మందికి ఇళ్ళను మంజూరు చేసి, ₹4.64 లక్షలు చెల్లించింది.
- ఐఏవై పథకం కింద ఇంటిని కేటాయించేందుకు ప్రాథమికంగా ఉండాల్సిన డాక్యుమెంటు 'తెల్ల రేషన్ కార్డు' కాగా, ఐఏవై హౌసింగ్ డేటాబేస్‌లో సరైన రేషన్ కార్డు నంబరు లేని రికార్డులు 3.48 లక్షలు ఉన్నాయి. ఈ రికార్డులకు సంబంధించిన లబ్ధిదారులకు రాష్ట్రం మొత్తం మీద చెల్లించిన మొత్తం ₹1,117.73 కోట్లు (కరీంనగర్ : ₹45.60 కోట్లు, ఖమ్మం : ₹201.42 కోట్లు).

---

23 ప్రజాసమస్యల పరిష్కారానికి, పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్ళడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం
24 పింక్ రేషన్ కార్డు ఉంటే ఆ లబ్ధిదారు దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న (ఏపీఎల్) వర్గానికి చెందినట్లు

- రేషన్ కార్డులు తనిఖీ చేయగా, ఐఏవై పథకానికి సంబంధించి, రాష్ట్రంలో 10,452 రేషన్ కార్డుల విషయంలో ఒకరి కంటే ఎక్కువ మంది లబ్ధిదారులు ఉన్నారని (కార్డులకు సంబంధించిన మొత్తం లబ్ధిదారుల సంఖ్య 31,209) గమనించడమైంది.
- రేషన్ కార్డుల విషయంలో పౌర సరఫరాల శాఖ డేటాబేస్‌ను ప్రామాణికంగా పరిగణించాలి. ఐతే, కరీంనగర్ జిల్లాలో 5,238 మంది లబ్ధిదారులు, ఖమ్మం జిల్లాలో 14,127 మంది లబ్ధిదారుల రేషన్ కార్డుల వివరాలు పౌర సరఫరాల శాఖ డేటాబేస్‌లో లేవు. రెండు జిల్లాల్లోని ఈ లబ్ధిదారులకు విడుదలచేసిన మొత్తం ₹66.66 కోట్లు (కరీంనగర్ : ₹18.80 కోట్లు, ఖమ్మం: ₹47.86 కోట్లు).

ఎంపిక చేసుకున్న జిల్లాల్లో ఇళ్ళ మంజూరీలను ఆడిట్‌లో పరిశీలించగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- ఈ పథకం కింద లబ్ధిపొందిన వారిలో 967 మంది పేర్లు రెండు మూడుసార్లు పునరావృతమయ్యాయి. ఈ లబ్ధిదారులకు చెల్లించిన మొత్తం ₹2.58[25] కోట్లు.
- కరీంనగర్ జిల్లాలో, గ్రామసభల్లో/సర్వేలో 395 రేషన్ కార్డులు చెల్లవని ప్రకటించారు. ఈ కార్డులు చెల్లవని ప్రకటించడానికి ముందే, వాటి ఆధారంగా లబ్ధిదారులకు ₹1.15 కోట్లు చెల్లించారు. అప్పటికే చెల్లించిన మొత్తాలను రికవరీ చేయడానికి ప్రాజెక్టు డైరెక్టరు ఎలాంటి చర్యనూ చేపట్టలేదు.
- ఇళ్ళ నిర్మాణం పురోగతికి సంబంధించి ఆన్‌లైన్‌లో ఉంచిన వివరాలను పరిశీలించగా, పట్టణ ప్రాంతాల్లోని 164 మంది లబ్ధిదారులను ఐఏవై పథకం కిందకు తెచ్చారు. అనర్హులైన ఇలాంటి లబ్ధిదారులకు మంజూరు చేసిన మొత్తం ₹0.41 కోటి.
- ఇళ్ళను నిర్మించకపోయినా, ఖమ్మం జిల్లాలో 222 మంది లబ్ధిదారులకు ₹44.57 లక్షలు చెల్లించారు.

కొన్ని జిల్లాల్లో ఈ పథకం కింద కొందరు అనర్హులు లబ్ధిపొందారని అంగీకరిస్తూ, ఇటువంటి కేసులన్నింటినీ రెండు నెలల్లో గుర్తించి, వారికి చెల్లించిన మొత్తాలను రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించి తిరిగి వసూలు చేస్తామని సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది (2013 డిసెంబరు).

### 5.2.7 లక్ష్యాలు, లక్ష్యసాధన

మార్గదర్శకాల ప్రకారం, ఐఏవై పథకం కింద ఇళ్ళ నిర్మాణం, మంజూరు తేదీ నుండి రెండేళ్ళలోపు పూర్తవ్వాలి. జనరల్ ఐఏవై పథకం కింద, 2008-13 మధ్యకాలంలో, 13,40,630 ఇళ్ళు మంజూరు కాగా, 2013 మార్చి నాటికి 12,11,784 ఇళ్ళు మాత్రమే పూర్తయ్యాయి; 1,02,437 ఇళ్ళ నిర్మాణాన్ని ఇంకా చేపట్టలేదు. మంజూరైన, పూర్తయిన ఇళ్ళ వివరాలు ఈ కింది పట్టికలో ఇవ్వడమైంది :

పట్టిక 5.2

| సంవత్సరం | ఐఏవై ఇళ్ళ సంఖ్య | | |
|---|---|---|---|
| | మంజూరైనవి | పూర్తయినవి | ఇంకా నిర్మాణం చేపట్టనివి |
| **2008-09** | 192132 | 192039 | 93 |
| **2009-10** | 371982 | 332770 | 39212 |
| **2010-11** | 257104 | 235936 | 21168 |
| **2011-12** | 249013 | 207081 | 41932 |
| **2012-13** | 270399 | 243958 | 26441* |
| మొత్తం | **1340630** | **1211784** | **128846** |

*మూలం : ఏపీఎస్‌హెచ్‌సీఎల్ రికార్డులు*

**26,409 ఇళ్లు 2013-14లో పూర్తయ్యాయి*

[25] కరీంనగర్ (102) : ₹0.28 కోటి; ఖమ్మం (865) : ₹2.30 కోట్లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ భారత ప్రభుత్వానికి పంపిన నివేదికల్లో యదార్థతలేని సందర్భాలు ఉన్నాయని ఆడిట్ పరిశీలనలో గమనించడమైంది. ఉదాహరణకు, 2008-13 మధ్య పూర్తయ్యాయని పేర్కొన్న ఇళ్ళ సంఖ్య, (ఆన్‌లైన్ డేటా ప్రకారం) వాస్తవ లక్ష్యసాధన కంటే కరీంనగర్ జిల్లాకు సంబంధించి 4,164, ఖమ్మం జిల్లాకు సంబంధించి 27,339 ఈ నివేదికలలో ఎక్కువగా ఉన్నాయి. అంతేకాక, అదనపు ఐఏవై పథకం కింద ఖమ్మం జిల్లాకు 2008-09 సంవత్సరానికి మంజూరైన 50,724 ఇళ్ళకుగానూ, 39,135 ఇళ్ళు, అదేవిధంగా ఐఏవై ఉద్దీపన ప్యాకేజీల కార్యక్రమానికి సంబంధించి ఆదిమతెగల సమూహం (పీటీజీ) కింద మంజూరైన 3,731 ఇళ్ళకుగానూ 3,109 ఇళ్ళు మాత్రమే 2013 సెప్టెంబరు[26] నాటికి పూర్తయ్యాయి. కానీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఈ ఇళ్ళన్నీ పూర్తయ్యాయని భారత ప్రభుత్వానికి 2012 నవంబరులో నివేదిక పంపింది.

అన్ని ఇళ్ళూ, అన్ని విధాలా పూర్తయ్యాయనీ ఇదే విషయాన్ని భారత ప్రభుత్వానికి తెలిపామనీ రాష్ట్ర ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 డిసెంబరు). ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ భారత ప్రభుత్వానికి పంపిన నివేదికల్లోని వివరాలకూ, ఆన్‌లైన్ డేటాలో ఉంచిన వాస్తవ లక్ష్య సాధనకూ మధ్య వ్యత్యాసాలకు డేటా మైగ్రేషన్ సమయంలో జరిగిన పొరపాట్లు కారణమని తెలిపారు.

### 5.2.8 పర్యవేక్షణ, మూల్యాంకనం

కేంద్ర ప్రణాళికా పథకాల పర్యవేక్షణ వ్యవస్థ (సీపీఎస్ఎమ్ఎస్) అనేది ప్రణాళికా సంఘం పర్యవేక్షణా యంత్రాంగం. పథకాలను అమలు చేసే వివిధ సంస్థలకు భారత ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల లభ్యత, వినియోగాన్ని పర్యవేక్షించడానికి కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) ఈ పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేస్తున్నారు. పథకాల అమలుకు వాస్తవంగా అవసరమైన ఆర్థిక వనరులను అంచనావేయడానికి ఈ పర్యవేక్షణ వీలు కల్పిస్తుంది. రాష్ట్రాల్లో పథకాలను అమలుచేసే సంస్థలన్నీ చివరి అంచెవరకు, అంటే ఉప జిల్లా స్థాయి వరకు బ్యాంకు ఖాతాల పూర్తి వివరాలతో ఈ వ్యవస్థ కింద సీపీఎస్ఎమ్ఎస్‌తో నమోదు చేసుకోవాలని 2011 ఆగస్టులో భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయాలన్నీ (డీఆర్‌డీఏ - మొదటి అంచె) 2013 డిసెంబరు నాటికి సీపీఎస్ఎమ్ఎస్‌తో నమోదు చేసుకున్నప్పటికీ, ఉప జిల్లా స్థాయిలో గృహ నిర్మాణ సంస్థ జిల్లా పీడీలు (రెండవ అంచె), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు (మూడవ అంచె) నమోదు చేసుకోలేదు. ఫలితంగా, డీఆర్‌డీఏలవద్ద ఉన్న నిధులు 'శూన్యం'గా చూపడంతోపాటు, రెండవ, మూడవ అంచె కార్యాలయాల వద్ద నిల్వల వివరాలు సీపీఎస్ఎమ్ఎస్‌లో అందుబాటులో ఉండటంలేదు. ఆవిధంగా, కేంద్రీయ పర్యవేక్షణ, మూల్యాంకన యంత్రాంగం ఆశించిన విధంగా అమలుకావడంలేదు. డీఆర్‌డీఏలకు సంబంధించిన వివరాలను మాత్రమే కేంద్రం అడిగిందనీ, సీపీఎస్ఎమ్ఎస్ దగ్గర తాజా సమాచారం ఉండేవిధంగా సంబంధిత వివరాలు పంపామనీ ప్రభుత్వం తెలిపింది (2013 డిసెంబరు).

ఐతే, రెండవ అంచె (సంబంధిత జిల్లాకు చెందిన ఏపీఎస్‌హెచ్‌సీఎల్), మూడవ అంచె (రాష్ట్ర స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ) సమాచారం, సీపీఎస్ఎమ్ఎస్‌లో ఇంకా నమోదు చేయలేదు కాబట్టి, పథకం అమలుకు వాస్తవంగా అవసరమైన ఆర్థిక వనరులను అంచనావేయాలనే లక్ష్యం నెరవేరలేదు.

### 5.2.9 ప్రత్యక్ష తనిఖీ/లబ్ధిదారుల సర్వే

ఐఏవై మార్గదర్శకాల ప్రకారం, కేంద్ర ప్రభుత్వ శాఖలు/మంత్రిత్వ శాఖలు అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు/ పథకాలలో ఐఏవై పథకంతో అనుసంధానం చేయడానికి అవకాశం ఉన్న వాటిని గుర్తించి, గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబాల కోసం ఉద్దేశించిన పథకాల ప్రయోజనాలు ఐఏవై పథకం లబ్ధిదారులకు కూడా అందేలా చేయడానికి డిఆర్‌డీఏలు కృషి చేయాలి.

[26] 2013 మార్చి నాటి స్థితిని ఆడిట్‌కు తెలియచేయలేదు

మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో, 2013 ఆగస్టు - సెప్టెంబరు మధ్యకాలంలో 660 ఇళ్ళవద్ద ఏపీఎస్‌హెచ్‌సీఎల్ సిబ్బందితో కలసి లబ్ధిదారుల సర్వే/ప్రత్యక్ష తనిఖీని ఆడిట్ నిర్వహించింది. ఈ సర్వే/తనిఖీలో కనుగొన్న అంశాలను ఈ కింద పేర్కొనడమైంది :

- ఐఏవై మార్గదర్శకాల ప్రకారం, ఈ పథకం నిధులతో నిర్మించిన/ఉన్నతీకరించిన ప్రతి ఇంటికీ పారిశుధ్య సౌకర్యం ఉన్న మరుగుదొడ్డి, పొగరాని పొయ్యిలను నిర్మించాలి. ఐతే, 660 ఇళ్ళను ప్రత్యక్ష తనిఖీ చేయగా, 443 (67 శాతం) ఇళ్ళలో (కరీంనగర్ : 295, ఖమ్మం : 148) పొగరానిపొయ్యిలు లేవనీ, 344 (52 శాతం) ఇళ్ళకు (కరీంనగర్ : 157, ఖమ్మం : 187) పారిశుధ్య సౌకర్యం లేదనీ వెల్లడైంది;
- 139 (21 శాతం) ఇళ్ళ నిర్మాణం నిర్దిష్ట నమూనా ప్రకారం లేదు;
- 457 (69 శాతం) ఇళ్ళకు మురుగునీటి పారుదల సదుపాయంలేదు;
- 78 (12 శాతం) ఇళ్ళకు విద్యుత్ సరఫరాలేదు; 129 (20 శాతం) ఇళ్ళలో విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేయలేదు; 582 మంది లబ్ధిదారుల ఇళ్ళకు విద్యుత్ కనెక్షన్ ఉండగా, అందులో 324 (56 శాతం) మందికి రాజీవ్ గాంధీ గ్రామీణ విద్యుత్ యోజన వంటి ప్రభుత్వ పథకాల మద్దతు అందడంలేదు;
- 114 (17 శాతం) మంది లబ్ధిదారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ విపత్తుల నివారణ సాంకేతికతకు సంబంధించిన సమాచారం/సహాయం అందజేయలేదు;
- ఐఏవై ఇళ్ళ కోసం, పలుమార్లు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగడం, మళ్ళీ-మళ్ళీ దరఖాస్తులను ఇవ్వాల్సిరావడం, నిధుల విడుదలలో జాప్యంవంటి ఇబ్బందులను ఎదుర్కొన్నవారు 75 (11 శాతం) మంది ఉన్నారు;
- వడ్డీరేటులో వ్యత్యాసం (డీఆర్ఐ)తో ఇచ్చే రుణాలు (వార్షిక వడ్డీరేటు నాలుగు శాతం)/రుణం, సబ్సిడీలు రెంటితో కూడిన గ్రాంటుల గురించి 511 (77 శాతం) మంది లబ్ధిదారులకు అవగాహనలేదు;
- మొత్తం 660 ఇళ్ళలో, ఏఒక్క ఇంటికీ 'ఐఏవై లోగో'ను అమర్చలేదు.

లబ్ధిదారులకు దీపం పథకం కింద గ్యాసు కనెక్షన్లను అందించినందువల్ల పొగరాని పొయ్యిలను ఏర్పాటు చేయలేదని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2013 డిసెంబరు). ఐతే, వీరిలో దీపం పథకం కింద ఎంతమంది లబ్ధిపొందారనే వివరాలను ప్రభుత్వం చెప్పలేదు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం 'సంపూర్ణ పారిశుధ్య ప్రచారం' పథకం కింద లబ్ధిదారులందరికీ ₹2,750 చొప్పున అందించామని ప్రభుత్వం తెలిపింది. మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ మొత్తాన్ని విడుదల చేస్తున్నామనీ, ఈ మొత్తాన్ని ₹11,000కు పెంచడం జరిగిందని కూడా ప్రభుత్వం తెలిపింది. అంతేకాక, నీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ తన బడ్జెట్ నుండి కల్పిస్తోందని ప్రభుత్వం తెలిపింది.

### 5.2.10 సారాంశం

*ఐఏవై పథకాన్ని 'ఇందిరమ్మ' అనే రాష్ట్ర పథకంతో కలగలిపిన కారణంగా, ఐఏవై నిధులతో నిర్మించిన ఇళ్ళలో, ఏ ఒక్క ఇంటిపైనా 'ఐఏవై లోగో'ను ప్రదర్శించలేదు. మచ్చుకు తనిఖీ చేసిన రెండు జిల్లాల్లోని లబ్ధిదారులకు ఐఏవై పథకం గురించి అవగాహనలేదు. ఐఏవై పథకం కోసం భారత ప్రభుత్వం ఇచ్చిన నిధులతో నిర్మించిన ఇళ్ళ సంఖ్య, ఆ నిధుల వినియోగానికి సంబంధించిన సమాచారం అసంపూర్ణంగా ఉంది. లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు శాశ్వత నిరీక్షణ జాబితాను మార్గదర్శకాల ప్రకారం రూపొందించలేదు. పౌర సరఫరాల శాఖ డేటాబేస్‌కూ, గృహ నిర్మాణ శాఖ డేటాబేస్‌కూ మధ్య వ్యత్యాసాలున్నాయి; లబ్ధిదారుల వివరాలలోని వాస్తవికతను తెలుసుకునే (వాలిడేషన్) ప్రక్రియలో లోపాలున్నాయి.*

పథకం అమలుకు సంబంధించి ఆడిట్ ప్రస్తావించిన అంశాలు, లోటుపాట్లమీద దృష్టిసారించి ఇటువంటివి ఇకమీదట జరగకుండా చూస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

## 5.3 వరద బాధితులకు ఇళ్ళ నిర్మాణంలో జాప్యం

**వరద బాధిత కుటుంబాలకు ఉపశమనం కోసం మంజూరుచేసిన ఇళ్ళ నిర్మాణం మొత్తం పూర్తిచేయలేదు, నిర్మించిన ఇళ్ళకు సైతం మౌలిక సదుపాయాలు కల్పించనందున వాటిని లబ్ధిదారులు స్వాధీనపరుచుకోలేదు. అందువల్ల వరదలు వచ్చి నాలుగు సంవత్సరాలు పైబడినా లబ్ధిదారులకు శాశ్వత ఆశ్రయం లభించలేదు**

గుంటూరు, కృష్ణా, కర్నూలు, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 2009 సెప్టెంబరు - అక్టోబరు నెలల్లో వచ్చిన వరదలవల్ల ఇళ్ళు కోల్పోయినవారికి ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ రూపంలో 1,00,000 ఇళ్ళ[27] నిర్మాణానికి అనుమతించింది. రాష్ట్రంలో ఇళ్ళ నిర్మాణాలు చేపట్టే నోడల్ ఏజన్సీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ (ఏపీఎస్‌హెచ్‌సీఎల్)కు వీటి నిర్మాణ బాధ్యతను అప్పగించారు. ఈ ప్యాకేజీలో మంజూరు చేసిన ఒక్కొక్క ఇంటి నిర్మాణ ఖర్చు ₹68,450[28] కాగా, నిర్మాణం ఆరు నెలల్లోపు పూర్తి చేయాలి.

కేంద్ర సహాయం రూపంలో భారత ప్రభుత్వం ఐఏవై[29] పథకం (ప్రకృతి వైపరీత్యాలు) కింద 5,485 ఇళ్ళ నిర్మాణానికి మాత్రమే (డీఆర్‌డీఏల ద్వారా)[30] ₹14.40 కోట్లు (₹35,000 యూనిట్ ధరలో మూడింట రెండు వంతుల భారత ప్రభుత్వ వాటా)ను ఏపీఎస్‌హెచ్‌సీఎల్ కు అందచేసింది. ఇక రాష్ట్ర వాటా విషయానికొస్తే, రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలలో ఇళ్ళ నిర్మాణం కోసం అందుబాటులో ఉన్న నిధులను ఉపయోగించమని ఏపీఎస్‌హెచ్‌సీఎల్‌ను కోరింది. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఈ పని నిమిత్తం ₹50 కోట్లను స్థల సేకరణ కోసం విడుదల చేసింది (2010 ఫిబ్రవరి).

ప్రభుత్వం మంజూరు చేసిన ఒక లక్ష ఇళ్ళకుగాను నాలుగు వరద ప్రభావిత జిల్లాల్లో 50,756 ఇళ్ళను మాత్రమే కలెక్టర్లు మంజూరు చేసినట్లు రికార్డుల తనిఖీలో (2013 జనవరి, 2013 సెప్టెంబరు/అక్టోబరు) ఆడిట్ గమనించింది. వీటిలో ఏపీఎస్‌హెచ్‌సీఎల్ తుదకు 31,991 ఇళ్ళ నిర్మాణం మాత్రం చేపట్టింది (ఎక్కడ ఉన్నవి అక్కడే: 13,819; వేరొక ప్రదేశంలో: 18,172). అంతేకాక రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ నిమిత్తం విడుదల చేసిన ₹50 కోట్లకు బదులుగా ఏపీఎస్‌హెచ్‌సీఎల్ పలు దఫాలలో ₹34.71 కోట్లను వరద ప్రభావిత జిల్లాలకు విడుదల చేసింది (2010 సెప్టెంబరు నుండి 2011 ఆగస్టు మధ్య). మిగిలిన మొత్తం ₹15.29 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ల[31] రూపంలో బ్యాంకులలో జమచేసారు. మంజూరు చేసిన 31,991 ఇళ్ళలో 21,288 ఇళ్ళ నిర్మాణం మాత్రమే పూర్తయినట్లు కూడా ఆడిట్ గమనించింది; మరో 7,773 ఇళ్ళ నిర్మాణం మొదలు పెట్టలేదు, మిగిలిన 2,930 ఇళ్ళ నిర్మాణం వివిధ దశలలో ఉన్నది (2013 అక్టోబరు).

ఇళ్ళ నిర్మాణం కోసం అవసరమైన భూమిని కూడా పూర్తిగా సేకరించలేదని తనిఖీలో తెలిసింది (2013 అక్టోబరు). వరద బాధితుల ఇళ్ళ నిర్మాణం ఆరు నెలల్లో పూర్తి కావలసి ఉన్నా నిర్మాణానికి అవసరమైన 1,330.29 ఎకరాలలో 104.16 ఎకరాలు ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఇంకా సేకరించలేదు (2013 అక్టోబరు). జాప్యానికి ఏపీఎస్‌హెచ్‌సీఎల్ చెప్పిన కారణాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

---

27 జిల్లా కలెక్టర్లు సమర్పించిన తాత్కాలిక అంచనాలను ఆధారం చేసుకొని

28 భారత ప్రభుత్వ సబ్సిడీ (ఐఏవై): ₹26,500; రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ (ఐఏవై): ₹8,500; ఇందిరమ్మ సబ్సిడీ: ₹13,200; రాష్ట్ర ప్రభుత్వ ఋణం: ₹17,500, మరుగుదొడ్డి (పంచాయతీ రాజ్ శాఖ): ₹2,750

29 ఇందిరా ఆవాస్ యోజన

30 జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు

31 2010 జూలై నుండి 2013 జనవరి వరకు వచ్చిన వడ్డీ ₹3.27 కోట్లను ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఆదాయంగా చూపించింది

పట్టిక **5.3**

| జిల్లా | స్థలం (ఎకరాలలో) | | | కారణాలు/ఆడిట్ కనుగొన్నది |
|---|---|---|---|---|
| | సేకరించ వలసినది | సేకరించినది | ఇంకా సేకరించ వలసినది | |
| గుంటూరు | 6.30 | 4.30 | 2.00 | వివాదాలు ఉండడంతో; ఏపీఎస్‌హెచ్‌సీఎల్ వేరొక స్థలాన్ని గుర్తించడానికి ప్రయత్నించలేదు |
| కృష్ణా | 32.00 | 10.40 | 21.60 | నిధులు లేకపోవడంతో పల్లపు ప్రాంతాలను మెరక చేయలేదు |
| కర్నూలు | 914.90 | 863.34 | 51.56 | వివాదాలు ఉండడం; నీటి పారుదల శాఖ రెవెన్యూ అధికారులకు భూమిని బదిలీ చేయకపోవడంవల్ల; ఏపీఎస్‌హెచ్‌సీఎల్ వేరొక స్థలాన్ని అన్వేషించలేదు |
| మహబూబ్‌నగర్ | 377.09 | 348.09 | 29.00 | భూ వివాదం; నీటి పారుదల శాఖ భూమి బదలాయించక పోవడంవల్ల |
| మొత్తం | **1330.29** | **1226.13** | **104.16** | |

*మూలం: ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ల రికార్డులు*

వరదలు వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికీ, భూ సేకరణ జరగకపోవడం వల్ల తొమ్మిది పునరావాస కాలనీలు[32] (ప్రతిపాదించిన మొత్తం 59) ఏర్పాటు కాలేదు. ఆవిధంగా, 2,879 లబ్ధిదారులకు[33] శాశ్వత నివాసం లభించలేదు (2013 అక్టోబరు).

కొన్ని ప్రాంతాలలో భూ సేకరణ ఆలస్యం వల్ల నిర్మాణ కార్యక్రమం మొదలుకాలేదని ప్రభుత్వం తన జవాబులో ఒప్పుకొంది (2013 డిసెంబరు). ఏపీఎస్‌హెచ్‌సీఎల్ దగ్గర ఉన్న మొత్తాలను జిల్లా కలెక్టర్ల నుండి అభ్యర్థనలు వచ్చిన వెంటనే విడుదల చేస్తామనికూడా ప్రభుత్వం తెలిపింది.

ఇళ్ళ మంజూరు, నిర్వాసితులకు ఊరట కలిగించే ఉద్దేశంతో చేపట్టినది కాబట్టి వెంటనే మొదలు పెట్టి అనుకున్న సమయంలో పూర్తిచేయాలి. అందువల్ల ఈ పనికోసం భూమిని గుర్తించడంలోనూ, గుర్తించిన భూమిని వెంటనే బదలాయించడంలోనూ ఇతర సంబంధిత శాఖలతో సమన్వయంతో వ్యవహరించడంలో ఏపీఎస్‌హెచ్‌సీఎల్ తగిన జాగ్రత్తలు తీసుకొని ఉండవలసింది. వినియోగించని నిధులలో (భూసేకరణ కోసం ఉద్దేశించినది) కొంత భాగాన్ని జిల్లా కలెక్టర్లతో చర్చించి అప్పటికే సేకరించిన భూమిని చదును చేయడానికి ఉపయోగించకుండా, వాటిని బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో ఉంచడానికే ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ప్రాధాన్యమిచ్చింది.

ఆడిట్ పరిశీలనలో ఇంకా ఈ కింది విషయాలు తెలిసాయి:

- కృష్ణా జిల్లాలో రెండు పునరావాస కాలనీల (మొత్తం లబ్ధిదారులు: 235) ఏర్పాటు కోసం 10.40 ఎకరాల స్థలం (ఆరు పునరావాస కాలనీల కోసం మొత్తం 32 ఎకరాలు సేకరించాలని ప్రతిపాదించారు) సేకరించినా (2010 జూలై), స్థలం పల్లంలో ఉండడం, తగినన్ని నిధులు లేక మెరక చేసే పనిని చేపట్టకపోవడం, వంతెన నిర్మాణ ప్రతిపాదన పరిశీలనలో ఉండడంతో చేసిన మొత్తం కసరత్తు వ్యర్థమైపోయింది. మరో నాలుగు పునరావాస కాలనీల విషయంలో ఇంకా స్థల నిర్ణయం కూడా జరగలేదు (మొత్తం లబ్ధిదారులు: 718).
- గుంటూరు జిల్లాలో 81 ఇళ్ళ నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయడం కోసం ఒక ప్రభుత్వేతర సంస్థకు అప్పగించారు (2012 జూన్). ఐతే 2013 అక్టోబరు నాటికి సంవత్సరం పూర్తయినా, ఏ ఒక్క ఇంటి నిర్మాణం పూర్తి కాలేదు. ఆ సంస్థకు నోటీసు ఇవ్వడంకాని, పని పూర్తి చేయమని తొందర పెట్టటం కానీ ఏపీఎస్‌హెచ్‌సీఎల్ చేయలేదు. ఇది ఏపీఎస్‌హెచ్‌సీఎల్ పర్యవేక్షణ లోపాన్ని సూచిస్తుంది.

పునరావాసంలో భాగంగా చేపట్టిన 18,172 ఇళ్ళలో 11,517 ఇళ్ళ నిర్మాణం పూర్తయినట్లు, 6,512 ఇళ్ళలోకి లబ్ధిదారులు వెళ్లినట్లు ప్రభుత్వం తన జవాబులో తెలిపింది (2013 డిసెంబరు).

[32] గుంటూరు (2), కృష్ణా (4), కర్నూలు (2), మహబూబ్‌నగర్ (1)
[33] గుంటూరు (57), కృష్ణా (718), కర్నూలు (1965), మహబూబ్‌నగర్ (139)

కర్నూలు జిల్లా, జి.సింగారంలోని ఒక లేఔట్ కాలనీని శాఖాధికారులతో కలిసి ఆడిట్ ప్రత్యక్ష తనిఖీ చేయగా (2013 అక్టోబరు) ఇక్కడ మంజూరు చేసిన 1,003 ఇళ్ళలో, 692 ఇళ్ళ నిర్మాణం పూర్తయిందనీ, 311 ఇళ్ళ నిర్మాణం అసలు మొదలుపెట్టలేదనీ తెలిసింది. నిర్మాణం పూర్తయిన వాటిలో 60 ఇళ్ళలోకి (తొమ్మిది శాతం) మాత్రమే లబ్ధిదారులు వెళ్లగా, మిగిలిన ఇళ్ళకు అంతర్గత రోడ్లు, నీరు, విద్యుత్తు మొదలైనవి కల్పించక పోవడంతో లబ్ధిదారులు స్వాధీనపరచుకోలేదు. అంతర్గత రోడ్ల విషయమై వివరించి నిధుల విడుదల కోసం జిల్లా కలెక్టరు 2012 నవంబరులోనే ఏపీఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టరుకు విజ్ఞప్తి చేసినా 2013 డిసెంబరు నాటికి కూడా కావలసిన నిధులు మాత్రం సమకూర్చలేదు.

ఏపీఎస్‌హెచ్‌సీఎల్ దగ్గర ఇందుకు అవసరమైన నిధులు లేకపోవడంతో మౌలిక సదుపాయాలు కల్పించలేక పోయినట్లు, అందువల్ల ఈ బాధ్యతను స్థానిక సంస్థలకు అప్పగించినట్లు ప్రభుత్వం (2013 డిసెంబరు) తెలిపింది.

## పాఠశాల విద్యా శాఖ

## 5.4 పరీక్ష రుసుముల జమాలెక్కలు

**వివిధ ప్రవేశ పరీక్షల కోసం వసూలు చేసిన రుసుములను వెంటనే జమ చేయకుండా నియమాలను అతిక్రమించి ఖర్చు చేశారు. పరీక్ష రుసుముల రూపేణా వచ్చిన ₹2.45 కోట్ల మొత్తాన్ని శాఖాపరమైన అవసరాలకు వాడుకోవడం నియమ విరుద్ధం. ఖర్చు చేయక మిగిలిన ₹53.62 కోట్లను కూడా పాఠశాల విద్యా శాఖ కమీషనరు మరియు డైరెక్టరు ప్రభుత్వ పద్దులకు ఆవల ఉంచారు**

ప్రభుత్వం (పాఠశాల విద్యా శాఖ) వివిధ ఉద్యోగ నియామక పరీక్షలు[34], కోర్సులలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సీఈటీ - సెట్) లను నిర్వహిస్తుంది. ఇలాంటి పరీక్షల నిర్వహణ కోసం ప్రతి పరీక్షకూ విడివిడిగా కన్వీనర్లను నియమిస్తారు. సంబంధిత కన్వీనర్ల ద్వారా ఆయా పరీక్షల నిర్వహణకు పాఠశాల విద్యా శాఖ కమీషనరు మరియు సంచాలకులు (కమీషనరు) బాధ్యత వహిస్తారు. ఆ పరీక్షలకు సంబంధించిన రాబడులు, ఖర్చులకు జమాలెక్కలను నిర్వహించే బాధ్యత సంబంధిత కన్వీనర్లపై ఉంది.

పరీక్ష ఫీజుల రూపేణా వచ్చిన ఆదాయం, వాటి నుంచి చేసిన ఖర్చుల జమాలెక్కల విషయంలో నియమ నిబంధనలు, ప్రభుత్వ ఆదేశాలను ఏమేరకు పాటించారో తెలుసుకునేందుకు, 2008-09 నుండి 2012-13 (2013 మే/జూన్) మధ్యకాలంలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించి కమీషనరు రికార్డులను 2013 ఆగస్టులో పరిశీలించడమైంది. ఆడిట్‌లో కనుగొన్న విషయాలను ఈ కింద పేర్కొనడమైంది :

### 5.4.1 ప్రభుత్వ రాబడులను నిబంధనలకు విరుద్ధంగా తమవద్దనే ఉంచుకోవడం, వాటిని వినియోగించుకోవడం

ప్రభుత్వ ఉద్యోగులు అధికారిక హోదాలో తీసుకున్న మొత్తం సొమ్మును అనవసర జాప్యమేదీ లేకుండా ట్రెజరీలో జమచేయాలని ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ కోడ్ మొదటి సంపుటిలోని నియమం 7(1) నిర్దేశిస్తోంది.

- పైన పేర్కొన్న నిబంధనల ప్రకారం, దరఖాస్తుల అమ్మకం, పరీక్ష ఫీజుల ద్వారా వచ్చిన రాబడులను ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలి. పరీక్షల నిర్వహణ వ్యయం కోసం నిధులను విడిగా మంజూరు చెయ్యాలి. కానీ, ఈ నిబంధనలకు విరుద్ధంగా, రాబడులను ఏపీటెట్ నిర్వహణకు వినియోగించుకునేందుకు కమీషనరుకు

[34] ఉపాధ్యాయుల నియామకాల కోసం జిల్లా ఎంపిక సంఘం (డీఎస్‌సీ) ; ఉపాధ్యాయుల నియామకం (ప్రైవేటు పాఠశాలలకు కూడా) అర్హతకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (ఏపీటెట్)

వీలు కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది[35]. ఈ ఖర్చుల అనంతరం కమీషనరు వద్ద మిగిలిన నిధుల వినియోగం గురించి ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలూ జారీ కాలేదు. డీఎస్సీ, డైట్ సెట్, ఎల్పీ సెట్[36] పరీక్ష ఫీజుల వసూలు, వినియోగం గురించి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఆడిట్ పరిశీలనకు అడిగినాగానీ వాటిని అందచేయలేదు.

- 2008-13 మధ్యగల ఐదేళ్ళకాలంలో, ఏపీ టెట్, డీఎస్సీ, డైట్సెట్, ఎల్పీసెట్ లకు సంబంధించి, పరీక్ష ఫీజుల రూపేణా కమీషనరు ₹89.48 కోట్లు వసూలు చేసి, పరీక్షల నిర్వహణ కోసం ₹35.86 కోట్లు ఖర్చు చేసారు. ఈ మొత్తం ఖర్చులో, అడ్వాన్సుల రూపేణా జిల్లా విద్యాధికారులకిచ్చిన ₹9.37 కోట్లు, ఇతర అధికారులకిచ్చిన ₹1.65 కోట్లు కూడా ఉన్నాయి. అడ్వాన్సులుగా ఇచ్చిన ఈ ₹11.02 కోట్లకు వివరాలు సమర్పించని కారణంగా ఏడాది నుండి నాలుగేళ్ళుగా ఇవి పెండింగులో ఉన్నాయి. పాఠశాల విద్యా శాఖ కమీషనరు కార్యాలయం తగు చర్యలు తీసుకోకపోవడమే అడ్వాన్సులు పెండింగులో ఉండటానికి కారణం.
- ఆయా పరీక్షల కార్యకలాపాలన్నీ ముగిసినప్పటికీ, వాటి తాలూకు ₹53.62[37] కోట్లను కమీషనరు ఫిక్స్డ్ డిపాజిట్లలోనూ, పొదుపు ఖాతాలలోనూ ఉంచారు.
- జిల్లా ఎంపిక సంఘం (డీఎస్సీ) పరీక్షల ఫీజు రూపేణా వసూలు చేసిన మొత్తం నుండి ఈ పరీక్షలకు సంబంధంలేని ఇతర (శాఖాపరమైన) ఖర్చులకోసం ₹2.45 కోట్లు[38] కమీషనరు మళ్ళించారు (2008-13). ఈ ఖర్చులకు నిధులను పాఠశాల విద్యా శాఖ బడ్జెటునుండి తీసుకోవాలి. బడ్జెటు కేటాయింపులు స్వల్పంగా ఉండటంవల్ల ఈ విధంగా నిధులు మళ్ళించాల్సి వచ్చిందని కమీషనరు తెలిపారు (2013 జూలై).

### 5.4.2 క్యాష్‌బుక్, వేల్యూబుల్స్ రిజిస్టర్లను నిర్వహించకపోవడం

ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ నియమావళి ప్రకారం, ప్రతి డ్రాయింగ్ ఆఫీసర్ ఏపీటీసీ ఫామ్ 5 లో ఉన్న ప్రకారం నగదు పుస్తకాన్ని (క్యాష్‌బుక్‌ను) నిర్వహించాలి. అనుబంధ నగదు పుస్తకాల్లోని నిల్వలతో సహా, క్యాష్‌బుక్‌లోని నిల్వల వివరాలను తెలుపుతూ క్యాష్‌బుక్‌ను రెగ్యులర్‌గా క్లోజ్ చెయ్యాలి.

భారీ మొత్తంలో నిధులు అందుకుంటూ, పరీక్షల నిర్వహణ కోసం వాటిని ఖర్చు చేస్తున్నప్పటికీ ఏ ఒక్క పరీక్షకు సంబంధించి కూడా నగదు పుస్తకాలను నిర్వహించలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. చెక్కుల జారీ రిజిస్టరు, సంబంధిత దస్త్రాలు (ఫైల్స్), మొదలైన వాటి ఆధారంగా 'సంక్షిప్త వివరాల నగదు పుస్తకం (ఆబ్‌స్ట్రాక్ట్ క్యాష్‌బుక్)' మాత్రమే రూపొందించారు. ఒకే పరీక్ష (డైట్ సెట్ 2010, 2011) కోసం వేరు వేరు బ్యాంకుల్లో రెండు ఖాతాలను తెరిచారు. నగదు పుస్తకాలను నిర్వహించని కారణంగా అన్ని రాబడులు, చెల్లింపులకు జమా లెక్కలు సరిగా నమోదయ్యాయనే భరోసా లేదు.

ఆర్థిక జవాబుదారీతనంపై 2008 ఆగస్టులో ప్రభుత్వం జారీ చేసిన కరదీపిక (హ్యాండ్‌బుక్) లోని పేరా 3.39 ప్రకారం, డిమాండు డ్రాఫ్టులు (డీడీ), ఇతరాల ద్వారా వచ్చిన నిధుల వివరాలను వెంటనే 'వేల్యూబుల్స్ రిజిస్టరు'లో నమోదు చేసి, ఎలాంటి జాప్యం లేకుండా బ్యాంకులో జమ చేయడానికి పంపాలి. దీని కోసం 'వేల్యూబుల్స్ రిజిస్టరు' కానీ, మరే ఇతర రికార్డునుకానీ నిర్వహించని కారణంగా డీడీలన్నింటినీ నగదుగా

---

35 పాఠశాల విద్య (ఎస్ఈ.జనరల్ - II) శాఖ జారీ చేసిన 2011 ఏప్రిల్ 16వ తేదీ నాటి జీఓఎమ్ఎస్ నంబరు 51

36 జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థలలో ప్రవేశానికి డైట్‌సెట్; భాషా పండితుల కోర్సులకు ఎల్పీసెట్

37 డీఎస్సీ (2008, 2011, 2012) : ₹13.82 కోట్లు; టెట్ (2011, 2012 జనవరి, 2012 మే) : ₹23.78 కోట్లు; ఎల్పీసెట్ (2010, 2011, 2012) : ₹0.05 కోటి; డైట్‌సెట్ (2010, 2011, 2012) : ₹15.97 కోట్లు

38 ఇతర ప్రయోజనాల కోసం అడ్వాన్సులు : ₹1.00 కోటి, కార్యాలయ ఖర్చులు : ₹0.87 కోటి, అగ్నిమాపక పరికరాల కొనుగోలు : ₹0.23 కోటి, ఆర్‌జేడీ ఆఫీసు నిర్మాణం, ఇతరాలు : ₹0.20 కోటి, వాహనం కొనుగోలు : ₹0.09 కోటి, ప్రభుత్వ ప్లీడరు స్టెనోకు రెమ్యూనరేషన్ : ₹0.04 కోటి, పరీక్షా కేంద్రానికి ఫర్నిచరు కొనుగోలు : ₹0.02 కోటి

మార్చారనీ, వాటిని లెక్కల్లో చూపారనీ ఆడిట్‌లో నిర్ధారించడం వీలు కాలేదు. ఆబ్‌స్ట్రాక్ట్ క్యాష్‌బుక్, బ్యాంకు స్టేట్‌మెంట్లను పరిశీలించగా బ్యాంకుకు పంపినా నగదుగా మారని డీడీల విషయంలో ₹0.19 లక్ష వ్యత్యాసం ఉన్నట్లు వెల్లడైంది (2013 మే). అంతేకాక, డీడీలను బ్యాంకులో జమ చేయడంలో రెండు నుండి నాలుగు నెలల జాప్యం జరిగింది. ఈ విషయాన్ని సంబంధిత బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్ళామనీ, డీడీలను నగదుగా మార్చుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటామనీ కమీషనరు తెలిపారు (2013 జూలై).

ఈ విషయాన్ని 2013 నవంబరులో ప్రభుత్వానికి తెలపడమైంది. సమాధానం రాలేదు (2014 జనవరి).

## రెవెన్యూ శాఖ

### 5.5 భూబదలాయింపులో అక్రమాలు

**ప్రభుత్వానికి స్థలం విలువ ఇంకా ₹2.82 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా, ఆక్రమణదారులకు పరిహారంగా చెల్లించేందుకు జిల్లా యంత్రాంగం ₹1.67 కోట్లను కళాశాలకు తిరిగి ఇచ్చేసింది**

చిత్తూరు జిల్లాలో సుమారు 600 ఎకరాల భూమిని తమకు కేటాయించమని ఒక కళాశాల 2009 ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, వైద్యకళాశాల, ఫార్మసీ కాలేజి, నర్సింగ్ కాలేజి, దంతవైద్య కళాశాల, ప్రజా ఆరోగ్య సంస్థ, బయో మెడికల్ ఇంజనీరింగ్ కాలేజి, పూర్తి స్థాయి నివాస ప్రాంగణం, హాస్టళ్ళు, సంబంధిత సామాజిక మౌలిక వసతులతో తమ రెండవ ఆవరణను ఏర్పాటు చేసేందుకు ఆ భూమిని కేటాయించమని కళాశాల కోరింది.

ప్రభుత్వం ఈ విజ్ఞప్తిని పరిశీలించి, చిత్తూరు జిల్లా చిత్తూరు, గుడిపాల మండలాల్లోని 640.17 ఎకరాల స్థలాన్ని ఆ సంస్థకు కేటాయించడానికి 2009 ఫిబ్రవరిలో అంగీకరించింది. అధికారిక భూబదలాయింపు ఉత్తర్వులను 2010 మార్చిలో జారీ చేయడమైంది. సంబంధిత రికార్డుల పరిశీలనలో ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి :

- భూమి బదలాయింపునకు చెల్లించాల్సిన ₹18.96[39] కోట్లకుగానూ కళాశాల 2009 ఏప్రిల్-జూలై మధ్య ₹16.14 కోట్లను మాత్రమే చెల్లించింది. మిగిలిన ₹2.82 కోట్లను ఇంకా చెల్లించలేదు (2013 మే).
- నియమాల[40] ప్రకారం, ఒక కంపెనీకి లేదా ప్రైవేటు వ్యక్తికి లేదా సంస్థలకు, ప్రజా ప్రయోజనాల కోసం భూమిని బదలాయించాలంటే, దాని మార్కెట్ విలువ[41] ను వసూలుచేసి మాత్రమే బదలాయించాలి. బోర్డ్ ఆఫ్ స్టాండింగ్ ఆర్డర్స్ (బీఎస్ఓ)లో నిర్దేశించిన నిబంధనలు, షరతులకు లోబడి మాత్రమే ఈ బదలాయింపు జరగాలి. అంతేకాక, భూసేకరణ నోటిఫికేషన్ తేదీని అనుసరించి, 'ఫెయిర్ మార్కెట్ వేల్యూ' ను నిర్ధారించుకోవాలని ఆంధ్రప్రదేశ్ భూసేకరణ చట్టంలోని సెక్షన్ 18 లో నిర్దేశించడమైంది. సేకరించాల్సిన భూమి మార్కెట్ విలువ, ఆ భూమి ఎక్కడ ఉందనే అంశంపైనా, దాని చుట్టుపక్కల ప్రాంతాలపైనా ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత కేసులో, జాయింట్ కలెక్టరు, రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) 2009 జనవరిలో భూమిని తనిఖీ చేసి మార్కెట్ విలువను ఎకరానికి ₹1.50 లక్షల నుండి ₹2 లక్షల వరకు నిర్ధారించగా, ఎకరానికి లక్ష రూపాయల చొప్పున భూబదలాయింపునకు జిల్లా కలెక్టరు సిఫార్సు

[39] ప్రభుత్వ భూమి : 237.74 ఎకరాలు /ఎకరాకు ₹1 లక్ష చొప్పున ; డీకేటీ భూమి : 319.11 ఎకరాలు /ఎకరాకు ₹1 లక్ష + ఎకరాకు ₹2.50 లక్షల పరిహారం ; పట్టాభూమి : 83.32 ఎకరాలు / ఎకరాకు ₹5 లక్షలు + 30 శాతం సొలేషియమ్

[40] ఒకప్పటి బోర్డ్ ఆఫ్ రెవెన్యూ నిర్దేశించిన స్టాండింగ్ ఆర్డర్స్ (బీఎస్ఓ), ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ ప్రాంతపు) రాష్ట్ర భూముల బదలాయింపు, భూమి శిస్తు నియమావళి - 1975

[41] ఆంధ్రప్రదేశ్ భూసేకరణ చట్టంలోని నిర్వచనం ప్రకారం, మార్కెట్ విలువ అంటే, ఒకే రకమైన సౌలభ్యాలున్న పొరుగు భూములకు అమ్మకం ద్వారా వచ్చిన ధర

చేసారు. ప్రభుత్వం 2005 ఫిబ్రవరిలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం[42] విద్యాసంస్థలకు స్థలాలను మార్కెట్ ధరలకే ఇవ్వాలన్న విషయం ఇక్కడ గమనించతగింది. ఎంపవర్డ్ కమిటీ సైతం భూమిని ఎకరం ₹1.50 లక్షల వంతున బదిలీ చేయమని 2009 ఫిబ్రవరిలో సిఫార్సు చేసింది. అయితే, తాను రూపొందించిన విధివిధానాలకు విరుద్ధంగా, ఎంపవర్డ్ కమిటీ (సాధికార సంఘం) సిఫార్సులను సైతం విస్మరించి ప్రభుత్వం ఈ స్థలాన్ని ఎకరం లక్ష రూపాయలకే బదిలీ చేసింది. మార్కెట్ విలువ కన్నా తక్కువ రేటుకు భూమిని బదలాయించడం వల్ల ప్రభుత్వానికి కనీసం ₹1.19 కోట్ల[43] నష్టం జరిగింది.

- ప్రభుత్వం (రెవెన్యూ శాఖ) 2010 మార్చిలో జారీ చేసిన ఆదేశాల ప్రకారం, భూఆక్రమణదారులకు ఎలాంటి పరిహారాన్నీ చెల్లించనవసరం లేదు. కాబట్టి, చిత్తూరు, గుడిపాల మండలాల్లోని మాపాక్షి, 190 రామాపురం గ్రామాల్లో కాల్వలు, వాగుల కింది పోరంబోకు భూముల ఆక్రమణదారులను చట్టప్రకారం ఖాళీ చేయించాలి. ఇందుకు విరుద్ధంగా భూమి బదలాయింపునకు కళాశాల చెల్లించిన ₹16.14 కోట్ల నుండి 66.72 ఎకరాల[44] ప్రభుత్వ భూముల ఆక్రమణదారులకు ఎకరానికి ₹2.50 లక్షల చొప్పున పరిహారంగా చెల్లించడానికి ₹1.67 కోట్లను ప్రభుత్వ అనుమతి లేకుండానే జిల్లా పాలనా యంత్రాంగం 2010 ఏప్రిల్‌లో కళాశాల కోరికపై తిరిగి ఇచ్చేసింది.

***ఆ విధంగా, ప్రభుత్వానికి కళాశాల ఇంకా ₹2.82 కోట్లను చెల్లించాల్సి ఉండగా, ఆక్రమణదారులకు పరిహారంగా చెల్లించేందుకు ₹1.67 కోట్లను జిల్లా పాలనాయంత్రాంగం ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా తిరిగి ఇచ్చేయడంవల్ల కళాశాలకు అనుచిత లబ్ధి చేకూరింది.***

ఈ అంశాన్ని 2013 జూలైలో ప్రభుత్వానికి తెలుపగా, సమాధానం ఇంకా రాలేదు (2014 జనవరి).

## 5.6 ప్రభుత్వ భూమి ఆక్రమణదారుకు బదలాయింపు

**ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా రక్షించటంలో చిత్తూరు జిల్లా పాలనాయంత్రాంగం వైఫల్యంవలన ప్రభుత్వానికి ₹57.56 లక్షల నష్టం వాటిల్లింది**

చిత్తూరు జిల్లా, పూతలపట్టు మండలం, ముతిరేవాల గ్రామంలో 34.34 ఎకరాల భూమిని చిత్తూరులోని ఎడ్యుకేషనల్ అకాడమీ కోరికపై ఎకరం నాలుగు లక్షల రూపాయల చొప్పున, 2011 ఆగస్టులో ప్రభుత్వం బదలాయించింది. ఇంజనీరింగ్ కాలేజీ భవనాల నిర్మాణానికి సంబంధించి సాధికార సంఘం 2010 ఏప్రిల్‌లో చేసిన సిఫార్సు మేరకు ఈ భూబదలాయింపు జరిగింది. 2011 అక్టోబరులో భూమిని అకాడమీకి స్వాధీనం చేశారు.

పైన పేర్కొన్న గ్రామంలో, కాలేజీ భవనాల నిర్మాణం కోసం 17.84 ఎకరాల భూమిని మార్కెట్ విలువకు కేటాయించమని 1999 జూన్‌లో అకాడమీ అభ్యర్థించింది. కాలేజీ భవనాల నిర్మాణం కోసం ఈ అకాడమీకి 14.39 ఎకరాల భూమిని మార్కెట్ విలువకు బదలాయించేందుకు చిత్తూరు జిల్లా కలెక్టరు 2001 జనవరిలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఐతే, 2001 డిసెంబరులో ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను తిరస్కరించింది. ఈ భూమి (14.39 ఎకరాలు) అకాడమీ ఆక్రమణలో ఉందనీ, అనుమతి లేకుండా అందులో భవనాలను కూడా నిర్మించారనీ 2002 మే లో జాయింట్ కలెక్టరు గమనించినప్పటికీ, ఆక్రమణదారును ఖాళీ చేయించి, భూమిని తిరిగి ప్రభుత్వ అధీనంలోకి తీసుకురావడానికి జిల్లాపాలనాయంత్రాంగం ఎలాంటి చర్యా చేపట్టలేదు.

[42] రెవెన్యూ (ఏ.I) శాఖ జీఓఎమ్ఎస్ నెం.243 తేదీ 28.2.2005
[43] ఎకరానికి ₹50,000 చొప్పున 237.74 ఎకరాలకు
[44] మాపాక్షి గ్రామం : 41.68 ఎకరాలు ; 190 - రామాపురం గ్రామం : 25.04 ఎకరాలు

ఈ అకాడమీకి మొత్తం 48.73 ఎకరాల భూమిని (ఆక్రమణలోఉన్న 14.39 ఎకరాలతో కలిపి) బదలాయించమని 2009 డిసెంబరులో జిల్లాపాలనాయంత్రాంగం పంపిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఐతే, 2011 ఆగస్టులో 34.34 ఎకరాల భూమిని అకాడమీకి బదలాయించడం జరిగింది. అప్పటికే ఆక్రమణలో ఉన్న 14.39 ఎకరాలను అకాడమీకి వదిలేశారు.

***ఆవిధంగా, ప్రభుత్వ భూమి నుండి ఆక్రమణదారులను ఖాళీ చేయించి, శిక్షించడానికి బదులు, 34.34 ఎకరాల భూమిని బదలాయించి జిల్లాపాలనాయంత్రాంగం ఆక్రమణదారుకు లబ్ధిని చేకూర్చింది. ఫలితంగా, ప్రభుత్వానికి ₹57.56 లక్షల[45] నష్టం వాటిల్లింది.***

ఈ విషయాన్ని 2013 జూలైలో ప్రభుత్వానికి తెలియజేయగా, సమాధానం ఇంకా రాలేదు (2014 జనవరి).

## ఆర్థిక మరియు ఇతర శాఖలు

## 5.7 అద్దెకు తీసుకున్న వాహనాలకు అక్రమ చెల్లింపులు

**ప్రభుత్వ ఉత్తర్వులు పాటించడంలో శాఖాధిపతుల వైఫల్యం, క్లెయిమ్‌ల అనుమతి మంజూరులో డ్రాయింగ్ అధికారులు, ట్రెజరి అధికారులు తగిన పరిశీలన చేయకపోవడంతో అద్దెకు తీసుకున్న వాహనాలకు అక్రమ చెల్లింపులు జరిగాయి. వాహన యజమానులకు బిల్లులు చెల్లించే సమయంలో డ్రాయింగ్ అధికారులు ఆదాయం పన్ను వసూలు చేయలేదు**

ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ అనుబంధ సంస్థలలో వాహనాల కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం 1994 జనవరిలో నిషేధం విధించింది. అత్యవసర పరిస్థితులలో మాత్రం కొన్ని నిబంధనలకు లోబడి వాహనాలను అద్దెకు తీసుకోవడానికి అనుమతిస్తోంది.

రాష్ట్రంలోని 12 శాఖలకు సంబంధించి ***(అనుబంధం-5.5)*** 2009-10 నుండి 2012-13 వరకు 22 జిల్లాలు, పే అండ్ అకౌంట్స్ అధికారి, హైదరాబాదుకు చెందిన నెలసరి వాహనాల అద్దె చెల్లింపుల తాలూకు 866 పెయిడ్ ఓచర్లను (మొత్తం వ్యయం ₹4.87 కోట్లు) ఆడిట్‌లో పరిశీలించడం జరిగింది. ప్రభుత్వ ఉత్తర్వులు, ఆదాయ పన్ను చట్టం నిబంధనల ప్రకారం ఆదాయ పన్ను మినహాయింపులు మూలం నుండి చేసినదీ లేనిదీ తెలుసుకునే ఉద్దేశంతో ఈ ఆడిట్ చేపట్టడం జరిగింది.

ఈ పరిశీలనలో 12 శాఖలలో 8 శాఖలకు చెందిన 326 (38 శాతం) ఓచర్లలో ప్రభుత్వ నిబంధనలు పాటించ లేదని తెలిసింది. రెవెన్యూ (79 శాతం), సాధారణ పరిపాలన (11 శాతం) శాఖలలో ప్రముఖంగా నిబంధనలు పాటించకపోవడం జరిగింది. దీనికి సంబంధించి వివరాలు ఈ కింద ఇవ్వడమైంది.

### 5.7.1 తగిన పత్ర సహిత ఆధారం లేకుండా డ్రా చేసారు-తద్వారా మోసం జరగడానికి అవకాశం

ప్రభుత్వ ఉత్తర్వుల వల్ల వాహనాల కొనుగోలుపై నిషేధం ఉండటంతో కార్లను అద్దెకు తీసుకొనే అవకాశం కలిగింది. ప్రభుత్వం నిర్ణయించిన నెలసరి అద్దె రేట్లు 'టాక్సీ' లకు వర్తిస్తాయి.

ఇలా చెల్లింపులు జరిగిన వాహనాల నెంబర్లను రవాణా శాఖ వెబ్‌సైట్‌లో పోల్చిచూడగా వివిధ శాఖలు అద్దెకు తీసుకున్న 100 వాహనాలు వాస్తవంగా టాక్సీలు (అద్దె కార్లు) కావని తేలింది. వీటిలో ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోరిక్షాలు, వస్తు రవాణా వాహనాలు ఉన్నాయి. ఈ విధంగా 63 ఓచర్లకు మొత్తం ₹21.72 లక్షల

[45] బదలాయించిన భూమికి 2011 ఆగస్టులో సాధికారిక సంఘం నిర్ణయించిన రేటు ఎకరానికి ₹4 లక్షలను ప్రాతిపదికగా తీసుకుని లెక్కగట్టడం జరిగింది

చెల్లింపులు జరిగాయి. తమకు తోచిన నెంబర్లను, తప్పుడు రకం వాహనాలను చూపారు. దాంతో కిరాయి రూపంలో చేసిన చెల్లింపులు ₹21.72 లక్షలు సముచితంగాకానీ తగిన పత్ర సహిత ఆధారం లేకుండా ఉన్నాయి.

### 5.7.2 ప్రయివేటు వాహనాలను అద్దెకు తీసుకున్నారు (టాక్సీలు కానివి)

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టాక్సీలుగా నమోదు చేయబడిన వాహనాలను మాత్రమే అద్దెకు తీసుకోవాలి. ప్రయివేటు వాహనాలను ప్రభుత్వ శాఖలుగానీ, అనుబంధ సంస్థలుగానీ అద్దెకు తీసుకోకూడదు.

ఇందుకు విరుద్ధంగా, ప్రభుత్వ శాఖలకు చెందిన పలువురు అధికారులు ప్రయివేటు వాహనాలను 'టాక్సీలుగా నమోదు కానివి' అద్దెకు తీసుకొని ఆ విధంగా 438 కార్లకు ₹1.19 కోట్లు అద్దెరూపంలో చెల్లించారు (263 ఓచర్లు).

### 5.7.3 మూలం నుండి ఆదాయ పన్ను మినహాయించకపోవడం

ఆదాయపన్ను చట్టం సెక్షన్ 194సి ప్రకారం, డ్రాయింగ్ అధికారులు వాహనదారులకు చేసే చెల్లింపు, వారి ఖాతాలకు చేసే జమల మూలం నుండి రెండు శాతం చొప్పున ఆదాయపన్ను (టీడీయస్) మినహాయించాలి (సెక్షన్ 206ఏఏ ప్రకారం బిల్లుపై పాన్ నెంబరు సూచించకపోతే ఇది 20 శాతం).

సప్లైదారులు బిల్లు క్లెయిమ్‌లపై తమ పాన్ నెంబరు రాయడంలేదని ఆడిట్ పరిశీలనలో తెలిసింది. అద్దె చార్జీలకు చెందిన 866 ఓచర్ల నుండి కనీసం రెండు శాతం చొప్పున మినహాయించవలసిన మొత్తం ₹10.03[46] లక్షలుగా ఉన్నట్లు లెక్క తేలింది. అయినా డ్రాయింగ్ అధికారులు ఎటువంటి ఆదాయపన్ను మినహాయింపులు చేయలేదు. మూడు శాఖలకు[47] చెందిన కొంతమంది అధికారులు మాత్రం 28 ఓచర్ల నుండి ₹11,000 మినహాయింపులు చేసారు.

వాహనాల అద్దెకు సంబంధించి మోసపూరిత, అక్రమ చెల్లింపులపై పరిశీలన చేపట్టమని సచివాలయ శాఖలకు, శాఖాధిపతులకు 2013 డిసెంబరులో తగిన ఆదేశాలు జారీ చేసినట్లు ప్రభుత్వం పేర్కొన్నది (2014 జనవరి). ప్రత్యేక తనిఖీ చేపట్టి రిపోర్టు ఇవ్వమని ఆర్థిక శాఖ (అంతర్గత తనిఖీ విభాగం)ను ఆదేశించినట్లు (2013 డిసెంబరు) కూడా ప్రభుత్వం తెలిపింది.

## ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ

## 5.8 మానసిక ఆరోగ్య సంస్థ, హైదరాబాదు నందు ఖైదీల వార్డు నిర్మాణంలో జాప్యం

ప్రతి దశలోనూ నిర్మాణంలో జాప్యం, తగినన్ని నిధులు లభించకపోవడం వల్ల ఏడు సంవత్సరాల కాలం గడిచినా ఖైదీల వార్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఖర్చు చేసిన **₹1.05** కోట్లు ప్రయోజనమివ్వలేదు

జాతీయ మానసిక ఆరోగ్య పథకంలో భాగంగా భారత ప్రభుత్వం, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఒక్క మారు ఇచ్చే సహాయక గ్రాంటు రూపంలో ₹2.71 కోట్లు (అంచనా వ్యయం ₹3 కోట్లు) మానసిక ఆరోగ్య సంస్థ, హైదరాబాదు (ఐయమ్‌హెచ్)ను అభివృద్ధిపరచడానికి ఇచ్చింది (2005 సెప్టెంబరు). ఇందులో భాగంగా ₹1.50 కోట్లతో[48] ఐయమ్‌హెచ్ ఆవరణలో 150 పడకల[49] ఖైదీల వార్డు నిర్మాణం, ₹1.50 కోట్లతో ఇతర

[46] ₹4.87 కోట్ల మీద రెండు శాతం ఆదాయపన్ను ₹9.74 లక్షలు, ఇంకా దీనిపై మూడు శాతం సర్చార్జి ₹0.29 లక్ష; మొత్తం కలిపి ₹10.03 లక్షలు

[47] ఆర్థిక శాఖ, హోం (పోలీసు) శాఖ, రెవెన్యూ శాఖ

[48] ఎస్ఎస్ఆర్ 2005-06 ప్రకారం

[49] ఖైదీల వార్డుకు ప్రస్తుతం 40 పడకల సామర్థ్యమున్నది

వార్డుల అభివృద్ధి, పరికరాల కొనుగోళ్ళు ఉన్నాయి. నిర్మాణ పని కోసం ₹2.71 కోట్లను ఇటువంటి పనులు చేపట్టడానికి ఏర్పరిచిన నోడల్ సంస్థైన ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థకు (ఏపీయమ్‌యస్ఐడీసీ - పూర్వపు ఏపిహెచ్‌యమ్‌హెచ్ఐడీసీ) జమ చేసారు (2006 జూలై). మిగిలిన మొత్తం ₹29 లక్షల విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతోంది. ఏడు సంవత్సరాలు పూర్తయినప్పటికీ (2013 అక్టోబరు) అనుకున్న పనులు పూర్తి కాలేదు.

ఏపీయమ్‌యస్ఐడీసీ, ఐయమ్‌హెచ్ రికార్డుల పరిశీలనలో ఈ కింది విషయాలు తెలిసాయి :

- ఐయమ్‌హెచ్, ఏపీయమ్‌యస్ఐడీసీకి అప్పగించిన స్థలంపై న్యాయపరమైన హక్కు విషయంలో వివాదాలు ఉండటంతో నిర్మాణ సంస్థ పనిని ప్రారంభించడానికి ముందే హైకోర్టు 2006లో స్టే ఉత్తర్వులు ఇచ్చింది. దాంతో 2007 జనవరిలో కాంట్రాక్టును రద్దు చేసారు.

- ఒక సంవత్సర కాలం జాప్యం తరువాత 2008 ఫిబ్రవరిలో ఐయమ్‌హెచ్ వేరొక స్థలాన్ని ఇదే ఆవరణలో ఏపీయమ్‌యస్ఐడీసీకి ఇచ్చింది. దీనివల్ల వ్యయం కోటి రూపాయలు పెరిగిపోయింది. కేంద్ర ప్రభుత్వం నుండిగాని రాష్ట్ర ప్రభుత్వం నుండిగాని అదనపు నిధులు తీసుకురాలేకపోవడం వల్ల ఐయమ్‌హెచ్ అందుబాటులో ఉన్న నిధులతోనే పనిని పూర్తి చేయడం కోసం నిర్మాణ విస్తీర్ణాన్ని తగ్గించడానికి (2,060 చ.మీ. నుండి 1,110 చ.మీ.కు) నిర్ణయించుకుంది (2008 అక్టోబరు). ఏపీయమ్‌యస్ఐడీసీ దగ్గర ₹1.05 కోట్లు మాత్రమే ఈ పని కోసం మిగిలి ఉండటంతో (ఇతర పనుల మీద ₹1.66 కోట్లు ఖర్చు చేసిన తరువాత) ₹1.22 కోట్లతో 1,110 చ.మీల నిర్మాణస్థలంలో పనిని పూర్తి చేయడానికి కాంట్రాక్టరుకు 2008 ఆగస్టులో అప్పగించింది. మిగతా పనుల కోసం ₹33.37 లక్షలతో అనుబంధ ఒప్పందాన్ని చేసుకుంది. ఇటువంటి పరిస్థితిలో, కుదించిన నిర్మాణానికి సైతం తగినన్ని నిధులు (₹1.55 కోట్లు[50]) ఏపీయమ్ఎస్ఐడీసీ దగ్గర లేవు.

- ఏపీయమ్‌యస్ఐడీసీ పనిని పూర్తి చేయడానికి అదనపు మొత్తం ₹45.35 లక్షలు (2013 నాటికి ఇది ₹58 లక్షలకు పెరిగింది) జమ చేయమని ఐయమ్‌హెచ్‌ను అడిగింది (2009 జూన్). ఏపీయమ్‌యస్ఐడీసీ, ఐయమ్‌హెచ్ రెండూ (2009 జూలై) అదనపు నిధుల కోసం వైద్యవిద్య సంచాలకులను ఆశ్రయించాయి. కానీ, 2013 డిసెంబరు వరకు అదనపు నిధులు అందలేదు.

- 2009 జూలైలో పైకప్పు వరకు నిర్మాణం పూర్తయిన తరువాత నిధులు లేకపోవడంతో పనిని నిలిపి వేసారు. నాలుగు సంవత్సరాలుగా 2009-13 మధ్యన నిర్మాణంలో ఎటువంటి పురోగతి లేదు. మిగిలిన పనిని పూర్తి చేయడానికి గుత్తేదారు సుముఖంగా లేకపోవడంతో 2011 డిసెంబరులో కాంట్రాక్టును రద్దు చేశారు.

***ప్రతి దశలోనూ నిర్మాణంలో జాప్యం, తగినన్ని నిధులు లభించకపోవడం వల్ల ఏడు సంవత్సరాల కాలం గడిచినా ఖైదీల వార్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో ఖర్చు చేసిన ₹1.05 కోట్లు ప్రయోజనమివ్వలేదు.***

జరిగిన జాప్యాన్ని ప్రభుత్వం ఒప్పుకుంది (2013 డిసెంబరు). అదనపు నిధులు వెంటనే విడుదలచేసి అతి తక్కువ సమయంలో పనిని పూర్తి చేయగలమని హామీ ఇచ్చింది. ప్రస్తుతం ఉన్న ఖైదీల వార్డులోనే రోగులందరికి వైద్య సహాయం అందిస్తున్నట్లు కూడా ప్రభుత్వం చెప్పింది. అయితే, నిర్మాణంలో ఉన్న ఖైదీల వార్డు, జైలులో ఉన్నట్లు ఎత్తైన గోడలు, సోలార్ కంచె, క్లోజుడ్ సర్క్యూట్ కెమెరాలు వంటి సౌకర్యాలతో నేరస్తుల వార్డుగా ఉండాలన్నది మాత్రం వాస్తవం.

[50] ₹1.22 కోట్లు, ₹33.37 లక్షలు కలిపి

## హోమ్ (జైళ్ళు) శాఖ

### 5.9 ఫైర్ ఔట్‌పోస్టుల సర్వీసు ప్రొవైడర్లకు అనుచిత లబ్ధి

**కమిటీ గుర్తించిన లోపాల దిద్దుబాటును గమనించుకోకుండా, ఫైర్ ఔట్‌పోస్టుల నిర్వహణకోసం సర్వీసు ప్రొవైడర్లకు కొత్త రేట్లను వెనుకటి తేదీనుండి వర్తింపజేస్తూ చెల్లింపు చేసిన ఫలితంగా, రాష్ట్రంలో అగ్నిమాపక సేవలు, విపత్తులను ఎదుర్కొనే సంసిద్ధత విషయంలో మెరుగుదల లేకుండానే, సర్వీసు ప్రొవైడర్లకు ₹1.37 కోట్ల అనుచితలబ్ధి చేకూరింది**

పన్నెండు జిల్లాల్లో, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 21 ఫైర్ ఔట్‌పోస్టులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది (2004 జనవరి). ప్రతీ ఔట్‌పోస్టు కోసం సర్వీసు ప్రొవైడర్లను బహిరంగ టెండర్ల ద్వారా ఎంపిక చేసి 11 జిల్లాల్లోని 19 ఔట్‌పోస్టుల నిర్వహణను వారికి అప్పగించారు. సర్వీసు ప్రొవైడర్లతో కుదుర్చుకున్న ఒప్పందాలు ఐదేళ్ళపాటు అమలులో ఉంటాయి. ఈ ఔట్‌పోస్టులను ఏర్పాటు చేసిన ప్రదేశాన్ని బట్టి వీరికి చెల్లించే రేట్లు ఏడాదికి ₹10.22 లక్షల నుండి ₹11.89 లక్షల వరకు ఉన్నాయి. ఈ ఫైర్ ఔట్‌పోస్టులకు కావలసిన స్థలాన్ని, గ్యారేజి నిర్మాణం, కార్యాలయ సదుపాయాలకు అయ్యే ఖర్చును ప్రభుత్వం కల్పిస్తుంది. అగ్నిమాపక వాహనం (వాటర్ టెండర్), చిన్న నీటిపంపు, నీటిని వెదజల్లే పరికరాలు, కార్బన్ డయాక్సైడ్‌తో మంటలనార్పే పరికరం, ఇతర ఉపకరణాల నిర్వహణతోపాటు, ప్రతి ఫైర్ ఔట్‌పోస్టులోనూ రెండు షిఫ్టుల్లో పనిచేసేందుకు ఫైర్ మేన్, డ్రైవర్ మొదలైన 16 మంది శిక్షణ పొందిన సిబ్బంది నిర్వహణ సర్వీసు ప్రొవైడర్ బాధ్యత. ఈ ఫైర్ ఔట్‌పోస్టులు, 2006 జూలై - 2012 ఫిబ్రవరి మధ్య పనిచేయడం మొదలుపెట్టాయి.

నిర్వహణ ఛార్జీలను పెంచాలని 'ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక మరియు అత్యవసర సేవల ఔట్‌పోస్టు సర్వీసు ప్రొవైడర్ల రాష్ట్ర సంఘం' 2008 ఆగస్టులో చేసిన విజ్ఞప్తి మేరకు, ఈ అంశాన్ని పరిశీలించేందుకు ప్రభుత్వం 2008 ఆగస్టులో ఒక కమిటీని[51] ఏర్పాటు చేసింది. ఈ కింది అంశాలలో సర్వీసు ప్రొవైడర్లు ఒప్పందపు షరతులను పాటించలేదని కమిటీ గమనించింది :

- అన్ని ఫైర్ ఔట్‌పోస్టుల్లోనూ శ్వాస పరికరాలు, మంటలనార్పేందుకవసరమైన నిర్దేశిత పరికరాలు (ముఖ్యంగా, డెలివరీ హోజులు) అందుబాటులో ఉంచడం;
- ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ పొందిన సిబ్బందిని తగినంతమందిని ఫైర్ ఔట్‌పోస్టుల్లో నియమించడం;
- పరికరాలను సరైన స్థితిలో ఉండేలా చూడటం;
- బ్యాంకు ఖాతాల ద్వారా సిబ్బంది వేతనాల చెల్లింపు.

ప్రస్తుత ఫైర్ ఔట్‌పోస్టుల్లో, పైన పేర్కొన్న లోపాలను సరిదిద్దిన తర్వాత, సర్వీసు ప్రొవైడర్లకు చెల్లించే మొత్తాన్ని ఏడాదికి ₹20.36 లక్షలకు పెంచాలని కమిటీ 2010 సెప్టెంబరులో సిఫార్సు చేసింది.

ఒక్కొక్క ఫైర్ ఔట్‌పోస్టుకూ వార్షిక నిర్వహణ వ్యయాన్ని ₹11.89 లక్షల[52] నుండి ₹20.36 లక్షలకు పెంచుతూ, 2010 ఏప్రిల్ నుండి ఈ పెంపుదలను వర్తింపజేస్తూ 2011 మేలో ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం, కమిటీ గుర్తించిన లోపాలను సర్వీసు ప్రొవైడర్లు సరిదిద్దారా లేదా అనే విషయాన్ని గమనించలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. వాస్తవానికి, కమిటీ గుర్తించిన లోపాలను సరిదిద్దాలనే నిబంధనను తాను జారీ చేసిన ఆదేశాలలోనే ప్రభుత్వం పేర్కొనలేదు. కమిటీ ప్రస్తావించిన అంశాల విషయంలో ఎలాంటి దిద్దుబాటు చర్యలూ తీసుకోక పోయినప్పటికీ, సర్వీసు ప్రొవైడర్లకు హెచ్చు మొత్తాన్ని చెల్లించేందుకు దీనివలన అవకాశం కల్గింది.

[51] అగ్నిమాపక - అత్యవసర సేవల అదనపు సంచాలకులు, తూర్పు, మధ్య ప్రాంతాల ప్రాంతీయ అగ్నిమాపక అధికారులు ఈ కమిటీలో ఉంటారు

[52] జీతాలు ₹7.78 లక్షలు, యూనిఫామ్ ఛార్జీలు ₹0.80 లక్ష, ఇంధన ఛార్జీలు, వాహనాల నిర్వహణ ₹0.50 లక్ష, పరికరాల విలువలో తరుగుదల ₹1.26 లక్షలు, 15 శాతం చొప్పున లాభం ₹1.55 లక్షలు

జిల్లా అగ్నిమాపక కార్యాలయాలను 2013 జూన్ - జూలైలో పరిశీలించినపుడు, 15 ఔట్‌పోస్టుల్లో శిక్షణ పొందని సిబ్బందిని నియమించారనీ, 15 ఔట్ పోస్టుల్లో పూర్తి స్థాయిలో పరికరాలు లేవనీ, ఐదు ఔట్‌పోస్టుల్లో తగిన రికార్డులను నిర్వహించడంలేదనీ ఆడిట్ కనుగొన్నది. కొంతమంది సిబ్బందినీ, కొన్ని పరికరాలనూ 24 గంటలూ అందుబాటులో ఉంచాలని సర్వీసు ప్రొవైడర్లతో కుదుర్చుకున్న ఒప్పందంలో స్పష్టం చేసినప్పటికీ, ఈ నిబంధనను పాటించకపోతే తీసుకోవలసిన చర్యల గురించి ఒప్పందంలో ప్రస్తావించలేదు. అందుకున్న, హాజరైన మొత్తం ఫైర్ కాల్స్ వివరాల రికార్డులను నిర్వహించాలని ఒప్పందంలో నిర్దేశించినప్పటికీ, 19 ఫైర్ ఔట్‌పోస్టుల్లోని ఏ ఒక్క దాంట్లోనూ ఈ రికార్డులు లేవు. హాజరుకాని ఫైర్ కాల్స్‌కు జరిమానా విధించాల్సి ఉండగా, జిల్లా అగ్నిమాపక అధికారుల తనిఖీ నివేదికల్లో 'హాజరైన కాల్స్' వివరాలు మాత్రమే ఉన్నాయికానీ 'అందుకున్న కాల్స్' వివరాలు లేవు.

శిక్షణ పొందిన సిబ్బంది తగినంతమందిని నియమించకుండా, మంటలనార్పే పరికరాలను నాణ్యమైన వాటిని సమకూర్చకుండా, నిర్దేశిత రికార్డులను నిర్వహించకుండా, సవరించిన రేట్లను వెనుకటి తేదీ నుంచి వర్తింపచేసారు. ఆ విధంగా, జీతాలు, ఇంధన ఖర్చులు, లాభాంశం రూపేణా వచ్చే ₹3.38 కోట్ల నుండి తొలి వేలం మొత్తం ₹2.01 కోట్లు మినహాయించుకొని ₹1.37 కోట్లను 2010 ఏప్రిల్ నుంచి 2011 మార్చి మధ్య కాలానికి చెల్లించారు. కమిటీ సూచించిన లోపాలపై దిద్దుబాటును గమనించకుండానే ఇలా ప్రభుత్వం కొత్త రేట్లలో చెల్లింపులు చేయటం సముచితం కాదు. రాష్ట్రంలో అగ్నిమాపక, విపత్తు నివారణ సన్నద్ధతలో మెరుగుదల సాధించకపోయినా, సర్వీసు ప్రొవైడర్లకు ప్రభుత్వం ₹1.37 కోట్ల అనుచిత ప్రయోజనం చేకూర్చింది.

ఈ విషయాన్ని 2013 డిసెంబరులో ప్రభుత్వానికి తెలియ చేయగా, 2014 జనవరి నాటికి సమాధానం రాలేదు.

Vani

(వాణీ శ్రీరామ్)
ప్రధాన మహాగణకాధికారి (జీఎస్ఎస్ఏ)
ఆంధ్రప్రదేశ్

హైదరాబాదు
20 May 2014

ధృవీకరించడమైనది

(శశికాంత్ శర్మ)
భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్

కొత్త ఢిల్లీ
30 May 2014

# అనుబంధాలు

పేజీలు 103 - 116

## అనుబంధం-1.1
## (పేరా 1.6 పేజీ 3)

### శాఖలవారీగా బకాయి ఉన్న తనిఖీ నివేదికలు, పేరాలు

| శాఖ | 2013 సెప్టెంబరు 30 నాటికి పెండింగులో ఉన్న తనిఖీ నివేదికలు/పేరాల సంఖ్య | |
|---|---|---|
| | తనిఖీ నివేదికలు | పేరాలు |
| వెనుకబడిన తరగతుల సంక్షేమం | 119 | 777 |
| వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాలు | 255 | 871 |
| ఆర్థిక | 14 | 64 |
| సాధారణ పరిపాలన | 105 | 383 |
| ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం | 849 | 6461 |
| ఉన్నత విద్య | 1314 | 7904 |
| హోం | 335 | 1610 |
| గృహ నిర్మాణం | 21 | 167 |
| కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు | 449 | 1572 |
| న్యాయం | 317 | 954 |
| అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం | 35 | 124 |
| మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి | 367 | 4862 |
| పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి | 749 | 6233 |
| ప్రణాళిక | 61 | 268 |
| రెవెన్యూ | 137 | 1032 |
| పాఠశాల విద్య | 348 | 3392 |
| సాంఘిక సంక్షేమం | 207 | 1969 |
| గిరిజన సంక్షేమం | 207 | 1845 |
| మహిళ, శిశు, వికలాంగులు, వయోజనులు | 540 | 2076 |
| యువజనాభ్యుదయం, పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు | 203 | 1015 |
| **మొత్తం** | **6632** | **43579** |

**అనుబంధం 1.2**

**(పేరా 1.6, పేజీ 4)**

**2014 జనవరి నాటికి అపరిష్కృతంగా ఉన్న వివరణాత్మక నివేదికలు**

| శాఖ | 2005-06 | 2006-07 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 (జీఎస్ఎస్ఏ) | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| వెనుకబడిన తరగతుల సంక్షేమం | - | - | - | - | - | 1 | **1** |
| ఆర్థిక* | - | - | - | 1* | - | 1 | **2** |
| ఉన్నత విద్య | - | - | - | - | - | 2 | **2** |
| హోం* | - | 1* | - | - | - | 1 | **2** |
| అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం | - | - | - | - | - | 1 | **1** |
| మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి (మునిసిపల్ పరిపాలన విభాగం) | - | - | - | - | - | 1 | **1** |
| గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం | - | - | - | - | - | 1 | **1** |
| సాంఘిక సంక్షేమం | - | - | - | - | - | 1 | **1** |
| గిరిజన సంక్షేమం | - | - | - | - | 1 | 1 | **2** |
| యువజనాభ్యుదయం, పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు | 1 | 1 | 2 | 1 | 1 | 2 | **8** |
| **మొత్తం** | **1** | **2** | **2** | **2** | **2** | **12** | **21** |

** రెవెన్యూ రాబడులపై ఆడిట్ నివేదికలో పొందుపర్చిన ఆడిట్ పేరాలకు సంబంధించినవి*

## అనుబంధం-2.1
## (పేరా 2.3.3.1, పేజీ 18)

### నమూనా యూనిట్ల జాబితా

| క్రమ సంఖ్య | జిల్లా | యూనిట్ పేరు | క్రమ సంఖ్య | జిల్లా | యూనిట్ పేరు |
|---|---|---|---|---|---|
| 1 | అనంతపురం | అనంతపురం ఎమ్‌సీ | 55 | నల్గొండ | అనుమాల |
| 2 | | బుక్కరాయసముద్రం | 56 | | ఆత్మకూరు (ఎస్) |
| 3 | | సీకే పల్లి | 57 | | చౌటుప్పల్ |
| 4 | | ధర్మవరం ఎమ్‌సీ | 58 | | దేవరకొండ |
| 5 | | గోరంట్ల | 59 | | కట్టంగూర్ |
| 6 | | గార్లదిన్నె | 60 | | కోదాడ |
| 7 | | హిందూపురం గ్రామీణ | 61 | | మిర్యాలగూడ |
| 8 | | కుడేరు | 62 | | నల్గొండ |
| 9 | | మడకశిర | 63 | | నల్గొండ ఎమ్‌సీ |
| 10 | | నల్లమాడ | 64 | | నల్లచెరువు |
| 11 | | నరపాల | 65 | | నిడమనూరు |
| 12 | | ఓడీ చెరువు | 66 | | నూతనకల్ |
| 13 | | పరిగి | 67 | | తిప్పర్తి |
| 14 | | పెనుకొండ | 68 | | తుంగతుర్తి |
| 15 | | పుట్లూరు | 69 | | వలిగొండ |
| 16 | | రాప్తాడు | 70 | | యాదగిరిగుట్ట |
| 17 | | సోమందేపల్లి | 71 | రంగారెడ్డి | బషీరాబాద్ |
| 18 | | తనకల్లు | 72 | | కుల్కచెర్ల |
| 19 | చిత్తూరు | బంగారుపాలెం | 73 | | ఎల్‌బీ నగర్ ఎమ్‌సీ |
| 20 | | చిత్తూరు ఎమ్‌సీ | 74 | | మల్కాజిగిరి ఎమ్‌సీ |
| 21 | | జీడీ నెల్లూరు | 75 | | మొమిన్‌పేట |
| 22 | | ఐరాల | 76 | | శంషాబాద్ |
| 23 | | కార్వేటినగరం | 77 | ఎస్‌పీఎస్ నెల్లూరు | అళ్ళూరు |
| 24 | | కుప్పం | 78 | | బుచ్చిరెడ్డిపాళెం |
| 25 | | మదనపల్లి | 79 | | చిల్లకూరు |
| 26 | | పీటీ సముద్రం | 80 | | దుత్తలూరు |
| 27 | | పాకాల | 81 | | గూడూరు |
| 28 | | పీలేరు | 82 | | ఇందుకూరుపేట |
| 29 | | పుంగనూరు | 83 | | కావలి |
| 30 | | పూతలపట్టు | 84 | | నెల్లూరు ఎమ్‌సీ |
| 31 | | రామకుప్పం | 85 | | పొదలకూరు |
| 32 | | సత్యవేడు | 86 | | సూళ్ళూరుపేట |
| 33 | | శ్రీకాళహస్తి | 87 | | సైదాపురం |
| 34 | | తవనంపల్లి | 88 | | వెంకటాచలం |
| 35 | | తిరుపతి ఎమ్‌సీ | 89 | | విడవలూరు |

| క్రమ సంఖ్య | జిల్లా | యూనిట్ పేరు | క్రమ సంఖ్య | జిల్లా | యూనిట్ పేరు |
|---|---|---|---|---|---|
| 36 | | వెంకటగిరికోట | 90 | శ్రీకాకుళం | కవిటి |
| 37 | | ఏర్పేడు | 91 | | కోటబొమ్మాళి |
| 38 | మహబూబ్‌నగర్ | అమ్రాబాద్ | 92 | | కొత్తూరు |
| 39 | | బిజినేపల్లి | 93 | | లావేరు |
| 40 | | ధాన్వాడ | 94 | | మందస |
| 41 | | ధరూర్ | 95 | | పోలాకి |
| 42 | | ఫరూఖ్‌నగర్ | 96 | | పొందూరు |
| 43 | | గట్టు | 97 | | సంతకవిటి |
| 44 | | ఐజ | 98 | | సీతంపేట |
| 45 | | జడ్చర్ల | 99 | | శ్రీకాకుళం ఎమ్‌సీ |
| 46 | | కోయిల్‌కొండ | 100 | | వంగర |
| 47 | | కొల్లాపూర్ | 101 | విశాఖపట్టణం | చింతపల్లి |
| 48 | | కొత్తకోట | 102 | | జీకే వీధి |
| 49 | | మహబూబ్‌నగర్ | 103 | | కొయ్యూరు |
| 50 | | మహబూబ్‌నగర్ ఎమ్‌సీ | | | |
| 51 | | మక్తల్ | | | |
| 52 | | నారాయణపేట | | | |
| 53 | | పంగల్ | | | |
| 54 | | వీపనగండ్ల | | | |

## అనుబంధం-2.2
## (పేరా 2.3.3.1, పేజీ 18)

### ఆడిట్ నిర్వహించిన లబ్ధిదారుల సర్వేలో సంప్రదించిన పింఛనుదారుల వివరాలు క్యాటగిరీ వారీగా

| జిల్లా పేరు | వృద్ధాప్య పింఛను | వితంతు పింఛను | వికలాంగుల పింఛను | గీత కార్మికుల పింఛను | చేనేత కార్మికుల పింఛను | డా. వైఎస్ఆర్ అభయ హస్తం పథకం | పింఛనుదారులు కానివారు | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|
| అనంతపురం | 542 | 297 | 176 | 1 | 73 | 32 | - | 1121 |
| చిత్తూరు | 478 | 401 | 171 | 8 | 0 | 72 | - | 1130 |
| మహబూబ్‌నగర్ | 479 | 316 | 106 | 3 | 49 | 24 | - | 977 |
| నల్గొండ | 439 | 244 | 131 | 30 | 35 | 46 | - | 925 |
| రంగారెడ్డి | 313 | 182 | 90 | 0 | 0 | 19 | 43 | 647 |
| ఎస్‌పీఎస్ నెల్లూరు | 370 | 280 | 194 | 3 | 22 | 53 | 29 | 951 |
| శ్రీకాకుళం | 168 | 135 | 180 | 0 | 29 | 151 | - | 663 |
| విశాఖపట్టణం | 98 | 38 | 15 | 0 | 0 | 7 | - | 158 |
| **మొత్తం** | **2887** | **1893** | **1063** | **45** | **208** | **404** | **72** | **6572** |

## అనుబంధం-2.3
## (పేరా 2.5.1, పేజీ 21)

### పింఛను మంజూరు ప్రక్రియ

